జూన్ - 2018

₹20

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

DECCAN LAND, HYDERABAD

70







- బాలల సాహిత్యం-రచన-సవాళ్లు
- సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం
- మనిషితనాన్ని కాపాడుకుందాం
- సాధికారులవుతున్న తెలంగాణ గ్రామీణులు

# తెలంగాణ పురోగమిస్తున్నది...
# భారత దేశం గర్విస్తున్నది.

అరవైయ్యేళ్ళ నిర్లక్ష్యానికి చరమగీతం పాడిన
ఉద్యమకారుడి కలలు సాకారం...

బాధ్యతాయుతమైన పరిపాలనతో అద్వితీయ సారథ్యం...

పునాదుల నుంచి ఆరంభం
శరవేగంతో ప్రగతి దిశగా ప్రయాణం...

ఈ అభివృద్ధి అనితరసాధ్యం
అసమానం మన కేసీఆర్ సారథ్యం...

మన శ్వాస, మన భాష, మన ఆశల మణిపూసలు...

**తెలంగాణ ఆవిర్భావ నాలుగవ వార్షికోత్సవాలు**
**నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల హృదయాల్లో ఆనందోత్సవాలు**



నాలుగేళ్ల నాడు కన్ను తెరిచిన పసికూన రాష్ట్రం మన తెలంగాణ. పొత్తిళ్ళలోని ఈ శిశువును కంటికి రెప్పలా సాదే బాధ్యతను తెలంగాణ ప్రజలు గౌరవనీయ ముఖ్యమంత్రి వర్యులు **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు** గారి అద్వితీయ సారధ్యానికి అప్పగించారు. ఈ బాధ్యతను చిత్తశుద్ధితో చేపట్టిన కేసీఆర్ గారి ప్రభుత్వం గత అరవై ఏళ్లలో ఏ ప్రభుత్వమూ చేపట్టని అనేక అభ్యుదయ పథకాలను వినూత్నంగా రూపొందించి, విశేషమైన శ్రద్ధాశక్తులతో అమలు చేస్తున్నది. అత్యంత ప్రాథమికమైన వ్యవసాయ రంగం మొదలుకొని విద్య, వైద్య, ఆరోగ్య, సాంస్కృతిక, ఐటి, పట్టణ, నగరాభివృద్ధి, మౌలిక వసతులు ఇంకా పారిశ్రామిక రంగాలలో అసమానమైన అభివృద్ధి కోసం అనేక వైవిధ్యభరిత కార్యక్రమాలు, పథకాలు రూపొందించింది. నాలుగేళ్ల ప్రస్థానంలో ఇవి జాతీయస్థాయిలో పోటీపడే తత్వాన్ని పెంచి, మన తెలంగాణను అగ్రస్థానంలో నిలబెట్టాయి. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల జీవితాల్లో ఆనందాన్ని ఆవిష్కరించాయి. వామనుడు త్రివిక్రముడిగా ఎదిగినట్లు కేవలం నాలుగేళ్ళలో అత్యున్నత శిఖరాలను చేరుకొన్న మన తెలంగాణ వైపు నేడు భారతదేశం ఆసక్తిగా చూస్తున్నది. మన అభ్యుదయ పథకాలను అనుసరించేందుకు ఉత్సాహంతో ఎదురుచూస్తున్నది. ఈ అభివృద్ధి ఫలాలు మనందరివీ... తెలంగాణ గడ్డ మీద ప్రతీ వ్యక్తివీ!

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ నాలుగవ వార్షికోత్సవాల సందర్భంగా

అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు..

ఈ స్ఫూర్తిని కొనసాగిద్దాం... తెలంగాణ ఖ్యాతిని జాతీయస్థాయిలో నిలబెడదాం.

ఎంతో ఎత్తుకు ఎదిగాం... ఎన్నెన్నో సాధించాం



జారీ చేయువారు: కమీషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం




## జన జీవన శోభితం

పల్లెను ఒడిసిపట్టి ఆ మూలాలను ఉన్నతీకరిస్తూ వర్ణరాగరంజితమైన దృశ్యమాన చిత్రాలుగా మలిచి ఆబాలగోపాలాన్నీ ఆకట్టుకుంటున్న చిత్రకారుడు కంది నర్సింలు. గామీణ జీవనాన్ని అవగాహన చేసుకుని అద్భుత కళాఖండాలను సృష్టిస్తున్న ఆయన ఆలోచనలకు తెరలుతీసే చిత్రకారుడు. పల్లె నుండి ఎదిగి అక్కడ చూసిన, అనుభూతి పొందిన ప్రతి సంఘటనకు, దృశ్యానికి, సన్నివేశానికి అందంగా తన కుంచెతో రంగులద్ది మానవీయతను మెరుపుగా జోడించాడు. అద్వితీయ చిత్రాలను ఆవిష్కరించిన నర్సింలు సూక్ష్మ చిత్రకళలో ప్రవీణుడు. అంతర్జాతీయంగా తన చిత్రాలతో చిత్రకళాభిమానుల ఆదరణను దక్కించుకున్న జ్ఞాన సంపన్నుడు.

TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com    website : www.deccanland.com







## దాచుకోదగిన గొప్ప సంచికలు

ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికల నుండి ఇటీవలివరకు వెలువడిన అన్ని దక్కన్‌ల్యాండ్ మాస పత్రిక సంచికలను నేను క్షుణ్ణంగా చదివాను. తెలుగు సభల సంచిక ఒక డిక్షనరీలా దాచుకోదగిన గ్రంథమని నా భావన. ప్రమాణమైన, పరిశోధనాత్మకమైన అంశాలను ఎన్నుకుంటూ నాటకం, పాట, ఫోటోగ్రఫీ, చిత్రలేఖనం, సినిమా, సంగీతం, సామాజికత, జీవనశైలి, భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయం, పుస్తకాల పరిచయం, సదస్సుల నివేదికలతో సమగ్రంగా పాఠకులు మరో సంచిక రాక కోసం ప్రతినెలా ఎదురుచూసేలా దక్కన్‌ల్యాండ్‌ను తీర్చిదిద్దుతున్న మీ కృషి అభినందనీయం.

**– కెఎస్‌నబీ రసూల్, అనంతపురం**

❖ ❖ ❖

## ఉస్మానియా యూనివర్సిటీ పాత్ర

తెలంగాణ సామాజికాభివృద్ధిలో ఉస్మానియా యూనివర్సిటీ పాత్ర అన్న వ్యాసం అనేక అంశాలను విశ్లేషిస్తూ వివరణాత్మకంగా కొనసాగింది. తెలంగాణ ఉన్నత విద్యా శిఖరంగా విశ్వవ్యాప్తంగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రసిద్ధి చెందిన తీరును ప్రొ॥ అడపా సత్యనారాయణ చక్కగా వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఘనతకు ప్రతిబింబం ఈ వ్యాసం.

**–రాజేంద్ర ప్రసాద్, వరంగల్**

❖ ❖ ❖

## విలువైన సమాచారం

ఆధునిక జీవశాస్త్ర పరిశోధనలలో కీలకపాత్ర పోషిస్తున్న సిసిఎంబి గురించి ఎంతో విలువైన సమాచారంతో ఎండి కరీం రాసిన వ్యాసం బాగుంది. శక్తి, జలం, పౌష్టికాహారం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పర్యావరణ రంగాలలో మేలైన మార్పుల దిశగా శాస్త్ర విజ్ఞాన పరిశోధనలను నిర్వహిస్తున్న సిసిఎంబి దేశానికే గర్వకారణమైన పరిశోధనా విభాగం.

**– ప్రభు, సంగారెడ్డి**

### ఆన్‌లైన్ ద్వారా దక్కన్ ల్యాండ్ చందా చెల్లింపు

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరాలు**

Name : DECCAN LAND,
Kotak Account No: 7111218829
Bank: KOTAK MAHINDRA BANK
IFSC Code:KKBK0000555
Branch Code : 000555,
MICR Code : 500485007

## త్వరలో మీ ముందుకు 'బాలచెలిమి'

చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో యం.వేదకుమార్ సంపాదకత్వంలో గతంలో వెలువడిన 'బాల చెలిమి' పిల్లల మాస పత్రికను తిరిగి పునరుద్ధరిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. బాలలలో సృజనాత్మకతను పెంచి విజ్ఞాన, వినోదాలను అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగే 'బాల చెలిమి'ని త్వరలో మీ ముందుకు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. సంపాదకులు యం. వేదకుమార్ నిర్వహణలో ఇందుకోసం జరిగిన బాలచెలిమి సమావేశంలో ప్రసిద్ధ రచయితలు వి.ఆర్.శర్మ, డా. పత్తిపాక మోహన్, డా.ఎస్.రఘు, డా. సంపత్, డా.సిరి, గాలి ఉదయ్‌కుమార్, తిరునగరి శ్రీనివాస్ పాల్గొని తమ సూచనలు అందించారు. రచయితల నుండి బాలల కథలు, గేయాలు, కవితలు, స్కెచ్‌లు, వ్యాసాలు, పొడుపుకథలు, సామెతలు, జాతీయాలు బాలచెలిమిలో ప్రచురణ కోసం ఆహ్వానిస్తున్నాం. బాలచెలిమిని www.balachelimi.com వెబ్‌సైట్‌లో కూడా చూడవచ్చు.

**–చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ**

బాల చెలిమి

**మీ రచనలు మాకు పంపవలసిన చిరునామా:**

ఎడిటర్, "బాలచెలిమి", చంద్రం, 3-6-712/2, స్ట్రీట్ నెం:12, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029, తెలంగాణ.
మొబైల్: 9030626288
ఇమెయిల్:balachelimi@yahoo.com
వెబ్‌సైట్: www.balachelimi.com

## పాఠకులు, రచయితలకు శుభవార్త

### దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, వర్ధమాన రచయితలు, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింపజేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**

3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.

**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**

E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

**- ఎడిటర్**

ISSN 2581-3188

# దక్కన్ ల్యాండ్


సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 6 సంచిక: 10 పేజీలు: 68

జూన్ - 2018

విషయసూచిక

# లోపలి పేజీల్లో...



జోనల్ వ్యవస్థలో అనివార్యమైన మార్పులు (ఎడిటోరియల్) ............ ఎం. వేదకుమార్ ........................ 7
కుతుబ్‌షాహీ నాణేలు ........................................................ దెమె రాజారెడ్డి ........................ 8
చరిత్రకెక్కిన 'హైదరాబాద్ మెడికల్ స్కూల్' ........................ సంగిశెట్టి శ్రీనివాస్ ........................ 9
హైదరాబాద్ యాదే - బాతే ........................................................ దక్కన్ న్యూస్ ........................ 12
మనిషిని, మనిషితనాన్ని కాపాడుకుందాం! ........................ డా॥ దేవరాజు మహారాజు ................ 13
బిగబిగ తాడు - సొంటె సొంటె కట్టె ........................................ పరవస్తు లోకేశ్వర్ .................... 15
భారత రాజ్యాంగ రూపకల్పన ................................................ బి.ఎస్.రాములు .................... 18
ఓ మనిషీ! మిడిసి పడకు ........................................................ డా॥ కె. బాబురావు .................... 21
జానపద ఇంద్రజాలికులు - సాధనాశూరులు ........................ డా॥ గడ్డం వెంకన్న .................... 23
చైతన్యానికి ఊతమిచ్చిన పదాలు బుర్ర సతీష్ పాటలు ................ అంబటి వేకువ ........................ 26
సాధికారులవుతున్న తెలంగాణ గ్రామీణులు ........................ టంకశాల అశోక్ .................... 29
ఉత్తమ ఫోటోగ్రఫీలో సిద్ధహస్తుడు 'సిధార్థ' ........................ పరాంకుశం సింహాద్రి .................. 31
70వ వసంతంలోకి కె.రామచంద్రమూర్తి ................................ ఎం.డి.కరీం ........................ 34
మనసుపై ముద్రవేసే వర్ణశోభిత చిత్రాలు ................................ సృజన్ ........................ 36
మన టాకీసులు - సినిమా చరిత్రకు ఆనవాళ్లు ........................ హెచ్.రమేష్‌బాబు .................... 39
జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే ............ కట్టా ప్రభాకర్ .................... 42
షటిల్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్ కాపిటల్ -హైదరాబాద్ .................. ఎం.డి.కరీం ........................ 44
నవాబోఁకా జమానా -కార్ఖానోఁకా ఖజానా ............................ దక్కన్ న్యూస్ ........................ 46
ఘనంగా తెలంగాణ సాహితి భాషా సాహిత్యోత్సవాలు ................ దక్కన్ న్యూస్ ........................ 49
బానిసలు ................................................................ శిరంశెట్టి కాంతారావు ................ 52
వనపట్ల సుబ్బయ్య దీర్ఘ కవితలు - తెలంగాణ ఉద్యమం .......... కోడం కుమారస్వామి ................ 55
'అక్షరాయుధం' పుస్తకం ................................................ ఆర్. పురుషోత్తం నాయుడు ............ 58
బాలల సాహిత్యం - రచన - సవాళ్లు ................................ తిరునగరి శ్రీనివాస్ .................... 61
సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం ................................ డా॥ ఎస్. రఘు .................... 63
పుస్తకాలు ................................................................ దక్కన్ న్యూస్ ........................ 66

సంపాదకులు
**యం. వేదకుమార్**
9848044713
editordeccan@gmail.com

సహాయ సంపాదకులు
**తిరునగరి శ్రీనివాస్**

స్పెషల్ కరస్పాండెంట్
**కె. ప్రభాకర్**
8106721111

సర్క్యులేషన్
**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు
**నీరజ**
9030626288

ఫొటోగ్రాఫర్
**టి.స్వామి**
8374995555

కవర్‌పేజీ ముఖచిత్రం
**కంది నర్సింలు**

చిత్రాలు
**కూరెళ్ల శ్రీనివాస్**

layout & composing @
CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS
ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND
"CHANDRAM"
3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana
Mobile: 9030626288 Fax: 040-27635644
E-mail: desk.deccan@gmail.com
website : www.deccanland.com

**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక సాహిత్యం విభాగంలో సలహాలు, సూచనలు అందించిన **డా॥ ఎస్. రఘు**కు మా కృతజ్ఞతలు.

'దక్కన్ ల్యాండ్'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను ప్రజాస్వామిక అభిప్రాయ వేదికగా, ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక సాహిత్య విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, సమస్యలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# తెలంగాణ పరంపర

(తెలంగాణ సంస్కృతిని చాటే చిన్ననాటి ఆటలు కొన్ని)



పరంపర మన పరంపర తెలంగాణలో పరంపర
ఆటల పాటల పరంపర తరంతరంగా పరంపర

తొక్కుడుబిళ్ళా రంగారైటులు కచ్చకాయలూ కోలాటాలు
రాయి రంగము చెట్టుసెనంగము కట్టె సాములు కోతికొమ్మలు
దాగుడు మూతలు దండాకోలు పిల్లీ వచ్చే ఎలుకా భద్రం
లేలేలెంక చంద్రబాలెంక గుంజుకోవడం గుద్దుకోవడం

అంగుడు దునుకుడు చెర్వుల ఈతలు పల్టీలు బుడుబుంగాటలు
పెద్ది పెర పెర నడ్డి నర నర చిర్ర గోనెలు చిమ్ముడు కొట్టుడు
బొంగరాలు అరిచేతిల తిప్పడు గోటీలను గురుచూసి కొట్టుడు
టొక్కా అంటే లేచి ఉరుకుడు సైకిలు పయ్యతో ఆటలాడుడు

కాశ పుల్లలు కండ్లు మూసుడు కలబడినట్లు కబడ్డి ఆడుడు
ఎర్రికాయలు దొరుకవట్టుడు ఎట్లెలు గొట్టుడు ఎగిరి దునుకుడు

కాముని పున్నము ఎన్నీల రాతిరి జాజిరాడి జమకురాడి ఉండుడు
కయినీడలలో రేసులాడుడు దెబ్బలసెండి జోరుగాడుడు

రేగుపమడ్లను ఏరుక బుక్కుడు బలుసు పండ్లు ఇష్టంగ బుక్కుడు
ఆఠాన రూపాయి బిళ్ళతో జానా బెత్తల ఆటలాడుడు
పతంగులూ పైపైకి లేపుడు గులేరుతోని గువ్వల గొట్టుడు
అనుపకాయ కనుకేసి బుక్కుడు మక్క కంకులు తంపిల కాల్చుడు

గోకులాష్టమిన ఉట్లు గొట్టుడు బురద గుంజ పైపైకి పాకుడు
పచ్చీసలు పైలంగ యేసుడు అష్టాచమ్మలు ఇష్టంగాడుడు
ఈత గుజ్జును కొట్టుక తినుడు లేత ముంజలు గిచ్చుక తినుడు
తాటి పండ్లను కాల్చి చీకుడు సొప్ప బెండ్లతో బండ్లు తిప్పడు

పీరీల పండుగ చిలుకల పేర్లు అసోయిదూల గుండంల ఎగురుడు
బతుకమ్మలకు పువ్వులు దెంపుడు సంచి నిండ తంగేడు తెచ్చుడు
దసరా పండుగు యాటలు గోసుడు ఇంటికొక్కటీ పోగులు ఏసుడు
జమ్మి చెట్టుకు పూజలు జేసుడు పాలపిట్టను కండ్ల జూసుడు

పరంపర మన పరంపర తెలంగాణలో పరంపర
ఆటల పాటల పరంపర తరంతరం ఈ పరంపర

- వడ్నాల కిషన్
m : 9866702382

## కొత్త జిల్లాల సంగ్రహ చరిత్ర వ్యాసాలకు ఆహ్వానం

తెలంగాణలో కొత్తగా ఏర్పడిన జిల్లాల చరిత్రను తిరిగి లిఖించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వివిధ కారణాల వల్ల మరుగున పడిన విశేషాలెన్నో ఈ సందర్భంగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల సంగ్రహ చరిత్రపై వ్యాసాలను దక్కన్‌ల్యాండ్ మాసపత్రికకు పంపించాల్సిందిగా కోరుతున్నాం.

మీ లేఖలను E-mail:desk.deccan@gmail.comకు పంపించవచ్చు.

# జోనల్ వ్యవస్థలో అనివార్యమైన మార్పులు

తెలంగాణ రాష్ట్ర అవసరాలు తీర్చేలా జోనల్ వ్యవస్థ ఉండాలన్న ఆలోచనతో ప్రభుత్వం ముందడుగేసింది. రాష్ట్రంలోని ప్రస్తుత అవసరాలు, విద్యార్థులు, ఉద్యోగార్థుల ప్రయోజనాలకు అనుగుణంగా జోనల్ వ్యవస్థలో మార్పులకు పూనుకుంది. ఏడు జోన్లు, రెండు మల్టీ జోన్లకు ప్రభుత్వం సూచనలు చేసి మంత్రివర్గంతో ఆమోదింపజేసి రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణలకు ప్రతిపాదింపజేసింది. రేపటి తరానికి ఉద్యోగావకాశాలు పెంపొందించడం, జోనల్ స్థాయిలో పోస్టుల సంఖ్యను పెంచడంవంటి లక్ష్యాలతో కొత్త నిబంధనలను చేరుస్తూ సవరణలు చేసి ప్రభుత్వం పంపిన నూతన ప్రతిపాదన రాష్ట్రపతి ఆమోదమే తరువాయి.

జోనల్ స్థాయిని విస్తృతపరచడం జరుగుతున్నందున ఆ జోన్లతో సంబంధమున్న వ్యవస్థలన్నింటికీ మేలు జరిగేలా మార్పులుండాలన్న, స్థానికతను ప్రామాణికంగా తీసుకోవాలన్న అభిప్రాయాలు, సూచనలు బహుముఖంగా వ్యక్తమయ్యాయి. 1948 సెప్టెంబరు నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడేవరకు తెలంగాణ ఉద్యోగులకు, తెలంగాణలో చదువుకున్న విద్యార్థులకు జరిగిన అన్యాయాలు సరిదిద్దాలంటే తల్లిదండ్రుల 15 సంవత్సరాల నివాస ప్రాంతాన్ని స్థానికతకు ప్రామాణికంగా తీసుకుని జోనల్ స్థాయిని పెంచాలని, లేనిపక్షంలో విద్యార్థి 1 నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ప్రాంతాన్ని స్థానికతగా గుర్తించాలన్న అభిప్రాయాలు వెలువడ్డాయి. ఏదేమైనా జోనల్ వ్యవస్థలో మార్పుకోసం ప్రభుత్వం వేసిన అడుగుకు గతంలోని రాష్ట్రపతి ఉత్తర్వులకు కేంద్ర ప్రభుత్వం జరిపే శాస్త్రీయమైన సవరణల ద్వారా సమాధానం రావాల్సి ఉంది.




వ్యవసాయాన్ని లాభదాయకమైన వృత్తిగా మార్చి ప్రభుత్వ సాయంతో రైతుల దిగుబడులను పెంచి ఆర్థికస్థాయిని బలోపేతం చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా చేపట్టిన రైతు బంధు పథకంలో భాగంగా లక్షలాదిమంది రైతులు పాసు బుక్కులు, చెక్కులను తీసుకున్నారు. సాంకేతిక సమస్యలతో ఆగిన రైతుల పాసుబుక్కులు, చెక్కులను వెనువెంటనే ఇచ్చేందుకు వారం రోజులపాటు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం పొడిగించి నిర్వహించింది. ఇదే క్రమంలో నిత్యం భూసేద్యంలో కనిపించే కౌలు రైతుల సమస్య ప్రభుత్వం ముందుకొచ్చింది. మరోవైపు ప్రభుత్వం రానున్న ఆగస్టు 15 నుండి రైతులకు భీమా పథకాన్ని పైసా ఖర్చు రైతుకు కలగకుండా అమలు చేస్తున్నట్టు ప్రకటించింది. క్రియాశీలత, పారదర్శకత, కార్యదక్షతతో వ్యవసాయరంగ, రైతు సంబంధ కార్యక్రమాలు కొనసాగాలన్నది అందరి అభిమతం.

బడిగంట మోగే వేళ వచ్చింది. వేసవి సెలవులకు సెలవు చెప్పి విద్యార్థులు బడిబాట పట్టనున్న సందర్భంలో వారి ప్రాధమ్యాలు, అవసరాలు, వారిపై మన బాధ్యతను గురించి పునరావలోకనం చేసుకుందాం. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు సమన్వయంగా కృషి చేయాలి. ఉద్యోగుల బదిలీ ప్రక్రియ, పదోన్నతులు రాష్ట్రం ఏర్పడిన నాలుగేండ్ల తరువాత భారీగా జరగనున్నాయి. ఉద్యోగ సంఘాల బాధ్యత క్రియాశీలమైంది. ప్రజల్లో సంతృప్తిని రాబడుతూ వారిని సమన్వయ భాగస్వాములను చేస్తూ అభివృద్ధి లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఎంతో ఉంది. ప్రతి ఒక్కరూ తమ భాగస్వామ్య పాత్రను గమనించి తోడ్పడితేనే వికాస దిశకు దారులు తెరుచుకుంటాయి.

వేదకుమార్.యం

(యం. వేదకుమార్)
ఎడిటర్

# కుతుబ్‌షాహీ నాణేలు

## కుతుబ్ షాహీ వంశం (క్రీ.శ. 1493-1687)

ఈ వంశ మూలపురుషుడు కులీ కుతుబ్ షా. ఈ వంశానికి చెందిన ఐదో పాలకుడు మహ్మద్ కులీ కుతుబ్‌షా చార్మినార్ నిర్మాణంతో సహా హైదరాబాద్‌లో నూతన రాజధాని నిర్మించాడు. టావెర్నిర్ వంటి విదేశీయులు సైతం సందర్శించిన కొల్లూరు వంటి వజ్రాల గనులకు ఈ సామ్రాజ్యం పేరొందింది. పర్షియన్ ప్రభావం అధికంగా ఉండేది. పాలకులు ఇస్లాం షియా తెగకు చెందినవారు. 1687లో మొఘల్ పాలకులు కుతుబ్‌షాహీ పాలనకు చరమగీతం పలికారు. కుతుబ్‌షాహీ రాజుల వరుసక్రమం దిగువ ఇవ్వబడింది.

| పాలకుడు | ఎహెచ్ | క్రీ.శ. |
|---|---|---|
| 1. సుల్తాన్ కులీకుతుబ్ షా | 895-950 | 1489-1543 |
| 2. జంషీద్ కులీకుతుబ్ షా | 950-957 | 1543-1550 |
| 3. సుబాన్ కులీకుతుబ్ షా | 957 | 1550 |
| 4. ఇబ్రహీం కులీకుతుబ్ షా | 957-988 | 1550-1580 |
| 5. మహ్మద్ కులీకుతుబ్ షా | 988-1020 | 1580-1612 |
| 6. మహ్మద్ కుతుబ్ షా | 1020-1035 | 1612-1626 |
| 7. సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్ షా | 1035-1083 | 1626-1672 |
| 8. అబుల్ హసన్ కుతుబ్ షా | 1083-1098 | 1672-1687 |
| 9. ఔరంగజేబు స్వాధీనం | 1098 | 1687 |



కుతుబ్‌షాహీ వంశానికి చెందిన మహమ్మద్ కులీ కుతుబ్ షా నాణెం
కులీ కుతుబ్

కుతుబ్‌షాహీలు రాగి నాణేలు మాత్రమే జారీ చేసేవారు. అరుదుగా బంగారు ఫనామాలు విడుదల చేసేవారు. ఈ వంశ మూలపురుషుడికి చెందిన నాణేలు మాత్రం ఇప్పటి వరకూ లభ్యం కాలేదు. బహమనీ తదనంతర వంశాల మూల పురుషుల వలే ఆయన కూడా తన పేరిట నాణేలు విడుదల చేసి ఉండకపోయి ఉండవచ్చు. మహమ్మద్ కులీ కుతుబ్ షా (క్రీ.శ. 1580-1612) వరకు కూడా వీరి నాణేలన్నీ కూడా గోల్కొండలోనే తయారయ్యేవి. తదనంతరం కులీ కుతుబ్ షా తన రాజధానిని హైదరాబాద్ నగరానికి మార్చాడు. క్రీ.శ. 1604 నుంచి అక్కడే నాణేలు దారుల్‌సల్తానత్ హైదరాబాద్ పేరిట రూపొందేవి.

దక్కన్‌ను పాలించే కుతబ్‌షాహీ రాజులపై మొఘలు చక్రవర్తులు కన్నెర్ర చేసేవారు. అబ్దుల్లా కుతుబ్ షా (క్రీ.శ. 1626-1672) లొంగుబాటు ఒప్పందం పై సంతకం చేయడంతో, షాజహాన్ క్రీ.శ 1636 నుంచి కుతుబ్‌షాహీల హోదాను సామంతుల స్థాయికి తగ్గించాడు. ఈ ఒప్పందంతో అబ్దుల్లా కుతుబ్‌షా తన పేరిట నాణేలను

కుతుబ్‌షాహీ వంశానికి చెందిన అబ్దుల్లా కుతుబ్ షా, కుతుబ్‌షాహీ వంశానికి చెందిన అబ్దుల్ హసన్ తానాషా రాగి నాణేలు



ముద్రించే అవకాశాన్ని వదులుకున్నాడు. వెండి, బంగారంతో తయారయ్యే మొఘల్ నాణేలను ఆయన ముద్రించాల్సి వచ్చింది. అందుకు అవసరమైన ముద్రలను మొఘల్ చక్రవర్తులే సమకూర్చేవారు. షహబుద్దీన్ షాజహాన్। (క్రీ.శ. 1628-1658), మొహియుద్దీన్ ఔరంగాజేబ్ ఆలంగిర్ (క్రీ.శ. 1658-1707)లతో ఆశ్చర్యకరదాయకంగా అమ్మద్ షా బహదూర్ (క్రీ.శ 1748-1754)ల పేరిట ఉన్న గోల్కొండ నాణేలు తయారయ్యాయి.




గోల్కొండ మింట్ నుంచి వెలువడిన ఔరంగాజేబ్ నాణెం

క్రీ.శ. 1687లో ఔరంగాజేబు కుతుబ్‌షాహీలను ఓడించి గోల్కొండను ఆక్రమించాడు. దీంతో హైదరాబాద్ క్రీ.శ. 1724 వరకు కూడా మొఘల్ చక్రవర్తుల ప్రత్యక్ష పాలనలో ఉండింది. తదనంతరం అసఫ్‌జాహీలు పాలనాపగ్గాలు చేపట్టారు. అబ్దుల్లా, తానా షా అనే ఇద్దరి కాలంలో మినహాయిస్తే, మిగిలిన నాణేలన్నీ కూడా 'కుతుబ్' పేరు కలిగి ఉండేవి. ఈ చివరి ఇద్దరు పాలకుల కాలం నాటి నాణేలను హైదరాబాద్ మింట్ పేరు, సంవత్సరం ఆధారంగా గుర్తించవచ్చు. ఈ నాణేలు ఎహెచ్ 1068, ఎహెచ్ 1095లకు చెందినవి.

- దెమె రాజారెడ్డి, m: 9848018660
e: palvashreddy@gmail.com

# చరిత్రకెక్కిన 'హైదరాబాద్ మెడికల్ స్కూల్'

ప్రపంచ వైద్యచరిత్రలో హైదరాబాద్‌కు ఒక విశిష్టమైన స్థానమున్నది. అంతకన్నా ఘనమైన చరిత్ర ఉన్నది. ప్రజల ఆరోగ్యం పట్ల ఇక్కడి రాజులు వందల ఏండ్ల క్రితమే శ్రద్ధ వహించారు. కుతుబ్‌షాహీ వంశానికి చెందిన సుల్తాన్ మొహ్మద్ కులీకుతుబ్‌షా 1595లో హైదరాబాద్‌లోని చార్మినార్ పక్కనే 'దారుషిఫా' అనే వైద్యాలయాన్ని నిర్మించాడు. ఇక్కడ యునాని వైద్యంలో శిక్షణ నిప్పించడమే గాకుండా, రోగులకు చికిత్స చేసేవారు. రెండంతస్థుల్లో నిర్మించిన ఈ భవనంలో మొత్తం 40 గదులుండేవి. ఒక్కో గదిలో కనీసం నాలుగు బెడ్ల ఏర్పాటుకు వీలుండింది. మొత్తం 25000ల చదరపు అడుగుల్లో నిర్మితమైన ఈ భవంతిలో చికిత్స అంతా కుతుబ్ షాహిల రాజ వైద్యుడు హకీమ్ సైపుద్దీన్ జిలానీ నేతృత్వంలో జరిగేది. రోగులకు ఉచిత ప్రోటీన్ యుక్త భోజన సదుపాయాలు కూడా ప్రభుత్వమే కల్పించేది. అందుకే ప్రపంచంలో పేరుగాంచిన 'యునాని' వైద్యులు ఆనాడు హైదరాబాద్‌లో స్థిరపడినారు. సామాన్యులు మొదలు నవాబుల వరకు వారు వైద్యాన్ని అందించారు. 'యునాని'తో పాటుగా ఆయుర్వేద వైద్యానికి కూడా అసఫ్జాహీల కాలంలో కొంత ప్రాచుర్యం ఉండేది. హకీం నారాయణదాస్, హకీం జనార్ధన దాస్ లాంటి వారు ఏడో నిజామ్‌కు రాజ వైద్యులుగా పనిచేశారు. రాధాకృష్ణ బిషగాచార్య, వైద్యరత్న బి.రామరాజు, బి. మార్కండేయులు లాంటి ఆయుర్వేద వైద్యులు ఇక్కడ రాణించారు. అయితే ప్రస్తుతం ఇక్కడ ప్రపంచ వ్యాప్తంగా పరుచుకుపోయిన, విస్తృతంగా అమల్లో ఉన్న అల్లోపతి వైద్యం లేదా ఇంగ్లీషు వైద్యం గురించి మాట్లాడుకుందాం! ఆ వైద్యం హైదరాబాద్‌కు ఎప్పుడు ఎలా వచ్చిందనేది చర్చించుకుందాం!



అన్ని రంగాల్లో 'ఆధునికత' అనేది విదేశీయుల రాకతో హైదరాబాద్‌లో ఆరంభమయింది. అల్లోపతి వైద్యం కూడా అలాగే హైదరాబాద్‌కు వచ్చింది. 1798, 1800ల సంవత్సరాల్లో ఈస్టిండియా కంపెనీతో రెండో 'నిజామ్ నిజామ్ అలీఖాన్' సైన్య సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్, బొల్లారం, సికింద్రాబాద్ జాల్నా, ఔరంగాబాద్ తదితర ప్రాంతాల్లో బ్రిటీష్‌వారు తమ సైన్య స్థావరాలను ఏర్పర్చినారు. ఈ సైన్యం నిజాం ప్రభుత్వం కోరినదే తడవుగా ఆయనకు సహాయాన్ని అందించేది. శాంతిభద్రతలు కాపాడడంలో ఈ సైన్యం పాత్ర ప్రధానంగా ఉండేది. ఇట్లా బొల్లారం, బ్రిటీష్ రెసిడెన్సీ (కోఠీ)లో ఏర్పాటు చేసిన పటాలాల బాగోగులను బ్రిటీష్ అధికారులే చూసుకునేవారు. వాటి నిర్వహణ, జీత భత్యాల నిమిత్తం నిజాం ప్రభుత్వం బ్రిటీష్‌వారికి ఆంధ్రా జిల్లాలను దారదత్తం చేయడం జరిగింది. అందుకే వీటిని సీడెడ్ జిల్లాలంటారు. ఇది 1800ల నాటి సంఘటన.

ఇట్లా ఏర్పాటైన సైన్యం ఆరోగ్యం, చికిత్సకు సంబంధించిన బాగోగులని పట్టించుకోవాల్సిన బాధ్యత కూడా బ్రిటీష్ రెసిడెన్సీ అధికారుల పైనే ఉండేది. అందుకే 1814లో బ్రిటీష్ రెసిడెంట్ సర్ హెన్రీ రస్సెల్ తమ సైన్యం వైద్యం నిమిత్తం ఈస్టిండియా కంపెనీ, గవర్నర్ జనరల్ అనుమతితో రెండు పోస్టులను సృష్టించాడు. ఇట్లా సృష్టించిన పోస్టుల్లో నియమితులైన ఫస్ట్ డ్రెస్సర్, సెకెండ్ డ్రెస్సర్ పేరిట ఇద్దరు వైద్యులు చికిత్సను అందించేవారు. దీనికి కొనసాగింపుగా 1818లో అప్పటికే ఉన్న వైద్య సిబ్బందికి అదనంగా ఒక సర్జన్‌ని నియమించారు. ఆ తర్వాత 1827లో 'హైదరాబాద్ కంటింజెంట్'కు (పటాలం) అనుబంధంగా ఒక మెడికల్ స్టోర్ కీపర్, మరో మెడికల్ సూపరింటెండ్-(సర్జన్)ని కూడా నియమించారు. ఇట్లా 1835లో బొల్లారం మిలిటరీ కేంద్రంలో రెసిడెన్సీ అధికారులు ఒక మెడికల్‌స్కూల్‌ని ప్రారంభించారు. ఈ సమయంలో కల్నల్ జె. స్టెవార్ట్ రెసిడెంట్‌గా ఉన్నాడు. స్థానికులకు అల్లోపతి మెడిసిన్‌లో శిక్షణ ఇచ్చి వారిని సైన్యంలోనే ఉద్యోగస్థులుగా, సహాయకులుగా నియమించడం వారి ఉద్దేశ్యం. ఈ స్కూల్ మొదటి ప్రిన్సిపాల్‌గా అసిస్టెంట్ సర్జన్ థామస్ కీ పనిచేశారు. ఈయనకు సహాయకుడిగా మెడికల్ స్టోర్ కీపర్ సైమన్ యంగ్ ఉన్నారు. అయితే ఇక్కడ పనిచేసే సూపరింటెండ్ రిటైర్ కావడంతో ఈ మెడికల్ స్కూల్ నిర్వహణ వల్ల రెసిడెన్సీ ఖజానా మీద అధిక భారం పడడమే గాకుండా దానివల్ల ఆశించిన ఫలితాలు దక్కడం లేదనే మిషతో అప్పటి రెసిడెంట్ జేమ్స్ స్టువార్ట్ ఫ్రేజర్ పాఠశాలను రద్దు చేసిండు. ఈ నిర్ణయం 1846 మే ఒకటిన జరిగింది. దీంతో హైదరాబాద్‌లోని పత్రికలు రెసిడెంట్ నిర్ణయాన్ని తప్పుపట్టాయి. తీవ్రంగా విమర్శించాయి. ఈ విషయం ఈస్టిండియా కంపెనీ అధికారులకు కూడా చేరింది. దీంతో ఫ్రేజర్ దిద్దుబాటు చర్యలు చేపడుతూ పూర్తిస్థాయిలో మెడికల్ స్కూల్ ఏర్పాటు చేసే ఉద్దేశ్యంతోనే ప్రస్తుతమున్నదాన్ని రద్దు చేశామని చెబుతూ, త్వరలోనే ఆ పాఠశాల ప్రారంభమవుతుందని ప్రకటించాడు. ఈ మేరకు ఫ్రేజర్ ఈస్టిండియా కంపెనీ గవర్నర్ జనరల్‌తో ఉత్తరప్రత్యుత్తరాలు జరిపి మెడికల్ పాఠశాల నడిపేందుకు అనుమతి తీసుకున్నాడు. ఇదే విషయాన్ని నాలుగో నిజామ్ నాసర్‌జంగ్ దృష్టికి కూడా తీసుకొచ్చినాడు. ఎందుకంటే వీటి

నిర్వహణకయ్యే ఖర్చు నిజాం ప్రభుత్వమే భరించేది. తమ ప్రజలకు ఉపయోగపడే ప్రతిపాదనకు నాసర్‌జంగ్ అంగీకారం తెలిపినాడు. అంతేగాదు ఈ మెడికల్ పాఠశాలలో బోధనా భాష 'ఉర్దూ'లో ఉండాలని షరతుని విధించినాడు. అందుకు ఫ్రేజర్ అంగీకరించడంతో మొత్తం భారతదేశంలోనే దేశీయ భాషల్లో 'మెడికల్ విద్య'ను బోధించే మొట్ట మొదటి పాఠశాల 1846 సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో ప్రారంభమయింది. ఇట్లా పూర్తి విదేశీ వైద్య విద్యను స్వదేశీ భాషలో బోధించిన ఘనత హైదరాబాద్‌కు దక్కుతుంది.


జేమ్స్ స్టువార్ట్ ఫ్రేజర్

అయితే గ్రీకులో పుట్టి పర్షియా గుండా హైదరాబాద్‌కు వచ్చిన 'యునాని' వైద్యంలో నిజాం రాజులకు, నవాబులకు, ప్రజలకు నమ్మకముండేది. బ్రిటీష్ రెసిడెన్సీలో అల్లోపతి వైద్యం అందిస్తున్నప్పటికీ దాని పట్ల నవాబులకు, నిజాం రాజులకు ముఖ్యంగా హకీమ్‌లకు ఏ మాత్రం నమ్మకముండేది కాదు. ఈ హకీమ్‌లు నవాబులకు, రాజులకు ఆంగ్ల వైద్యం పట్ల పూర్తి వ్యతిరేకతను నూరి పోశారు. 'టాబ్లెట్' మింగితే రక్షించే, చికిత్స చేసే, ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత తమది కాదని చెప్పేవారు. ఒక రకంగా 'అల్లోపతి' వైద్యం పట్ల ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింద్రు. ఇలాంటి దశలో 1845-46 ఆ ప్రాంతంలో నాలుగో నిజామ్ నాసిరుద్దౌలా 'డయాబిటిస్'తో బాధపడుతూ ఉండేవాడు. 'యునాని' వైద్యంతో ఆయనకు స్వస్థత చేకూరలేదు. దీంతో నిజామ్‌ని క్షేమ సమాచారాలు కనుక్కోవడానికి వచ్చిన ఫ్రేజర్ అల్లోపతి వైద్యం గురించి చెబుతూ, దాని ద్వారా స్వస్థత పొందవచ్చని పేర్కొన్నాడు. అంతేగాదు చికిత్స నిమిత్తం రెసిడెన్సీ వైద్యుడు మెక్లీన్‌ని పంపించాడు. ఈ సమయంలో డాక్టర్ మెక్లీన్‌కు నాసిరుద్దౌలా కొన్ని షరతులు విధించాడు. 'నేను మీరిచ్చే ఒక్క అల్లోపతి మాత్రను కూడా మింగేది లేదు. కనీసం ముట్టుకునేది లేదు'. అని తేల్చి చెప్పిండు. దానికి మెక్లీన్ అంగీకరిస్తూ కొన్ని 'టెస్టులు' చేసి 'డయాబిటిస్'కు పాటించాల్సిన పత్యాన్ని సూచించాడు. 'డైటింగ్'లో మార్పులు చేసిండు. డాక్టర్ సూచించిన పత్యాన్ని, డైట్‌ని తూ.చ. తప్పకుండా నాసిరుద్దౌలా పాటించాడు. దీంతో మూడు నెలల్లోనే ఆయన ఆరోగ్యం కుదురుకుంది. అలా అల్లోపతి వైద్యంపై నిజాంకు నమ్మకం ఏర్పడింది. ఇట్లా హైదరబాద్‌లో తొలి మెడిసిన్ స్కూల్ ఆధునిక పద్ధతుల్లో స్థాపనకు పునాదులు పడ్డాయి.


డాక్టర్ మెక్లీన్

బ్రిటీష్ రెసిడెన్సీ హాస్పిటల్ (ప్రస్తుత సుల్తాన్ బజార్ దవాఖానా) సూపరింటెండెంట్‌గా, సర్జన్‌గా డాక్టర్ విలియం కాంప్‌బెల్ మెక్లీన్ 1944లో నియమితుడయిండు. ఇందుకు గాను ఆయనకు నెలకు వెయ్యి రూపాయలు జీతంగా లభించేది. ఆయనకు ఐదు వందల రూపాయల అదనపు జీతం ఇచ్చే ఖరారుతో 'హైదరాబాద్ మెడికల్ స్కూల్' 1946లో నగరంలోని ఆబిడ్స్ ప్రాంతంలో (ఒకప్పటి ప్యాలెస్ థియేటర్ ఉన్న స్థలంలో) 'మెడికల్ స్కూల్' ఏర్పాటయింది. దీనికి తొలి ప్రిన్సిపాల్‌గా మెక్లీన్ పనిచేశారు. అయితే బోధన ఉర్దూలో చేయాల్సి రావడంతో ఆయన ఆ భాషలోనూ పట్టు సాధించాడు. కోర్సు మెటీరియల్ అంతా కూడా ఉర్దూలో తయారు చేయించారు. కేవలం ఉర్దూలోనే కాదు తెలుగులో కూడా కొన్ని వ్యాధులు, వాటి నివారణకు సంబంధించిన వివరాలు ఈ మెడికల్ స్కూల్ వాళ్లు ప్రచురించారు. 1850ల నాటికే హైదరాబాద్‌లో 'మశూచి-స్ఫోటకం' గురించి మెక్లీన్ ఇంగ్లీషులో రాసిన పుస్తకాన్ని తెలుగులోకి తర్జుమా చేసి అచ్చేశారు. ఇట్లా మెక్లీన్ ఒకవైపు బ్రిటీష్ రెసిడెన్సీలో పనిచేస్తూనే, నాసిరుద్దౌలా, షంషుల్ ఉమ్రా, సూరజ్ ఉల్ ముల్క్ తదితర రాజులు, నవాబులకు రాజ వైద్యుడిగా కూడా కొనసాగాడు. ఈయన ఈ పదవిలో 1854 వరకు ఉన్నాడు. ఈ 'మెడికల్ స్కూల్' నుంచి మొదటి బ్యాచి విద్యార్థులు 1852-53లో బయటి కొచ్చారు. మొదటి బ్యాచ్‌లో మొత్తం పది మంది విద్యార్థులు పట్టా పుచ్చుకున్నారు. ఇందులో ఒక్కరు మినహా ముస్లిములే! వారి పేర్లు. 1.మొహ్మద్ అష్రఫ్, 2. హెన్రీ పికాక్, 3. మొహ్మద్ బాకర్ అలీ, 4. ఫైజుల్లా ఖాన్, 5. సయ్యద్ ఒమర్, 6. ఐన్ ఖాన్, 7. గులామ్ జిలానీ, 8. ఖ్వాజా అష్రఫ్, 9. మొహ్మద్ యాకూబ్, 10. పీర్ ఖాన్.

నిజానికి మెక్లీన్ హైదరాబాద్‌లో 'అల్లోపతి వైద్య పితామహుడు'. ఎడింబరో విశ్వవిద్యాలయంలో చదువుకున్న ఈయన 1811 నవంబర్ 29న స్కాట్లాండ్‌లో పుట్టి చాలా ఏండ్లు ఇండియాలోని వివిధ ప్రదేశాల్లో పనిచేశారు. రిటైరైన తర్వాత ఇంగ్లండ్‌లోని వివిధ మెడికల్ కళాశాలల్లో లెక్చర్లిచ్చారు. ఈయన తన 87వ యేట 1898 నవంబర్ పదో తేదిన మరణించారు. ఈయన తన జీవిత చరిత్రను కూడా రాసుకున్నారు. మెక్లీన్ ఏర్పాటు చేసిన ఈ 'మెడికల్ స్కూల్' 1861లో 'అఫ్జల్ గంజ్ దవాఖానా'గా మారింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పాటైన తర్వాత 1925లో దానికి అనుబంధంగా 'ఉస్మానియా మెడికల్ కాలేజి'గా రూపుదిద్దుకుంది. ఇంతటి ఘన చరిత్ర ఉన్న మెడికల్ స్కూల్ ప్రారంభం అంత ఈజీగా ఏమీ జరగలేదు.

'హైదరాబాద్ మెడికల్ స్కూల్' మెక్లీన్ పూనిక మేరకు సరైన పద్ధతుల్లో ప్రారంభమయింది. తొలుత నెలకు ముప్పయి రూపాయల అద్దెతో ఒగిల్వీ అనే భూస్వామి భవనాన్ని కిరాయికి తీసుకున్నారు. అలాగే అమీర్ అలీని క్లర్క్‌గా నియమించుకున్నాడు. దుబాసీగా ముర్రే అనే అతన్ని ఉద్యోగిగా నియమించాడు. వీరికి తోడుగా ఇద్దరు అటెండర్లను కూడా ఆయన నియమించాడు. ఇదంతా బాగానే ఉన్నది కానీ విద్యార్థులెవ్వరూ మెడిసిన్ విద్యను చదవడానికి ఆనాడు సిద్ధంగా లేరు. దీనికి ప్రధాన కారణం ఐదారేండ్లు 'హకీమ్'

కోర్సును చదవాల్సి రావడం. అలాగే బోధన ఉర్దూలో ఉన్నప్పటికీ విషయం పెద్దగా తెలిసింది కాకపోవడం కూడా ఒక కారణం. కొంతమంది వైద్యాలయంలో మానవ కంకాళాలను చూసి భయపడి విద్యను మధ్యలోనే మానుకున్న వారు కూడా ఉన్నారు. అయితే ఈ సమస్యల్ని అధిగమించడానికి విషయాన్ని డాక్టర్ మెక్లీన్ నాలుగో నిజాం దృష్టికి తీసుకొచ్చినాడు. అందుకు ఆయన తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా తన కార్యాలయాధికారి మీర్ ఇమామ్ అలీఖాన్‌ని కోరినాడు. చివరికి నవాబ్ షంషూల్ ఉమ్రా దగ్గర వకీల్‌గా పనిచేస్తున్న గులామ్ మొహియుద్దీన్ ఖాన్ విద్యార్థులను చేర్పిస్తానని మాటిచ్చాడు. ఆ మేరకు షంషూల్ ఉమ్రా పోషణలో చదువుకుంటున్న నాలుగు వందల మంది ఉర్దూ, పర్షియన్ బాగా తెలిసిన విద్యార్థుల నుంచి 30 మంది తెలివైన విద్యార్థులను తీసుకొని రావాల్సిందిగా అక్కడి అధ్యాపకులను ఆదేశించారు. అందులో నుంచి షంషుల్ ఉమ్రా తానే స్వయంగా ఒక పదిమంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి కౌన్సిలింగ్ ఇచ్చాడు. మీ భవిష్యత్తు బాగుంటుంది, దానికి నాది భరోసా అంటూ వారికి ధైర్యాన్నిచ్చాడు. వైద్య విద్య చదవడం ద్వారా సేవ చేయడమే గాకుండా, ఆర్థికంగా కూడా బలపడవచ్చని వారిని ప్రోత్సహించాడు. అంతేగాకుండా ఎంపికైన విద్యార్థులందరికీ ఒక 'ఇంక్‌పాట్', 'నైఫ్', పేపర్ బండిల్స్ తానే స్వయంగా అందించి వారి వైద్యవిద్యకు అండగా నిలిచాడు.


డాక్టర్ నాసిరుద్దౌలా

ఇట్లా ప్రారంభమైన స్కూల్‌లో పాసైన వారికి 'హకీమ్' సర్టిఫికెట్ ఇచ్చేవారు. ఈ పాఠశాలలో ప్రతి సంవత్సరం 30 మంది విద్యార్థులకు బోధన చేసేవారు. అయితే అందులో పది, పన్నెండు మించి పాసయ్యే వారు కాదు. వాళ్ళు మళ్ళీ తర్వాతి సంవత్సరం పరీక్షలు రాసేవారు. ఇట్లా పాసైన 'హకీమ్'లు సాలర్‌జంగ్, షంషుల్ ఉమ్రా తదితర నవాబుల దగ్గర వైద్యులుగా చేరేవారు. సాలర్‌జంగ్ వద్ద వైద్య లుగా చేరిన వారు నగరంలో ఉచిత వైద్య సేవలు అందించేవారు. మరికొంతమందిని హైదరా బాద్ ప్రధాని సాలార్జంగ్ తాలూకా కేంద్రాల్లో 'హకీమ్' లుగా నియమించినాడు. వీరికి నెలకు ఆనాడు 30 రూపాయల జీతాన్ని ఇచ్చేవారు. ఈ హకీమ్‌లకు పూర్తి వైద్య సదుపాయాలతో డిస్పెన్సరీని ఏర్పాటు చేయడమే గాకుండా వారు ధనవంతుల నుంచి కొంత ఫీజు వసూలు చేసుకునేందుకు అనుమతి చ్చారు. అట్లాగే ప్రభుత్వ ఉద్యోగులకు ఆనాడే ఉచిత వైద్య సదుపాయాన్ని సాలర్‌జంగ్ కల్పించారు. మెక్లీన్ అనంతరం ఈ పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జార్జ్ స్మిత్ పనిచేశారు. 1861లో డాక్టర్ స్మిత్ ప్రమోషన్‌పై మద్రాసు మెడికల్ కాలేజికి వెళ్ళిండు. స్మిత్ స్థానంలో ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఫ్లెమింగ్ నియుక్తులయ్యారు. ఆ తర్వాత 1867లో డాక్టర్ పంబర్టన్, 1882లో డాక్టర్ విండోవ్ తదితరులు ప్రిన్సిపాల్స్‌గా వ్యవహరించారు. ఈ దశలో మెడికల్ విద్యార్థులకు నెలకు నాలుగు రూపాయల స్టైఫండ్ ఇచ్చి ఇంగ్లీషు నేర్చుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహించింది. 1861-62 తర్వాత వైద్య విద్యలో చేరడానికి ఎక్కువ మంది ఆసక్తి కనబరచడంతో విద్యార్థులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సికింద్రాబాద్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ ఫోర్బ్స్ చైర్మన్‌గా వ్యవహరించేవారు. ఆయనతో పాటుగా ఆల్వాల్‌కు చెందిన డాక్టర్ సాండర్సన్, సికింద్రాబాద్‌కు చెందిన డాక్టర్ మార్టిన్ సభ్యులుగా ఉండేవారు. బోధనా మాధ్యమాన్ని ఇంగ్లీషుకు 1883-84లో మార్చినారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అదే కొనసాగుతున్నది. ఈ సమయంలో 'మెడికల్ స్కూల్'కు ఎడ్వర్డ్ లారీ అనే అతను ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. ఈయన తర్వాత అంటే 1888-94లో క్లోరోఫామ్ మిషన్‌ని ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ కీర్తిపతాకను, పరిశోధన రంగానికి నిజాం ప్రభుత్వం చేస్తున్న సేవలను ఎరుక పరిచాడు. ఇంగ్లండ్‌లోని వివిధ పత్రికల్లో వ్యాసాలు రాసి హైదరాబాద్‌లో జరుగుతున్న పరిశోధనలను వెల్లడించారు. 'లాన్సెట్' అనే ఒక బ్రిటన్ పత్రిక సంపాదకుడు ఆయన పరిశోధనలపై కొంత సందేహాన్ని వ్యక్తం చేసిండు. అయితే ఆ సందేహాన్ని నివృత్తి చేసుకునేందుకు బ్రిటన్ నుంచి పత్రిక ప్రతినిధిని రప్పించి వివిధ జంతువులపై హైదరాబాద్‌లో'అనస్తీషియా' విషయంలో చేసిన పరిశోధనలు రుజువు చేసినాడు. దీని కొనసాగింపుగానే హైదరాబాద్‌లో రోనాల్డ్ రాస్ మలేరియా కారకాల మీద చేసిన పరిశోధనకు గాను 1902లో నోబెల్ ప్రయిజ్ వచ్చింది. అలాగే ముత్యాల గోవిందరాజులు నాయుడు కూడా తర్వాతి కాలంలో ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. డాక్టర్ మల్లన్న ఇక్కడి నుంచే అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన తెలంగాణ బిడ్డ.


డాక్టర్ ఎడ్వర్డ్ లారీ

ఇట్లా ప్రపంచ చరిత్రలో హైదరాబాద్ వైద్య రంగానికి ఒక విశిష్టమైన స్థానమున్నది. అంతేకాదు నిజాం ప్రభుత్వం వైద్యవిభాగాలను ప్రోత్సహించింది. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలను అందించింది. వైద్యవిద్యలో నూతనంగా చోటు చేసు కుంటున్న పరిశోధనలు వైద్యులందరికీ అందుబాటు లోకి తెచ్చేందుకు గాను సాలార్జంగ్ ఆర్థిక సహకారంతో ఈ మెడికల్ స్కూల్ 'రిసాలా తిబ్బాత్' అనే వైద్య పత్రికను నడిపించింది. ఈ పత్రికకు ఆనాడు ఒక్క హైదరాబాద్‌లోనే గాకుండా బొంబాయి, కలకత్తాల్లో కూడా చాలా మంచి పేరుండేది. ఇన్నేండ్లు విస్మృతంగా ఉన్న ఘన చరిత్ర అందరికీ తెలియాలి.

–సంగిశెట్టిశ్రీనివాస్,
m:98492 20321
e: sangishettysrinivas@gmail.com

# హైదరాబాద్ యాదే - బాతే

వారిదో ప్రత్యేకమైన విభిన్న వర్గాల బృందం... ఒకరు రిటైర్డ్ ప్రిన్సిపల్... మరొకరు అడ్వకేట్... ఒకరు పాలవాడు, మరో వ్యక్తి సామాజిక ఉద్యమకర్త, ఇంకొకరు ఫిల్మ్ మేకర్... ఇలా... కొందరు సమాజానికి పరిచయస్తులు... మరికొందరు తమపని తాము చేసుకుని పోయే అపరిచితులు... కానీ వీరందరిదీ ఒకే లక్ష్యం... హైదరాబాద్‌తో ఉన్న స్మృతులు... జ్ఞాపకాలు... అలనాటి ఘటనలు... బంధాలు-అనుబంధాలను పంచుకోవడం... హైదరాబాదీ తెహజీబ్‌ను భవిష్యత్ తరాలకు.. అందించడం... అలా అందరినీ ఒకే ఛత్రం కింద చేర్చిన ఘనత మన హైదరాబాద్‌కే దక్కుతుంది.

సాంస్కృతిక ఘన వారసత్వ సంపదకు నిలయం మన హైదరాబాద్. కానీ అలనాటి ముచ్చట్లు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే... హైదరాబాద్ చరిత్ర పుస్తకాల్లో అయితే దొరుకుతుందికానీ... ఇక్కడ జన జీవన సంస్కృతి ముచ్చట్లు... తర్వాతి తరాల వారికి తెలియకుండాపోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితిపై ఆందోళన చెందిన కొందరు హైదరాబాదీ ప్రేమికులు... సీనియర్ అడ్వకేట్ గులామ్ యాజ్దానీ, విద్యావేత్త ఆనంద్ రాజ్ వర్మ మరికొందరి మిత్రుల సహకారంతో... భావితరాలకు అందించాలని సంకల్పించారు. అలా... హైదరాబాద్‌తో ఉన్న అనుభవాలను... పంచుకుంటూ... సమావేశమవుతున్నారు.



హైదరాబాదీ తెహజీబ్‌ను... భావితరాలకు అందించే క్రమంలో... భాగంగానే మే 10న హిమాయత్‌నగర్‌లోని ఉర్దూ హాల్‌లో... భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకర్త యం.వేదకుమార్ కూడా పాల్గొని అలనాటి విశేషాలను... తనకు తెలిసిన విషయాలను బృంద సభ్యులతో పంచుకున్నారు. అంతకంటే ముందు జరిగిన సమావేశంలో... ఉస్మానియా బిస్కెట్‌లు... మలాయి ఇరానీ చాయ్‌ల ఆస్వాదన స్మృతులతో వారి జ్ఞాపకాల ప్రయాణం మొదలైంది. అలా సినిమా టాకీసుల సందడి కళ్లముందు సాక్షాత్కరించాయి. ఆరోజుల్లో... 'పర్దా నషీన్ ఖ్వాతీన్' పేరుతో... సినిమా టాకీసుల్లో మగ, ఆడ ప్రేక్షకుల మధ్య పరదాలుండేవని గుర్తుతెచ్చుకున్నారు. మహిళలకు ప్రత్యేకంగా టిక్కెట్ కౌంటర్లు కూడా ఉండేవట. సినిమా నడుస్తున్నపుడు... నమాజ్ చేసే సమయం అసన్నమైతే... దాని కోసం కూడా ఇంటర్వెల్ బ్రేక్ ఇచ్చేవారని సీనియర్ అడ్వకేట్ గులామ్ ఎజ్దానీ గుర్తు చేసుకున్నారు. 40వ దశకంలో 'తస్వీర్ మహల్, షీష్ మహల్, జమ్రుద్ మహల్ వంటి పేర్లతో సినిమా థియేటర్లుండేవి. దివాన్ దేవ్‌డీ ప్రాంతంలో నిజాం కుటుంబీకుల కోసం 'సెలెక్ట్ థియేటర్' ఉండేది. లండన్ నుంచి తెప్పించిన 16ఎమ్ఎమ్ ప్రొజెక్టర్ ద్వారా ఇక్కడ సినిమాలు ప్రదర్శించేవారు. తొలి భారతీయ టాకీ చిత్రం 'ఆలమ్ ఆరా'ను ఆబిడ్స్‌లోని సాగర్ టాకీస్‌లో ప్రదర్శించారు. అలాంటివి హైదరాబాద్‌లో 59 థియేటర్లుండేవి. ప్రస్తుతం అవి చరిత్రలో కలిసిపోయాయి. చాయ్ బిస్కట్... సినిమా ముచ్చట్లు తర్వాత... అప్పటి హోటళ్ల గురించి ప్రస్తావన వచ్చింది. శంకర్ షేర్ హోటల్, గడే కా ఛాయ్‌ఖానా, ఓరియంట్ హోటల్, వికాజీ హోటల్... హైదరాబాద్‌లో ల్యాండ్ మార్క్‌గా ఉండేవి. అక్కడ కూర్చొని సేదతీరడానికి హైదరాబాదీలు ఉత్సాహం చూపేవారు. ఫతే దర్వాజా, ఫలా దర్వాజా వంటి... ముఖద్వారాలు.... ఆ రోజుల్లో 11 ఉండేవి. హైదరాబాదీ జ్ఞాపకాలతో ఒక్కటైన అందరినీ ఉద్దేశించి... సీనియర్ అడ్వకేట్ గులామ్ యజ్దానీ పలు ఆసక్తికర విషయాలు తెలిపారు. అప్పటి మాటలు, కనుమరుగైన అనేక పదాలు.. అనేక ఘటనలు ఆసక్తికరంగా వివరించారు.

**గులామ్ యజ్దానీ, సీనియర్ అడ్వకేట్...**

హైదరాబాద్‌కి మాత్రమే ప్రత్యేకమైన అనేక పదాలు... చర్చ సందర్భంగా... గులామ్ యజ్దానీ చదివి వినిపించారు.. హైదరాబాద్ వెలుపల( ఉత్తర భారత్) నుంచి ఎవరైనా వస్తే వారిని 'హిందుస్తానీ' అని పిలిచేవారట. హైదరాబాద్ చుట్టుపక్కల నుంచి వచ్చేవారిని 'గావ్ కీ లోగ్' అనే వారట... జిగరీ దోస్త్... బూమ్ పిటారా... కౌడీ ( నగదు), హడ్డీ - హడ్డీకి పాని పిలానాతో పాటు అనేక పదాలు చెబుతూ... వాటి గురించి యజ్దాని వివరణ ఇచ్చారు. 1956 నాటి ఒక ఘటనను ఆయన గుర్తు చేశారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హైదరాబాద్ పర్యటనకు వచ్చారు. నిజాం రాజును కలవాలని ఉందని తన అధికారులతో ఆమె చెప్పారు. కానీ... టూర్ షెడ్యూల్‌లో లేనందున కుదరని అధికారులు అన్నారట. అదేంటి... హైదరాబాద్ వచ్చి నిజాం రాజును కలవకపోతే ఎలా... తమ వర్తమానాన్ని పంపమని అధికారులు తెలిపారు. ఆ వర్తమానం అందుకున్న నిజాం రాజు... ఇంత తక్కువ సమయంలో ఏర్పాట్లు ఎలా చేస్తాం... అని విసుగు చెందారట. ఆ తర్వాత ఇందిరాగాంధీ నిజాంను కలవడానికి వెళ్లారు. ఇందిర కారు దిగిన వెంటనే... ముందస్తు సమాచారం లేకుండా ఎలా వస్తారు... ఏర్పాట్లు చేసుకోవాలి కదా అని నిజాం రాజు.. ఇందిరను ఉద్దేశించి అన్నారట... అప్పుడు... ఇందిర సమాధానం ఇస్తూ... తండ్రి ఇంటికి రావడానికి కూతురుకి ముందస్తు సమాచారం ఇవ్వాలా అని అన్నారట. అలా... అప్పటి ఘటనలను యజ్దానీ గుర్తు చేసుకున్నారు.

ఇంకా పేరు పెట్టని ఈ గ్రూప్ త్వరలోనే నియమ నిబంధనలు ఏర్పాటు చేసుకుని రిజిష్టర్ చేయించుకుంటామని సభ్యులు తెలిపారు. హైదరాబాద్ ముచ్చట్లను... భవిష్యత్ తరాలకు అందించే ప్రయత్నం చేస్తున్న ఈ హైదరాబాదీ సంస్కృతి ప్రియులు... అభినందనీయులు.

-దక్కన్ న్యూస్

# మనిషిని, మనిషితనాన్ని కాపాడుకుందాం!

మనిషి భౌతికంగా సజీవుడై ఉంటేనే విలువలు ప్రతిష్ఠించగలిగేది. ప్రేమాభిమానాలు, ఆత్మీయతలు పంచుకోగలిగేది. మనిషి ప్రకృతిని పరిరక్షించుకోగలిగితేనే మనిషి తనలోని చెడుపై తిరుగుబాటు చేయగలిగేది. సమాజంలోని చెడుపై ధ్వజమెత్తగలిగేది. మానవత్వం నా మొదటి ప్రపంచం, మానవవాదం నా రెండో ప్రపంచం. అయితే నేను ఒక మామూలు మానవ మాత్రుడిగా నా 'మూడో ప్రపంచం'లో బతుకుతుంటాను. అయితే ఇది నిరంతరం కొనసాగించే యుద్ధం. ఇప్పుడు నిజంగానే ఉన్న అణుయుద్ధం,మరోవైపు కాలుష్యం, ఇంకోవైపు మానవ నీచ ప్రవృత్తి. ఇవి మూడూ మూడువైపుల నుండి దండెత్తి మనిషిని ఒక మూలకు నొక్కిపెడుతున్నాయి. మనసుని ముక్కలు చేస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే జురాసిక్ యుగంలో రాజ్యమేలి, నశింపు పొందిన డైనోసార్స్ లాగా ఈ శతాబ్దపు అంతానికి మనిషి నశించిపోయే ప్రమాదం లేకపోలేదు.



విలువల వలువలు కనబడక పోవడమన్నది ఇప్పుడు మాత్రమే జరుగుతున్న విషయం కాదు. అది భారత కాలం నుండి ఉంది. అంతకు ముందునుండి కూడా ఉంది. భారతంలో పాంచాలి వలువల్ని విప్పే ప్రయత్నం దుశ్శాసనుడు చేయనే చేశాడు. అందుకు శిక్ష కూడా అనుభవించాడు. అందువల్ల ఈ పోరాటం లోగడ జరిగింది. ఇప్పుడు జరుగుతోంది. ఇకముందు జరగుతూనే ఉంటుంది. ఈ యుద్ధానికి అంతంలేదు. కష్టసాధ్యమైనా చెడుపై మంచికి గెలుపు ఖాయం! అనే భావంతోనే ఆశాజీవి అయిన మనిషి జీవిస్తూ ఉన్నాడు. బాధ్యతగల కవులు, రచయితలు, శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, అధికారులు..... సమాజంలోని అన్ని రంగాలవారు పూనుకుని వారివారి కోణంలోంచి మనిషి మనుగడకు దోహదం చేయాల్సిఉంది. దృక్పథాలు వేరైనందువల్ల ఏర్పడే పలుచని పొరలేవైనా ఉంటే వాటిని విస్మరించి, ఈ విషయంలో అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉంది.

పుణ్యం గురించి, పవిత్రత గురించి ఇప్పుడు మనం అన్వేషించ నక్కరలేదు. అవి మరణానంతరం దొరికేవి. కానీ, మనం బతికి ఉండగానే జీవితంలో వెతుక్కోవాల్సింది మానవత్వం. ఒకరికి ఇవ్వడం, మనస్ఫూర్తిగా నవ్వడం ఎక్కడెక్కడో తప్పిపోయినా, మళ్ళీ దొరకడం, ఆడడం, పాడడం, ప్రేమించడం, ప్రేమ పొందడం... అన్నీ..అన్నీ – ఒక క్రమపద్ధతిలో మనిషిలాగానే నిర్వహిస్తూ ఉండాలి.

మనిషి కనుమరుగయ్యే అవకాశాలు చాలా ఉన్నాయని ఎంతోమంది శాస్త్రవేత్తలు తమ ప్రయోగ ఫలితాలవల్ల, పరిశీలనలవల్ల తెలియజేశారు. విషయాన్ని బలపరుస్తూ ఎంతోమంది సరళ వైజ్ఞానిక రచయితలు, మేధావులు పుస్తకాలు రాశారు. సినిమా దర్శక నిర్మాతలు వీడియోలు, చలనచిత్రాలు రూపొందించారు. ఈ భూమి అనారోగ్యకర ఆవాసంగా తయారుకావడానికి ఎన్నెన్నో కారణాలు కనబడుతున్నాయి. అణు యుద్ధం, జీవ సంబంధమైన యుద్ధం కోలుకోలేని రోగాలు, మందుల ప్రతికూల ప్రభావాలు, నియంత్రణలేని జనాభా కుప్పగూలిపోతున్న పర్యావరణం, కృత్రిమ మేధ, వెర్రితలలు వేస్తున్న జీవ సాంకేతిక పరిజ్ఞానం, రోబోట్లు, పునరుత్పత్తి పొందగలిగే నానో రోబోట్లు, ఇవిగాక, ప్రకృతి సంబంధమైన వరద భీభత్సలు, అగ్ని పర్వతాలు, కరువు, ఆహార ధాన్యాల కొరత, ముఖ్యంగా శుభ్రమైన గాలి, నీరు దొరకకపోవడం. ఇవన్నీ ఇలా ఉంటే విశ్వాంతరాళంలో గ్రహాల కదలికతో వచ్చే మార్పులవల్ల పూర్తిగా మారిపోయే పర్యావరణం వల్ల ఈ భూమి ఇంకా, ఇంత జనాభాను భరించలేకపోవచ్చుననే అభిప్రాయం కూడా ఒకటుంది!

తత్వవేత్త రాబర్ట్ ఆడమ్స్ ప్రకారం-మనం మన పర్యావరణాన్ని, భూమిని, నదుల్ని, సముద్రాల్ని సురక్షితంగా ఉంచుకుంటున్నామా అనేదానిమీద మన మనుగడ ఆధారపడి ఉంటుంది. మన పిల్లలకు మనమేం చేస్తున్నాం, మళ్ళీ మన పిల్లలు వారి పిల్లలకేం చేస్తున్నారు అనేది ముఖ్యం. అలా తరాల తర్వాత తరాలు బుద్ధిని ఉపయోగించి, తెలివిగా మసలుకో గలిగితే మానవజాతికి అంతమంటూ ఉండనే ఉండదు.

మరో తత్వవేత్త నిక్ బోస్ట్రోమ్ చెప్పేదేమంటే – "ఏ దేశంవారైనా, ఏ కాలంవారైనా, ఏ తరంవారైనా సమాజంలో అన్ని విధాలా 'చెడు స్థాయి'ని పెంచకుండా ఉంచగలిగితే చాలు. అంతకన్నా మరేం లేదు. దీనిమీద ఇంత చర్చ అనవసరం" అని అన్నాడు. దేశాల మధ్య, ప్రభుత్వాల మధ్య సయోధ్య లేక ప్రమాదకరమైన సూక్ష్మ క్రిముల్ని ఒక పథకం ప్రకారం ఇతర దేశాల మీద ప్రయోగిస్తే...అది అక్కడితో ఆగదు. మొత్తానికి మొత్తంగా ప్రపంచ జనాభాయే నాశనమైపోతుంది అని అంటున్నారు వైద్యశాస్త్ర నిపుణులు. ఎందుకంటే రాబోయే

కాలంలో కొత్త వైరస్‌లు, కొత్త బాక్టీరియాలు పుట్టుకొచ్చే ప్రమాదం తప్పకుండా ఉంది. వాటిపై మనం ఇప్పుడు ఉపయోగిస్తున్న 'యాంటీబయాటిక్స్' పనిచేయవు. కొత్తవేవో కనుక్కుని వాటికి విరుగుడు మందులు తయారు చేసుకునేలోపు ఎంతో ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది.

హైడ్రోజన్ తగ్గడం మూలాన మరో బిలియన్ సంవత్సరాల తర్వాత సూర్యుడి వేడి, వెలుతురు ఊహించలేనంత పెరుగుతుంది. అప్పుడు భూమి పైపొరలన్నీ వేడెక్కుతాయి. ఫలితంగా సముద్రాలు ఇంకిపోవచ్చు. ఇది జరగకముందే కార్బడైఆక్సైడ్ తగ్గిపోతుంది. అంటే వృక్షజాతి నశించిపోతుంది. దాని ఫలితం అన్ని జీవరాసులపై ఉంటుంది. అంటే మనిషి మీద కూడా ఉంటుంది కదా!?! ఇలాంటి మార్పులవల్ల సూర్యుని వేడి పెరుగుతూపోయి, చివరికి భూమి నాశనమౌతుంది – అని కొన్ని వైజ్ఞానిక కథనాలున్నాయి. హాన్స్ రోస్‌లింగ్, స్వీడిష్ మెడికల్ డాక్టర్, ప్రొఫెసర్ పరిశోధనలు చేసి చెప్పిందేమంటే '21వ శతాబ్దంలో ప్రపంచ జనాభా పెరుగుతుంది' అని! అది ప్రస్తుతం నిజమౌతోందికదా! అంటే రాబోయే శతాబ్దాల గురించి వైజ్ఞానికులు చెప్పేవి కూడా నిజం కావచ్చు.. సర్ మార్టిన్ రీస్ "మన తుది గంట" (our final hour) పుస్తకంలో చెప్పినట్టు విపరీతంగా పెరిగిపోతున్న వైజ్ఞానిక ప్రగతే మానవ వినాశానికి కారణమౌతోంది. నానో టెక్నాలజీవల్ల భూ పర్యావరణానికి ముప్పు బాగా వాటిల్లుతుంది. హై ఎనర్జీ ఫిజిక్స్ రీసర్చ్‌వల్ల భూమి మీద మైక్రో బ్లాక్ హోల్స్ పడే అవకాశముంది. అంతేకాదు ఎన్.ఇ.ఓ.(NEOs) ల వల్ల అంటే నియర్ ఎర్త్ ఆబ్‌జెక్ట్స్ (Near Earth Objects) వల్ల భూమికి అతి సమీపంలో ఉన్న పదార్థాలవల్ల, వాటి ప్రభావాలవల్ల జీవరాశులు పెద్దఎత్తున నాశనం కావొచ్చు. గ్రావిటీ ట్రాక్టర్ (Gravity Tractor) మనిషి తయారుచేసిన పరికరమే! వైజ్ఞానిక ప్రయోగాల్లో ఎన్నో యంత్రాల్ని అంతరిక్షంలోకి పంపుతున్నాం. వాటివల్ల కూడా పెను ప్రమాదాలు సంభవించొచ్చని సర్ మార్టిన్ రీస్ హెచ్చరించారు. సహజంగా మనుషులు పుట్టి పెరగడం కాకుండా, ఇప్పుడు జెనటిక్ ఇంజనీరింగ్‌తో సహజత్వం, సాంకేతికతల సంయుక్త 'ఉత్పత్తులు' అంటే – కొత్త జీవాలు పుడుతున్నాయి. మనుషులు కూడా పుడుతున్నారు. దీనివల్ల ముందు ముందు నైతికత సమస్యలు ఉత్పన్నం కావొచ్చు. రాగల కాలంలో ఈ ప్రయోగాలు ఎలాంటి విపత్కర పరిణామాలకు దారితీస్తాయో చెప్పలేం కదా అని కొందరు భయపడుతున్నది కూడా నిజమే.

ఇరవై ఒకటవ శతాబ్దపు పాపులర్ సైన్స్ గ్రంథం 'మనం లేని మన ప్రపంచం' (The World without us) రచయిత అలైన్ వైస్‌మెన్ తన ప్రయోగాత్మక ఆలోచనని అక్షరాల్లో పెట్టాడు. ఈ భూమి మీద నశింపు (Extinction) పొందిన ఎన్నో ఇతర జంతువుల్లాగా మనిషి కూడా నశించిపోతే ఎలా ఉంటుంది?...అని! ఇంతేకాదు, సైన్స్ ఫిక్షన్ కథలు ఇలాంటివే ఎన్నో వెలువడ్డాయి. 1951లో ఒక సినిమా కూడా వచ్చింది. ఈ భూమి మరో గ్రహంతో గుద్దుకున్నప్పుడు జరిగే అనర్థాల్ని ఊహాత్మకంగా చిత్రించింది. 'మానవత్వం ఆత్మహత్యా సదృశ్యమా?' అనే శీర్షికతో 1993 మే 30న న్యూయార్క్ టైమ్స్–చాలా వివరమైన కథనం ప్రచురించింది. వైజ్ఞానిక రచయిత లెస్లీ (1996) తన 'ముగిసిపోయే ప్రపంచం' పుస్తకంలో ఒకచోట అంటాడు. ఈ భూమిని నాశనం చేయగల ప్రమాదకరమైన ప్రొటాన్ ఏదీ బయటపడలేదు. మనం తెలుసుకునేలోపునే అది భూమిని నాశనం చేస్తే – ఏం జరిగిందో తెలుసుకోవడానికి అసలు మనవేం ఉండం అని. అంతేగాక, భారత్‌వంటి దేశాల్లో డబ్బుల కోసం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరుగుతున్నాయి. మరి కొన్ని వంధ్యత్వ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంకా ఇతరత్రా అనేక కారణాలవల్ల 2150 నాటికి ప్రపంచ జనాభా విపరీతంగా తగ్గిపోయే అవకాశాలున్నాయి – అని అన్నాడు సైన్స్ రచయిత లెస్లీ.

ఒకవైపు మనిషే నశించిపోయే పరిస్థితులు దగ్గరపడుతూ ఉంటే – భాషా ఉద్యమాలకు, ప్రాంతీయ సామాజిక ఉద్యమాలకు, రిజర్వేషన్లకు, అస్థిత్వ పోరాటాలకు, జలాల వివాదాలకు విలువేముంటుంది? ఆలోచించవల్సిన విషయం. మనిషి సజీవంగా కళకళలాడుతూ ఉంటేకదా పైవాటికి విలువ ఉంటుంది. ఏదైనా సాధిస్తే సార్థకత ఉంటుంది. పైగా మరోవైపు ఉగ్రదాడులు...అంటే ప్రమాదం అంచున మనిషి దినదినగండంగా గడపాల్సివస్తోంది కదా! తమ స్థాయిలో తాము చేసే ఉద్యమాలే చరిత్రలో గొప్పగా నిలుస్తాయని కొందరు అనుకుంటూ ఉంటారు. నిజమే నిలుస్తాయనుకుందాం. ఎప్పుడూ? అసలు మనిషనేవాడు బతికి ఉంటేకదా! మనిషితనం కనుమరుగై, భౌతికంగా మనిషి బతికిఉంటే మాత్రం లాభం ఏమిటీ? అడవిలో ఒకరకమైన జంతువులు, ఊళ్ళో మరో రకమైన జంతువులు ఉంటాయన్నమాట. ఆ 'ఛాయలు' నాగరికత బాగా నేర్చిన మహా నగరాల్లోనే ప్రస్ఫుటమౌతున్నాయి.

**ఒకవైపు మనిషే నశించిపోయే పరిస్థితులు దగ్గరపడుతూ ఉంటే – భాషా ఉద్యమాలకు, ప్రాంతీయ సామాజిక ఉద్యమాలకు, రిజర్వేషన్లకు, అస్థిత్వ పోరాటాలకు, జలాల వివాదాలకు విలువేముంటుంది? ఆలోచించవల్సిన విషయం. మనిషి సజీవంగా కళకళలాడుతూ ఉంటేకదా పైవాటికి విలువ ఉంటుంది. ఏదైనా సాధిస్తే సార్థకత ఉంటుంది. పైగా మరోవైపు ఉగ్రదాడులు...అంటే ప్రమాదం అంచున మనిషి దినదినగండంగా గడపాల్సివస్తోంది కదా! తమ స్థాయిలో తాము చేసే ఉద్యమాలే చరిత్రలో గొప్పగా నిలుస్తాయని కొందరు అనుకుంటూ ఉంటారు.**

**"అందుకే మనిషిని, మనిషితనాన్ని బతికించుకోవాల్సిన అవసరం అత్యవసరంగా ఉంది!!"**

– డా॥ దేవరాజు మహారాజు

m : 9573706806

e : devaraju.maharaju@gmail.com

# బిగ బిగ తాడు - సొంటె సొంటె కట్టె

కథ ఎప్పుడు పుట్టింది? మనిషి పుట్టినప్పుడే కథ పుట్టిందేమో? భాష పుట్టినప్పుడే కథ కూడా పుట్టిందేమో? ఓబుకాలాన భూమండలమంతా హిమయుగంలో కూరుక పోయినపుడు ఎముకలు కొరికే చలిరాత్రుళ్లలో పాతరాతి యుగం ఆదిమానవులు చీకటి గుహలలో చలిమంటల చుట్టు చేరినపుడు, నిద్రరాని పొద్దుపోని క్షణాల నుండి కథ పురుడు పోసుకుని పుట్టిందేమో? ఈ భూమ్మీద ప్రపథమంగా కథ చెప్పిన ఆ అనామక ఆదిమానవుడెవరో?

ఒక మన దేశంలోనే కాదు. ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ కథలు చెప్పే ప్రత్యేక జాతుల వారు ఉన్నారు. మధ్య ఆసియా దేశాలలో వారిని "అసహక్స్" అంటారు. వీరు "ఏక్‌తారా" లాంటి వాయిద్యాన్ని మీటుతూ రోజుల తరబడి "మానస్" పురాణాన్ని గానం చేస్తారు. ఇది కూడా మన మహాభారతం లాంటిదే. మానస్ రెండు వేల సంవత్సరాల క్రిందటి పురాణగాథ. ఆ పాటను నేను మధ్య ఆసియా దేశాలను పర్యటిస్తున్నప్పుడు విన్నాను.



కథలలో విన్న వెన్నెల కాదు వెన్నెలలో విన్న కథల గురించి ఇపుడు మీకు చెబుతాను. ఆ వెన్నెల కథలు చెప్పిన కథల మాంత్రికుడి గురించి అతను చెప్పే కథా సంవిధానం గురించి కూడా కథ చెబుతాను. కంచికి వెళ్లని ఆ 'కథకుడి కథ' ఆఖరిలో ఎట్లా ఆగమైపోయిందో కూడా విన్నవిస్తాను. ఓ బుధ జనులారా ఆలకించి ఆనందించండి.

వేసవికాలం. నిండుపున్నమి పండు వెన్నెల కాలం. మా గల్లీలో ప్రతి ఇంటి ముందు జాజురంగుతో పెద్ద పెద్ద అరుగులు. అందరూ అన్నాలు తినంగనే ఇండ్లల్ల గ్యాసునూనె దీపాలు ఆర్పేసి నులక మంచాలు, నవారు మంచాలు, చినిగిన ఈత చాపలు, అతుకుల బొంతల పక్కబట్టలు, షత్రంజీలు, మెత్తలు తీసుకుని, మరచెంబులలో మంచినీళ్ల సౌకర్యం ఏర్పాటు గావించుకొని మా గల్లీల జమయ్యేవారు. పిల్లలం అరుగుల మీద, పెద్దలు, ముసలోళ్లు మంచాలల్ల, చాపల మీద ఎవరింటి ముందు వారు కాళ్లు చాపుకుని, నడుంవాల్చి "ఆబ్‌ఆరాం కా మామ్‌లా హై" అన్నట్లు సెటిల్ అయ్యేవారు.

అప్పుడు గల్లీ హఠాత్తుగ ఒక సామూహిక రంగస్థలంగ మారిపోయేది. నానాజాతి సమితి సభలాగ దర్శనమిచ్చేది. గల్లీ ఆఖర్న రెండు తురుకోళ్ల ఇండ్లు వారికెదురుంగ మరాఠోళ్లు, ఇటుపక్క వడ్లోళ్లు, జంగమొళ్లు వారికెదురుంగ బాపనోళ్లు తర్వాత మేమూ మా ఇంట్ల కిరాయికి ఉండే కన్నడం వాళ్లూ, మా పక్కన బర్రెలదొడ్డితో సహా పాలు అమ్మే గొల్లోళ్ల ఇల్లు ఇట్ల అందరూ కలగాపులగంగ కలువంగనే మా గల్లీ మినీ భారతంగా, మేరా భారత్ మహాన్ గా భాసించేది. భిన్నత్వంలో ఏకత్వానికి మా గల్లీ ఒక సంకేతం. ఒక ప్రతీక.

మండుటెండల మధ్యాహ్నాలల్ల వేడివేడి వడగాలులతో వేగివేగి కాలికాలి సాయింత్రానికి అందరూ నిప్పుల కొలిమిలో మండి మండి నీళ్లల్లో ముంచి తీసిన ఇనుప ముక్కల్లా చల్లబడేవారు. ఇక రాత్రిళ్లు అరుగుల మీదకు చేరంగనే వేపచెట్టు మీంచి చల్లగాలి వింజామరలు వీచేది. మా ఇంటి నుండొచ్చిన మల్లె పందిరి పూల పరిమళాలు మమ్మల్ని చుట్టుముట్టి కనబడకుండా కావలించుకునేవి. మనస్సంతా మత్తు మందు చల్లినట్లు మాయకు గురికాంగనే అప్పుడు "కథకు చక్రవర్తి - మాటల మాంత్రికుడు" వొడ్ల వెంకయ్య తాత "భళీ భళీ మా తాత బల్లెంబు చేబూని" అన్నట్లు రంగప్రవేశం చేసేవాడు.

తాతా, తాతా ఒక కథ చెప్పు తాతా అని మేమందరం పిల్లలం ఆయన చుట్టూ చేరేవారం. బుంగ మీసాల చాటు నుండి ఆయన ముసి ముసి నవ్వులు వొలికించుకుంట అక్కడే క్రింద ఉత్తనేల మీద కూచునేవాడు. మేమందరం ఆయనచుట్టూ బెల్లం చుట్టూ ఈగల్లాగ మూగేవాళ్లం.

వన్నెవన్నెల వెన్నెల కథలు వైనవైనాలుగా వర్ణనలతో ప్రారంభించేవాడు. ఆయన నిఘంటువులో కథా నిర్వచనం, కథాభాష్యం ఎట్టిదనగా కథ చెప్పటం అంటే సుత్తికొట్టటం కాదు. శ్రోతల మనోనేత్రాలకు పట్టంగట్టినట్లు దృశ్యమానంగా చెప్పటం, బాలనాగమ్మ నాటకంలో మాయలఫకీర్ మనుషుల్ని రాతిబొమ్మలుగా మార్చినట్లు కథకుడు శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని గావించి శిలాప్రతిమలుగ నిలబెట్టాలి. కనె్రప్పలు ఆర్పకుండ, తెరిచిన నోళ్లు మూయకుండ స్థాణువులైపోవాలి. భయంతో ఊపిరి బిగపట్టి ఒంటిమీది రోమాలు నిక్కబొడుచుకుని ఆ తర్వాత హాస్యరసం రాగానే కడుపుబ్బ ముక్కచెక్కలయ్యేటట్లు నవ్వాలి. ఒక కంట ఆనందభాష్పాలు మరోకంట దుఃఖాశ్రువులు రాల్చాలి.

ఎవరూ ఎన్నడూ వినని కొత్త కొత్త కథలు చెప్పేవాడు. బిగబిగ తాడు సొంటెసొంటె కట్టె, ఎసరు మసళ్లు గుంజకు బందిళ్లు, రాకాసి లోయల ఒంటికన్ను రాక్షసుడికి ఒంటికొమ్ము పిశాచానికి మధ్య

జరిగిన ముష్టియుద్ధం, బాతాల పోతురెడ్డి చిట్టిపొట్టి హాస్యకథలను కథలు కథలుగా వర్ణించి వర్ణించి చెప్పేవాడు.

పుష్కరకాలం గురుకుల విద్యాభ్యాసం ముగించుకున్న రాకుమారుడు శ్వేతాశ్వంపై దేశాటనానికి బయలుదేరి కాకులు దూరని కారడవిలో చీమలు దూరని చిట్టడవిలో ప్రయాణిస్తూ ఆకలిగొన్న పులిబారి నుండి ఒక సాధువును రక్షించగా ఆయన ఒక తాడును మరో కట్టెను "దివ్యాస్త్రములుగా" బహుకరించగా వాటి మహిమతో రాకుమారుడు దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించి రాకుమార్తెను వివాహమాడటమే "బిగబిగతాడు – సొంటె సొంటె కథ". దొంగమొగుడు – దొంగపెళ్లాం కథ రెండోది. ఇద్దరూ వొళ్లొంచి కష్టపడి సంపాదించటం ఇష్టంలేని సోమరిపోతులు. భర్త బియ్యం దొంగతనానికి బయలుదేరితే భార్య పొయ్యి అంటించి నీళ్లతో ఎసరు పెట్టి బియ్యం కోసం ఎదురు చూస్తుండేది. ఒక రోజు కథ అడ్డం తిరిగి దొంగదొరికాడు. ఊరోళ్లు వాణ్ణి గుంజకు కట్టి కొట్టుతున్నారు. అక్కడ వాడి పెళ్లాం బియ్యం కోసం ఎదురుచూస్తూ విసుగుతో పెద్దగా "ఎసరు మసళ్లు" అని కేకేసింది. దానికి జవాబుగా మొగుడు ఏడ్పుగొంతుతో "గుంజకు బందిళ్లు" అని మొత్తుకున్నాడు.

**పుష్కరకాలం గురుకుల విద్యాభ్యాసం ముగించుకున్న రాకుమారుడు శ్వేతాశ్వంపై దేశాటనానికి బయలుదేరి కాకులు దూరని కారడవిలో చీమలు దూరని చిట్టడవిలో ప్రయాణిస్తూ ఆకలిగొన్న పులిబారి నుండి ఒక సాధువును రక్షించగా ఆయన ఒక తాడును మరో కట్టెను "దివ్యాస్త్రములుగా" బహుకరించగా వాటి మహిమతో రాకుమారుడు దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించి రాకుమార్తెను వివాహమాడటమే "బిగబిగతాడు – సొంటె సొంటె కథ".**

ఇవేగాక శాఖినీఢాకినీ భూతప్రేత పిశాచాలు, దయ్యాలు, చేతబడులు, బాణామతులు, ఎగిరే రెక్కల గుర్రాలు, నిప్పులు మింగి జ్వాలలు కక్కే వేయి పడగల శేషనాగులు, ఆయన కథల కార్ఖానాలో తాజా తాజా కహానీలు. ప్రతి కథను వర్ణించి సుదీర్ఘంగా సాగదీసి తర్వాత రోజుకు వాయిదా వేసి ఊరించేవాడు. ఒక ముక్కలో చెప్పాలంటే వొడ్ల వెంకయ్య తాత అంటే "కథల ఖజానా – పిల్లలకు నజరానా" అన్నమాట.

వీర్యశౌర్యహాస్య సాహసగాథలు వినిపించే ఆయన బ్రతుకు కథ మాత్రం విషాదభరితం. అది బ్రతికి చెడిన మనిషి కథ. కలతలు కన్నీళ్లు నిండిన కష్టాల కథ.

ఆయనది హైదరాబాద్ కాదు. ఎక్కడో నల్లగొండ జిల్లాలో ఓ పల్లెటూరు. వడ్ల పనిలో మహామశూర్ కళాకార్. ఆ రోజులలో అపుడపుడే నందికొండ (నాగార్జున సాగర్) ఆనకట్ట పని శురూవయ్యింది (1955). బ్రతకటానికి అక్కడికి వెళ్లిన ఈయన బ్రతుకు పచ్చగా పండింది. అక్కడ ఓ చిన్న సబ్ కాంట్రాక్టర్‌గ మారి దండిగా సంపాదించాడు. చక్కటి భార్యా, ఇద్దరు పిల్లలతో ఇల్లు కళకళలాడుతున్నప్పుడు ఒక దుర్ఘటన జరిగింది.

ఒక రోజు పూజ గదిలోకి వెళ్లేసరికి పెద్దనాగుపాము ప్రత్యక్షమైంది. నందికొండలల్ల నుండి వచ్చినదేమో గోధుమ వర్ణంతో నిగనిగలాడుతూ చాలా పొడుగ్గా, బలంగా కనబడింది. ఇతనిని చూడగానే కోపంతో బుసకొట్టి పడగ పూర్తిగా విప్పి తోక చివరన దాదాపు అతని ఎత్తులో నిలబడింది. నీల మణుల్లా మెరుస్తున్న రెండు కండ్లనూ అతని కండ్లల్లో పెట్టి తీక్షణంగా చూస్తుంది. ఈ లోగా అక్కడికి వచ్చిన భార్యాపిల్లలు ఆ దృశ్యాన్ని చూసి కెవ్వున అరిచారు. ఆ అరుపులకు ఇరుగుపొరుగు అందరూ గుమికూడారు. దాంతో అది ఇంకా కోపంతో బుసలు కొడుతుంది. నోరు తెరిచి తెల్లటి కోరల్ని ప్రదర్శిస్తుంది. ఎవరికి ఏం తోచలేదు. చివరికి అతనే తేరుకుని నెమ్మదిగా ఒక్కొక్క అడుగే వెనక్కి వేసుకుంటు ఇంట్లోకి వెళ్లి తను వేటాడే నాటు తుపాకీ చేతుల్లోకి తీసుకుని అందరూ వారిస్తున్న వినకుండా ఆ పాము పడగకు గురి చూసి కాల్చాడు. ఆ పాము రక్తం కక్కుకుంటూ నేల కూలి అతనికేసి తీవ్రమైన చూపుతో కోపంగా చూస్తూ మూడుసార్లు పడగను నేలకుకొట్టి "ఏదో శపథం చేస్తున్నట్లు" ప్రాణం వదిలింది.

శనివారంరోజు పామును అదీ నాగుపామును ఇంట్లో చంపడం ఆ ఇంటికే అశుభం అని చాలా మంది భయపడ్డారు. శాంతి చేయించమన్నారు. కనీసం దాని నోట్లో ఒక వెండిరూపాయి బిళ్ల పెట్టి సగౌరవంగా దహనం చేయమని సలహా ఇచ్చారు.

అతను ఏ సలహాలను పాటించలేదు. చచ్చిన పామును పెంటకుప్పపై విసిరేశాడు.

సరిగ్గా మూడు రోజులకు చూడచక్కని అతని ఇల్లాలు నిద్రలో పడుకున్నది పడుకున్నట్లుగానే మంచంలోనే మరణించింది. జాగ్రత్తగా పరిశీలిస్తే ఎడమ పాదం బొటన వేలిదగ్గర పాముకాటు కనబడింది.

ఊరుఊరంతా గొల్లుమన్నది.


పగబట్టిన పాము సంతతి లోకంలో ఎక్కడ దాక్కున్నా వచ్చి పగ దీర్చుకుంటుందని మహాభారతంలోని "పరీక్షిత్తుడిని కాటు వేసిన తక్షకుడి" కథను అందరూ చెప్పుకున్నారు.

ఇంకో వారం రోజులకు అతను కాంట్రాక్టు తీసుకుని కడుతున్న కట్టడం అకారణంగా కుప్పకూలింది. పది మంది పనివాళ్లు అక్కడి కక్కడే శిథిలాల్లో సజీవ సమాధి అయ్యారు. ఆ కుటుంబాల వాళ్లకు ఇతనే వేలల్లో పరిహారం చెల్లించవలసి వచ్చింది. ఆ మరునాడే సర్కార్ ఇతని కాంట్రాక్టును రద్దు చేసింది. ఈ సంగతిని విని ఎక్కువ వడ్డీకి అప్పులిచ్చి "పెట్టుబడి" సమకూర్చిన కాబూలీలు బాకీ వసూళ్ల కోసం ఇతని వెంటపడేసరికి ఉత్తచేతులతో కట్టుబట్టలతో ఇద్దరు చిన్న పిల్లలతో పట్నానికి పారిపోయి వచ్చి మర్చిపోయిన వడ్లపనిలో మళ్లీ కూలీగా మారిపోయి మా గల్లీలో ఉంటున్నాడు. తన ఆచూకీ కాబూలీలకు తెలియకుండా అజ్ఞాతవాసం చేస్తున్నాడు.

తన గుండెగాయం మాన్పుకోవడానికి ఆయన వెన్నెల రాత్రుళ్లలో "కథా మార్గాన్ని" ఎన్నుకున్నాడు.

× × ×

వడ్లపనులు దొరకటం రోజురోజుకూ కనాకష్టమైపోతుందనీ, ఇద్దరు పిల్లల్ని ఎట్లా సాకాలో సమజయితలేదని, చుక్కల పర్వతంల



(శ్రీశైలం) ఆనకట్ట పనులున్నవనీ, వొచ్చే సంవత్సరం శివరాత్రి ఐపొంగనే వాపసు వస్తాననీ అందరికి చెప్పి పిల్లలతో సహా దేశం (వలస) పోయాడు.

రెండు మూడు శివరాత్రులు గడిచి పోయినయ్. ప్రతి వెన్నెల రాత్రి, వెన్నెలలో తడిసిన ప్రతి అరుగు అతని కోసం ఎదురు చూసింది. అయినా అతని అతాపతా (జాడ) లేదు.

రేడియోలు, టేప్‌రికార్డర్లు వచ్చినంక మా గల్లీ వాళ్లందరూ కాల వాహిని అలల వాలున కొట్టుకపోయి ఆ "కథక చక్రవర్తిని" మర్చిపోయింద్రు.

ఆయన చెప్పకుండా వదిలి వెళ్లిన "ఆయన కథ" మాత్రం ఎవరికీ తెలియదు.

ఒకరోజు మిట్టమధ్యాహ్నం శ్రీశైలం ఆనకట్ట నిర్మాణంలో చాలా ఎత్తుమీద నిలబడి సెంట్రింగ్ పని చేస్తున్నాడు. నలుగురు పహిల్వాన్ లాంటి మనుషులు అక్కడికి వచ్చి అతని కాళ్లు చేతులు ఎత్తి పట్టుకుని గాలిలో ఊయలలా ఊపుతూ ఇసుకబస్తాను విసిరేసినట్లు క్రింద పాతాళలోకంలో ప్రవహిస్తున్న కృష్ణమ్మ ఒడిలోకి విసిరి వేశారు. అందరూ గుడ్లప్పగించి చూస్తుండగానే దర్జాగా జీపెక్కి కర్నూలు వైపు మాయం అయ్యారు. వారు కాబూలీ వాలాలు పంపిన కిరాయి గుండాలని ఎవరికీ తెలియదు.

కృష్ణమ్మ ఉధృతిలో అతని ఆనవాళ్లు కూడా దొరకలేదు. ఆయన పిల్లలు ఒకరు సున్నిపెంట మరొకరు ఈగల పెంట బస్టాండులల్ల భిక్షగాళ్లుగా మారిపోయారు.


వెంకయ్య తాత కత కంచిదాకా వెళ్లకుండ మధ్యలో కృష్ణలో గల్లంతయ్యింది.

ఆయన లేడు కాని వెన్నెల ఆయన కోసం నిరీక్షిస్తునే ఉంది. యాభై ఏండ్లు దాటినా ఆయన చెప్పిన కతలు ఇప్పటికీ నాకు వెన్నెల రాత్రుల్లలో గాలిలో గుసగుసగా వినబడుతూనే ఉన్నాయి.

నన్ను కథా రచయితను చేసింది. "కథక చక్రవర్తి వొడ్ల వెంకయ్య" తాతనే.

-పరవస్తు లోకేశ్వర్, m : 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# వాడు మేల్కొనేదెన్నడో......



నేల సచ్చిపోతోంది
సారం సచ్చిపోతోంది
రైతు సచ్చిపోతుండు
మనిషి మేల్కొనేదెన్నడో...

గాలి మలినమౌతుంది
నీరు మరుగుపడుతోంది
ఎలుతురు వేడెక్కుతోంది
మనిషి మేల్కొనేదెన్నడో...

పక్షి తన జాతిని చంపదు
మృగం తన జాతిని చంపదు
మనిషి.....?

జాతి హననం తథ్యం
జీవి హననం తథ్యం
సృష్టి హననం తథ్యం
మనిషిని మనిషిగా చూడని
మలీనుడు సచ్చేదెన్నడో
మనిషి మేల్కొనేదెన్నడో..?

-కొండూరి కోటిబాబు
m : 9951752077
e : kotibabu76@gmail.com

# భారత రాజ్యాంగ రూపకల్పన

**నేపథ్యం**

ఇటీవల ఆయా సదస్సుల్లో, సందర్భాల్లో భారత రాజ్యాంగాన్ని ఎంతమంది చదివారని ప్రశ్నించినప్పుడు పది శాతంలోపే అని తెలిసి ఆశ్చర్యం కలిగింది. బాధ కలిగింది. భారత రాజ్యాంగంలోని ముఖ్యాంశాలు తెలుసుకోకుండా, వాటిని అందు కోవడం, సాధించడం, ముందుకు పోవడం కష్టం.

**భారత రాజ్యాంగం ఒక ఉత్కృష్టమైన గ్రంథం**

భారత రాజ్యాంగం ఒక ఉత్కృష్టమైన గ్రంథం. దీని రచనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వాళ్లంతా మహనీయులు. స్వాతంత్ర్య ఉద్యమంలో కలలుగన్న భవిష్యత్ స్వప్నాలను సాకారం చేయడానికి భారత రాజ్యాంగం ఒక ప్రతీకగా రూపొందింది.

1935లో భారతరాజ్యంగ చట్టం రూపొందించబడింది. ఎన్నికలు జరిగాయి. 1946లో భారత రాజ్యాంగ పరిషత్ ఏర్పడింది. నాటి రాజ్యాంగ పరిషత్‌లో నేటి బంగ్లాదేశ్, పాకిస్థాన్ భూభాగాలకు చెందినవారు కూడా ఉన్నారు. వారితో కలిపి రాజ్యాంగ పరిషత్ మొత్తం సభ్యుల సంఖ్య మొదట 399. వారిలో 292 మంది అప్పటి ప్రావిన్షియల్ అసెంబ్లీ సభ్యులచే పరోక్షంగా ఎన్నిక కాబడ్డ సభ్యులు. వారిలో 208 కాంగ్రెసు పార్టీకి చెందినవారు. 73 మంది ముస్లిం లీగ్ ప్రతినిధులు. మిగిలిన కొద్దిమంది ఇతర పార్టీ వర్గాలకు చెందిన వారు. వారిలో భారతీయ జనసంఘ్ వ్యవస్థా పకులలో ఒకరైన శ్యాంప్రసాద్ ముఖర్జీ ఒకరు. కమ్యూనిస్టు పార్టీకి చెందినవారు కూడా ఒకరున్నారు. మిగిలినవారిలో అప్పటికి భారతదేశంలో ఉన్న వివిధ సంస్థానా లకు చెందిన ప్రతినిధులు 93 మంది. చీఫ్ కమిషనర్ ప్రావిన్సుల ప్రతినిధులు నలుగురు ఉన్నారు.

రాజ్యాంగ పరిషత్ కుల, మత, వర్గ, ప్రాతిపదికగా పరిమిత ఓటు పద్ధతిపై పరోక్ష ఎన్నికల ద్వారా ఏర్పాటైంది. స్వతంత్ర రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరవాత ప్రత్యక్ష ఎన్నికల ద్వారా పార్లమెంట్ ఏర్పాటైతే ఇది రాజ్యాంగ పరిషత్ కంటే ఎక్కువగా ప్రజాభిప్రాయానికి అద్దం పట్టగలదు.

భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్విభజన వివిధ రాష్ట్రాల నుంచి డిమాండు రావడంతో రాజ్యాంగ ప్రక్రియలో మార్పు ఏర్పడింది.

తక్కువ సమయంలో రాజ్యాంగ రచన చేయవలసిన ఉన్నందున సర్వహక్కుల నుంచి స్పష్టమైన నిబంధనలు రూపొందించడం సాధ్యం కాలేదు. సాంఘిక, ఆర్థిక రంగాల్లో నాటి భారతదేశ స్థితి అయో మయంగా ఉంది. భారత రాజ్యాంగం లక్ష్యం ఉదారవాదమా? సామ్యవాదమా? అనే విషయంలో సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు.

9-12-1946న ఆ రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశం జరిగింది. మొదటి సమావేశానికి 220 మంది సభ్యులు హాజరయ్యారు. ముస్లిం లీగ్ ఆ సమావేశాలను బహిష్కరించింది.

తూర్పు పాకిస్థాన్, పశ్చిమ పాకిస్థాన్ కలిసి పాకిస్థాన్ దేశం ఏర్పడడంతో పాకిస్థాన్ రాజ్యాంగ పరిషత్ ప్రత్యేకంగా ఏర్పడింది. అందువల్ల కొందరు భారత రాజ్యాంగ పరిషత్‌లోని సభ్యులు పాకిస్థాన్ రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులయ్యారు. వారు కరాచీకి వెళ్ళిపోయారు.

అందువల్ల 399 సభ్యుల నుండి సంఖ్య 302 మంది సభ్యులు మిగిలారు. వారిలో 230 మంది అప్పటి ప్రావిన్షియల్ అసెంబ్లీ సభ్యులచే పరోక్షంగా ఎన్నిక కాబడిన సభ్యులు. మిగిలిన 72 మంది ఇండియన్ స్టేట్స్ సంస్థానాల ప్రతినిధులు. 1947 ఆగష్టు 5 నాటి రాజ్యాంగ పరిషత్ సభ్యులు వీరు.

29 ఆగష్టు 1947 తేదీన రాజ్యాంగం డ్రాఫ్ట్ కమిటీ అనే ఉపసంఘానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షులు. రాజ్యాంగం డ్రాఫ్ట్ సబ్ కమిటీలో మొత్తం ఏడుగురు. 1. డా॥ బి.ఆర్. అంబేద్కర్, 2. అల్లాడి కుప్పుస్వామి అయ్యర్, 3. ఎన్. గోపాలస్వామి

***భారత రాజ్యాంగం ప్రపంచంలోని అత్యుత్తమ రాజ్యాంగంలో ఒకటని ఐక్యరాజ్య సమితి ప్రశంసించింది. ఇంత విస్తారంగా, సమగ్రంగా అనేక రంగాలను, అంశాలను, విభాగాలను స్పష్టంగా పొందుపరచిన మహోన్నత పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగం. భారత రాజ్యాంగంలో ప్రతి మనిషికి ఒకే ఓటు, ఒకే విలువ, ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామిక హక్కులు, సమాన అవకాశాలు, సమాన అవకాశాలు అందుకోవడానికి ప్రత్యేక శ్రద్ధ, స్వేచ్ఛాసమానత్వం, సౌభ్రాతృత్వం, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవంతో జీవించడానికి, సామాజిక న్యాయం ద్వారా, సామాజిక మార్పు సాధిస్తూ, శాంతియుతంగా సమాజం ముందుకు సాగడానికి అనేక లక్ష్యాలు పొందుపరచడం జరిగింది. ప్రతి ప్రాంతం, రాష్ట్రం, ఆయా సామాజిక వర్గాలు, కులాలు, మతాలు తమ గురించి రాజ్యాంగంలో ప్రత్యేకంగా పొందుపరచిన ఆర్టికల్స్ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉండడం సహజం. తెలంగాణాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల జనాభా 89 శాతంగా ఉంది. అందువల్ల వారికి సంబంధించిన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవడం ఎంతో అవసరం అని అనిపించింది. సామాజిక తత్వవేత్త బి.ఎస్. రాములు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ గురించి, అనేక విషయాలను వ్యాసంవలె సులభంగా రాశారు. ఈ వ్యాసాలను వరుసగా ప్రచురించాలని తలపెట్టిన క్రమంలో ఇది మొదటిది.***

(ఈ రచనలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు.) **– ఎడిటర్**

అయ్యంగార్, 4. బి.ఎల్. మిట్టల్, 5. మహమ్మద్ తాజుల్లా, 6. డి.పి. ఖైతాన్, మధ్యలో బి.ఎల్. మిట్టల్ రాజీనామా చేయడంతో మాధవరావును నియమించారు. అలాగే ఖైతాన్ మరణించడంతో టి.టి. కృష్ణమాచారిని నియమించడం జరిగింది. ఈ ఉపసంఘానికి న్యాయసలహాదారు బి. నర్సింగరాజు.

1948, జనవరి నెలలో రాజ్యాంగం తొలి ముసాయిదా ప్రతి (చిత్తు ప్రతి) విడుదల అయింది. ఆ చిత్తు ముసాయిదాకు వివిధ వర్గాల నుండి, ప్రజలనుండి 7,635 సవరణలు వచ్చాయి. వాటిలో 2,473 సవరణలపై ఉపసంఘం చర్చించింది.

26-11-1949న నూతన రాజ్యాంగాన్ని, రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. తొలి రాజ్యాంగ ప్రతిపై 24-1-1950 తేదీన 284 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు సంతకాలు చేశారు. నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నాము. 15 ఆగష్టు స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుకుంటున్నాము. 26 జనవరిని రిపబ్లిక్‌డే (గణతంత్ర దినోత్సవం)గా జరుపుకుంటున్నాము.

1950 జనవరి 26 నుండి రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అదే గణతంత్ర దినోత్సవం అనబడే రిపబ్లిక్‌డే (1947 తర్వాత భారత రాజ్యాంగ పరిషత్ 10 పర్యాయాలు సమావేశమయింది. ఆ తర్వాత జరిగిన చివరి సమావేశంలో నూతన రాజ్యాంగాన్ని ఆమోదించటంతో రాజ్యాంగ పరిషత్ అధ్యాయం ముగిసింది).

299 లేదా 302 సభ్యులు గల రాజ్యాంగ పరిషత్‌లో హైదరాబాద్ రాజ్యం నుంచి 17 సెప్టెంబర్ 1948లో ఇండియన్ యూనియన్‌లో కలపబడినప్పటికీ ఈ రాజ్యం నుంచి సభ్యులను కొ-ఆప్ట్ చేసుకున్నట్టు కనపడదు. మద్రాస్, బోంబే, పశ్చిమ బెంగాల్, యునైటెడ్ ప్రావిన్స్, తూర్పు పంజాబ్, బీహార్, సెంట్రల్ ప్రావిన్స్‌లు, బేరార్, అస్సాం, ఒరిస్సా, ఢిల్లీ, అజ్మీర్ - మీర్వార్, ఇండయన్ స్టేట్స్‌లోని మైసూర్, జమ్మూ కాశ్మీర్, ట్రావన్‌కోర్ - కొచ్చిన్, మధ్య భారత్, సౌరాష్ట్ర, రాజస్థాన్, పాటియాలా, తూర్పు పంజాబ్ స్టేట్స్ యూనియన్, బోంబే స్టేట్స్, ఒరిస్సా స్టేట్స్, సెంట్రల్ ప్రావిన్స్ స్టేట్స్, యునైటెడ్ ప్రావిన్సెస్ స్టేట్స్, మద్రాస్ స్టేట్స్, వింధ్య ప్రదేశ్, కూచ్ బీహార్, త్రిపుర, మణిపూర్, భోపాల్, కూచ్, హిమాచల్ ప్రదేశ్‌ల నుండి మొత్తం 302 మంది రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులు.

అయితే భారత రాజ్యాంగం రచనలో నైజాం రాజ్యానికి ప్రాతినిధ్యం లేదు. అనేక సంస్థానాల నుండి ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ నైజాం రాజ్యానికి రాజ్యాంగ నిర్మాణంలో ప్రాతినిధ్యం లేకపోవడం చారిత్రక వాస్తవం. నైజాం స్టేట్ ఇండియన్ యూనియన్‌లో 17 సెప్టెంబర్ 1948లో కలపబడినప్పటికీ రాజ్యాంగ పరిషత్‌లో జనాభా, రాజ్య విస్తీర్ణం అనుసరించి కనీసం 18 మందిని రాజ్యాంగసభకు కొ-ఆప్ట్ చేసుకోవాల్సి ఉండింది. అలా జరగలేదు. దానివల్ల నైజాం స్టేట్ స్వతంత్ర రాజ్యంగా, దేశంగా ఉందని, ఉండాలని ఐక్యరాజ్యసమితిలో వేసిన పిటీషన్ 1970 దాకా కొనసాగడానికి ఆస్కారం ఏర్పడింది.

రాజ్యాంగ పరిషత్‌లో నైజాం రాజ్యంలోని కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాలనుండి రాజ్యాంగ పరిషత్ సభ్యులను చేర్చుకుని ఉంటే రాజ్యాంగంలో మరికొన్ని అంశాలు అదనంగా చేరి ఉండేవి. ఏమంటే భారతదేశంలో అతిపెద్ద రాజ్యం లేదా దేశం నైజాం రాజ్యమే.

1955లో తెలంగాణ, ఆంధ్ర విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ లేదా 'తెలంగాణ - ఆంధ్ర' అనే రాష్ట్రం ఏర్పాటు చేసుకోవడానికి పెద్దమనుషుల ఒప్పందం కుదుర్చుకునేటప్పుడైనా భారత రాజ్యాంగ నిర్మాతగా సుప్రసిద్ధులైన డా॥ బి.ఆర్. అంబేద్కర్‌గారిని సలహా, సంప్రదింపులు అడిగి ఉండాల్సింది. ఎందుకు అడగలేదో,

1962 శాసనసభ ఎన్నికల తర్వాత ఏర్పడిన శాసనసభలో విలీనం గురించి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభ మూడింట రెండువంతుల మెజారిటీతో తీర్మానిస్తే రెండు రాష్ట్రాలు ఒకటి కావచ్చు అని ఫజుల్ అలీ కమిషన్ సూచించినప్పటికీ రాజ్యాంగం రూపొందించిన డా॥ బి.ఆర్. అంబేద్కర్ బతికి ఉన్నప్పటికీ వారిని సంప్రదించకుండా 1955లో ఆదరబాదరగా పెద్దమనుషుల ఒప్పందం ఎందుకు కుదుర్చుకున్నారో తెలియదు. అంబేద్కర్‌ను సంప్రదించి ఉంటే పెద్ద మనుషుల ఒప్పందం భారత రాజ్యాంగంలో అంతర్భాగం ఎలా చేయాలో సూచించేవారు.

డా॥ బి.ఆర్. అంబేద్కర్‌ను సంప్రదించి ఉంటే 'జమ్మూ-కాశ్మీర్' రాష్ట్రానికి రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక అంశాలన్నీ హైదరాబాద్ రాష్ట్రానికి కూడా ప్రతిపాదించి ఉండేవారు. తద్వారా సీమాంధ్ర వలసపాలన, సమస్త వనరుల, ఉద్యోగాల ఆక్రమణ జరిగి ఉండేది కాదు. జమ్మూ-కాశ్మీర్‌కు గల ప్రత్యేక అంశాలన్నీ చారిత్రక మైనవే. అలాంటి ప్రత్యేకతే నైజాం రాజ్యానికి కూడా ఉండేది.

ఇలా భారతదేశంలో అతిపెద్ద ప్రాంతమైన నైజాం రాజ్యం భారత రాజ్యాంగ నిర్మాణంలో భాగస్వామ్యం పొందలేదు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఔరంగాబాద్, సికింద్రాబాద్‌లోని పెండర్‌గాస్ట్ రోడ్ నివాసం ద్వారా నైజాం రాష్ట్రంతో అక్కడి ప్రజలతో సంబంధాలు ఉన్నప్పటికీ నిజాం రాజ్యానికి రాజ్యాంగ నిర్మాణంలో ప్రాతినిధ్యం లేదనేది కాదనలేని సత్యం. కాశ్మీర్ నుండి ఇతర రాజ్యాల నుండి ప్రాతినిధ్యం ఉన్నప్పుడు నైజాంకు లేకపోవడం భారతరాజ్యాంగంలో దీనికి సంబంధించిన కొరతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. భారత రాజ్యాంగ పరిషత్‌లో నైజాం రాజ్యం నుండి ప్రతినిధులు ఎన్నికై ఉంటే కాశ్మీర్‌వలె 371 ఆర్టికల్‌లో చేర్చడం గానీ, మరొక ఆర్టికల్ చేర్చడం గానీ జరిగి ఉండేది.

భారత రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని 1973లో సుప్రీంకోర్టు కేశవానంద భారతీ వర్సెస్ కేరళ రాష్ట్రం కేసులో తన తీర్పుద్వారా వ్యక్తపరిచింది. "పార్లమెంట్ ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించవచ్చని కానీ ఆ సవరణ రాజ్యాంగ మౌలిక స్వరూపానికి భంగం కలిగించరాదు" అని సుప్రీంకోర్టు ఈ తీర్పులో పేర్కొంది.

అయితే రాజ్యాంగ మౌలిక స్వరూపం అంటే ఏమిటి అనే విషయాన్ని మాత్రం సుప్రీంకోర్టు తన తీర్పులో నిర్వచించలేదు. నేటివరకు ఈ సిద్ధాంతం ప్రకారమే రాజ్యాంగ సవరణలను

వ్యాఖ్యానిస్తున్నప్పటికీ సుప్రీంకోర్టు ఈ సిద్ధాంతాన్ని నిర్వచించ లేదు. రాజ్యాంగంలోని వివిధ లక్షణాలను వివిధ తీర్పులలో మౌలిక స్వరూపమంటే ఏమిటో న్యాయస్థానం నిర్వచించలేదు.

కేశవానంద భారతీ తీర్పులో, తదుపరి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులలో, రాజ్యాంగంలోని కొన్ని లక్షణాలను మౌలిక లక్షణాలుగా సుప్రీంకోర్టు గుర్తించడం జరిగింది. రాజ్యాంగంలోని ప్రతి ప్రధాన లక్షణం ఇతర ప్రధాన లక్షణాలతో మిళితమై ఉంటుంది. ప్రజాస్వామ్యం అనే లక్షణంలో లౌకికత్వం, స్వేచ్ఛ మొదలైన అంశాలు అనేకం ఉంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకని మౌలికాంశ లక్షణాలు నిర్ణయం మారవచ్చు.

ఒక భవనం దాని పునాది రాళ్ళపై నిలబడుతుంది. ఆ పునాది రాళ్ళు తొలగిస్తే ఆ భవనం కూలిపోతుంది. అలాగే రాజ్యాంగం అనే భవనానికి కూడా కొన్ని పునాదులుంటాయి. ఆ పునాదులను తొలగిస్తే రాజ్యాంగం దెబ్బతింటుంది. రాజ్యాంగ పునాదులను కాపాడటం అవసరమని సుప్రీంకోర్టు భావిస్తూ రావడం జరిగింది.

అయితే సామాజిక న్యాయం ద్వారా, సామాజిక మార్పు శాంతియుతంగా సాగడానికి ప్రాధాన్యత ఇవ్వాలా? ప్రాథమిక ప్రాధాన్యత ఇవ్వాలా? అనే అంశం ముందుకు వచ్చినప్పుడల్లా మెజారిటీ ప్రజలకు అందాల్సిన సమాన హక్కులు, స్వేచ్ఛా సమాన అవకాశాలు అందుకునే అవకాశాలు, అందుకు ప్రత్యేక అవకాశాలు, శిక్షణలు, రక్షణలు అవసరం అనేవాటిలో ఏదో ఒకటి తేల్చుకోవాల్సి నప్పుడల్లా మెజారిటీ ప్రజలను పక్కన పెట్టి, సామాజిక న్యాయాన్ని పక్కన పెట్టాయి.

న్యాయస్థానాలు ఆస్థిపర వర్గాలకు, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, కులపరంగా, ఆధిపత్యంలో ఉన్న కొన్ని సామాజిక వర్గాలకు, ప్రాథమిక హక్కుల పేరిట 15-20 శాతం గల కొన్ని సామాజిక వర్గాలు, కులాలు, 70 శాతం అభివృద్ధి, విద్యా, ఉద్యోగాలు, పరిశ్రమలు, వాణిజ్యం, కాంట్రాక్టులు, భూమి, వనరులు, ఖనిజాలు, మొదలైనవన్నీ అనుభవించే, హక్కుభుక్తం చేసుకునే ఆధిపత్యం సాధించే విధంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా తీర్పులిస్తూ వచ్చాయి. ఆ పరిణామాల్ని ఆపలేకపోయాయి. నిరోధించలేకపోయాయి.

కొందరు న్యాయమూర్తులు, భూసంస్కరణలను అడ్డుకొని భూస్వాములకు మేలు చేయడానికి చట్టాలను, భారత రాజ్యాంగ ఆర్టికల్స్‌ను తమకు తోచినవిధంగా వ్యాఖ్యానించి ప్రభుత్వ నిర్ణయాలను అడ్డుకుంటూ, అమలు జరపకుండా వచ్చారు. దాంతో భారత రాజ్యాంగంలో 31బి, 9వ షెడ్యూల్ మొదలైనవి సుప్రీంకోర్టు పరిధిలోకి రాకుండా ఆయా చట్టాల, శాసనాల రక్షణ చర్యలు చేపట్టడం జరిగింది.

**(తరువాయి వచ్చే సంచికలో)**

- బి.ఎస్.రాములు

సామాజిక తత్వవేత్త, ఛైర్మన్ బి.సి. కమీషన్, తెలంగాణ

m : 8331966987

e : bsramulu@gmail.com



# రహస్యం

అవసరాలకు ఆశల అంగీ తొడిగి
పసిమొగ్గల అంగడిబొమ్మలను చేసే సందర్భం
ఆ అంధకార ప్రవాహం
ఒకరిది పేగుమడతల ఆకలి
మరొకరిది కోరికలు కొవ్వెక్కిన ఆకలి
కాటుక మడతల కన్నీటి కాన్పుల ఈ నల్ల సముద్రం
ఆశయాలను ఆశలు కాటేసే బానిస సంచయాల శ్రమల దోపిడీ
పాపసంపన్న ప్రదర్శనలో నెత్తురోడే జాతర
దేహమోహాలే కాదు రక్త దాహాల రణరంగం
పలుకుటకు సిగ్గిల్లే చర్యలు
అనేక భ్రమలవంటి సాగరకన్య
అనాథ బాలుని నోటికాడి మెతుకులు తన్నుకుపోయే
హాస్టల్ గద్దల అనుకూల సమయం
నేరాలు ఘోరాలే కాదు శరశ్చంద్రికల విలాసాలు దీని బహురూపమే
ఆసక్తులకు వ్యూహాల రచనలు సాగే తియ్యటి తీగపాకం
రోకటిపోటుకు చిల్లిన వడ్లగింజలో లే విచక్షను చెదరగొట్టే ప్రమాదకారి
నాలో ఆత్మస్థైర్యం ఎదగకుండా బెదిరించే ద్రోణపూనిత గురువు
చేజారిన అద్దంలా ముక్కలయిన మనసుకు స్వాంతననిచ్చేది
మీవంటి ప్రియమైన స్నేహితురాలు రాత్రి

- జ్వలిత

m : 9989198943

e : jwalitha2020@gmail.com

# ఓ మనిషీ! మిడిసి పడకు

"మానవుడే మహనీయుడు, శక్తి పరుడు, యుక్తిపరుడు" అన్నాడో కవి. దేవుడు సృష్టిలో భాగంగా మానవుని తన ప్రతిరూపంగా చేసి సర్వోత్కృష్ట జీవిగా మలచాడనీ, సర్వ జీవ ప్రపంచంపై ఆధిపత్యాన్నిచ్చాడనీ, అన్ని మతాల వారూ విశ్వసిస్తారు. అదే విశ్వాసం, అహంకారం, మానవ చరిత్ర గమనంలో మనిషి ప్రకృతి శక్తులపై పట్టు సాధించి యీ నాడు "మానవ యుగ" అరంభకుడు కావడానికి కారణమయింది. కార్ల్ లిన్నెయుస్ అనే స్వీడిష్ శాస్త్రవేత్త 1758 లో మనిషికి "హెూమో శాపియన్" అనే శాస్త్రీయ నామకరణం చేశాడు. దాని అర్థం "జ్ఞాని". ప్రత్యేకంగా గత 250 సంవత్సరాలుగా మనిషి చేస్తున్న విధ్వంసాన్ని దృష్టిలో వుంచుకుని జూలియన్ క్రిబ్ అనే ఆస్ట్రేలియన్ జీవ శాస్త్రవేత్త మానవులను జ్ఞానులనడం సబబు కాదనీ నామకరణం మార్చవలసిన అవసరం ఉందనీ ప్రతిపాదించాడు.

మానవ చర్యలు గ్రహ స్థాయిని చేరి ప్రభావితం చేస్తున్నాయి. గ్రహ హద్దులు మీరుతున్నాయి. శిలాజ ఇంధన వాడుకతో విడుదలౌతున్న బొగ్గుపులుసు వాయువు సహజ కర్బన వలయం స్థాయిని మించింది. ఏడాదికి 4000 కోట్ల టన్నుల వరకూ పెరిగి పారిస్ ఒప్పందం తరువాత తగ్గుతూ 2017 లో 3250 కోట్ల టన్నులకు చేరింది. ఇది 2016 తో పోలిస్తే అర శాతం హెచ్చుదలతో ఒప్పందం తిరోగమనాన్ని సూచిస్తోందని శాస్త్రవేత్తలు అందోళన వెలిబుచ్చుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలంతా గాలిలో బొగ్గుపులుసు వాయువు స్థాయి 410 పిపిఎంలు వుంది. జీవావరణ భద్రతకి 350 పిపిఎంలు మించ గూడదని ప్రముఖ శాస్త్రవేత్త జేమ్స్ హాన్సెన్ పరిశోధనలు తెలుపుతున్నాయి. రసాయన ఎరువుల తయారీకి నత్రజని వాడుక సహజ నత్రజని వలయ ప్రమాణాన్ని మించి పోయింది. పారిశ్రామిక విప్లవం ముందు నత్రజని వాడుక శూన్యం. అది 2009 అధ్యయనం ప్రకారం 12.1 కోట్ల టన్నులు దాటింది. శాస్త్రవేత్తలు నిర్ణయించిన హద్దు 3.5 కోట్ల టన్నులు. మానవ చర్యలతో 17 వ శతాబ్దంకి పూర్వం ఏడాదికి మిలియన్ జీవులలో కేవలం 0.1 నుండి 1 జీవి అంతరించి పోయేది. అది ఇప్పుడు 100 దాటి పోయింది. హద్దు 10 మాత్రమే. ఈ స్థితి మానవ ప్రేరిత ఆరవ మహావినాశనంగా గుర్తింపు పొందింది. భూమిపైన మొత్తం జీవుల సంఖ్యలో కేవలం ఒక శాతం, జీవ ద్రవ్యరాశిలో (బయోమాస్) 0.01 శాతం మాత్రమే వున్న మానవులు స్వతంత్ర జీవులలో 83 శాతం అటవీ క్షీరదాలూ, 80 శాతం సముద్ర క్షీరదాలూ, 50 శాతం మొక్కలూ, 15 శాతం చేపలూ అంతరించి పోవడానికి కారకులయ్యారని ఈ నెలలోనే ప్రచురించిన పరిశోధనా ఫలితం. భూమిపైని జీవ – అజీవ వ్యవస్థలన్నిటిపైన మానవ పాద ముద్రలున్నాయి. అందుకే శాస్త్రవేత్తలు ప్రస్తుత (జియోలాజికల్ ఎరా) భౌమ యుగానికి "అంత్రోపసీన్" (మానవ యుగం) అని నామకరణం చేశారు. ఈ మానవ ప్రగతి హర్షణీయమా? అభిలషణీయమా?



మానవ మనుగడ జీవావరణంతోనూ, జీవావరణం మనుగడ జీవ వైవిధ్యంతోనూ ముడిపడి వున్నాయి. జీవ వైవిధ్యం నశిస్తే జీవావరణమే కుప్పకూలుతుంది. జీవావరణమే లేకుంటే మనిషెక్కడ? పైన ఉదహరించిన స్థాయిలో జీవ వైవిధ్యాన్ని విధ్వసం చేస్తున్న మనిషి తన మనుగడ సుస్థిరమని భావిస్తూ అహంకారంతో యధావిధి కొనసాగించడం మూర్ఖత్వంగాక మరేమిటి? ఇతర జీవులు ప్రకృతి వ్యవస్థలతో సమతుల్యాన్ని పాటిస్తూనే, మానవ శాస్త్ర విజ్ఞానం ఈనాటికీ సాధించలేని, ఎలాంటి విధ్వంసమూ, ఉద్దేశించని (unintended) దుష్ఫలితాలూ లేని, ఎన్ని గొప్ప శాస్త్ర సాంకేతిక విజయాలు, సాధించాయో గమనిస్తే సిగ్గుతో తలదించుకోవాలి. అహంకారంతో కూడిన మిడిసిపాటుని విడిచి, అణకువతో ప్రవర్తించాలి.

ప్రకృతిని మించిన రూప శిల్పి (Designer) మరొకరు లేరు. జీవ పరిణామంలో 380 కోట్ల సంవత్సరాల ప్రకృతి పరిశోధనానుభవం ముందు మనిషి మేధస్సు పేలవం. ప్రకృతిలో జరిగే ఉత్పత్తులు స్థానికంగా లభించే పదార్థాలతో, పర్యాప్త స్థితి (ambient conditions)లో ఎలాటి వ్యర్థాలు లేకుండా జరుగుతాయి, జీవానుకూల రసాయన పద్ధతులను ఉపయోగిస్తుంది ప్రకృతి. కాని మానవ సాంకేతికత భిన్నంగా పీడనం, ఉష్ణోగ్రతలలో పెను మార్పులు చేసి, ఎంతో శక్తిని వెచ్చించి వివిధ వ్యర్థాలతో కూడిన ఉత్పత్తులు చేస్తుంది. ఈనాడు మానవుడు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య గాలిలో, నీటిలో, నేలపై పేరుకుంటున్న వ్యర్థాల సమస్య. ప్రధానమైనది పెరిగిపోతున్న బొగ్గుపులుసు వాయువు సృష్టిస్తున్న భూతాప సంక్షోభం. జానైన్ బెన్యూస్ వివరించినట్లు అతిపెద్ద ఉత్పాదన ప్రకృతిలోనే జరుగుతూ వచ్చింది. ప్రపంచంలోని చెట్లన్నీ కలగలిసి రోజూ తమ పెరుగుదలకై ఉత్పత్తి చేసే రసాయనాల మొత్తానికి ఏ పరిశ్రమా సరిరాదు. ఈ ఉత్పత్తి మొత్తం ముడిసరుకూ, ఉత్పత్తుల రవాణా, వ్యర్థాల శుద్ధి హడావుడి లేకుండా నిశ్శబ్దంగా జరిగి పోతుంది. అది ఎన్నో జీవులకు బ్రతుకు నిస్తుంది.

దుష్పరిణామాలు లేని మానవ సాంకేతికత దాదాపు శూన్యం.

ఇప్పుడు కొత్తగా కలుగుతున్న స్పృహతో కొంత ప్రయత్నం మొదలయింది. ఆధునిక జీవితానికి ప్రమాణమైన కారుని తీసుకుంటే దాని జిలుగుల వెనుక ఎంత విషాదం వుందో తెలుసుకుందాం. కారు వీధులలోకి రాక ముందు లండన్ లాంటి నగరాలలో వీధులు సామాజిక పరామర్శ (social exchange) కేంద్రాలుగా వుండేవి. స్కూలు పిల్లలు తమంతట తామే స్వతంత్రంగా బడులకు నడిచి వెళ్ళే వారు. కారు వీధులను ఆక్రమించ గానే రోడ్డుపై పాదచారులకు చోటు లేకుండా పోయింది. పిల్లలను బడికి పంపాలంటే తోడు అవసరమయింది. ప్రొ. మేయర్ హిల్ మాన్ పిల్లల స్వతంత్ర కదలికలపై జరిపిన అధ్యయనాలను “One False Move……” అనే శీర్షికతో రాసిన పుస్తకంలో, 1970 లో దాదాపు 80 శాతం 7-8 సంవత్సరాల వయసున్న పిల్లలు తామే స్కూలుకి వెళ్ళే వారనీ, 1990 నాటికి బ్రిటన్ లో తల్లిదండ్రులు పిల్లలను స్కూలుకు చేర్చడానికీ, తిరిగి తీసుకురావడానికీ ఏడాదికి 1356 మిలియన్ గంటలు వెచ్చించారనీ, ఆ సమయం విలువ 10 – 20 బిలియన్ పౌండ్లు వుంటుందనీ చూపారు. పెరిగిన వాయు కాలుష్యం, రోడ్డు ప్రమాదాలూ ప్రజలపై వాటి భారం అదనం. ప్రపంచంలో ఏటా 13 లక్షల మంది రోడ్డు ప్రమాదాలలో మృత్యువాత బడతారు. గాయపడినవారూ, అంగ వైకల్యం పొందినవారూ 2 నుండి 5 కోట్ల వరకూ వుంటారు. సాంకేతికతలో మార్పులతో అధిక శక్తితో వేగంగా నడిచే కార్ల తయారీ ప్రారభమైన తరువాత ఎన్నో కొత్త సమస్యలు. ఇంధనంతో టెట్రా ఇథైల్ లెడ్ వాడకంతో లెడ్ గాలిలో విస్తరించి పెద్ద ఆరోగ్య సమస్య తెచ్చింది. అధిక పీడనంలో, ఉష్ణోగ్రతలో ఇంధనం మండించడంతో తయారైన నత్రజని ఆక్సైడ్లు వాయు కాలుష్యాన్ని పెంచడమే కాక, ఎన్నో నగరాలు పొగమంచుతో (smog) కప్పుకుపోయి వేలాది మరణాలకు కారణమయ్యాయి. పెరుగుతున్న వాహన కాలుష్యంతో ప్రపంచ నగరాలెన్నో అల్లాడుతున్నాయి. ఇలాటి ఉదాహరణలెన్నో. సాంకేతికత ప్రజాస్వామ్య హక్కులను హరిస్తుంది. పాదచారులకు రోడ్డుపై చోటు లేకపోవడం హక్కుల హరణమే.

నిర్మాణ రంగంలో గొప్ప వాళ్ళమని విర్రవీగుతాం. మనకంటే ఎంతో చిన్న చెదపురుగులు ఏ విశ్వవిద్యాలయ డిగ్రీలు లేకనే స్థానికంగా లభించే వనరులతో నిర్మించే పుట్టలు శక్తి అవసరం లేకుండానే పుట్ట లోపలి ఉష్ణోగ్రతలు ఏకాలంలోనైనా కేవలం ఒక డిగ్రీ తేడాతో స్థిరంగా ఉండే విధంగా నిర్మిస్తాయి. మానవ శరీరం, చెద పురుగు పొడుగుల నిష్పత్తితో పుట్టల ఎత్తుని హెచ్చిస్తే వచ్చే ఎత్తున్న నిర్మాణాలను మనిషి ఇంతవరకూ నిర్మించ లేదు. అందుకు అవసరమయ్యే అసాధారణ నిర్మాణ సామాగ్రి ఇంకా మనకి లేదు. అలాగే సాలె పురుగు తన గూడు నిర్మాణానికి అవసరమయ్యే దారాన్ని తనే తయారు చేసుకుంటుంది. గూడు నిర్మాణంలో ఎక్కడ ఏ ప్రయోజనం కోసం ఎలాంటి దారం కావాలో అది తయారు చేసి వాడుతుంది. సాలె పురుగు పై పరిశోధకులు ఈ పురుగు దారం మానవులు తయారు చేసే అన్ని రకాల దారాల కంటే మెరుగైనదంటున్నారు. ఒకే బరువున్న స్టీలు దారం కంటే ఆరు రెట్లు బలమైనది సాలె పురుగు దారం. మనిషి నీచంగా చూసే యీ చిన్న పురుగులు సాధించిన సాంకేతిక విజయాలు మనిషికి కనువిప్పు కలిగించాలి.

నిర్మాణ రంగంలో గొప్ప వాళ్ళమని విర్రవీగుతాం. మనకంటే ఎంతో చిన్న చెదలు పురుగు ఏ విశ్వ విద్యాలయ డిగ్రీలు లేకనే స్థానికంగా లభించే వనరులతో నిర్మించే పుట్టలు శక్తి అవసరం లేకుండానే పుట్ట లోపలి ఉష్ణోగ్రతలు ఏకాలంలోనైనా కేవలం ఒక డిగ్రీ తేడాతో స్థిరంగా ఉండే విధంగా నిర్మిస్తాయి.

ఆరోగ్య రంగాన్ని తీసుకుంటే ధృవ ఎలుగుబంటి నుండి మనిషెంతో నేర్చుకోవాలి. ధృవంలో ఆరు నెలలు చీకటీ, శీతాకాలం వుంటాయి. సాధారణంగా ఆడ ఎలుగుబంటి శీతాకాలం ముందు గర్భం దాల్చి, ఆరు నెలలు మంచు బొరియలో సుప్తావస్తలో వుంటూనే పిల్లల్ని కని పాలిస్తుంది. యీ ఆరు నెలలూ ఆహారముండదు, కదలిక లేదు, మల మూత్ర విసర్జన లేదు. అయినా దానికెలాటి అనారోగ్యమూ రాదు. ఎముకలు బలహీనపడడం, కీళ్ళు పట్టేయడం జరగవు. అదెలా సాధ్యమౌతోందో తెలుసుకో గలిగితే మధుమేహం లాటి వ్యాధులను నివారించ వచ్చు. ఎముకల బలహీనత కలిగించే ఓస్టియోపోరోసిస్ వ్యాధికి పరిష్కారం లభిస్తుంది. భూతాపాన్ని నిరోధించలేకపోతే త్వరలోనే ధృవ ఎలుగుబంటి అంతరించి పోతుంది.

మనుషులలో వున్న సామాజిక వ్యత్యాసాలు ఇతర జీవులలో వుండవు. డాల్ఫిన్స్, గుర్రాలూ లాంటి కొన్ని క్షీరదాలలో తప్ప జీవులలో లైంగిక బలాత్కారమనేది లేదు. బలాత్కారం చేసిన వారిని మృగాళ్ళుగా సంభోదించడం న్యాయం కాదు. మానవ రుగ్మతను ఇతర జీవులకు అంటగట్టడం అన్యాయం. వాటిలో పరస్పర సహకారం ఎక్కువ. వివిధ జాతుల జీవులు కూడా సహకరించు కుంటాయి. మొసలి ఆహారం తిన్న తరువాత నోరు తెరిచి పడుకుంటే ప్లోవర్ పక్షి నోటి లోపలకు వెళ్లి పళ్ళ చుట్టూ వున్న మాంసాహార అవశేషాలను తింటూ పళ్ళను శుభ్రం చేస్తుంది. పక్షికి ఆహారం దొరుకుతుంది, మొసలికి పళ్ళు శుభ్ర పడతాయి. రెంటికీ ప్రయోజనమే. జీవుల మధ్య సహకారం గురించి పీటర్ క్రోపోట్కిన్ “Mutual Aid” అనే పేరుతో జీవుల మధ్య సహకారాన్ని వివరిస్తూ పుస్తకం రాశాడు. సామ్రాజ్య వాదులు డార్విన్ సిద్ధాంతానికి చేస్తున్న వక్రభాష్యాన్ని నిలువరించడానికి ఆ పుస్తకాన్ని రాశాడు.

ప్రకృతి నియమాలకు లోబడి జీవించనందునే మానవుడు ఈ నాడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాడు. ఈ శతాబ్దం తరువాత మానవ జాతి భూమిపై మిగులుతుందా అనే స్థాయిలో వుంది సంక్షోభం. ఇది నాగరికత సృష్టించిన సంక్షోభం. మానవ చరిత్రలో అంతరించిన 24 నాగరికతలు ప్రాంతీయంగా వికసించి నశించాయి. ప్రస్తుత పతనం ప్రపంచవ్యాప్తం. మనిషి మిడిసిపడడం ఆపి ఇతర జీవుల నుండి నేర్చుకుని తననుతాను కాపాడుకునే దిశగా అడుగులు వేయాలి.

- డా॥ కె బాబూ రావు,
m : 9491116543
e : baburaokalapala@gmail.com

# జానపద ఇంద్రజాలికులు - సాధనాశూరులు

జానపదులకు విజ్ఞానంతోపాటు వినోదాన్ని పంచుతూ, సంస్కృతిలో మనుగడ సాగిస్తున్నాయి జానపద కళారూపాలు. జానపద ఇంద్రజాల కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా అద్భుతాలు ఇంద్రజాలం అంటే 'మాయ' అని, 'మంత్రౌషధాదుల చేత ఒక విధమైన పదార్థాన్ని మరొక విధంగా చూపే విద్య' అని నిఘంటువులు అర్థాలు చెపుతున్నాయి. ఇంద్రజాలకుడు అంటే 'కనుకట్టువాడు', 'ఇంద్రజాలం చేయువాడు' అని, కనుకట్టు అనే పదానికి 'కన్నులకు గట్టెడు కట్టుగంత' అనే అర్థం ఉంది. గారడి అనే పదం కూడా ఇంద్రజాలం అనే అర్థాన్ని సూచిస్తుంది. ఇంద్రజాల విద్యను ప్రదర్శించే కళాకారులను మంత్రగాళ్ళని, మంత్రతంత్రాలు చేసేవారని, చేతబడి చేసేవారని జానపదుల విశ్వాసం.

చారిత్రకంగా ఇంద్రజాల ప్రస్తావన శ్రీహర్షుని రత్నావళి నాటకం, పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర, కొరవి గోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశక, కాళిదాసు మేఘసందేశం, పింగళిసూరన కళాపూర్ణోదయం వంటి కావ్యాల్లో కనిపిస్తుంది. జానపద ఇంద్రజాల కళారూపాల్లో సాధనాశూరులు, విప్రవినోదులు, బీరన్నలు, కాటిపాపలు, పగటివేషగాళ్ళు, గారడి, మోడి, పాములవారు, మోళీ మొదలైన వాటిని పేర్కొనవచ్చు. ఈ కళారూపాల్లో కేవలం ఒక కులాన్ని మాత్రమే ఆశ్రయించి ఇంద్రజాల ప్రదర్శన చేసే వారిలో సాధనాశూరులు పద్మశాలి కులానికి, విప్రవినోదులు బ్రాహ్మణులకు, బీరన్నలు గొల్లవారికి ఆశ్రితులుగా ఉండి ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు.



'సాధనా' అంటే మల్లవిద్య అని, 'శూరుడు' అనే పదానికి ధైర్యం కలవాడు, బలం కలవాడు, పరాక్రమం కలవాడు అనే అర్థాలున్నాయి. నిజానికి సాధనాశూరులు ధైర్యం కలవారు. ఎందుకంటే పద్మశాలి కులాన్ని రక్షించడం కోసం ధైర్యంతో సాధన చేసి, మంత్రతంత్రవిద్యలు గొల్లకేతమ్మ దగ్గర నేర్చుకొని ఆ విద్యలనే ప్రయోగించి రాజును సంహరించి సాధనాశూరులుగా పద్మశాలి వారితో కొలువబడ్డారని సాధనాశూరుల నమ్మకం.

### సాధనాశూరుల మౌఖిక కథ :

పూర్వం శ్రీకృష్ణ గంధర్వరాజు పొట్ల చెరువు ప్రాంతంలో యాభైఆరు రాజ్యాలను ఏకచత్రాధిపత్యంగా పరిపాలిస్తుంటాడు. ఆ రాజు ఎవరి చేత మరణం లేకుండా ఉండాలని కాళికాదేవిని పూజిస్తాడు. అందుకు ఆ దేవత తనకు ప్రతిఫలంగా ప్రతిరోజు ఒక మనిషికి కొత్తబట్ట కట్టిచ్చి అతని తల నరికి, ఆ తలపై కూర్చొని పన్నెండు సంవత్సరాలు పూజ చేయాలని కోరుతుంది. అందుకు రాజు సమ్మతించి, రాజ్యంలోని పద్మశాలీలు ప్రతిరోజు కొత్తబట్టలను, మిగతా కులాల వారు ఒక మనిషిని రాజు కొలువుకు పంపియ్యాలని చాటింపు వేయిస్తాడు. ఈ విధంగా రాజు కాళికాదేవికి పూజలు చేస్తుంటాడు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత రాజ్యంలోని పద్మశాలి కులం తప్ప మిగతా కులాల వారి కుటుంబాల్లో ఇంటికి ఒకరు చొప్పున పంపించడం పూర్తవుతుంది, రాజు తిరిగి మళ్లీ ఇంటికి ఒకర్ని పంపియ్యండని చాటింపు వేయటంతో పద్మశాలీలు తప్ప, మిగతా కుటుంబాలు అందరు కలిసి రాజుతో మేమే కొత్తబట్ట ఇస్తాము. పద్మశాలి వారిని ఇంటికి ఒకర్ని పంపియ్యండని కోరుతారు. రాజు అందుకు సమ్మతించి ఆ విధంగా మళ్లీ చాటింపు వేయిస్తాడు. అందుకు పద్మశాలీలు ముందుగా పంపించిన మనుషుల్ని ఏం చేస్తున్నారో చెప్పండని రాజును ప్రశ్నిస్తారు. రాజు కోపంతో చీకటి చెరసాలలో పద్మశాలీలను బంధిస్తాడు. అయిదు రోజులు గడిచిన తర్వాత, మేము స్నానసంధ్యలు లేకుండా చెరసాలలో ఉన్నామని పూజ చేసుకొని తిరిగి వస్తామని కాపలాదారునికి లంచమిచ్చి బయటకు వస్తారు. పూజకు ముందు మార్కండేయుని గుడిలో 'ఢంకా' మోగిస్తారు. ఆ శబ్దానికి పద్మశాలి వారంతా గుడి దగ్గరికి చేరుకుంటారు. మన వంశాన్ని నిర్వీర్యం చేయడానికి శ్రీకృష్ణగంధర్వరాజు కంకణం కట్టుకున్నందున మనం అందరం ఉత్తర కంచికి చేరుకొని భవిష్యత్తును నిర్ణయించుకోవాలని అంటారు. ఉత్తర కంచిలో యాభైఆరు దేశాల పద్మశాలీలు సమావేశమై శ్రీ కృష్ణ గందర్వరాజును సంహరించాలని తీర్మాణిస్తారు.

వెంటనే అక్కడ ఒక బంగారు పళ్లెంలో జాంబియా పెట్టి ఆ రాజును సంహరించడానికి వచ్చేవారు జాంబియాను ముట్టుకోవాలని కోరుతారు. అందుకు గంజి, ఆడెపు, వంగరి, బండారి, భీమనపల్లి ఇంటిపేర్లు వారు ముందుకు వస్తారు. ఈ విధంగా ముందుకు వచ్చిన వారిని ప్రతి సంవత్సరం ఆయా గ్రామాలకు పిలిచి ఇంటింటికి రూపాయి పావల, వెయ్యిపదహార్లు ఇవ్వాలని యాభై ఆరుదేశాల పద్మశాలీలు తీర్మాణం చేసుకుంటారు. రాజును సంహరించాలంటే ఏడు తాటి చెట్ల ఎత్తు ఉండే ఒంటిస్తంభం మేడ ఎక్కాలి, మున్నానది దాటాలి కాబట్టి కర్రసాము, కత్తిసాము విద్యలు సాధన చేస్తారు. అంతేగాకుండా కోట చుట్టూ భూతాలతో పాటు కాళికాదేవి కాపలా ఉంటుంది. అందుకోసం గొల్లకేతమ్మ దగ్గర మంత్ర తంత్ర విద్యలు నేర్చుకుంటారు. అన్ని విద్యలు నేర్చుకున్న తరువాత వారు కోటలోకి ప్రవేశిస్తారు. వెంటనే కాపలాగా ఉన్న కాళికాదేవి వీరు కోటలోకి ప్రవేశిస్తారు. కోటలోకి ప్రవేశించిన వారు పద్మశాలీలని తెల్సుకొని

కాళికాదేవి వారిని తింటానంటుంది. పద్మశాలీలు ఒక స్తోత్రం చదివి దేవతను ప్రసన్నం చేసుకొని రాజును సంహరిస్తారు. ఆ ప్రకారంగా పద్మశాలి కులంలోని అయిదు కుటుంబాల వారు పద్మశాలి వంశాన్ని రక్షించటానికి సాధన చేసి రాజును సంహరించి ధీరులుగా కీర్తించబడ్డాడు. అప్పటి నుండి వీరు 'సాధనాశూరులు' అయ్యారని మౌఖిక కథ ప్రచారంలో కలదు.

**సాధనాశూరులు - ఇంద్రజాల విద్య :**

ఇంద్రజాల ప్రదర్శనలో పది నుండి పన్నెండు మంది కళాకారులు ఉంటారు. ఒక్కొక్కరు ఒక్కొక్క కనికట్టు విద్యలో నిపుణులై ఉంటారు. ప్రదర్శన రక్తికట్టించడానికి ఇద్దరు ప్రముఖ పాత్ర వహిస్తారు. అందులో ఒకరు గురువు లేదా నాయకుడు. మరొకరు హాస్యగాడు. వీరిరువురు బృందంలోని ఇతర కళాకారుల మాదిరిగా కాకుండా ప్రతీ సన్నివేశంలో నైపుణ్యత కలిగి ప్రదర్శన పూర్తి అయ్యే వరకు వేదికపై ఉంటారు. ప్రేక్షకుల నాడిని గమనిస్తూ ప్రదర్శన పట్ల ఆసక్తి కనబరిచే విధంగా ప్రతి సన్నివేశాన్ని రక్తి కట్టిస్తారు.



సాధరణంగా ప్రదర్శన మొత్తం గురువు ఆధీనంలోనే ఉంటుంది. ప్రదర్శనానుభవం ఎక్కువగా ఉండి, కనికట్టు విద్యలు పరిపూర్ణంగా తెలిసిన వాడై ఉంటాడు. మంచి వాక్చాతుర్యంతో చురుకుగా, నిరాడంబరంగా వ్యవహరిస్తూ ఉండేవారు. గురువుగా ఉంటారు. మంత్రతంత్ర విద్యలతో బృందాన్ని ఎప్పటికప్పుడు ఉత్సాహపరుస్తూ, బృందం సభ్యులు తప్పు చేస్తే దాన్ని తన అనుభవం చేత సవరించి ప్రేక్షకుల దృష్టి మరలుస్తాడు. ఇతని చేతిలో తాళపత్ర ప్రతులు, మంత్రించిన వేప మండ ఉంటుంది. దానితోనే కనికట్టు విద్యలను ప్రదర్శిస్తాడు. కట్టడి గ్రామాలకు వెళ్లినపుడు కుల పెద్దమనిషిని కలువడం, బృందానికి కావల్సిన వసతి, భోజనం, ప్రతిఫలం, ప్రదర్శన స్థలం మొదలైన విషయాలను గురువు చూసుకుంటాడు.

**హాస్యపాత్ర / హాస్యగాడు :**

గురువు తర్వాత ప్రదర్శనను రక్తికట్టించటంలో, ప్రేక్షకులకు ఆనందం కలిగించడంలో హాస్యగాడు సిద్ధహస్తుడు. ఇతని వేషధారణ చాలా విచిత్రంగా ఉంటుంది. తన నడక, హావభావాలు ప్రేక్షకులకు ఆనందం కలిగిస్తాయి. ప్రదర్శనా విద్యల్లో కలిగే సందేహాలను తీరుస్తూ అవసరమైతే గురువు చేత హాస్యం కోసం దెబ్బలు కూడ తింటూ ప్రదర్శన రక్తి కట్టించడానికి ప్రయత్నిస్తాడు. కళాకారులు ప్రదర్శించే సన్నివేశాలను వివరిస్తూ, ప్రేక్షకులకు కలిగే సందేహాలను తీరుస్తాడు. గురువుతో పాటు సమానమైన పాత్ర పోషిస్తాడు.

**ప్రదర్శనా స్థలం :**

గ్రామానికి ప్రదర్శన నిమిత్తం వెళ్లినపుడు గ్రామంలో నాలుగు కూడళ్లుండే స్థలంలో లేదా పాఠశాల ఆవరణలో లేదా ప్రభుత్వ కార్యాలయాల ముందు, విశాలమైన స్థలంలో ప్రేక్షకులు కూర్చుని చూడటానికి అనువుగా ఉన్న ప్రదేశాన్ని ప్రదర్శనకు ఎంచుకుంటారు. ప్రదర్శన ప్రారంభానికి ముందు గురువు బృంద సభ్యులందరికి మంత్రించిన తావీదులను కట్టి కార్యోన్ముఖులను చేస్తాడు. అష్టదిక్పాలకులను మంత్రంతో బంధించి ప్రదర్శన ప్రారంభిస్తాడు. ముందుగా 'నగారా' అనే వాద్యాన్ని మ్రోగిస్తూ కర్రసాము విద్యలను ప్రదర్శిస్తారు. ఈ విన్యాసాలు ప్రదర్శిస్తుండగానే గ్రామస్థులు వాద్యాల చప్పుళ్లు విని ప్రదర్శనా స్థలానికి చేరుకుంటారు. ఆ తర్వాత సాధనాశూరులు జలస్థంభన, అగ్నిస్థంభన, వాయుస్తంభన మొదలైన విద్యలను ప్రదర్శిస్తారు.

సాధనాశూరులు ముందుగా జలస్తంభన ద్వారా అంటే నీటిని స్తంభింపచేసి తమ ఆధీనంలోకి తెచ్చుకోవటం అని అర్థం. ఈ జలస్తంభన ద్వారా కొన్ని ఇంద్రజాలాంశాలు ప్రదర్శిస్తారు. అందులో ముక్కు రంధ్రాల్లోని ఒక రంధ్రం నుండి నీటిని పంపి మరొక రంధ్రం నుండి నీటిని బయటకు పంపటం. నీటిలో పసుపు, కుంకుమ, సుద్ద కలిపి వాటిని యథావిధిగా బయటకు తీయటం వంటివి ప్రదర్శించి ఆకట్టుకుంటారు.

**అగ్నిస్తంభన :**

సాధారణంగా అగ్నికి ఆహుతికాని వస్తువు ఏదీ ఉండదు. కానీ సాధనాశూరులు తమ ప్రతిభతో అగ్నిని స్తంభింపచేసి తమ ఆధీనంలోనికి తెచ్చుకునే కొన్ని అంశాలు ప్రదర్శిస్తారు. అందులో కాగితం మరియు దారాన్ని కాల్చి మళ్లీ సృష్టించటం, తలపై పొయ్యి పెట్టి పూరీలు చేయటం, అగ్గిలో కాల్చిన ఇనుప పారను చేతితో పట్టుకోవడం ఆసక్తిని కలిగిస్తాయి.

అగ్నిస్తంభన విద్యలో ప్రధానమైనది తలపై పొయ్యి పెట్టి పూరీలు చేయటం. రేగడి మట్టితో తయారు చేసిన పొయ్యి, చిన్న మూకుడు, గోధుమపిండి, కోల, పీట, మంచినూనె, కిరోసిన్‌లో తడిపిన గుడ్డ పీలకలతో ఈ అంశాన్ని ప్రదర్శిస్తారు. సాధనాశూరుల్లో ఒక వ్యక్తి ప్రదర్శన కోసం ఏర్పాటు చేస్తే అతను కాలకుండా తలకు పసరు రాసుకున్నాడని అనుకుంటారు. కాబట్టి గ్రామస్థులలో ఎవరైనా ఒకరు రావాలని హాస్యగాడు పిలుస్తాడు. అలా వచ్చిన వ్యక్తి తలపై రేగడిమట్టి పొయ్యి పెట్టి మూకుడు ఉంచి నూనె పోస్తారు. గురువు తన చేతిలోని వేదంతో ఆ వ్యక్తి చుట్టూ మూడు సార్లు తిప్పి కాళికాదేవిని తలుచుకుని ఆ వ్యక్తి ఒడిలో వేపాకు మండను ఉంచుతాడు. తరువాత గురువు కిరోసిన్ గుడ్డ పేలికలు వేసి అగ్గి వెలిగిస్తాడు. ఆ అగ్గికి మూకుడులోని నూనె వేడికాగానే గోధుమపిండితో చేసిన పూరీలు నూనెలో వేసి కాలుస్తారు. వాటిని హాస్యగాడు ప్రేక్షకులకు చూపించి తింటాడు. తర్వాత పొయ్యి తీసి చూపించగా వ్యక్తి తలకు ఏ అగ్గి అంటుకోదు. దీనితో ప్రేక్షకులంతా సాధనాశూరుల ప్రదర్శనకు అబ్బుర పడిపోతారు.

**వాయు స్తంభన :**

సాధనాశూరులు నీటిని, అగ్గిని తమ ఆధీనంలోకి తెచ్చుకుని

ప్రదర్శించినట్టుగానే గాలిని స్తంభింపచేసి కొన్ని అంశాలు చేస్తారు. అందులో చిలుక కట్టడం, చొప్పల పల్లకిలో ఊరేగడం ముఖ్యమైనవి.

చిలుక కట్టడం ప్రదర్శనలో చెక్కతో చేసిన చిలుక బొమ్మ ఆరడుగుల వెదురుకర్ర, కావడి ఉపయోగపడతాయి. బృందంలోని వ్యక్తి ఆరడుగుల పొడవైన వెదురు కర్రను తీసుకవచ్చి భూమిపై నిలపెట్టి పట్టుకుంటాడు. దానికి చెక్కతో చేసిన చిలుక బొమ్మను తీసుకవచ్చి దాని నడుము భాగాన్ని కర్రపై ఉంచి కదలకుండా పట్టుకుంటాడు. కావడి బద్దకు ఇరువైపుల మూడు కిలోల బరువు గల రాళ్లను అమర్చి ఆ కావడిని చిలుక పై భాగంలో ఉంచుతారు. గురువు చిలుకపై మంత్రించిన నీళ్లు చల్లి చిలుకను పట్టుకున్న వ్యక్తిని వదిలివేయమంటాడు. అపుడు చిలుక ఏ ఆధారం లేకుండా ఒక కర్రను ఆధారం చేసుకుని బరువు గల కావడిని మోస్తుంది. ఇది చూసిన ప్రేక్షకులు మంత్రమో, తంత్రమో తెలియక సాధనాశూరుల మాయ అంటూ ఆశ్చర్యానికి లోనవుతారు.



ప్రదర్శించే అంశాల్లో చొప్ప పల్లకిలో ఊరేగటం చాలా ప్రత్యేకమైంది. దీన్ని గురువు ప్రదర్శించటం జరుగుతుంది. రెండు వెదురు కర్రలకు కింది భాగంలో చొప్పబెండ్లతో నాలుగు మూలలు గడుల మాదిరిగా చేసి కింది భాగంలో దారాలతో కడతారు. ఆ తర్వాత గురువు కాళికాదేవిని స్మరించు కొని అందులో కూర్చోని అతన్ని కావడి మోసినట్లుగా బృందం సభ్యులు ప్రేక్షకుల మధ్యన తిప్పుతుండగా గాలిలో తేలినట్లు గురువు కనిపించడంతో ప్రేక్షకులు ఆశ్చర్య చకితులవుతారు.

సాధనాశూరులు ఇలా జల, అగ్ని, వాయు స్తంభన ద్వారా మాత్రమే కాకుండా బృందంలో శారీరకంగా దృడంగా ఉన్నవారు ఛాతిపై బండలు పెట్టుకొని పగలకొట్టించుకోవడం, కరెంటు బల్బులు నోట్లో వేసుకొని నమలటం, అదేవిధంగా ఒక మాయా బొమ్మను తయారు చేసి అలంకరణ చేసినట్లుగా ఒక గుడారంలో దాచిన వ్యక్తికి బొమ్మ అలంకరణ వచ్చేటట్లు చేయడం, తాళ్లతో కట్టేసిన వ్యక్తి వాటిని వెంటనే విప్పుకోవడం, గుడారంలోకి వెళ్ళిన వ్యక్తి వికృత రూపంలో బయటకు రావడం, చెవిలోనుండి నీళ్లు బయటికి తీయటం వంటి మాయాకృత్యాలు ప్రదర్శించి ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తారు.

సాధనాశూరులు ప్రదర్శించే అంశాల్లో చివరిది గుడారంలో దేవతా విగ్రహాలను సృష్టించడం. ఈ ప్రదర్శనకు పసుపు కలిపిన బియ్యం, రాళ్లు, ఒక గుడారం అవసరమవుతాయి. ముందుగా బృందంలోని సభ్యులు ఒక గుడారాన్ని నిర్మిస్తారు. ఆ గుడారంలోకి హాస్యగాడు ఒక వ్యక్తిని పంపి లోపల ఏమైనా వస్తువులు ఉన్నది లేనిది చూడమంటాడు. ఆ తర్వాత గుడారంలోకి పసుపు కలిపిన బియ్యం, రాళ్లు పంపి వీటితో పులిహోర, దేవతల విగ్రహాలు, దీపాలు వెలిగించమని గురువుకు సవాలు విసురుతాడు. ముందుగా గురువు గుడారంలోకి పసుపు బియ్యం పంపి ఆ తర్వాత ఒక్కొక్క దేవత పేరు చెప్పి ఒక్కో రాయిని గుడారంలోకి పంపుతాడు. గుడారంపై పరదా కప్పి, గురువు గుడారంపై వేపాకు దుస్సి మంత్రించిన నీళ్లు చల్లి పరదా తీయమంటాడు. పరదా తీయగానే గుడారంలో దేవతల విగ్రహాలు, వాటి ముందు దీపాలు, పులిహోర, కొబ్బరికాయ, ఊదుబత్తీలు వెలిగించి ఉంటాయి. ఈ సన్నివేశం చూసిన ప్రేక్షకులు ఒక్కసారిగా తమ చేతుల్ని జోడించి ఆ దేవతల విగ్రహాలకు దండం పెట్టుకుంటారు.

ప్రదర్శనలో బృందం సభ్యులు ఎప్పటికప్పుడు ఒకరినొకరు హెచ్చరించుకోవటానికి రహస్య భాషా పదాలను ఉచ్చరించుకుంటారు. ప్రదర్శనలో తప్పు జరిగినా, సమయానికి అవసరమైన వస్తువు లేకపోయినా రహస్యంగా మాట్లాడుకుంటారు. వీరు ఉపయోగించే రహస్య పదాల్లో పచ్చ - తావిత్తు, పత్రం-బండ, పొంత-పొయ్యి, పచ్చ-పసుపు, మొకిరలు-పూరీలు మొదలైన పదాలను సందర్భాన్ని బట్టి ఉపయోగిస్తూ ప్రదర్శనకు ఆటంకం కలగకుండా రక్తికట్టించే ప్రయత్నం చేస్తారు.

సాధనాశూరులు ఈ రకంగా తమ యొక్క నైపుణ్యంతో ఇంద్రజాలాంశాలు ప్రదర్శిస్తూ దాతృకులాన్ని ఆనందపరచటమే కాక, ఇతర కులాల వారిని కూడా ఆనంద పరుస్తున్నారు. నేటి కాలంలో కూడా ప్రేక్షకుల నుండి సేకరించిన వస్తువులనే ప్రదర్శనకు ఉపయోగిస్తూ, వారి సందేహాలను తీరుస్తూ ఇంద్రజా లాంశాలను ప్రదర్శించటం గొప్ప విశేషం. ఇంతటి అరుదైన సంప్రదాయ ఇంద్రజాల కళారూపమైన సాధనాశూరులకు ప్రస్తుతం దాతృకులం ఆదరణ లేకపోవడంతో, వారికి వారసత్వంగా వచ్చిన ఇంద్రజాలాంశాలు చాలా వరకు మరుగునపడిపోతున్నాయి. కరీంనగర్ జిల్లాలోని వీణవంక మండలం చల్లూరు, ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్ వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం బూరుగుమళ్ళ గ్రామాల్లో సాధనాశూరుల బృందాలు ఉన్నప్పటికి ఆదరణ లేకపోవడంతో కళారూపం అంతరించిపోయే దశకు చేరుకుంది. ఈ కళారూపానికి ప్రాచుర్యం కలిపించి వారి సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాబట్టి విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రభుత్వ ఆదరణ కూడా కళాకారులపై ఉండాల్సిన అవసరం ఉంది.

-డా॥ గడ్డం వెంకన్న
m :9441305070
e : gaddamvenkanna@gmail.com

## జానపద, సామాజిక చైతన్యానికి చేతి కర్రలై ఊతమిచ్చిన పదాలు

# బుర్ర సతీష్ పాటలు

అది పల్లె పదాలతో సయ్యాటలాడిన పాట. నిండైన జానపదాలతో జాలువారిన పాట. తెలంగాణ భాషా సొగసులతో బతుకమ్మను ఎత్తుకున్న పుత్తడిబమ్మ ఆ పాట. బోనాల బండి మీద రెపరెపలాడిన రంగు రంగు చీరల సింగిడి ఆ పాట. లంబాడి గాజులేసుకున్న లబ్బురుబమ్మ ఆ పాట. సెల్‌ఫోన్ మతలబు చెప్పిన పాట. అదే మన బుర్ర సతీష్ పాట. అనేక జానపద, సామాజిక చైతన్య గీతాలతో పాటు ప్రత్యేక తెలంగాణ ఉద్యమగీతాలను అందించిన కవి, గాయకుడు బుర్ర సతీష్ గురించి నేటి మన 'అలుగెల్లిన పాట' లో...

కరీంనగర్ జిల్లాలోని బెజ్జంకి మండలం గుండారం గ్రామంలో బుర్ర సత్తెవ్వ - రాజయ్య గౌడ్ దంపతులకు కలిగిన ఇద్దరు సంతానంలో సతీష్ పెద్దోడు. సుమన్ చిన్నోడు. సతీష్ మార్చి 10,1984లో జన్మించిండు. ప్రస్తుతం గుండారం గ్రామం సిద్ధిపేట జిల్లాలో ఉన్నది. సతీష్ తండ్రి రాజయ్య గౌడ్ తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ తాళ్ళెక్కి కుటుంబాన్ని పోషించుకునేటోడు.



యక్షగాన కళాకారులకు నిలయమైన గుండారం గ్రామంలో నిత్యం "పోతులూరి వీరబ్రహ్మం గారి చరిత్ర, ఎల్లమ్మ చరిత్ర" వంటి యక్షగానాలు, కథాగానాలతో ఊరు ఊరంత పులకించిపోయేది. ఇదే గ్రామంలో సతీష్ మేనమామ కోరుకొప్పుల యాదయ్య గౌడ్ మంచి యక్షగాన కళాకారుడు. రామాయణ, మహాభారత గాథల్లోని ప్రధానపాత్రలను పోషించేటోడు. ఈ రకంగ మేనమామ సాన్నిహిత్యంతో సతీష్ చిన్ననాటి నుంచే భజనకీర్తనలను గానం చేసేటోడు. సతీష్‌కు పాటలు తప్ప మిగతా ప్రపంచం కనిపించేది కాదు. తబల, తాళం సప్పుడు వినబడితే చాలు ప్రాణం లేసొచ్చేది. క్రమంగ సతీష్ మంచి తబలా వాద్యకారుడయ్యిండు. ఎక్కడ ఏ ప్రదర్శన ఉన్నా చిన్నగ అక్కడికి చేరుకొని తబలా వాయించేటోడు. తల్లిదండ్రులు ఎంత మొత్తుకున్నా వినేటోడు కాదు. మేనమామ యాదయ్యగౌడ్ అల్లుని కళా నైపుణ్యాన్ని చూసి లోలోపల సంతోషపడేటోడు. కాని సదువు ఆగమైతదేమోనని కడకంట బెదిరించేటోడు. అయినా సతీష్ లెక్క చేసేటోడు కాదు. ఇట్ల పాటలు, కీర్తనలు పాడటం బాగ అలవాటయ్యింది. సతీష్ చిన్నప్పుడే తన మేనమామ సాన్నిహిత్యంతో బ్రహ్మంగారి నాటకంలో "ఆనంద భైరవుడు" పాత్రని పోషించి అబ్బుర పరిచిండు. అభినయంతో పాటు చక్కని వినసొంపైన గాత్రంతో చూపరులను ఆకర్షించిండు. తల్లి ఎంత తిట్టినా, కట్టడి చేసినా పాటలు, ప్రదర్శనలు మాత్రం మానలేదు. తండ్రి రాజయ్య గౌడ్ మాత్రం ఏనాడు తన ఆట పాటకు అడ్డ చెప్పలేదు. ఇట్ల ఆట పాటలతోనే సతీష్ తన 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు గుండారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకుండు. 8వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేసిండు. ఆ తర్వాత డిగ్రీ కోసం కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో చేరిండు. అదే సమయంలో ప్రభుత్వం "అక్షర ఉజ్వల" కార్యక్రమం చేపట్టడంతో అందులో చేరి పాటలు పాడిండు.

"ఏమే పిల్లో ఎంత ఎడ్డి బతుకులాయే
గొడ్ల కంటే హీనమాయే" అనే పాటను బాగ పాడేది. ఇట్లాంటి పాటలు పాడుతున్న క్రమంలోనే సతీష్‌కు తానే స్వంతంగ పాటలు రాయాలనే తలంపు కలిగింది. సతీష్ పదవ తరగతి చదివే రోజుల్లోనే "నా చిట్టి చెల్లెలా - బంగారు చెల్లెలా" అంటూ పదాలను అల్లుకునే ప్రయత్నం చేసిండు.

తనకు ఊహ తెలిసిన నాటి నుంచి సతీష్ తండ్రి రాజయ్య సౌదీలోనే ఉన్నడు. సతీష్ పెదనాన్నలు కూడ సౌదీలో ఉండడంతో తండ్రి రాజయ్య గౌడ్ కూడ అక్కడికి చేరిండు. అయితే సతీష్ పెదనాన్నలిద్దరు సౌదీలో ప్రమాదవశాత్తు చనిపోయినప్పుడు, ఆ శవాలను ఊరుకు తీసుకురావడానికి కన్నశెరలైనయి. నెలలు గడిచినా శవాలు ఇంటికి చేరలేదు. ఊరు ఊరంత కన్నీటి పర్యంతమైన పట్టించుకున్న నాథుడు లేడు. దుబాయ్, మస్కట్, సౌదీ వంటి కాని రాజ్యాలకు వలసబోయి అక్కడే దిక్కులేని శవాలుగా బతుకు చాలించిన సందర్భాలు కోకొల్లలు. ఆ దీనమైన స్థితి తన కుటుంబానికి ఎదురుకావడం, ఆ బాధను, వేదనను ప్రత్యక్షంగ అనుభవించిన సతీష్ దుఃఖాన్ని కైగట్టిండు. తన పదాలతో పల్లెపల్లెని కన్నీరు పెట్టించిండు. సతీష్ వలసబతుకుల హీనస్థితిని అక్షరీకరించిన తీరు ఎందరినో కదిలించింది. దీంతో తన మొదటి పాటతోనే సతీష్‌కు మంచి గుర్తింపు వచ్చింది. సతీష్‌ను బుర్ర సతీష్‌గా, ఒక కవిగా ఈ లోకానికి అందించిన పాట

"ఎట్లున్నవో ఏ తీరుగున్నవో ఎరుకన్న జేయిరా మామ
బతుకు పాడుగాను మెతుకు లేదనుకుంట
దుబాయి బతుకబోయినావా మాకు దుఃఖాన్ని నింపి పోయినావా" పాటతో బుర్ర సతీష్ పలువురి ప్రశంశలు పొందిండు. బుర్ర సతీష్ డిగ్రీ చేసే సమయంలో ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమాలలో పాల్గొంటూ తన పాటలకు మరింత పదును పెట్టిండు. బుర్ర సతీష్

రాసిన పాటలు పాడడానికి ఎన్.ఎస్.ఎస్ ద్వార ఒక మంచి వేదిక దొరికినట్టయ్యింది.

బుర్ర సతీష్ మీద గద్దర్, విప్లవోద్యమ పాటల ప్రభావం కూడ ఉన్నట్టు కనిపిస్తది. "జంగు నడిపి జైత్రయాత్ర చేసిన వేళ" అంటూ జగిత్యాల పోరాటం మీద బుర్ర సతీష్ రాసిన పాట కరీంనగర్ జిల్లా అంతట మార్మోగింది.

"కరీంనగరు పాట ఇది కదనాలకు తూట
మూలకు బడ్డ ఎడ్లబండిని చూసి దుఃఖంతో రాసిన పాట
"యాదున్ననా ఎడ్ల బండిని
నాడు పల్లెల్లో మీ బతుకు బండిని
సవ్వారి మీ కచ్చురాన్నిరా
మిమ్ము అవ్వోలె సాదినదాన్నిరా" అంటూ ఎడ్లబండి ఏ విధంగ వ్యవసాయంలో రైతుకు సాయపడ్డదో వివరిస్తడు. ఆర్ద్రతా రాగంతో ఆలపిస్తడు. బుర్ర సతీష్ కూడ కవిగా, గాయకుడిగా ఎదుగుతున్న క్రమంలో ఎన్నో జానపద పాటలకు ప్రాణం పోసిండు.

''పిల్లా నిన్ను ఏ తీరున పిలుచుకుందునే
ఓ పిల్లా నిన్ను ఏ పేరున తలుచుకుందునే
సిరిగల్ల వెూముదాన శ్రీదేవందునా
సుగుణాల రాశి నిన్ను సుగుణ అందునా
లతవోలె మెరిసేవు శ్రీలతందునా
నా సౌందర్యాల రాశి సౌందర్య అందునా" అంటూ ఇష్టసఖిని తీరొక్క పేరుతో పిలుచుకుంటడు.



గాజర్ల రమేశ్ చంద్ర పాటల ప్రేరణతో పాటు ఎలుక యాదయ్య అందించిన ప్రోత్సహంతో దాదాపు మూడు వేల పాటలు రాసినట్టు చెప్తడు. బుర్ర సతీష్ వీరిద్దరితో కలిసి 'అభినందన కళామండలి' ని ఏర్పాటు చేసిండ్రు. ఊరూర వివిధ సందర్భాలలో పాటల ప్రదర్శనలు చేసిండ్రు.

సిరిసిల్లలో రికార్డింగ్ స్టూడియో అధినేత ఎం.డి. సత్తార్ ప్రసిద్ధ జానపద పాటలతో రూపొందించిన మొట్టమొదటి జానపద వీడియో ఆల్బమ్ "లాయిలాయి లబ్బరి బొమ్మ" లో బుర్ర సతీష్ పాట

"పుత్తడి బొమ్మ అత్త కూతురా పిల్లో గౌరమ్మ మరదలు పిల్లో గౌరమ్మ
యాడికె పిల్లా బయలు దేరినవ్ పిల్లో గౌరమ్మ" బుర్ర సతీష్‌ను ప్రధాన కవి గాయకుల సరసన చేర్చింది.

"లంబాడి గాజులేసి లబ్బరు బొమ్మ
లాలు దర్వాజ కాడ గూసుంటవోయమ్మ" అంటూ రాసిన మరో జానపదం అచ్చమైన గ్రామీణ నుడికారంతో గిరిజన జీవితాల్లోని సొగసును కండ్లకు కట్టినట్టు చూపిస్తది. ఆనందంగ దరువులేపిస్తది.

"అందాల బొమ్మ సందమామే నువ్వమ్మా కసికసిగ జూస్తవేందే
ముసిముసి నవ్వుల పిల్లా ఓ హుస్నాబాదు పొల్లా
సుజాత అరెరే సుజాత ఏమిటె పిల్లా నా రాత" అంటూ బుర్ర సతీష్ రాసిన జానపద గీతం తెలియని తెలంగాణ పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. తెలుగు జానపద పాటల్లో బుర్ర సతీష్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుండు. అదేవిధంగ సకలదేవతల చరిత్రల మీద కూడ బుర్ర సతీష్ ఎన్నో పాటలు రాసిండు.

"జగదేక వీరుడు అంజన్న – జగమేలు స్వామివే అంజన్న
వానర వీరుడు అంజన్న – వాయు కుమారుడు అంజన్న" వంటి పాటలు రాసి, తన ఆధ్యాత్మికతను చాటుకుంటడు. ప్రకృతీశక్తులను ఆరాధించే పల్లెతల్లులకు భక్తిభావాన్ని పెంపొందించే విధంగ పాటలు అల్లుతడు.

"అవ్వా నాకొక్క సెల్లు గొనియ్యే అందరు కొనుక్కున్నరే
నా తోటి సోపతిగాళ్ళ ముందు నా ఇజ్జతిబోతున్నదే
పక్క ఇంటి పర్శిగాడు గొనుక్కునే
ఎనక ఇంటి ఎల్లిగాడు ఎపుడో గొనుక్కునే" అనే సెల్‌ఫోన్ పాటతో బుర్ర సతీష్ సామాజిక చైతన్యాన్ని పాదుగొలిపే ప్రయత్నం చేస్తడు. సీమాంధ్ర పోలీసులు తెలంగాణ ఉద్యమంలో భాగమైన కళాకారుల మీద కర్కశంగ దాడి చేసినప్పుడు తీవ్రంగ స్పందించిన బుర్ర సతీష్ పదునైన భావజాలంతో, పరుష పదజాలంతో పాటందుకుంటడు.

"ఆట పాట కద్దుబడితె తూటాలై పేలుతం
డప్పు శిర్ర గుంజుకుంటె దండోరై పేలుతం
కలం మీద కక్ష్యలేందిరా బద్మాశులార
గళమును బంధించుడేందిరా ఒరి దొంగలారా
కాలు గజ్జె గట్టుకోని డప్పు సంకనేసుకోని
గోశి గొంగడేసుకోని గోసలన్ని జెప్పుకుంటే
దొంగ చాటుగా వచ్చి నిగాలెన్నో బెడుతుండ్రు
ఆకలిగొన్నట్టి పాట సోకం బెట్టిందంటే
జైలు గోడలు గూడ బద్దలయ్యి పోతయిరో" అంటు సమైక్యాంధ్ర సర్కారును చెడుగుడు ఆడుకుంటడు. కళాకారులను కన్నీరుపెట్టించిన సమైక్యపాలన ఎంతో కాలం సాగదని నినాదాలు చేస్తడు. ఉప్పెనైన తెలంగాణ ఉద్యమం "మిలియన్ మార్చ్" కు పిలుపునిచ్చింది. ఆ సమయంలో బుర్ర సతీష్ రాసిన

"లగాంచెయ్‌రా దరువులు ఇగ లాడాయె శురువాయెరా
తెలంగాణ పోరులోన తెగించి కొట్లాడుదాం" అనే పాట ప్రజాగాయకుడు, ధూం–ధాం దరువులతో దుమ్ములేపిన పాటల కచ్చడం రసమయి బాలకిషన్ గొంతులో ఉరుములు ఉరిమినట్టు, పిడుగులు నేలకు రాలినట్టు ప్రతిధ్వనిస్తది.

"అన్నా ఓ విలేఖరి – జనబాంధవుడా నీకు వందనమే
న్యాయమన్నది నీకు సిరా – అవినీతి గుండెపై అగ్గిపోర"

అంటూ కోదారి శ్రీనుతో కలిసి విలేకర్ల జీవితాన్ని గానం చేస్తడు. పదాలతో అక్షరాన్ని సుసంపన్నం చేస్తడు. నీ కలానికి సలాములే అన్నా విలేఖరి జనబాంధవుడా నీకు వందనమే అన్నా విలేఖరి" అంటూ గానం చేస్తడు. పాటల సేద్యం చేస్తూ, తెలంగాణ ప్రత్యక్ష ఉద్యమంలో పాల్గొంటూనే ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య ద్వార ఎం.ఎ ఎకనామిక్స్ పూర్తి చేసిండు. చదువుకోవాలనే ఆకాంక్షతో ఎం.ఎ పట్టాను సాధించిండు. సాహితీ, కళా రంగాలలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న బుర్ర సతీష్ బెజ్జెంకి మండలం దాచారం గ్రామానికి చెందిన వడ్లకొండ రాజయ్య - బాలవ్వల బిడ్డ సంజనను 2009లో వివాహం చేసుకుండు. బుర్ర సతీష్ -సంజన దంపతులకు కుందన్, ధృవన్ అనే ఇద్దరు మగపిల్లలు కలిగింర్రు. కుందన్ ప్రస్తుతం 3వ తరగతి చదువుతుండు. బుర్ర సతీష్ భార్య, పిల్లలను ఎంతో ప్రేమగా చూసుకుంటడు. పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాలనే తపన కలిగి ఉంటడు. దళిత, బహుజన దృక్పథంతో బుర్ర సతీష్ అంబేద్కర్ మీద రాసిన



"పొడిసెనో ఒక పొద్దు భారతావనిలో
అది అంబేద్కరుడై వెలిగెను పల్లె పల్లెలో
పేదోడి తలరాత రాజ్యాంగ నిర్మాత
తరతరాల బానిస సంకెళ్ళుదెంచెనో"

పాట అంబేద్కర్ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించేదిగా ఉంటది. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ యాదిలో బుర్ర సతీష్ రాసిన

"పదిజిల్లాల ఎదపై పరిచిపోతివా ఉద్యమాల జెండా
ఎగరేయమంటివా వెనకడుగు వేయకుండ
పోరాటమంటే మీరు మా జయశంకరు సారు" పాట ఎందరినో కదిలించింది. ప్రతి గుండెను తట్టి లేపింది.

ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా దుష్ప్రభావంతో పతనమైతున్న మనిషి జీవన విధానం మీద బుర్ర సతీష్ రాసిన

"ఇదేమి మాయకాలము ఓరి నాయనా
ఇంటరునెట్టు గాలము ఓరి నాయనా
ఒట్టిది గాదు పోతులూరి కాలజ్ఞానము
మట్టిలోన కలిసినాది మానవ సంబంధము
మనిషికి తోటి మనిషి ఆసరగా ఉండేది
మంచి చెడ్డలకు సాయపడుతు బతికేది
కలుసుడు బందాయే సెలుఫోన్‌లు వచ్చినంక
మనుషులు మాయమాయె టీవి వ్యాదొచ్చినంక" పాట ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తది. బుర్ర సతీష్ కరీంనగర్ జిల్లా సిరిసిల్ల నేతన్నల జీవితాలను అక్షరీకరించిన తీరు అమోఘమైనది. ఆకలిచావులు, ఆత్మహత్యల పాలవుతున్న నేతన్న జీవితాలను గానం చేసిన తీరు ఎందరినో కంట కన్నీరు పెట్టిస్తది.

"సిరిసిల్ల ఉరిసిల్ల అయ్యిందిరో ఉరితాడుతో ఊయలూగిందిరో
చేనేత చితి పేర్చుకున్నది ఆత్మహత్యల అలరారుతున్నది" అంటూ రాసిన పాట ఎందరినో కదిలించింది. ప్రభుత్వాలు దిగివచ్చి నేతకార్మికులను ఆదుకునేలా చేయగలిగింది.

ప్రజా గాయకుడు కళాకారుడు రసమయి బాలకిషన్ మీద బుర్ర సతీష్ రాసిన పాటను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటడు.

"ఆట పాట మాట కలిసితె ధూం-ధామేనట
మన తెలంగాణకై గర్జించెను రసమయన్న నీ పాట
నీ పాటకు పట్టం కట్టింది మన మానకొండూరు గడ్డ
జనమందరి గుండెల్లుంటవయ్య ఓ ధూం-ధాం బిడ్డ
తెలంగాణలో పరిచయం అక్కెరలేనిదే నీ పేరు
పది జిల్లలల్ల ఏడ ఉంటే అదియేలే నీ ఊరు" గానం చేస్తడు.

ఎండకు ఎండి వానకు తడిసిన గోసి గొంగడి, పల్లె పల్లెను కదిలించినవో పాటల సింగిడి అంటూ అద్భుతమైన ప్రతీకలతో పాటకు పట్టం కట్టిన సందర్భాన్ని గానం చేస్తడు.

బంగారు తెలంగాణ సాధనలో భాగంగ ఎన్నో పాటలు రాసిన బుర్ర సతీష్ ప్రస్తుతం ముఖ్యమంత్రి చేపట్టిన "రైతుబంధు" పథకం కోసం రాసిన

"రైతే రాజయ్యే రోజే చేరువయ్యే
కలలన్నీ నిజమయ్యే మన తెలంగాణలో
నేలంత సిరులు పండ మన చెరువులన్ని నిండ
సర్కారు సల్లగుండ ముఖ్యమంత్రి నీడలో
గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం
రాబోతున్నది రైతన్నల రాజ్యం
ఆకుపచ్చ సందమామకందెను సాయం
వర్ధిల్లేనంట ఇగ మన వ్యవసాయం
మచ్చలేని పాలనలో పచ్చబొట్టుగా మన" అంటూ ఏడాదికి ఎకరానికి ఎనిమిది వేల రూపాయల పెట్టుబడి సాయాన్ని అందిస్తున్న ప్రభుత్వం మనదని చాటింపు వేస్తడు. గొంతెత్తి గానం చేస్తడు.

బుర్ర సతీష్ "మార్మోగిన పాట, తెలంగాణ ధూం తడాఖా, కొట్లాట, యుద్ధం" వంటి పాటల క్యాసెట్‌లు విడుదల చేసిండు. 2012లో కరీంనగర్ జిల్లా ధూం-ధాం కన్వీనర్‌గా పనిచేసిండు. మంచి పాటలు రాయాలనే ఆలోచనతో ఉన్నడు. అయితే ఇప్పటి వరకు వేలాది పాటలు రాసిన బుర్ర సతీష్ వీలైనంత తొందరగా వాటిని ఒక సంకలనంగా ప్రచురించాలని కోరుకుందాం. మరెన్నో మంచిపాటలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిద్దాం.

**బుర్ర సతీష్,** 9908906724

-అంబటి వేకువ
m: 94927 55448
e: varji.ambati@gmail.com

# సాధికారులవుతున్న తెలంగాణ గ్రామీణులు

ఎక్కడైనాసరే అభివృద్ధికి చివరి గీటురాయి ప్రజలు సాధికారులు కావటమే. వారి సాధికాంతో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, చివరకు సాంస్కృతికంగా జరగాలి. గుర్తుపెట్టుకోవలసిన మొదటి విషయం ఇది. పోతే, ప్రజలు అన్నపుడు గ్రామీణులు, పట్టణ ప్రాంతాలవారు, అటవీవాసులు అందరూ వస్తారు. ఇది రెండవ విషయం. ఇందులో ప్రస్తుతానికి గ్రామీణుల విషయం చూద్దాం. తెలంగాణ ప్రజలలో అధికులు గ్రామీణ ప్రాంతాలవారు కావటం, మొదటి నుంచి ఫ్యూడల్ దోపిడీకి గురువుతూ అటవీ వాసులతోపాటు కలిసిగాని, విడిగా కాని ఆ దోపిడీపై తిరగబడుతూ వస్తున్నవారు కావటంవల్ల ప్రస్తుతానికి వారి గురించి మాట్లడుకుందాం.

ఇక్కడ మరొక మాట చెప్పుకోవాలి. గ్రామీణులు అనేదానిలోకి ప్రధానంగా వచ్చేది రైతులు, వ్యవసాయ కూలీలు, వివిధ వృత్తి పనులవారు. తెలంగాణలో అత్యధికులు ఈ మూడు విధాలైన పనులలోనే ఉన్నారు. కనుక వీరి జీవితాలు గతంకన్నా బాగుపడటమే తెలంగాణ రాష్ట్ర సాధనకు సార్థకత అవుతుంది. అదే సర్వస్వమని కాదు. కానీ అది ప్రాథమికం అనాలి. వారి జీవితాలు బాగుపడటమనేదానికి రెండు పార్శ్వాలు, లేదా రెండు దశలు ఉంటాయి. మామూలు మాటలలో చెప్పాలంటే, గతంలో వారు ఎదుర్కొంటూ వచ్చిన ఆకలిదప్పులు, అనారోగ్యం, అవిద్య వంటి పేదరిక సమస్యలు, సంక్షేమరాహిత్యం క్రమంగా తొలగిపోవటం. ఇది మొదటిది కాగా, వారు మొదట అనుకున్న విధంగా సాధికారులు కావటం రెండవది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యలు ఈ రెండింటికి కూడా దోహదంచేసే విధంగా ఉన్నాయని చెప్పాలి. సాధికారత అనే మాటకు అర్థం ఆ ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా పరాధీనులుగా ఉండిన స్థితి తగ్గుతూ, క్రమంగా తమ నిర్ణయాలు తాము స్వతంత్రంగా తీసుకొని ఆ ప్రకారం వ్యవహరించగల స్థితి రావటం. ఆ స్థితి నుంచి జీవితంలో అభివృద్ధి చెందుతూ ముందుకు సాగటం.



ఇందుకు ఆరంభం అనివార్యంగా ఆర్థిక స్థితిగతుల నుంచి మొదలవుతుంది. పేదరికంలో ఉన్న ప్రజలకు తక్షణ సహాయంగా సంక్షేమ చర్యలు అవసరం. ఆర్థిక సాధికారత తదనంతరపు ముందడుగు అవుతుంది. సాధికారత అనే రెండవ పార్శ్వం గురించి చెప్పుకునేముందు సంక్షేమంపై కొంత చర్చ అవసరం. సంక్షేమం అనే దృక్పథానికి ఒకప్పుడు ఉండిన అర్థం, తర్వాత రెండు అర్థాలుగా మారింది. మొదట ఉండిన అర్థం ప్రకారం పాలకులు సంక్షేమ చర్యల ద్వారా కేవలం బతికించి ఉంచుతారు. ఒక మోస్తరు సదుపాయాలు మాత్రం కల్పిస్తారు. మౌలికంగా ఏమీ మారదు. ఎంతకాలం గడిచినా పేదలు ఆ సంక్షేమ చర్యలపై ఆధారపడి బతికి అయితే ఉంటారుగాని అంతకన్న ముందుకు పోవటం, స్వంత కాళ్ళపై నిలవటం అంటూ ఉండదు. సంక్షేమ పథకాలు ఇక అవసరం లేదనే స్థాయికి ఎదగరు. కాని తర్వాత కాలంలో ఈ అర్థం ఒకవైపు కొనసాగుతూనే మరొక అర్థం, నిర్వచనం వచ్చి చేరాయి. దాని ప్రకారం, సంక్షేమ చర్యలు అనేవి పేదలను క్రమంగా ఆర్థికంగా తమ కాళ్ళపై తాము నిలవగలిగేట్లు చేయాలి. అదేవిధంగా సంక్షేమ పథకాలు మానవ వనరుల అభివృద్ధికి దోహదం కూడా చేయాలి. దీనంతటిలో ప్రజాకర్షణ పథకాలు అన్నవి బహుముఖ పాత్రవహిస్తాయి. పేదలను బతికించి ఉంచటం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచటం, కొన్ని సందర్భాలలో ఆర్థికంగా సాధికారత కల్పించటం మానవ వనరుల అభివృద్ధివంటివన్నీ కనిపిస్తాయి. పథకాల తీరునుబట్టి ఇవి వేర్వేరు విధాలుగా ప్రతిఫలిస్తాయి. ఇందులో పాలకుల ప్రధాన లక్ష్యం ఒకప్పుడు కేవలం ఓట్ల సంపాదన అయి ఉండేది. తర్వాత నిపుణులు, అధికారులు, ఐక్యరాజ్య సమితి, డబ్ల్యుహెచ్ఓ వంటి అంతర్జాతీయ సంస్థలు ప్రమేయం వల్ల దృష్టి కొంత మారి, ఓట్ల సంపాదన దృష్టి ఉంటూనే పేదలు బతికి ఉండటంతోపాటు తమ కాళ్ళపై తాము నిలవగలిగేట్లు కొంత చేయగలిగితే మేలు అనే ఆలోచనలు రాసాగాయి. ఆ ప్రకారం కొన్ని చర్యలు కూడా తీసుకున్నారు. అయితే ఆ పని అర్థమనస్కంగా ఒక పరిమితిలో జరిగింది. అందుకు కారణాలు ఏమిటన్న చర్చలోకి ఇక్కడ పోలేం. మొత్తనికి 70 ఏళ్ళ స్వాతంత్ర్యం తర్వాత పరిస్థితులు ఇవి. అందువల్ల పేదరికం అంటూ స్వల్పంగా తప్ప పోలేదు. అంతకన్న ముఖ్యంగా సాధికారతలు రాలేదు. అక్కడక్కడ కొన్ని వర్గాల విషయమై అది జరిగిందిగాని విస్తృతార్థంలో కాదు.

ఈ నేపథ్యాన్ని అంతా చెప్పుకున్న తర్వాత ఇక తెలంగాణ విషయానికి రావాలి. ఇక్కడ గత నాలుగు సంవత్సరాలుగా అమలు జరుగుతున్న పథకాలు, తీసుకుంటున్న చర్యలు గ్రామీణులపై రెండు విధాలైన ప్రభావాలను చూపుతున్నాయి. వారిని బతికి ఉంచటంతోపాటు జీవన ప్రమాణాలను మెరుగుపరచటం, తద్వారా మానవాభివృద్ధి ఒకటి కాగా, సాదికారతకు పునాదులు వేయటం రెండవది. ఇవన్నీ ఊహాగానాలు కావు. నకరంగా కన్పిస్తున్న విషయాలు. ఇందుకు సంబంధించిన ఫలితాలు ఇప్పటికే ఒకమేరకు కన్పిస్తుండగా, అమలైనవాటివల్ల మరిన్ని ఫలితాలు మరికొంత కాలంపాటు వస్తూపోవటం, అమలు మొదలైనవి రాగల కాలంలో ఫలితాలనివ్వటం, ప్లాన్ చేస్తున్నవి మునుముందు అమలుకు వచ్చి ఫలితాలనివ్వటం అనే మూడు జరిగినా కొద్దీ ఇందుకు సమగ్రత కన్పిస్తుంది.

ప్రతి ఒక్క పథకం గురించి ఇక్కడ పేర్కొని అందువల్ల కలుగుతున్న, కలుగగల సంక్షేమం, మానవాభివృద్ధి, సాధికారతలను వివరించలేంగాని కొన్ని ఉదాహరణలను చూద్దాం. సంక్షేమానికి గల పథకాలవల్ల మానవాభివృద్ధి కూడా జరగటం గురించి పైన చెప్పుకున్నాం. ఆ విధంగా ఉదాహరణకు ఆసరా పెన్షన్లను చూద్దాం. ఈ నగదు ఆర్థిక సహాయం ఈ సరికి దాదాపు 40 లక్షలమందికి

అందుతున్నది. దీనిని పెరిగిన బియ్యం కోటాతో కలిపి చూడండి. ఈ రెండింటి ఉమ్మడి ప్రభావం గ్రామాలలో, పట్టణాలలో పేదల జీవితాలపై ఏ విధంగా, ఎన్ని కోణాలలో ఉన్నదో ఎవరైనా క్షేత్రస్థాయికి వెళ్ళి, లబ్ధిదారులతో వివరంగా మాట్లాడి, సూక్ష్మస్థాయి అధ్యయనాలు (మైక్రో స్టడీస్) చేసారా? అటువంటి ప్రయత్నం కొద్దిమాత్రంగానైనా చేసినట్లయితే అర్థంకాగలది చాలా ఉంది. ఈ రెండు పథకాల ఉమ్మడి ప్రభావం ఆకలిపైన, వస్త్రాలపైన, కుటుంబ సంబంధాలపైన, పోషకాహార విలువలపైన, వినోదంపైన, సంస్కృతిపైన, ప్రయాణాలపైన, మనిషి విశ్రాంతిపైన ఉంటున్నది. దీనంతటితో సగటు ఆయుర్దాలపైన కూడా ఉండవచ్చుని తార్కికంగా చెప్పవచ్చు. కొంతకాలం గడిచిన తర్వాత తెలంగాణలో మానవాభివృద్ధి సూచికల అధ్యయనాలు, మనిషి సంతోష సూచికల అధ్యయనాలు జరిగినట్లయితే ఈ మార్పులు నిర్ధారిత రూపంలో తెలిసిరాగలవు. ప్రస్తుతానికి పైన పేర్కొన్న మార్పులు ఈ రచయిత క్షేత్ర స్థాయిలో స్వయంగా స్థూలంఅ గమనించినటువంటివి.

సంక్షేమం, మానవాభివృద్ధి దిశగా ప్రభావం చూపుతున్నవి మరికొన్ని ఉన్నాయి. అందుకు కొన్ని ఉదాహరణలు కెసిఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబరక్, క్రమంగా వేగం అందుకుంటున్న ఆరోగ్య సదుపాయాలు, విస్తరించినకొద్దీ డబుల్ బెడ్‌రూం ఇళ్ళు, దాదాపు చివరికి చేరిన మిషన్ భగీరథ, పేదపిల్లలకు గురుకులాల విస్తరణలు, మెరుగైన ఆహారం, మైనారిటీలకోసమ విస్తృత చర్యలు మొదలైనవి. ఇన్నిన్ని సంక్షేమాలు మరియు మానవాభివృద్ధి చర్యలవల్ల ఇప్పటికే మొదలైన ప్రభావాలు, రాగల కాలంలో ఉండగల ప్రభావాలు ఏమిటో 'తెరిచిన కళ్ళు, తెరిచిన మెదడు'లో చూడగల ఎవరికైనా సరే తేలికగానే కన్పించగలవు. అందుకోసం చేయవలసింది వెళ్ళి నేరుగా ఆయా వర్గాల ప్రజలను కలిసి మాట్లాడించటం.

యథాతథంగా మానవాభివృద్ధి సూచికల మెరుగుదల, మానవ వనరుల అభివృద్ధి అన్నవే మనిషి సాధికారతకు తమవైన రీతిలో దోహదం చేస్తాయి. అది స్థూల దృష్టికి ప్రత్యక్షంగా వెంటనే కన్పించని స్థితి. కాని వాస్తవం. ఆ విషయం జీవితాలలోకి తొంగిచూసినట్లయితే అర్థమవు తుంది. ఈ మెరుగుదలలు మనిషికిగల కొన్ని కొరతలను తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచి, నిలబడేందుకు దోహదం చేస్తాయి. సాధికారతకు ఆధారాలవుతాయి.

అవట్లుండగా, మన ప్రస్తుత చర్చ గ్రామీణులు, వారిలోని వివిధ వర్గాలగురించి ఆయినందున అందులోకి వెళదాము. ఒకవైపు రైతులు-వారి వ్యావసాయం, మరొకవైపు వివిధ వృత్తులవారికోసం చర్యల జాబితా పెద్దగానే ఉంది. విద్యుత్తు, నీరు, నగదు పెట్టుబడి సహాయం, ఇతర వనరుల నుంచి మొదలుకొని ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకూ తీసుకున్న – తీసుకుంటున్న – తీసుకోనున్న చర్యల ఉమ్మడి ప్రభావం గురించి చాలానే చర్చలు జరుగుతున్నందున వాటిలోకి నిర్దిష్టంగా వెళ్ళటంలేదిక్కడ. కాని అందువల్ల సాధికారత ఏర్పడుతున్న జాడలు ఇప్పటికే కన్పిస్తున్నాయి. ప్రస్తుతానికి రూపం తీసుకుంటున్నది ఆర్థిక సాధికారత. ఈ పరిణామం ఇదే విధంగా కొనసాగినట్లయితే అది తార్కికంగా సామాజిక, సాంస్కృతిక, రాజకీయ సాధికారతకు దారితీస్తుంది. వ్యవసాయంతో రైతులు, వ్యవసాయ కూలీలు, పలు వృత్తులవారితో కూడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పెద్ద మార్పులకు లోనవుతుంది. వృత్తులవారికోసం తీసుకునే అదనపు చర్యలు ఆందుకు దోహదం చేస్తాయి. రైతులు, వృత్తులవారి ఆర్థిక స్వయంపోషకత, సాధికారతలు ఆ రెండు తరగతులకు మధ్య ఉండి వారిపై ఆధారపడే వ్యవసాయ కూలీలు, ఇతర కూలీలకు కూడా ప్రయోజనం కలిగిస్తాయి. అది ఇప్పటికే కన్పించటం మొదలైనట్లు సాగుభూములు విస్తరించటం, రెండవ పంటకు నీరందటం వంటివి జరుగుతున్న ప్రాంతాలకు వెళ్ళి రైతు కూలీలతో మాట్లాడినట్లయితే తెలుస్తుంది. ఇవన్నీ ఈ రచయత స్వయంగ చూసినటువంటివి.

ఈ పరిణామాలు ఒకవైపు సంతృప్తిని కలిగిస్తుండగా, విచారకరంగా ఉన్న పరిస్థితి ఒకటుంది. ప్రతిపక్షాలకు వాస్తవాలు తెలిసినా వాటిని బయటకు అంగీకరించకుండా విమర్శలుమాత్రమే చేయటాన్ని అర్థం చేసుకోవచ్చు. కాని అర్థంకానిది కొందరు మేథావులు, ఉద్యమకారులు, మాజీ ఉద్యమకారుల ధోరణి. తెలంగాణా బాగుపట్ల, ప్రజల బాగుపట్ల వారి చిత్తశుద్ధిని శంకించవలసింది ఏమీ లేదు. కాని వారి తీరులో కొన్ని లోపాలు కన్పి స్తున్నాయి. ఒకటి, మన ఆలోచనలు ఏవైనప్పటికీ వాటిని అట్లా ఉంచుకుంటూనే వాస్తవాలను కూడా తెలుసుకోవాలని అనుకోకపోవటం. వాస్తవాలను 'తెరిచిన కళ్ళు, తెరిచిన మైండ్'లో చూడకపోవటం రెండు. కన్పించె వాస్తవాలు మన ఆలోచనలకు భిన్నంగా ఉంటే వాస్తవాలనుబట్టి ఆలోచనలను సవరించుకోవాలను కోకపోవటం మూడు. హైదరాబాద్‌కు, పట్టణ ప్రాంతాలకు, డ్రాయింగ్‌రూములకు, సెమినార్లకు, ఉపన్యాసాలకు, పడికట్టు మాటలకు పరిమితమై గ్రామాలకు వెళ్ళకపోవటం నాలుగు. అక్కడ మన బోధనలు చెయటం, వాదనలకు దిగటం గాక వారు చెప్పేవి వినాలని గుర్తించకపోవటం అయిదు. అందువల్ల ఇప్పటికే ప్రజలతో పెద్ద డిస్‌కనెక్ట్ ఏర్పడిందని గ్రహించి దానిని తగ్గించు కోకపోవటం ఆరు. సామాన్యులు తమ పరిస్థితులనుబట్టి, జీవితాను భవాలనుబట్టి మంచిని మంచి అంటూ చెడును నిర్మొహా మాటంగా విమర్శించటమనే సమతులన వైఖరి తీసుకునే పద్ధతిని తాము కూడా అనుసరించటమే సరైనదవుతుందని అర్థం చేసుకోకపోవటం ఏడు. ఏదైనా రాత్రికి రాత్రి జరగదని, ఏ వ్యవస్థలోగాని, ఏ సైద్ధాంతిక పాలనలో గాని అది సాధ్యం కాదని, విషయాలు ఏ దిశలో సాగుతు న్నాయో చూడటం ముఖ్యమని గుర్తించకపోవటం ఎనిమిది. లక్షలాది మంది ప్రాణత్యాగాల మీదుగా అధికారానికి వచ్చిన సోషలిస్టు నేతలు, వారి పరిపాలనలు కుప్పగూలుతూ ఏమి చేయాలో తోచని స్థితికో ప్రజలను దైన్యంలోకి నెట్టుతండటం కనిపిస్తూకూడా రొటీన్ వాదనల చట్రాల నుంచి బయటకు రాలేని బలహీన స్థితి తొమ్మిది. సిని నిజాలు పది.

తెలంగాణలో జరుగుతున్నది అన్ని విధాలా ఆదర్శప్రాయంగా ఉన్నదని కాదు. కాని ఆదర్శప్రాయంగా ఉన్నవి కూడా ఆనేకం ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంతోగాని, గత కాంగ్రెస్, టిడిపి పాలనలతోగాని, బెంగాల్ సిపిఎం పరిపాలనతోగాని పోల్చితే చెప్పుకోదగిన మార్పులు చాలా కన్పిస్తున్నాయి. సంక్షేమం, మానవాభివృద్ధి, మనవ వనరుల అభివృద్ధి, సాధికారతల జాడలు వాటిలో ఒకటి.

**–టంకశాల అశోక్,**

m : 9848191767

e : tankashalaashok@gmail.com

# ఉత్తమ ఫోటోగ్రఫీలో సిద్ధహస్తుడు “సిదార్థ”

నిరంతర కళాతృష్ణతో, అంతర్లీనమైన కళాదృష్టిలో, అనుక్షణం అన్వేషణ పరంపరలో నిత్యనూతన దృశ్యాల చిత్రీకరణ వెతుకులాటలో అలుపెరగని ప్రయాణం సాగిస్తున్న యువ ఛాయా చిత్రకారుడు గొల్లపెల్లి సిదార్థ. **“ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక”** అన్న చందంగా **“ఒక్క ఫోటో వెయ్యి పదాలతో సమానమైనట్టు”** ఎన్నో హృదయాలను కదలించగల శక్తి ఫోటోగ్రఫీకి ఉన్నదని తన చిత్రాలద్వారా నిరూపిస్తున్నాడు సిద్ధహస్తుడైన సిదార్థ.



కళా హృదయాన్ని, పరుగులు తీస్తున్న కాలగమనాన్ని తన కెమెరా లెన్స్‌లో బంధించి ఎన్నో వినూత్న దృశ్యాలకు సరికొత్త భాష్యం పలుకుతూ, తన ప్రస్థానాన్ని పది కాలాలపాటు పదిల పర్చుకుంటూ, అంతర్జాతీయ స్థాయిలో సిదార్థ రాణిస్తున్నాడు.

సిదార్థ గ్రామీణస్థాయి నుండి పట్టణస్థాయికి ఎదిగివచ్చిన యువ కెరటం. పూర్వపు కరీంనగర్ జిల్లా, ప్రస్తుత సిద్దిపేట జిల్లాలోని రాంచంద్రాపూర్‌కు చెందిన సిదార్థ 1979లో గొల్లపెల్లి రాజయ్య, సత్తెమ్మ దంపతులకు జన్మించాడు. తన తండ్రి మరణానంతరం అన్నయ్య శ్రీనివాస్‌పై కుటుంబ భారం పడింది. ఈ దిశలో తన అన్నయ్య కుటుంబ పోషణ కోసం ఫోటోగ్రఫీ వృత్తిని ఎంచుకున్నాడు. ఆ పరిస్థితుల్లో అన్నయ్యకు చేదోడుగా ఉంటూ, ఆ వృత్తినే సిదార్థ అనుకరిస్తూ, ఫొటోగ్రఫీపై మక్కువ పెంచుకొని, ఎన్నో మెళకువలను నేర్చుకున్నాడు. ఫోటోగ్రఫీతోపాటు విద్యాభ్యాసంలో కూడా శ్రద్ధను కనపర్చి ఇంటర్ వరకూ చదివి, కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో చదువుకు స్వస్థిపలికాడు. కానీ తన అన్నయ్య ప్రోద్భలంతో, ప్రోత్సాహంతో మళ్ళీ తన చదువుకు పదునుపెట్టి ‘కిమ్స్’ కాలేజీలో బి.కాం. పూర్తిచేసి, హైదరాబాదులోని ‘ఆరోరా’ కాలేజీలో ఎం.కాం పూర్తిచేశాడు.

అప్పటి పరిస్థితుల్లో సిదార్థకు ఎన్నో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు తలుపుతట్టినా, ఫోటోరంగంపై ఉన్న ఆసక్తికి, అభిరుచికి అనుగుణంగా ఫోటో జర్నలిస్ట్ కావాలన్న ప్రగాఢ ఆకాంక్షతో తన మార్గాన్ని నిర్దేశించుకున్నాడు. అందుకోసం 2007లో రచన, జర్నలిజం కళాశాలలో పీజీ డిప్లొమా ఇన్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం పూర్తిచేశాడు. అంతటితో ఆగకుండా శ్రీ వెంకటేశ్వర కళాశాలలో బి.ఎఫ్.ఏ (బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్)లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యాడు.

సిదార్థ చిత్రీకరించిన పలు వైవిధ్యమైన చిత్రాలు ఎన్నో అవార్డులను, పురస్కారాలను అందుకున్నాయి. ముఖ్యంగా ఆయన తీసిన ఫోటోగ్రఫీలో చత్తీస్‌గఢ్, ఒరిస్సా, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతంలోని గిరిజనుల జీవనశైలిని, వారి సంస్కృతి, సంప్రదాయ, ఆచార వ్యవహారాలను కళ్ళకు కట్టినట్లుగా తన సృజనాత్మక, కళా విలువలను ఆధునిక సమాజానికి తెలియపర్చాడు.

గ్రామీణ ప్రాంతంలోని కుమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలర పగ్గం, సాలెల మగ్గం అన్నచందంగా ఎన్నో వృత్తిపరమైన దృశ్యాలను పల్లెలోని జీవన సౌందర్యాన్ని తన కెమెరా ద్వారా సభ్యసమాజానికి అందించాడు. అందమైన అరకులోయలోని ప్రకృతి, పర్యావరణ అందచందాలను ఒడిసిపట్టి కమనీయ, రమణీయ దృశ్య కావ్యాలకు అద్దంపట్టాడు సిదార్థ.

ఇతిహాసపు చీకటి కోణంలోపడి కనిపించని కథలన్ని









కావాలిప్పుడు" అన్న శ్రీశ్రీ గారి మాటలకు అనుగుణంగా హైదరాబాద్ హెరిటేజ్ చిత్రాలతోపాటు అనేకమైన చారిత్రక కట్టడాల చారిత్రక విశేషాలను తన ఫోటోగ్రఫీ ద్వారా భావితరాలకు తెలియజేశాడు. ఎంతో కళాతృష్ణతో, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ, నిర్విరామకృషితో సిద్ధహస్తుడైన సిదార్థ ఎన్నో అవార్డులను తన సొంతం చేసుకొన్నాడు. విద్యార్థి దశలో ప్రప్రథమంగా కాలేజీలో నిర్వహించిన వార్షిక వేడుకల్లో భాగంగా ఫోటో ఎగ్జిబిషన్‌లో ద్వితీయ బహుమతి మరియు నగదు పురస్కారం అందుకున్నాడు. అదేవిధంగా సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ ద్వారా నిర్వహించిన 23వ అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక విభాగంలో సిల్వర్ మెడల్ మరియు రెండు మెరిట్ పురస్కారాలు అందుకున్నాడు. 2016లో కర్ణాటకలో ఆల్‌వేస్ నిర్వహించిన ఛాయాచిత్ర పోటీలో పాల్గొని ద్వితీయ బహుమతి, నగదు పురస్కారం అందుకున్నాడు. రవీంద్రభారతిలో జనవరి 2017లో నిర్వహించిన అంతర్జాతీయ ఫోటోగ్రఫీ పురస్కార వేడుకల్లో పాల్గొని పురపాలక, ఐటి శాఖా మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు, బి.సి.కార్పొరేషన్ ఛైర్మన్ బి.ఎస్ రాములు చేతుల మీదుగా పురస్కారం అందుకొన్నాడు. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ మరియు ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో జరిగిన 2018 గణతంత్ర దినోత్సవ సందర్భంలో విడుదల చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌లో హైదరాబాద్ హెరిటేజ్ పై తాను తీసిన చిత్రాలను ఎన్నుకొని ముద్రించి ఆవిష్కరింపజేసిన సందర్భంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ డా॥ ఫణిశ్రీగారి చేతులమీదుగా సర్టిఫికెట్, నగదు పురస్కారం అందుకుని వారి కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గారి, బోధనా సిబ్బంది ప్రశంసలకు పాత్రులయ్యారు. ప్రస్తుతం సిద్ధా జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో (ఎం.ఎఫ్.ఎ) మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తద్వారా లక్నో యూనివర్సిటీలో ఫైన్ ఆర్ట్స్‌లో పరిశోధన చేసి పి.హెచ్.డి సాధించాలన్న కృత నిశ్చయంతో ముందుకు సాగుతున్నాడు సిదార్థ.


ఫోటోగ్రఫీ ద్వారా మరెన్నో సామాజిక దృక్పథంకల్గి, భావుకతకు అద్దంపట్టే దృశ్యాలను ఆవిష్కరించి ప్రతి హృదయం స్పందించే విధంగా సఫలీకృతం కావాలని, మనందరికి మార్గదర్శిగా–నిరంతర క్రాంత దర్శిగా నిలవాలని ఆకాంక్షిద్దాం.

సిదార్థ, ఫోటోగ్రాఫర్
siddarthaphotography@gmail.com
9948693959

–పరాంకుశం సింహాద్రి
m : 9441350866
e : siddarthaphotography@gmail.com













Photographer:

**Gollapelli Sidhartha**

అనుక్షణం అన్వేషకుడిగా నిత్య నూతన దృశ్యాల వెతుకులాటలో తన కళాత్మకతకు పదునుపెట్టే ఫోటోలు తీస్తున్న యువ ఛాయా చిత్రకారుడు గొల్లపెల్లి సిదార్థ. పదిలమయ్యే దృశ్యాలను ఎన్నుకుని మదిని దోచి పది కాలాలు దాచుకునే ఛాయా చిత్రాలను తీస్తూ తనలోని అంతర్లీన కళాదృష్టిని సిదార్థ చాటిచెబుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు తలుపుతట్టినా ఫోటోగ్రఫీని వృత్తిగా చేపట్టి రాణించాలన్న నిశ్చయంతో తన మార్గాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని ముందుకెళ్తున్న కార్యశీలి.

ప్రత్యేక కథనం లోపలి పేజీల్లో





























# 70వ వసంతంలో పాత్రికేయ సైనికుడు

# కె.రామచంద్రమూర్తి

ఉన్నత పాత్రికేయ ప్రమాణాలు పాటిస్తూ... అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ఆలంబనగా నిలుస్తూ... దాదాపు 50 ఏళ్లుగా జర్నలిజం ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న అలుపెరగని అక్షర యోధుడు... కె. రామచంద్రమూర్తి. సీనియర్ జర్నలిస్ట్‌గా, రచయిత, కాలమిస్ట్‌గా, తన రచనలతో సమాజాన్ని మేల్కొపిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన 70వ వసంతంలో అడుగుపెట్టిన సందర్భంగా మే 20న తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో.. ఎమెస్కో సంస్థ ప్రత్యేక ఆత్మీయ అభినందన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎమెస్కో నిర్వాహకుడు విజయ్ కుమార్ అధ్యక్షతన ఈ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. తన సుదీర్ఘ జర్నలిజం ప్రస్థానంలో స్ఫూర్తిదాయ పాత్ర పోషించారని వక్తలు అభిప్రాయపడ్డారు. సీనియర్ జర్నలిస్టుల రామచంద్రమూర్తి సేవలను వక్తలు కొనియాడారు.



ఈ సందర్భంగా... సాక్షి పత్రికలో రామచంద్రమూర్తి రచించిన 'త్రికాలమ్' వ్యాసాల సంకలనాన్ని సీనియర్ పాత్రికేయుడు ఎన్.వెంకటనారాయణ్, సీనియర్ సంపాదకుడు ఎ.బి.కె. ప్రసాద్, మాజీ సీనియర్ ఐఏఎస్ అధికారి వేణుగోపాల్, కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి, తదితరులు ఆవిష్కరించారు.

**ఈటెల రాజేందర్, రాష్ట్ర ఆర్థికమంత్రి**

ఐదు దశాబ్దాలపాటు ప్రజల పక్షాన నిలిచిన పాలకులకు వాస్తవాలు తెలియజెప్పిన మహోన్నత వ్యక్తి కె.రామచంద్రమూర్తి అని... రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. మూర్తికి సామాజిక బాధ్యత ఎక్కువని, తెలంగాణ ఉద్యమ సమయంలో రెండు ప్రాంతాల మధ్య విద్వేషాలు తలెత్తకుండా నిర్వహించిన దశ-దిశ కార్యక్రమం అత్యున్నతమైనది ఈటెల పేర్కొన్నారు. మారుతున్న సమాజంలో నిజాయితీతో పనిచేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారని మంత్రి ఈటెల కొనియాడారు.

కె.రామచంద్రమూర్తికి ఆత్మీయుడు... సీనియర్ పాత్రికేయుడు... వెంకట్‌నారాయణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జర్నలిజం వృత్తిలో దిగ్విజయంగా అర్ధ శతాబ్దం పూర్తిచేసుకున్న వెంకట్ నారాయణ్‌ను... శాలువా కప్పి... రామచంద్రమూర్తి ఆత్మీయంగా సన్మానించారు. రామచంద్రమూర్తి వృత్తి నిబద్ధతను, వృత్తి పట్ల అంకితభావాన్ని వెంకట్ నారాయణ్ ఈ సందర్భంగా శ్లాఘించారు. ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూనే అనుబంధాలను, మానవబంధాలను పదిలంగా కాపాడుకుని జర్నలిజం వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి... మూర్తి అని... వెంకట్ నారాయణ్ ప్రశంసించారు.

**కె.రామచంద్రమూర్తి, సీనియర్ పాత్రికేయులు**

లిబరల్ డెమొక్రటిక్‌గా ఉండాలని మా ప్రొఫెసర్ బషీరుద్దీన్ చెప్పిన మాటలు తనకు స్ఫూర్తినిచ్చాయని రామచంద్రమూర్తి తెలిపారు. తన సుదీర్ఘ జర్నలిజం ప్రస్థానంలో ఏ సంస్థలో పనిచేసినా... మహిళా సాధికారత, దళితుల సంక్షేమం, మానవ హక్కులు, ఆరోగ్యం అంశాలకు అధిక ప్రాధాన్యమిచ్చినట్టు ఆయన తెలిపారు. తనకు సహకరించిన, సహకరిస్తున్న వారందరికీ రామచంద్రమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ మంత్రి గంటా శ్రీనివాస్ మాట్లాడుతూ... జర్నలిజాన్ని వృత్తిగా కాకుండా... ప్రవృత్తిగా మార్చుకున్న గొప్ప వ్యక్తి రామచంద్రమూర్తి అన్నారు. జర్నలిస్టులకు... ఆయన ఒక విశ్వవిద్యాలయం లాంటి వారని.. ..గంటా శ్రీనివాస్ కితాబిచ్చారు. ముక్కు సూటిగా చెప్పడం, నిరాడంబరత తన నైజమని పేర్కొన్నారు. కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ... పాత్రికేయ వృత్తి ద్వారా.. ప్రజలకు రామచంద్రమూర్తి అసమాన సేవలు అందించారన్నారు. గంభీర పరిస్థితుల్లోనూ తొణకని మస్తత్వం ఆయనదని దత్తాత్రేయ సభలో తెలిపారు. సమస్యలు పరిష్కరించే కోణంలో అన్నిరకాల భావజాలం కలిగిన వ్యక్తులతో సయోధ్య, చర్చకు వీలు కల్పించిన నేర్పు, ఓర్పు రామచంద్రమూర్తి సొంతమని కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి అభినందించారు.

తెలంగాణ విషయంలో, నల్గొండ ఫ్లోరైడ్ విషయంలోనూ రామచంద్రమూర్తి తీవ్రంగా కృషి చేశారని సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఫ్లోరైడ్ సమస్యపై హైకోర్టు వరకు వెళ్లి ఓ కమిటి ఏర్పాటు చేయడంలో మూర్తి సామాజిక బాధ్యత కనిపిస్తుందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మనపరిధిలోని అంశాలను కూడా... పరిధి పెంచుకుని కృషిచేసే వ్యక్తి రామచంద్రమూర్తి అని ఆయన అభిప్రాయపడ్డారు.

అనేక సంక్లిష్టమైన పరిస్థితులను నిబ్బరంగా ఎదుర్కొన్న విశిష్ట

వ్యక్తిత్వం ఆయనదని... టిఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఏర్పాటుకు రామచంద్రమూర్తి ఇచ్చిన స్ఫూర్తి ఎనలేనిదని... అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి తెలిపారు.

రామచంద్రమూర్తి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో... రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్, ఏపీ మంత్రి గంటా శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీలు జైపాల్ రెడ్డి, కేవీపీ రామచంద్రారావు, ఉండవల్లి అరుణ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి.ప్రకాశ్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, నమస్తే తెలంగాణ సంపాదకుడు కట్టా శేఖర్ రెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, నవ తెలంగాణ ఎడిటర్ ఎస్.వీరయ్య, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, సీఎంఓ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి, సీనియర్ జర్నలిస్ట్ మల్లేపల్లి లక్ష్మయ్య, ఐండియన్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, దేవులపల్లి అమర్, తెలంగాణ జర్నలిస్టు యూనియన్ నాయకులు పల్లె రవికుమార్, విరాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

**కె. రామచంద్రమూర్తి వృత్తిగత జీవన ప్రస్థానం....**

సాక్షి పత్రికలో ప్రస్తుతం ఎడిటోరియల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రామచంద్రమూర్తి ప్రస్థానం 1973లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో సబ్ ఎడిటర్‌గా ప్రారంభమైంది. అక్కడి నుంచి ఆంధ్రప్రభ పత్రికలో 1976లో చేరారు. 8 ఏళ్ల తర్వాత... కొత్తగా ఉదయం పత్రిక ప్రారంభమయ్యాక... విజయవాడ ఎడిషన్‌కు ఇన్‌చార్జిగా పనిచేశారు. అలా మరో 8 ఏళ్ల తర్వాత... ఆంధ్రజ్యోతి పత్రిక ఢిల్లీ బ్యూరో చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. 1998లో వార్త ఎడిటర్‌గా తన ప్రస్థానాన్ని కొనసాగించారు. ఆ తర్వాత మళ్లీ ఆంధ్రజ్యోతిలో ఎడిటర్‌గా తిరిగి చేరారు. ఆపై... 2008లో హైదరాబాద్ మీడియా హౌజ్ లిమిటెడ్ సంస్థ ప్రారంభించిన హెచ్‌ఎమ్‌టీవీలో ఎడిటర్‌గా ఎలక్ట్రానిక్ మీడియాలో అరంగేట్రం చేశారు. ఆ సంస్థ ప్రారంభించి ఇంగ్లిష్ దిన పత్రిక 'ద హాన్స్ ఇండియా'లోనూ కీలక బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలో హెచ్‌ఎమ్‌టీవీలో రామచంద్రమూర్తి నిర్వహించిన 'దశ-దిశ' కార్యక్రమం ద్వారా.... ఆయన ఆలోచనలు, సమాజంపై ఉన్న బాధ్యత ప్రజలకు మరింతగా తెలిశాయి....

'వార్తా రచన, విద్యుత్ వలయం, అమీబా, క్రీడాభారతం, సరదాల పరదా, కాలమేఘం, సకలం వంటి తెలుగు రచనలతో పాటు... ద హ్యాన్స్ ఇండియా పత్రికలో 'Thursday Thoughts' పేరుతో ఆయన రచించిన వ్యాసాలను The Emergnece of Telangana State పేరుతో ప్రచురించారు. గ్రామీణ విలేకరులపై Rural Reporting In Indiaతో పాటు... మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అధికారంలో ఉండగా అప్పటి పరిస్థితులపై... కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి మణిశంకర్ అయ్యర్ రాసిన Rajiv My Darling పుస్తకాన్ని రామచంద్రమూర్తి తెలుగులో అనువదించారు.

-ఎం.డి.కరీం
m: 9618644771
e:karreemmd786@gmail.com

## కవిత్వమంటే.....



కవిత్వమైనా
కార్టూనైనా
కదిలించాలి
కవ్వించాలి
కన్నీరు తెప్పించాలి
కాకుంటే
అయ్యో పాపం అనిపించాలి
ఆలోచింపజేయాలి
అదీ ఇదీ కానినాడు
ఆ కవిత్వమెందుకు?
కార్టూనెందుకు?
కలంతో కాగితం నింపిన
కాలమంతా దండుగ

-డా॥ కపిలవాయి లింగమూర్తి
m : 8790727772









Artist:


**KANDI NARSIMLU**

గ్రామీణ జనజీవన సౌందర్యాన్ని వర్ణశోభితంగా చిత్రించి చిత్రకళాభిమానుల మనసు కాన్వాసుపై ముద్రవేసిన చిత్రకారుడు కంది నర్సింలు. ఆవగింజపై భారతదేశ పటాన్ని, బియ్యపు గింజ, బరాణీ, జీర గింజలపై సూక్ష్మ చిత్రాలను అద్భుతంగా గీసిన కళాపిపాసి. త్రిమితీయ ఫైబర్ స్కల్ప్చర్ కళ పేరిట చిత్రాలను అసమానంగా గీసి కళాభిమానులను కట్టిపడేసిన ప్రతిభావంతుడు. సింగపూర్, అమెరికా, బ్రిటన్ వంటి పలు దేశాల చిత్ర కళాభిమానులు విరివిగా నర్సింలు గీసిన చిత్రాలను కొనుగోలు చేయడం వారి చిత్రకళకు అందిన అంతర్జాతీయ ఆదరణ.

ప్రత్యేక కథనం లోపలి పేజీల్లో























# మనసుపై ముద్రవేసే వర్ణశోభిత చిత్రాలు


పల్లె జీవనాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను చిత్రాలుగా మలచి చిత్రకళకు వన్నెలద్దిన గొప్ప చిత్రకారుడు నర్సింలు. గ్రామీణ జీవన నైతికత, పద్ధతులను తనదైన ముద్రతో వర్ణశోభితంగా చిత్రించడంలో నర్సింలుది అందెవేసిన చేయి. చిత్రకారుడిగా మనసు కాన్వాసుపై ముద్రవేసే చిత్రాలను సృష్టించారు. మెదక్‌జిల్లా మిరుదొడ్డి మండలం కాస్లాబాద్‌కు చెందిన కంది రాజయ్య, ఎల్లమ్మ దంపతులకు జన్మించిన నర్సింలు పాఠశాల స్థాయి నుండే చిత్రకళపై మక్కువను పెంచుకున్నారు. ప్రముఖ చిత్రకారుడు రుస్తుం నర్సింలు పాఠశాలలో డ్రాయింగ్ టీచరుగా పనిచేయడంతో చిత్రకళపై ఆయన ద్వారా మరెంతో అభిరుచి పెరిగింది. 1998లో జెఎన్‌టియులో బిఎఫ్ఏ, 2011లో ఎంఎఫ్ఏ పూర్తిచేసిన నర్సింలు ఎన్నో చిత్రకళా ప్రదర్శనలిచ్చారు.



నర్సింలు చిత్రాలలో జనజీవన చిత్రణ కన్పించింది. బోనాలు, మేకల బేరం, కల్లుగీత, పొలం పనులు, రైతు దంపతులు, వివిధ గ్రామీణ వృత్తులు ఆయన చిత్రాలలో కన్పిస్తాయి. వాస్తవికత ఉట్టిపడేలా దృశ్యమానంగా చిత్రించడం ఆయన నిపుణత.తనకు తెలిసిన పల్లె జీవితానికి సౌందర్యాన్ని జోడించి రంగుల ప్రపంచంలో రమణీయంగా ఆవిష్కరిస్తారు నర్సింలు. స్త్రీ పురుషులు కలిసిన శ్రమైక జీవన ప్రపంచంపై పలు చిత్రాలను నర్సింలు గీసి కళాభిమానులను ఆకటుటకున్నారు. ఇరుగు పొరుగు, భార్యాభర్తలు, ఆడవాళ్ళ సంభాషణలు వంటి అంశాలను చిత్రించి, ఆ చిత్రాలు నేరుగా చూసేవారితో సంభాషిస్తున్నట్టుగా దృశ్యమానతను కల్పించి మంత్రముగ్ధులను చేశారు నర్సింలు. పల్లె హృదయ కాన్వాసుపై ఎదిగి వచ్చిన నర్సింలు తాను దగ్గరగా చూసిన, అనుభవించిన జీవితాన్నే తన చిత్రాలకు ఇతివృత్తంగా ఎంచుకోవటంవల్లనేమో ఆయన చిరతాలలలో జీవకళ ఉట్టిపడుతుంది. ఇంటర్మీడయట్ చదివే రోజుల్లోనే పట్టుకుందామంటేనే జారిపోయే ఆవగింజపై భారతదేశ పటాన్ని చిత్రీకరించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. బఠాణీ గింజమీద ప్రపంచ ఖండాల పేర్లు రాసి భారతదేశాన్ని స్పష్టంగా గుర్తించేలా చేసి ఔరా అనిపించారు. బియ్యపు గింజపై గ్రామీణ మహిళ చుట్టుకుదురుతో తలపై గంపను పెట్టుకున్నట్టే కాక జింకపిల్లను, నంది బొమ్మను చిత్రించి ఆశ్చర్య పరిచారు. శాంతికి ప్రతీకైన పావురాన్ని బీర గింజపై చిత్రించాడు. చిన్నచిన్న గింజలపై అద్భుతమైన చిత్రాలు గీసి సరిలేరు నీకవ్వరు అని అనిపించుకున్నారు. సూక్ష్మ చిత్రకళలో ఈ చిత్రాలు గీయటానికి నర్సింలుకు ఎక్కువ సమయం తీసుకుంటాడంటే పొరపడినట్లే. పెద్ద చిత్రానికైతే గంట, చిన్న చిత్రానికి అరగంట సమయాన్ని తీసుకుని అద్భుతాలు సృష్టిస్తారు నర్సింలు.

హైదరాబాదులోని ఓషన్ పార్క్‌లో గాజులా స్ఫురించేటట్టుగా ఎనామిల్‌తో పై కప్పులపై 70X70 సైజులో బౌద్ధానికి సంబంధించిన అంశంతో వేసిన ఆరు చిత్రాలు నర్సింలు సంవిధాన చాతుర్యాన్ని చాటుతాయి. వర్ణాల అమరిక, రేఖల లావణ్యం, వస్తువులోని నిర్దుష్టత, ఒకదానికి మరొకదానికి మధ్య సంబంధం చూడముచ్చటగా అందులో ఉండి కళాభిమానులను ఎంతో ఆకట్టుకుంది. భారతదేశంలోని హైదరాబాదు, ఢిల్లీ, కోల్‌కత్తా, ముంబాయి,బెంగుళూరు వంటి ప్రముఖ నగరాలలో దాదాపు 24 చిత్రకళా ప్రదర్శనలలో నర్సింలు చిత్రాలు ప్రదర్శితమై ఆకట్టుకున్నాయి. తాను స్వయంగా మూడు ప్రదర్శనలు నిర్వహించారు. త్రిమితీయ ఆకృతిలో ఫైబర్ గ్లాస్ స్కల్ప్చర్ కళ పేరిట






నర్సింలు గీసిన చిత్రాలు కట్టిపడేస్తాయి. కాన్వాసుపై గీసిన చిత్రాలను ఫైబర్‌పై కూడా త్రిమితీయంగా పొందిస్తున్నారు. మార్కెట్‌లో ఈ చిత్రాలకు ప్రస్తుతం ఎంతో ఆదరణ ఉంది. సింగపూర్, అమెరికా, బ్రిటన్ లోని పలు సంస్థలు ఈయన చిత్రాలను కొనుగోలు చేశాయి. నర్సింలు చిత్రాలకు లక్షన్నరకు పైగా ధర పలకడం విశేషం.

- 2011లో ఆలిండియా పెయింట్ ఎగ్జిబిషన్, హైదరాబాదు ఆర్ట్ సొసైటీలో జరుగగా గోల్డ్ మెడల్ అందుకున్నారు.
- 2016లో తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ అంశంగా నిర్వహించిన పోటీలలో బహుమతి పొందారు.
- 2017లో మలేషియాలో జరిగిన సరాన్ ఇంటర్నేషనల్ ఆర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఆయనకు ఆహ్వానం అందడం ఒక అరుదైన గౌరవం.
- 2010లోనే నర్సింలు చిత్రానికి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు దక్కింది. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ సత్కారం కూడా పొందారు.
- 2011లో ఈయన గీసిన చిత్రానికి హైదరాబాదు ఆర్ట్ సొసైటీ బంగారు పతకం లభించింది.
- 2016లో బతుకమ్మ పండుగ సందర్భంగా నిర్వహించిన పోటీలో నర్సింలు గీసిన చిత్రం తెలంగాణ ప్రభుత్వ ప్రథమ బహుమతిని గెలుచుకుంది.




హైదరాబాద్ అలంకృత ఆర్ట్ గ్యాలరీలో 2011లో జరిగిన రూస్టిక్ రిఫ్లెక్షన్, 2013 రూరల్ ఎక్స్‌పర్ట్, 2014లో బెంగుళూరులో జరిగిన టుడి, త్రీడి, హైద్రాబాద్‌లో జరిగిన రూరల్ విష్ఫర్స్ సోలో ప్రదర్శనలలో పాల్గొని తన చిత్రాలకు గాను ప్రశంసలు పొందారు. ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా 2017లో నిర్వహించిన చిత్రకళా ప్రదర్శనలో పాల్గొని అభినందనలందుకున్నారు. 2010లో కాకతీయ ఎన్ఆర్ఐ ఫోరం తెలంగాణ సత్కారం, 2011లో చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పురస్కారాన్ని నర్సింలు అందుకున్నారు.

చిన్నప్పటినుండి చిత్రకళపై తనకున్న అభిరుచి, ఆసక్తిని సాధన ద్వారా సానబెట్టుకుని సమాజాన్ని పరిశీలించడంద్వారా గ్రామీణ ప్రజల జీవితాలను అవగాహన చేసుకుని తనదైన శైలితో అద్భుత కళాఖండాలను నర్సింలు సృష్టించారు. జీవన పార్శ్వాలను, పల్లె అనుబంధాలను, సంస్కృతులను తన కుంచె ద్వారా మరెన్నో చిత్రాలుగా మలిచి మైమరిపింపజేయాలని తెలంగాణ చిత్రకళా ఖ్యాతిని నలుదిశలా చాటిచెప్పాలని ఆకాంక్షిద్దాం.

**కంది నర్సింలు,** 8978766619
kandinarsimlu@gmail.com

– సృజన్ , –దక్కన్ న్యూస్



# మన టాకీసులు - సినిమా చరిత్రకు ఆనవాళ్లు

తెలంగాణలో సినిమా టాకీసులదే ఒక చరిత్ర అవుతుంది. ఇక్కడ మూకీ చిత్రాల నిర్మాణం, సినిమా టాకీసుల నిర్మాణం దాదాపుగా సమాంతరంగా జరిగింది. తెలంగాణలో హైదరాబాదులో 1920లోనే నిజాం నవాబు 'సెలక్ట్ టాకీస్' నిర్మించారు. ఇదే కాలంలో అవిభక్త హైదరాబాదు స్టేట్‌లోని బీడ్ జిల్లా కేంద్రంలో కూడా 1920లోనే ఎం.డి.సర్దార్‌ఖాన్ 'దక్కన్ టాకీస్' పేరుతో పర్మినెంట్ థియేటర్‌ను నిర్మించారు. ఈ రెండు చారిత్రక వాస్తవాలు 1921లో విజయవాడలో నిర్మితమైన "మారుతి" టాకీసు కన్నా ముందుగానే మన తెలంగాణలో థియేటర్లు ఉన్నట్లు రుజువు పరుస్తున్నవి. పై రెండు విషయాలు 1940 నాటి నిజాం స్టేట్ స్టాటిస్టిక్స్ రికార్డుల్లో నమోదై ఉన్నవి. 1921లో పుత్లీబౌలి బావి వద్ద "ఆస్రాని బయోస్కోప్" పేరిట ఒక టాకీస్ వుండేది. హైదరాబాదులో ఇది తొలితరం థియేటర్లలో ఒకటి. ఇంకా అఫ్జల్‌గంజ్ మార్వడి ప్రెస్ ప్రాంతంలో "సిటీ సినిమా" అని కూడా ఒక టాకీస్ వుండేది. మరోవైపు హైదరాబాదులో 1929లోనే డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఒకటి "అలీ బ్రదర్స్" పేరిట ప్రారంభమైంది. దీన్ని స్థాపించినవాడు 18 ఏళ్ల అలీబకర్.




భారతదేశంలో మొదటి సినిమా థియేటర్ కలకత్తాలో నిర్మాణమైంది. జె.ఎఫ్.మదన్ అనే పారసీ నాటకరంగ ప్రముఖుడు దీనికి ఆద్యులు. ఫ్రెంచికి చెందిన పాథే కంపెని నుండి సినిమా పరికరాలు కొని వాటి ద్వారా కలకత్తా మైదానంలో టెంట్ వేసి టికెట్టు కొని చూసే కమర్షియల్ షోని తొలిసారిగా 1902లో వేశారాయన. ఈయన మూకీల శకంలో బలమైన శక్తిగా ఎదిగి బెంగాల్‌లో తొలి మూకీ 'బిల్వమంగళ' (1919) తీశారు. ఈయనే 1907లో కలకత్తాలో దేశంలోనే తొలి పర్మినెంట్ సినిమా థియేటర్ నిర్మించారు. దాని పేరు 'ఎల్ఫిన్ స్టోన్ పిక్చర్ ప్యాలేస్! తర్వాత ఇది 'చాప్లిన్ థియేటర్'గా పేరు మార్చుకుని నూరేళ్లు దాటిన భారతీయ సినిమా చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచింది. కానీ 2013 ఏప్రిల్ 27న కలకత్తా మున్సిపల్ కార్పొరేషన్ దీన్ని కూల్చి వేసింది.

ఇట్లా మొదలైన సినిమా టాకీసుల నిర్మాణం దాదాపొల్కే భారతీయ తొలి మూకీ 'రాజహరిశ్చంద్ర' 1913లో తయారయ్యే నాటికి దేశంలో మొత్తం 40 థియేటర్లు నిర్మాణమైనవి. 1918 నాటికి 98కి చేరితే 1927లో 387 థియేటర్లుండగా తొలి భారతీయ టాకీ 'ఆలంఆరా' విడుదలయిన 1931లో వీటి సంఖ్య 451. 1927 నాటికి భారతదేశపు సినిమా ప్రదర్శన రంగం మొత్తం 10 రీజియన్లతో బాటు బర్మా, కంటోన్మెంట్ ఏరియాలుగా విభజించబడింది. అవి బొంబాయి, బెంగాల్, మద్రాస్, యు.పి., పంజాబ్, సెంట్రల్ ప్రావెన్స్, బీహార్ – ఒరిస్సా, అస్సామ్, ఢిల్లీ రీజియన్స్. అప్పటి హైదరాబాద్ స్టేట్ బొంబాయి రీజియన్‌లోనే ఉండింది. (ఆర్.కె.వర్మ – 'ఫిల్మోగ్రఫి సైలెంట్ సినిమా – 1913-1934'. ప్రచురణ : 2000)

1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యాక 1958 నాటికి సీమాంధ్రలో 258 పర్మినెంటు, 132 టెంపరరీ థియేటర్లుండగా నాటి తెలంగాణ ప్రాంతంలో 99 పర్మినెంట్, 57 టెంపరరీ థియేటర్లున్నవి. తెలంగాణ జిల్లాల్లో హైదరాబాదు 25, సికిందరాబాదు 12 పర్మినెంటు, ఆదిలాబాదులో 6 పర్మినెంట్, 8 టెంపరరీ, కరీంనగర్‌లో 6-12, ఖమ్మం మెట్టులో 8-7, మహబూబ్‌నగర్‌లో 7-8, నిజామాబాద్‌లో 13-7, నల్లగొండలో 7-4, వరంగల్లులో 11-5, మెదక్ 4-6 చొప్పున పర్మినెంట్ టెంపరరీ థియేటర్లు ఉండినవి. (ఆంధ్రదర్శిని – 1958)

అయితే తెలుగు సినిమా పరిశ్రమ అప్పటికి మద్రాసులో ఉన్నప్పటికీ హైదరాబాదు ఉమ్మడి రాజధాని అయ్యాక తెలుగు సినిమాల విడుదలకు హైదరాబాదు కేంద్ర స్థానమైంది. అప్పటి వరకు కృష్ణా, గుంటూరు జిల్లాల వ్యాపారమే కీలకం అనుకునే సినిమా నిర్మాతలకు హైదరాబాదు అధిక వసూళ్లకు నెలవైంది. హిందీ సినిమాలకు బొంబాయి నగరం ఎట్లనయితే ప్రధానమో, హైదరాబాదు కూడా తెలుగు సినిమాలకు మెట్రోపాలిటన్ స్థాయి కల్పించింది.

### ప్రిన్స్ టాకీస్, బోరియా టాకీస్ అదే విజయా టాకీస్

ముందుగా వరంగల్ జిల్లాలోని సినిమా టాకీసుల వివరాల్లోకి వెళితే 1930ల్లోనే టూరింగ్ టాకీస్ ఒకటుండేదనంటారు సాహిత్యకారులు నాగిళ్ల రామశాస్త్రి గారు. 1940ల్లో "ప్రిన్స్ టాకీస్" అని హనుమకొండ చౌరస్తా దగ్గర ఒక రేకుల టాకీస్ ఉండిందంటా రాయన. ఈ టాకీస్ స్థలం ఒకరిది. రేకులు ఒకరివి. ప్రొజెక్టర్ మరొకరిదిలా నడిచేది. వీటన్నింటిని కలిపి కొన్నవారు గోపాల్‌రావు. తరువాత ఇక్కడే జి.ఆర్.టాకీస్ పేరున థియేటర్ కట్టారాయన. అయితే ఇది కొద్ది కాలంలోనే కాలగర్భంలో కలిసిపోయింది. ఇదిగాక పెద్దమ్మగడ్డలో 1954 వరకు 'బోరియా టాకీస్' అని తడకల టాకీస్ కూడా మరొకటి ఉండింది. ఇది 1954లో 'విజయా టాకీస్'గా నిర్మాణం చేసుకుంది. దీనిని కృష్ణారెడ్డి గారనే ఒకాయన నిర్మించారు. ఈ టాకీస్ 1954లో 'మున్నా' అనే సినిమాతో ప్రారంభమైంది. ఈ చిత్ర హీరో మన తెలంగాణ వాడైన పైడి జైరాజ్.

జి.ఆర్.టాకీస్‌ను కొన్న ఒక ముస్లిం వ్యక్తి ఇప్పుడు సెయింట్ పాల్స్ స్కూల్ ఉన్నచోటనే మరొక థియేటర్ కట్టాలని శిలాఫలకం వేశాడు. కాని మరెందుకో గాని అది రూపుదిద్దుకోకుండానే ఆ స్థానంలో సెయింట్ పాల్స్ స్కూల్ నిర్మాణమైంది. అయితే ఆ తర్వాత నిర్వహణ భారం మోయలేక జి.ఆర్.టాకీస్ వేరొకరి చేతుల్లోకి మారి ప్రస్తుతం

షాపింగ్ కాంప్లెక్స్‌గా మారింది. దీని తరువాత అలంకార్ టాకీస్ వచ్చింది. దీనిని ఎవరు నిర్మించారో తెలియదు గానీ డాక్టర్ కె.ఎస్.ఆర్.శాస్త్రి, ఝాన్సీ దంపతులు లీజుకు తీసుకున్నారు. మొదట ఇంగ్లీషు చిత్రాలు మాత్రమే ఆడేవి. తరువాత అన్ని రకాల సినిమాలు వేయడం ప్రారంభించారు.

ఇక వరంగల్ సంగతి. వరంగల్ రైల్వేస్టేషన్ దగ్గరలో ఉన్నది ప్రభాకర్ టాకీస్. అదే తరువాత రాజేశ్వరి టాకీస్ అయ్యింది. ఇదే ఆ తరువాత 'సునిల్ టాకీస్'గా మారింది. మేనేజ్‌మెంట్ మారే కొద్ది పేర్లు మారుతూ పోయినవి. రైల్వే గేటు దగ్గరి "సరోజ్ టాకీస్" అని ఉండేది. మొదట దీని పేరు 'మార్కొండేయ'. 1970ల్లో ఇది మూతపడింది. తరువాత "చౌదరీ" టాకీస్ వచ్చింది. దీని సౌండ్ బాక్స్‌లు చాలా స్పష్టంగా వినిపించేవి. వీటి గురించి ప్రత్యేకంగా చెప్పుకునేవారు. దీని తరువాత 'రమా' టాకీస్ కట్టారు. కాని ఇదెంతో కాలం నడవక రెసిడెన్షియల్ ఫ్లాట్స్‌గా రూపాంతరం చెందింది.

1955కు ముందే నిర్మాణమైవున్న జె.పి.ఎన్.రోడ్‌లో 'విక్టర్' టాకీస్ ఉండేది. అది కొద్ది కాలమే నడిచి లక్ష్మీటాకీస్ ఉండేది. ఇది కూడా చివరికి తిరుమల బైండింగ్ వర్క్స్ బాల్‌రెడ్డి యాజమాన్యంలోకి మారి షాపింగ్ కాంప్లెక్స్‌గా మారింది. 1955 కన్నా ముందే నిర్మాణమై ఉండింది మట్టి వాడలోని 'శ్రీనివాస టాకీస్'. ఇదే ఆ తరువాత 'జై భారత్'గా మారింది. ఇందులో 1956లో పృథ్వీరాజ్‌కపూర్ నయాపైసా, గద్దర్, పఠాన్ వంటి నాటకాలు వేశారు. ఈ 'జై భారత్' కూడా కూల్చివేతకు గురై మరో రూపంలోకి మారిపోయింది. తర్వాత 'జెమినీ టాకీస్' వచ్చింది. అనంతరం 'రామ్‌లక్ష్మణ్' థియేటర్, తరువాత 'దేవి', రామన్నపేటలో 'నవీన్' థియేటర్ వచ్చాయి. 'దుర్గాటాకీస్' నిర్మాణమై కొద్ది కాలానికి "రామయ్య టాకీస్"గా పేరు మార్పుకు గురైంది. ఈ క్రమంలో ములుగు రోడ్డు వద్ద "కృష్ణా టాకీస్" నిర్మాణమైంది. ఇందులో కేవలం హిందీ సినిమాలు మాత్రమే ప్రదర్శించేవారు.

ఇక కాజీపేటలో భవాని, మినీభవాని టాకీస్‌లు నిర్మాణం జరుపుకున్నవి. హన్మకొండలోని శ్రీదేవి థియేటర్‌ని రామానాయుడు వాళ్ళు కొని ఏషియన్ సినిమాస్‌గా మల్టిప్లెక్స్ కాంప్లెక్స్‌గా పునర్నిర్మించారు.

1982 నాటికి వరంగల్ జిల్లాలో ఉన్న సినిమా థియేటర్లు శ్రీ దుర్గా కళామందిర్, కాకతీయ, కాకతీయ పిక్చర్ ప్యాలేస్, కృష్ణ కళామందిర్, లక్ష్మీటాకీస్, నవీన్ థియేటర్, శ్రీనివాస పిక్చర్ ప్యాలేస్, రామాటాకీస్, సరోజ్ టాకీస్, వెంకట్రామ కళామందిర్ (వరంగల్), జయసుజన టాకీస్ (అడివి నల్లబల్లి), దుర్గా టాకీస్, వీరభద్ర కళామందిర్ (చేర్యాల్), లక్ష్మీటాకీస్ (దోర్నకల్), రామకృష్ణా టూరింగ్ టాకీస్ (ధర్మసాగర్), గీతా టూరింగ్ టాకీస్ (ఎల్లంద), మల్లిఖార్జున టాకీస్ (ఐనోల్ ), జయలక్ష్మీ నరసింహ టాకీస్, రవి థియేటర్, కవితా మాధవి పిక్చర్ ప్యాలేస్ (ఘనపూర్), శ్రీనివాస టాకీస్ (ములుగు), వేంకటేశ్వర టాకీస్ (ఎ.ఘనపూర్), శ్రీ వెంకటరమణ టూరింగ్ టాకీస్, శ్రీరామ టాకీస్ (గోవిందరావుపేట), జి.ఆర్.టాకీస్, అలంకార్ టాకీస్, శ్రీ విజయా టాకీస్ (హన్మకొండ), అశోక్ టూరింగ్ టాకీస్ (ఎంగుల గడ్డ), సరస్వతీ టూరింగ్ టాకీస్ (హసన్‌పర్తి), అశోక్ టూరింగ్ టాకీస్ (జాడికల్), రాజశ్రీ టాకీస్, శ్రీలక్ష్మీ కళామందిర్ (జనగాం), శ్రీ వేంకటేశ్వర టాకీస్ (జూకాల్), శ్రీరామ టాకీస్ (కే సముద్రం), అశోక్ టాకీస్ (కొత్తకొండ), భవానీ పిక్చర్ ప్యాలేస్ (కాజీపేట), రవీంద్ర టాకీస్, లక్ష్మీ కళామందిర్, శ్రీనివాస కళామందిర్ (మహబూబాబాద్), రామకృష్ణా టాకీస్ (మంగపేట), నవీన్‌టాకీస్ (మునిపాడు), శ్రీవెంకటేశ్వర టాకీస్, వీరభద్రా టాకీస్ (ముల్కనూర్), వెంకటేశ్వర కళామందిర్ (మోగులపల్లి), శ్రీ దుర్గా కళామందిర్ (మెట్పాడ), జయలక్ష్మీ టాకీస్, రామ్‌రాజ్ కళామందిర్ (నరసంపేట), శంకర్ టూరింగ్ టాకీస్ (నెక్కొండ), ఉదయశ్రీ టూరింగ్ టాకీస్ (పాలకుర్తి), పూర్ణా టాకీస్, భవానీ టాకీస్ (పార్కల్), లక్ష్మీ టాకీస్, సంగం ఓపెన్ ఎయిర్ థియేటర్ (సంగం), శ్రీ వెంకటేశ్వర టాకీస్ (సోముడి), రంగ మహాల్ (పసర), శ్రీరామ టూరింగ్ టాకీస్ (శ్యామ్‌పేట), శ్రీ వేంకటేశ్వర కళామందిర్ (తొర్రూరు), ఇందిర ఓపెన్ ఎయిర్ థియేటర్ (వర్ధన్నపేట) మొత్తం 58 సినిమా టాకీసులు ఉండినవి. కాగా 2016 నాటికి వీటిలో కాలక్రమంలో తెరమరుగై వివిధ రూపాల్లో మారిపోయినవి. మారిపోగా కొత్తగా చేరిన వాటితో కలిపి సుమారు యాభై ఉన్నాయి.

## వరంగల్ జిల్లా థియేటర్లు - 2016

**వరంగల్:-** రామ్, దేవి, సుశీల్, సునీల్, వెంకట్రామ, రాధిక, లక్ష్మణ్, జెమిని, జెమినీ మయూరి, రామకృష్ణ

**హన్మకొండ :-** ఏషియన్ సినిమాస్, అమృత మందిర్, అశోక్, విజయ

**కాజిపేట:-** శాంభవి,భవాని

**డోర్నకల్ : -** లక్ష్మి

**మహబూబాబాద్: -** శ్రీనివాస, లక్ష్మీ, కళామందిర్, ముకుంద్, వెంకట్రామ

**మరిపేడ:-** లక్ష్మి, వెంకటేశ్వర, శాంతి, వెంకటరామ

**భూపాలపల్లి : -** ఆనంద్, ఊర్వశి

**ములుగు : -** తిరుమల

**పరకాల : -** జయడిలక్స్, కాకతీయ, నటరాజ్

**స్టేషన్ ఘనాపూర్ :-** మహాలక్ష్మి, కళామందిర్, కృష్ణకళామందిర్

**జనగామ:-** దేవి 70ఎం.ఎం., స్వర్ణకళామందిర్, కృష్ణకళామందిర్

**చేర్యాల : -** బాలాజి

**నర్సంపేట: -** అరవింద, రాంరాజ్, జయశ్రీ

**ఏటూరు నాగారం: -** శ్రీ వెంకటేశ్వర

**నెక్కొండ : -** సూర్య కళామందిర్

**పస్రా :-** మెహర్‌రంగా

**తొర్రూరు:-** అశ్వనీకళామందిర్, రామకృష్ణా, వేంకటేశ్వర కళామందిర్

**పాలకుర్తి:-** తిరుమల

**హసన్‌పర్తి:-** నారాయణ కళామందిర్, అశోక్ కళామందిర్

**ఫరహత్ దక్కన్ టూరింగ్ టాకీస్**

నిజామాబాద్‌లో సినిమా థియేటర్లకు 80 ఏండ్ల చరిత్ర ఉంది. మొదటి సినిమా థియేటర్ పర్మినెంట్‌ది 1936లో నిర్మాణం జరుపుకున్నది. దాని పేరు "ఫరహత్". అయితే దీనికి ముందు "దక్కన్ టూరింగ్ టాకీస్" అనే టూరింగ్ టాకీస్ ఒకటుండేది. "ఇది కొంత కాలం తరువాత 'గోపీ కళామందిర్'గా పేరును మార్చుకుని 1955 నాటికి మూతపడి కాలగర్భంలో కలిసిపోయిందని" నిజామాబాద్ ప్రాంతంలో చాలా సినిమా థియేటర్‌లకు మేనేజర్‌గా వ్యవహరించిన మేకా రామస్వామి పేర్కొన్నారు.

'ఫరహత్' ఉన్న కాలంలోనే 1939లో 'నిజామాబాద్ పిక్చర్ ప్యాలేస్' వచ్చింది. ఇదే ప్రస్తుతం 'శ్రీదేవి'గా మారింది. 1969లో "విజయా టాకీస్" వచ్చింది. ఇదే 'మోహన్ టాకీస్'గా మారింది. ప్రస్తుతం 'తిరుమల చిత్ర మందిర్'గా కొనసాగుతున్నది. ఈ కాలంలోనే తడకల టాకీస్ "రమేష్" వచ్చింది. దీని తరువాత "ప్రభాత్" నిర్మాణమైంది. ఈ క్రమంలో అశోక్ టాకీస్ వచ్చింది.

1985 నాటికి జయలక్ష్మి టాకీస్ 1988లో నట్‌రాజ్ తరువాత 'రాజరాజేంద్ర', 'ఉషామయూరి' టాకీస్‌లు ఏర్పడినవి. ఈ ఉషామయూరి'నే తరువాత మూడు స్క్రీన్లతో ఉషా కాంప్లెక్స్‌గా మారింది. 1990ల్లో 'రాధాకృష్ణ' టాకీస్ వచ్చి కొద్ది కాలం తరువాత మూతపడింది. నిజామాబాద్ చుట్టుపక్కన పట్టణాల్లో కూడా 1940 నాటికి టూరింగ్, తడకల టాకీసులు ఏర్పడి ప్రజలకు సినిమాలు పరిచయమైనవి. 1940ల నాటికే బోధన్‌లో 'దిల్‌కుష్' టాకీస్ కట్టారు.

'దిల్‌కుష్' తరువాత శ్రీరామ హనుమాన్, క్రిస్టల్ ప్యాలేస్, అనిల్, శ్రీనివాస, వేంకటేశ్వర థియేటర్లు వచ్చినవి. కామారెడ్డిలో 1952లో కమల్ టాకీస్ కట్టారు. తరువాత 'నాజ్', 'శాంతి', 'ప్రియ డిలక్స్' 70 ఎం.ఎం., 30 ఎం.ఎం. థియేటర్లు వచ్చినవి. బాన్సువాడలో రాజ రాజేశ్వరి, వెంకటేశ్వరి, మహేశ్వరి టాకీస్‌లు కట్టారు. నిజామాబాద్ 'ప్రభాత్', బోధన్ 'దిల్‌కుష్' టాకీస్‌లలో 1957లో "సువర్ణ సుందరి సినిమా 25 వారాలు ఆడి సిల్వర్ జూబిలి జరుపుకున్నది.




ఈ నేపథ్యంలో మేకా రామస్వామి పేర్కొన్నట్లుగా నిజామాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో నిర్మాణమైన తొలినాటి థియేటర్ల వివరాలు ఇలా ఉన్నవి. ఎల్లారెడ్డి – లక్ష్మి, నవీపేట–లక్ష్మీపిక్చర్ ప్యాలెస్, బిక్కనూరు – అంజలి, రేంజల్ – అన్నపూర్ణ, కోటగిరి – వెంకటేశ్వర, వర్ని – వేంకటేశ్వర, బిచ్కుంద – మహేశ్వరి, చిరికొండ – శ్రీనివాస, నందిపేట – నటరాజ్, కృష్ణా, చందూర్ – వేంకటేశ్వర, ఎడపల్లి – రాజేశ్వరి, గాంధారి – శ్రీశ్రీనివాస, దోమకొండ – వేంకటేశ్వర, పోతంగల్ – రామకృష్ణ, ధర్మారం – లక్ష్మి, డిచిపల్లి – వేంకటేశ్వర, మోర్తాడు – వేంకటేశ్వర, కమ్మర్‌పల్లి – లక్ష్మినరసింహ, బాల్కొండ – సాయిబాబా, దర్పల్లి – ఓపిన్ ఎయిర్ థియేటర్, భీమగల్ – లక్ష్మీనరసింహ, వేంకటేశ్వర థియేటర్లు వెలసినవి.

అయితే 1982 నాటికి వీటిలో కొన్ని ఉన్నవి. మరికొన్ని మూతపడగా, ఇంకొన్ని కొత్త టాకీస్‌లు వచ్చి చేరినవి. వాటి వివరాలు వరుసగా, నిజామాబాద్ – అశోక్‌టాకీస్, జయలక్ష్మి, పిక్చర్ ప్యాలేస్, మోహన్, నటరాజ్ డీలక్స్, ప్రభాత్, రమేష్, విజయ టాకీస్, ఆర్మూర్, జవహర్, బాలాజీ, బాల్కొండ – న్యూతాజ్ మహల్ టాకీస్, బిర్కూర్ – కృష్ణా టాకీస్, బాన్సువాడ – రాజరాజేశ్వరి, వేంకటేశ్వర, బిచ్కుంద – శ్రీరామటాకీస్, బోధన్ – శ్రీరామ హనుమాన్, రమేష్, దిల్‌కుష్, ధర్మారం – అనురాధా సినిమా, దోమకొండ – స్వామి, కోటగిరి– లీలామహల్, కామారెడ్డి – నాజ్, కమల్, శాంతి, కమ్మర్‌పల్లి– హనుమాన్, మోర్తాడ – రమేష్, నాగిరెడ్డిపేట – వెంకటేశ్వర, నందిపేట – నటరాజ్, నవీపేట – లక్ష్మీటాకీస్, పోచంపాడు – కమల్‌టాకీస్, పిట్లం –శ్రీనివాసమహల్, రంజాల్ – అన్నపూర్ణా, రుద్రూర్ – అలంకార్, శక్కర్‌నగర్ – క్రిస్టల్ ప్యాలేస్, వర్ని – వెంకటేశ్వర టాకీస్, వేల్పూరు – వెంకటేశ్వర, ఎల్లారెడ్డి – ప్రిమియర్ టాకీస్ నెలకొని ఉన్నది. అప్పటికి వీటి సంఖ్య 39.

**కొస మెరుపు :** నిజామాబాద్ జిల్లాకు చెందిన దిల్‌రాజుగా పిలువబడే వెంకటరమణారెడ్డి ఇప్పుడు తెలుగు సినిమా రంగంలో పేరున్న నిర్మాత. ఎన్నో సూపర్ హిట్ చిత్రాలు తీశారాయన. దిల్, బొమ్మరిల్లు, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, ఆర్య, భద్ర, సుబ్రమణ్యం ఫర్ సేల్, కేరింత వంటి సినిమాలు వాటిలో కొన్ని. తెలంగాణలో కొన్ని సినిమా టాకీసులు వీరే లీజుకు తీసుకుని నడిపిస్తున్నారు.

– హెచ్. రమేష్‌బాబు,
m: 7780736386
e: hrameshbabu5@gmail.com

### నిజామాబాద్ జిల్లాలో థియేటర్లు - 2016

**నిజాంబాద్ టౌన్ :–** తిరుమల, నటరాజ్, లలితా మహల్, విజయ్, దేవి, శ్రీదేవి, అశోక్, ఉషా మల్టిప్లెక్స్ (1,2,3 స్క్రీన్లు)
**ఆర్మూర్ :–** బృందావన్, వేంకటేశ్వర, రాజారమేశ్
**భీమ్‌గల్ :–** బృందావన్, వేంకటేశ్వర, రాజారమేశ్
**బాన్సువాడ :–** వేంకటేశ్వర, మహేశ్వరి
**బోధన్ :–** వేంకటేశ్వర, శ్రీనివాస
**బిచ్కుంద :–** పరమేశ్వరి
**పిట్లం :–** వెంకటేశ్వర
**కామారెడ్డి :–** ప్రియ, ప్రియ డిలక్స్, దర్శన్ డిలక్స్, శాంతి
**దర్పలి:–** వెంకటేశ్వర
**ఎల్లారెడ్డి :–** లక్ష్మీటాకీస్



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే

ఆరు దశాబ్దాల ఆరాటం.. నాలుగున్నర దశాబ్దాల కొట్లాట.. 1500 మందికి పైగా బలిదానాలు.. ఊరూవాడా ఒక్కటై ఢిల్లీ పాలకులను ఎదిరించి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నవశకానికి నాంది పలుకుతూ... జర్నలిస్టులు కూడా తమవంతు పాత్ర పోషించారు. సీమాంధ్ర ఆధిపత్య మీడియా సంస్థల్లో తీవ్ర నిర్బంధంలోనూ పనిచేస్తూ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో మమేకమైన కలం వీరులు.... స్వీయ అస్తిత్వాన్ని చాటుకునేందుకు జర్నలిస్టుల జాతర వేదికగా నిలిచింది. జర్నలిస్టుల పక్షాన, వారి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా తెలంగాణ సాధనే ధ్యేయంగా ఉద్యమించిన జర్నలిస్టుల నేతృత్వంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు – టీయూడబ్ల్యూజే పురుడు పోసుకుంది.

ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు జరిగిన ప్రజా ఉద్యమాల్లో తెలంగాణ రాష్ట్రం కోసం సాగిన పోరాటం ప్రత్యేకమైనది. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు భుజంభుజం కలిసి శక్తివంతమైన శత్రువును లొంగతీసిన తీరు అసాధారణం. ప్రజా ఉద్యమాలకు కొత్త మార్గాలను చూపిన తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్టుల పాత్ర విశిష్ట స్థానం. ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను ఏకతాటిపై నడిపించిన ఘనత జర్నలిస్టులదే అని చెప్పుకోవచ్చు. మలిదశ ఉద్యమంలో ప్రతి మలుపులో, ప్రతి ఘట్టంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిది.

2001లో కరీంనగర్‌లో టీఆర్ఎస్ తొలి బహిరంగ సభ నుంచి పార్లమెంటులో తెలంగాణ బిల్లు పాసయ్యే వరకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది జర్నలిస్టులే. తెలంగాణ జర్నలిస్టుల్లో ఆత్మగౌరవాన్ని నింపుతూ వారి హక్కులు, రక్షణ సౌకర్యాల కల్పన కోసం అన్ని జిల్లాల్లో ప్రథమ మహాసభలు నిర్వహించి రాష్ట్ర మహాసభల్లో కార్యాచరణ రూపొందించింది టీయూడబ్ల్యూజే. మన రాష్ట్రం – మన యూనియన్ లక్ష్యంగా అన్ని జిల్లాల్లో ప్రథమ మహాసభలు నిర్వహించింది. 2013లో టీయూడబ్ల్యూజే రిజిస్ట్రేషన్ చేయించి జర్నలిస్టుల మధ్య యూనియన్‌ను ప్రకటించింది. జర్నలిస్టులందరిని ఒకే గొడుగు కిందకు తెచ్చి ఐక్యతను చాటుకోవడానికి టీయూడబ్ల్యూజే కృషి చేసింది.

ఇంతకాలం రాష్ట్ర జర్నలిస్టు యూనియన్లలో ఏకచత్రాధిపత్యం వహిస్తున్న అధిపత్య సంఘానికి ప్రత్యామ్నాయ శక్తిగా టీయూడబ్ల్యూజే దూసుకు వస్తోందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. బాగ్‌లింగపల్లిలోని ఆర్టీసీ కళ్యాణమండపంలో మే 20 న నిర్వహించిన టీయూడబ్ల్యూజే హెచ్ – 143 రాష్ట్ర ప్రతినిధుల మహాసభకు ప్రెస్ క్లబ్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, జిల్లాల రిపోర్టర్లులతో పాటు డెస్క్, వీడియో, కెమెరా, ఇతర విభాగాల సుమారు 4 వేల మంది జర్నలిస్టులు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా ప్రెస్ అకాడమీ చైర్మన్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( టీయూడబ్ల్యూజే ) అధ్యక్షుడు అల్లం నారాయణ, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడు పల్లె రవికుమార్, కోశాధికారి మారుతిసాగర్, నగరశాఖ అధ్యక్షుడు యోగానంద్, టీపీజేఏ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు ఎంవీ రమణారావు, ఇస్మాయిల్, కొండల్‌రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో 12 వేల మందికి మాత్రమే అక్రెడిటేషన్లు ఉండగా తెలంగాణ రాష్ట్రంలో 17 వేల మందికి అక్రెడిటేషన్లు అందించిన ఘనత టీయూడబ్ల్యూజేకే దక్కిందన్నారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రెడిటేషన్లు ఇచ్చినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియాకు చట్టబద్ధత కల్పించడం, చిన్న, ఉర్దూ పత్రికల పరిరక్షణ, కనీస వేతనాలు అమలు, ఇండ్ల స్థలాల సాధన, ఇతర సమస్యల పరిష్కారానికి కార్యాచరణ అంశాలపై చర్చిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20 వేల మంది జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని, ఈ విషయంపై ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా హామీ ఇచ్చారని చెప్పారు. జర్నలిస్టుల అనేక సమస్యలు పరిష్కరించుకుంటూ వస్తున్నామని, ఎన్నికల కంటే ముందే ఇండ్ల విషయం తేలుస్తామని తెలిపారు. ఇప్పటివరకు మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు మాత్రమే

సహాయం చేయడం జరిగిందని... కానీ, ఇప్పటినుంచి బతికి ఉన్న జర్నలిస్టుల కుటుంబాలకు సహాయం చేయడానికి ప్రణాళిక చేస్తున్నామన్నారు.

టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ మాట్లాడుతూ.. గతంలో అక్రెడిటేషన్లులకు ఒక సంఘం మాత్రమే ఉండేదని, వాళ్ల వారికి మాత్రమే అక్రెడిటేషన్లులను ఇచ్చుకునేవారని, టీయూడబ్ల్యూజే ఏర్పడి దీనికి అల్లం నారాయణ అధ్యక్షత వహించిన తర్వాత రాష్ట్రంలో ఉన్న మూడు ప్రధాన సంఘాలతో పాటు అందరికి అక్రెడిటేషన్లు ఇవ్వడానికి టీయూడబ్ల్యూజే కృషి చేసిందని గుర్తు చేశారు. అలాగే జర్నలిస్టుల సమస్యలపై అధికారులతో చర్చించడం, దానిని పరిష్కారించడం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత అల్లం నారాయణ నేతృత్వంలో ఇప్పటివరకు 2.50 కోట్ల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించడం జరిగిందని, ఈ ఘనత టీయూడబ్ల్యూజేకే దక్కిందన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులపై జరిగిన దాడులపై కూడా టీయూడబ్ల్యూజే పోరాటం చేసి, వాటికి పరిష్కారం చూడటం కూడా జరిగిందన్నారు.

టీయూడబ్ల్యూజే డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.వి.రమణ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం తీవ్రంగా జరుగుతున్న సమయంలో సకల జనుల సమ్మె ప్రారంభమైయిన రోజున జర్నలిస్టుల సమస్యలను పరిష్కారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్‌గా ప్రారంభించడం జరిగిందన్నారు. ఆరోజు నుంచి ఈరోజు వరకు తెలంగాణ జర్నలిస్టు ఫోరం తో కలిసి పనిచేస్తూ ఆ తర్వాత ఏర్పడిన టీయూడబ్ల్యూజేనే అనుబంధంగా కొనసాగుస్తూ వస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షునిగా సయ్యద్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శిగా ఏ.రమణ, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా ఎం.యుగంధర్, ట్రెజరర్‌గా పాండు రంగారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలో పూర్తిస్థాయి రాష్ట్ర కమిటీలు, జిల్లా కమిటీలను ఏర్పాటును పూర్తిచేస్తామని రమణ స్పష్టం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు తీర్మానాలను ప్రవేశపెట్టగా, సభ్యులు బలపరిచారు.



**జర్నలిస్టుల సమస్యలపై పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదం :**

1. రాష్ట్రంలో అర్హత గల జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి.
2. గ్రామీణ జర్నలిస్టులకు 120 గజాలు, లేదా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పట్టణ జర్నలిస్టులకు 200 గజాలు లేదా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, హైదరాబాద్ జర్నలిస్టులకు 300 గజాలు లేదా ట్రిబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి.
3. జర్నలిస్టుగా 20 ఏళ్ల సర్వీసు లేదా 60 ఏళ్లు నిండిన వారందరికీ రూ.10 వేల పింఛన్ పథకం అమలు చేయాలి.
4. హైదరాబాద్‌లో జర్నలిస్టుల సంక్షేమభవన్ నిర్మించి ఇవ్వాలి.
5. మీడియా కార్యాలయాల్లో మహిళా జర్నలిస్టులకు ప్రసూతి సెలవులు, డే-కేర్ సెంటర్లు ఏర్పాటుచేయాలి. రాత్రి విధులు ముగిసిన తర్వాత డ్రాపింగ్ సదుపాయం కల్పించాలి.
6. ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను అమలు చేయాలి.
7. సంస్థలతో పనిలేకుండా సీనియర్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇవ్వాలి.
8. అక్రిడేషన్ లేనివారికి కూడా హెల్త్ కార్డులు ఇవ్వాలి.
9. పని ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టుల ఆరోగ్య దృష్ట్యా యాజమాన్యాలు వారానికి రెండు రోజులు సెలవులు అమలు చేయాలి.
10. జర్నలిస్టులకు కనీస వేతన చట్టాలు అమలు చేయించాలి.
11. రాష్ట్రంలో అన్ని ప్రెస్‌క్లబ్‌లను మీడియా అకాడమీ స్వాధీనం చేసుకోవాలి.
12. ప్రకటనల ద్వారా వచ్చే రాబడిలో 2శాతం కనీస వేతనాలకు జమ చేయాలి.
13. ఎలక్ట్రానిక్ మీడియాకు చట్టబద్ధత కల్పించాలి.

**టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులుగా సయ్యద్ ఇస్మాయిల్ :**


తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా సయ్యద్ ఇస్మాయిల్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ మీడియా చట్టబద్ధత కోసం పోరాడుతానని తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్‌ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన వారికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు.

- కట్టా ప్రభాకర్
m : 8106721111
e : akumarkatta@gmail.com

# షటిల్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్ కాపిటల్ - హైదరాబాద్

క్రికెట్, ఫుట్‌బాల్ వంటి క్రీడలతోపాటు మన హైదరాబాద్‌కు ప్రపంచ ఖ్యాతినార్జించి పెట్టిన మరో ముఖ్య క్రీడ ... బ్యాడ్మింటన్. క్రికెట్‌లో అప్పుడపుడు అద్భుతమైన క్రీడాకారులు తెరపైకి వస్తున్నప్పటికీ, ఫుట్‌బాల్‌కు స్వర్ణయుగాన్ని చూసిన దక్కన్ ప్రాంతం నుంచి మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులు రాలేదు. ఇక షటిల్ బ్యాడ్మింటన్ విషయంలో... వర్ధమాన క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై భారత్ సత్తా చాటుతూ... హైదరాబాద్ ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో అంతర్జాతీయ పోటీల్లో వచ్చిన చాలా మంది షటిల్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్ పుల్లెల గోపీచంద్ వంటి మాజీ ఆటగాళ్ల చేతుల్లో రాటుదేలినవారే. అయితే.. పుల్లెల గోపీచంద్ గురించి చెప్పుకునే ముందు... హైదరాబాద్‌లో ఆటగాళ్లకు షటిల్ బ్యాడ్మింటన్‌లో గురువులుగా కీర్తించబడే సయ్యద్ మహ్మద్ ఆరిఫ్, మీర్ మహబూబ్ అలీ గురించి తప్పకుండా ప్రస్తావించాలి. వర్ధమాన క్రీడాకారులతో పాటు అనేక మంది సినీ, రాజకీయ ప్రముఖులు, విద్యార్థులు వీరి వద్ద బ్యాడ్మింటన్ పాఠాలు నేర్చుకున్నారు.

### సయ్యద్ మహ్మద్ ఆరిఫ్



జనవరి 24,1944న హైదరాబాద్‌లో మహ్మద్ ఆరిఫ్ జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి బీఎస్సీ చేశారు. స్కూల్, కాలేజీ తొలి రోజుల్లో క్రికెట్‌పై ఆసక్తి ఉన్నప్పటికీ... ఆ తర్వాతి కాలంలో బ్యాడ్మింటన్‌లో ప్రావీణ్యం సాధించారు. అక్కడి నుంచి అనేక ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్ షిప్‌లతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు చాలా జాతీయ టోర్నమెంట్‌లలో ప్రాతినిధ్యం వహించారు.

పాటియాలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ నుంచి బ్యాడ్మింటన్ కోచింగ్‌లో డిప్లొమా పొందారు. 1974లో నేషనల్ ప్యానెల్ ఆఫ్ బ్యాడ్మింటన్ కోచెస్‌లో చేరిన ఆయన... ఆ తర్వాతి కాలంలో 1997లో నేషనల్ చీఫ్ బ్యాడ్మింటన్ కోచ్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ సాధించిన రెండో ఆటగాడికి ఖ్యాతిగాంచిన పుల్లెల గోపీచంద్ వంటి క్రీడాకారులతోపాటు పి.వి.వి. లక్ష్మి, గుత్తా జ్వాల, సైనా నెహ్వాల్ వంటి వర్ధమాన క్రీడాకారులకు ఆరిఫ్ శిక్షణ ఇచ్చారు. షటిల్ బ్యాడ్మింటన్ కోచింగ్‌లో ఆరిఫ్ సాబ్ చేసిన సేవలకుగాను.. 2000 సంవత్సరంలో ద్రోణాచార్యతోపాటు 2012లో పద్మశ్రీతో భారత ప్రభుత్వం సత్కరించింది.

### షటిల్ బ్యాడ్మింటన్ లెజండరీ కోచ్ - మీర్ మహబూబ్ అలీ



గుత్తా జ్వాల, శృతి కురియన్, సైనా నెహ్వాల్, పి.వి. సింధు వంటి వారు కెరీర్ ప్రారంభంలో మహబూబ్ అలీ దగ్గరే శిక్షణ పొందారు. షటిల్ బ్యాడ్మింటన్ ప్లేయర్స్‌ను తీర్చిదిద్దడమే పరమావధిగా మార్చుకున్న అలీ... ఏజీ ( అకౌంటెంట్ జనరల్) ఆఫీస్‌లో ఉద్యోగం చేశారు. సికింద్రాబాద్‌లో ఉన్న ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్ స్టేడియమ్‌లో మహబూబ్ అలీ బ్యాడ్మింటన్ అకాడమీ పేరుతో ఆయన శిక్షణ ఇచ్చారు. ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చే సమయంలో నిజాం క్లబ్ నుంచి సికింద్రాబాద్ బ్యాడ్మింటన్ రైల్వే కోర్ట్స్ వరకు మహబూబ్ అలీ సైకిల్‌పైనే వెళ్లేవారు. కొంతకాలం తర్వాత ఆయన వద్ద శిక్షణ పొందినవారు ఒక మోటర్ సైకిల్ కొనిచ్చారు. బ్యాడ్మింటన్ శిక్షణ ఇవ్వడంలో విశేషమైన ప్రతిభ కలిగిఉన్నప్పటికీ... మహబూబ్ అలీ ఏనాడు కూడా డబ్బుకు ఆశపడలేదు. ఆట నేర్పించడమే జీవితంగా ఆయన బతికారు. తన దగ్గర శిక్షణ పొందిన విద్యార్థులు సాధించే పేరు ప్రఖ్యాతలే తన సంపద అని అలీ అనేక సందర్భాల్లో చెప్పేవారు. బ్యాడ్మింటన్‌నే జీవిత భాగస్వామిగా ఎంచుకున్న అలీ, పెళ్లి కూడా చేసుకోలేదు. ఆయన చేతుల మీదుగా ఎందరో క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై రాణించినప్పటికీ... ఒక అద్భుతమైన కోచ్‌గా ఆయనకు దక్కాల్సిన గౌరవం దక్కలేదని క్రీడాభిమానులు అభిప్రాయపడుతుంటారు. తన చివరి రోజుల్లో సొంత చెల్లి ఇంట్లో తనువు చాలించారు.

### పుల్లెల గోపీచంద్



షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రకాశ్ పదుకునె తర్వాత... భారత ఖ్యాతిని మరోసారి విదేశాల్లో చాటిచెప్పిన ఘనత పుల్లెల గోపీచంద్ సొంతం. నవంబర్ 16, 1973లో ప్రకాశం జిల్లాలో జన్మించిన గోపీచంద్ విద్యాభ్యాసం, బ్యాడ్మింటన్ శిక్షణ అన్నీ హైదరాబాద్‌లోనే జరిగాయి.

బ్యాడ్మింటన్‌లో శిక్షణకు ప్రకాశ్ పదుకునె వద్ద చేరే ముందు... ఆరిఫ్ సాబ్ వద్దనే గోపీచంద్ బ్యాడ్మింటన్ పాఠాలు నేర్చుకున్నాడు. 1996లో తొలిసారిగా నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను గోపీచంద్ గెలిచాడు. 2000 సంవత్సరం వరకు ప్రతీ ఏటా ఛాంపియన్‌షిప్‌లు గెలుస్తూనే ఉన్నాడు.

ఆ తర్వాత... 2001లో ప్రెస్టీజియస్ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ సాధించిన రెండో భారతీయ ఆటగాడిగా గోపీచంద్ రికార్డు సృష్టించాడు. ఈ ఛాంపియన్‌షిప్‌ను ప్రకాశ్ పదుకునె 1980లో సాధించాడు. 1999లో అర్జున అవార్డు, 2001లో రాజీవ్ ఖేల్ రత్నా అవార్డు, 2005లో పద్మశ్రీ అవార్డు, 2009లో ద్రోణాచార్య అవార్డు, 2014లో పద్మభూషణ్ అవార్డుతో భారత

ప్రభుత్వ సత్కరించింది. కాలిగాయంతో బ్యాడ్మింటన్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత... గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వహిస్తున్నారు. సైనా నెహ్వాల్, పి.వి. సింధు వంటి యువ సంచలన షట్లర్లు... గోపీ చంద్ అకాడమీలోనే రాటుదేలారు.

### గుత్తా జ్వాల



పుల్లెల గోపీచంద్ తర్వాత ... బ్యాడ్మింటన్‌లో సంచనాలు సృష్టించిన క్రీడాకారిణి గుత్తా జ్వాల.

డబుల్స్ స్పెషలిస్ట్‌గా పేరు గాంచిన లెఫ్ట్ హ్యాండెడ్ బ్యాడ్మింటన్ ప్లేయర్ జ్వాల. సింగిల్, డబుల్స్ తోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆడటం ఈమె ప్రత్యేకత. 14 సార్లు నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ సాధించిన ఘనత గుత్తా జ్వాల సొంతం. సెప్టెంబర్ 7, 1983లో మహారాష్ట్ర జన్మించిన గుత్తా జ్వాల, తండ్రి ఉద్యోగరీత్యా వారి కుటుంబం హైదరాబాద్ చేరుకుంది. ఈమె తండ్రి తెలుగువారు కాగా, తల్లి చైనీ మహిళ. ఆరవ ఏట బ్యాడ్మింటన్ చేతపట్టిన జ్వాల అండర్ -13లో మిని నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ సాధించింది. శృతి కురియన్‌తో డబుల్స్ జోడీ కుదిరి...వరుసగా ఏడేళ్లపాటు వారి విజయాల పరంపర కొనసాగింది. 2002 నుంచి 2008 మధ్య వరుసగా ఉమెన్ డబుల్స్‌లో వీరిద్దరు విజయం సాధించారు. 2010లో కామన్వెల్త్ గేమ్స్‌లో తన కొత్త జోడీ అశ్విని పొన్నప్పతో కలిసి గోల్డ్ మెడల్ సాధించింది. 2011లో వరల్డ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో బ్రోంజ్ మెడల్‌తో.. భారత్ బ్యాడ్మింటన్‌లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించింది. సహ క్రీడాకారుడు చేతన్ ఆనంద్‌తో గుత్తా జ్వాల చేసుకున్న ప్రేమ వివాహం ఎక్కువ కాలం నిలవలేదు. 2016 ఉబెర్ కప్‌లో బ్రౌంజ్, 2015లో అశ్విని పొన్నప్పతో కలిసి కెనెడా ఓపెన్, 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో అశ్వినితో సిల్వర్ మెడల్ సాధించింది. అయితే డబుల్స్ అనేక విజయాలు సాధించిన గుత్తా జ్వాల... సింగిల్స్‌లో మంచి ప్రదర్శన కనబరచక పోవడంతో.. అంతగా లైమ్‌లైట్‌లోకి రాలేకపోయింది. చాలా సందర్భాల్లో ఓపెన్‌గా మాట్లాడిన గుత్తా జ్వాల అనేక వివాదాల్లోనూ చిక్కుకుంది.

### సైనా నెహ్వాల్



పుట్టుకతో తెలంగాణకు చెందిన అమ్మాయి కానప్పటికీ.... హైదరాబాద్ బ్యాడ్మింటన్ పేజీల్లో తనకంటూ ప్రత్యేకత చాటుకుంటున్న క్రీడాకారిణి సైనా నెహ్వాల్. మార్చి 17, 1990లో హర్యానాలో సైనా నెహ్వాల్ జన్మించింది. తండ్రి ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు మారడంతో... సైనా నెహ్వాల్ ఇక్కడే బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందింది. 2006లో ఫిలిప్పీన్స్ ఓపెన్‌లో విజయంతో.. ఆ సిరీస్ గెలిచిన తొలి భారతీయ మహిళగా నెహ్వాల్ గుర్తింపు సాధించింది. 2008 ఒలింపిక్స్‌లో క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరడమే కాకుండా ప్రపంచ జూనియర్ ఛాంపియన్ షిప్ సాధించిన తొలి మహిళా క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. అక్కడి నుంచి సైనా నెహ్వాల్ జైత్రయాత్రలో 21 ఇంటర్నేషనల్ టైటిల్స్ సాధించగా ... వీటిలో 10 సూపర్ సిరీస్ టైటిళ్లు కావడం విశేషం. ఈ ఏడాది జరిగిన సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఒలింపిక్ మెడల్ విన్నర్ పి.వి. సింధుపై గెలుపు సాధించింది.

### ఒలింపిక్ మెడల్ విన్నర్ - పి.వి. సింధు



భారత షటిల్ బ్యాడ్మింటన్‌లో యువ సంచలనంగా అందరిదృష్టిని తనవైపు తిప్పుకున్న యువ క్రీడాకారిణి పి.వి. సింధు. 2016 రియో ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించి... భారత బ్యాడ్మింటన్ చరిత్రలోనే తనకంటూ ఓ ప్రత్యేకతను సృష్టించుకుంది. 2012 ఒలింపిక్స్‌లో సైనా నెహ్వాల్ కాంస్య పతకం సాధించిన తర్వాత... మళ్లీ బ్యాడ్మింటన్‌లో రజతపతకం సాధించిన క్రీడాకారిణిగా దేశవ్యాప్తంగా క్రీడాభిమానుల దృష్టిని పి.వి.సింధు ఆకర్షించింది. జులై 5, 1995న హైదరాబాద్‌లో జన్మించిన పి.వి. సింధు తల్లిదండ్రులిద్దరూ వాలీబాల్ క్రీడాకారులు. పుల్లెల గోపీచందర్ స్ఫూర్తితో బ్యాడ్మింటన్ ఎంచుకున్న సింధు... ఆయన వద్దనే శిక్షణ తీసుకుని అత్యుత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు సాధించింది. 2009లో కొలంబోలో జరిగిన సబ్ జూనియర్ ఏసియన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో బ్రౌంజ్ మెడల్ సాధించి షటిల్ బ్యాడ్మింటన్ విజయాల పరంపరను ప్రారంభించింది. 2014లో అర్జున అవార్డు, 2015లో పద్మశ్రీ, 2016లో రాజీవ్ ఖేల్ రత్నా అవార్డులతో భారత ప్రభుత్వం సత్కరించింది. ప్రస్తుతం వరల్డ్ నెంబర్ 2 ర్యాంక్‌లో పి.వి. సింధు కొనసాగుతోంది.

-ఎం.డి.కరీం, m: 9618644771
e:karreemmd786@gmail.com

## పుస్తక పరిచయం

పుస్తక పరిచయం శీర్షిక ద్వారా వివిధ పుస్తకాలను పాఠకులకు పరిచయం చేసే ప్రయత్నం ఇది. ఈ వేదిక ద్వారా పాఠకులకు తమ పుస్తకాలను పరిచయం చేయాలనుకునే రచయితలు, ప్రచురణ సంస్థలు తమ పుస్తకాలు రెండు కాపీలను దిగువ చిరునామాకు పంపించవచ్చు. వీలు వెంట వాటిని ప్రచురిస్తాం. సమకాలీన సామాజిక అంశాలతో కూడిన కొత్త పుస్తకాలకు ప్రాధాన్యం. పుస్తకాలు పంపించాల్సిన చిరునామా:

TELANGANA RESOURCE CENTRE


**DECCAN LAND : "CHANDRAM"**
490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail: desk.deccan@gmail.com
www.deccanland.com

# నవాబోంకా జమానా - కార్ఖానోంకా ఖజానా

ప్రాంతం ఏదైనా ఆర్థికంగా, సాంకేతికంగా ముందడుగు వేయడంలో పరిశ్రమల పాత్ర కీలకం.. సమాజ సంక్షేమం పారిశ్రామిక అభివృద్ధితోనే సాధ్యమవుతుంది. అభివృద్ధి చెందిన దేశాలను పరిశీలిస్తే ఈ విషయం సృష్టమవుతుంది. భారతదేశంలో ఇనుము – ఉక్కు పరిశ్రమల స్థాపనతో ప్రారంభమైన పారిశ్రామికీకరణ క్రమంగా అన్ని రంగాలకు విస్తరించింది. రెండో పంచవర్ష ప్రణాళిక కాలం నుంచి పరిశ్రమలకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోంది. ''టీఎస్–ఐపాస్'' లాంటి నూతన విధానాలతో పారిశ్రామికీకరణకు వేగవంతంగా చేస్తూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది.

**హైదరాబాద్ సంస్థానంలో పరిశ్రమల అభివృద్ధి :**

కోస్తాంధ్ర, రాయలసీమలో ఎలాంటి ఫ్యాక్టరీలు లేనప్పుడే సుమారు 200 పరిశ్రమలు హైదరాబాద్ సంస్థానంలో ఉండేవి. వీటిలో చాలా మటుకు ప్రభుత్వ రంగంలో వుండేవి. కీ.శే. సురా ( సి.వి.సుబ్బారావు, ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్ర ఉపన్యాసకులు), మాటల్లో " హైదరాబాద్ సంస్థానంలో పారిశ్రామికీకరణ" అన్న తన పరిశోధనా పత్రంలో 1940కి ముందే హైదరాబాద్‌లో పారిశ్రామిక పురోగతి ఎలా ముందంజ వేసిందీ వివరించారు. ఒకవేళ ఈస్ట్ఇండియా కంపెనీ భారత దేశంలోకి రాకపోతే ఈ దేశంలోని చేనేత పరిశ్రమ బ్రిటన్‌లోని చేనేత పరిశ్రమల కన్నా అభివృద్ధి చెందేదని కారల్ మార్క్స్ చెప్పినట్లు, తెలంగాణా ఆంధ్ర ప్రాంతంలో విలీనం కాకపోతే తెలంగాణలోని పరిశ్రమలన్నీ ఈరోజు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందేవన్నది అక్షర సత్యం. ప్రపంచ బ్యాంకు, ఆంధ్ర వలస పాలకుల వలన అభివృద్ధికి నోచుకోలేదు సరికదా, ఉన్నవి కూడా మూతబడి కమీషన్ల కోసం అగ్గువసగ్గువకు అయినవారికి అమ్మివేయబడినాయి.




**నైజాం కాలంలో తెలంగాణలో పరిశ్రమల స్థాపన**

| | |
|---|---|
| 1871 | – సింగరేణి బొగ్గు గనులు |
| 1873 | – మొదటి స్పిన్నింగ్ మిల్లు |
| 1876 | – ఫిరంగుల ఫ్యాక్టరీ |
| 1876 | – ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ |
| 1910 | – సోడా ఫ్యాక్టరీ |
| 1910 | – బిరన్ ఫ్యాక్టరీ |
| 1916 | – దక్కన్ బటన్ ఫ్యాక్టరీ |
| 1919 | – వి.ఎస్.టి ఫ్యాక్టరీ |
| 1921 | – కెమికల్ లాబోరేటరీ |
| 1927 | – దక్కన్ గ్లాస్ ఫ్యాక్టరీ |
| 1929 | – డి.బి.ఆర్. మిల్స్ |
| 1931 | – అజంజాహి మిల్స్, వరంగల్ |
| 1932 | – ఆర్టీసీ స్థాపన |
| 1937 | – నిజాం షుగర్ ఫ్యాక్టరీ |
| 1939 | – సిర్పూర్ పేపర్ మిల్లు |
| 1941 | – గొల్కొండ సిగరేట్ ఫ్యాక్టరీ |
| 1942 | – హైదరాబాద్ స్టేట్ బ్యాంకు |
| 1942 | – హైదరాబాద్ అల్విన్ మెటల్స్ |
| 1943 | – ప్రాగా టూల్స్ |
| 1946 | – హైదరాబాద్ అస్బెస్టాస్ |
| 1947 | – హైదరాబాద్ లామినేషన్ ప్రొడక్ట్స్ |

**నిజాం నవాబుల హయాంలో పరిశ్రమలు-**

నిజాం సంస్థానంలో పరిశ్రమల ఏర్పాటు, రవాణా సౌకర్యాల అభివృద్ధి పెద్ద ఎత్తున జరిగిందన్నది వాస్తవం. ఇది చరిత్రలో కనిపించే సత్యం. హైదరాబాద్ ప్రాంతంలో బొంబాయి నుంచి పెట్టుబడిదారులు వచ్చారు. అలాగే బ్రిటిషు వారి పెట్టుబడి కూడా కలిసి స్థానికంగా ప్రైవేటు పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడానికి దోహదం చేసింది. అప్పటికే బొంబాయితో నిజాం సంస్థానానికి సంబంధాలు ఉన్నాయి. దీనితో అక్కడి పెట్టుబడిదారులు, వ్యాపారుస్థులు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకొచ్చారు. కొన్ని పరిశ్రమలు ప్రభుత్వ పెట్టుబడితోనూ ఏర్పాటయ్యాయి. అయితే ప్రైవేటు యాజమాన్యంతో ఉన్న కొన్ని పరిశ్రమలు కాలక్రమంలో నిజాం ప్రభుత్వ పరమయ్యాయి. 1940 నాటికే తెలంగాణ పారిశ్రామికంగా చెప్పుకోదగిన స్థాయిలో అభివృద్ధి చెందింది. ఈ కారణంగానే హైదరాబాద్ లో కార్మికోద్యమానికి బలమైన పునాదులు ఏర్పడ్డాయి. వీటన్నింటిని అర్థం చేసుకోవాలంటే తెలంగాణలో పరిశ్రమల స్థాపన, పారిశ్రామిక రంగ అభివృద్ధికి సంబంధించిన ఘట్టాల గురించి చెప్పుకోవాలి.

**బ్యాంకులు :**

హైదరాబాద్ సంస్థానంలో తొలుత బ్రిటిషు వారి ఇంపీరియల్ బ్యాంకులు, ఇతర బ్యాంకుల శాఖలు ఉండేవి. అయితే స్థానికంగా ఉన్న పెట్టుబడిదారులు, కోటీశ్వరులు కలిసి 1942 లో హైదరాబాద్ స్టేట్ బ్యాంకును ఏర్పాటు చేశారు.

**రైల్వేలు :**

హైదరాబాద్ సంస్థానంలో 1874 నాటికే రైల్వేవ్యవస్థ

ఏర్పడింది. నిజాం స్టేట్ గ్యారంటీడ్ స్టేట్ రైల్వే అనే పేరుతో బ్రిటిషు వారు రైల్వేల్ని నిర్వహించారు. అయితే 1930 లో కంపెనీ రైల్వేలను నిజాం ప్రభుత్వానికి అమ్మివేసింది. నాటి నుంచి నిజాం స్టేట్ రైల్వే పేరుతో నిజాం పాలకులే రైల్వేను నిర్వహించారు. ఒక అంచనా ప్రకారం 1938 నాటికే రైల్వేలలో ప్రభుత్వ పెట్టుబడి 15 కోట్ల 78 లక్షల రూపాయలు. దాదాపు ఇరవై వేలమంది రైల్వే కార్మికులు పనిచేసేవారు. తొలిరోజుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం, సరుకుల రవాణా కోసం వేసిన లైన్ల ద్వారా పందొమ్మిదవ శతాబ్దంలోనే తెలంగాణ ప్రజలకు రైల్వేలతో పరిచయం ఉంది.




**రోడ్డు రవాణా సౌకర్యాలు:** హైదరాబాద్ సంస్థానంలో మొదట రైల్వేశాఖ ఆధ్వర్యంలోనే బస్సులు నడిచేవి. రోడ్డు ట్రాన్స్‌పోర్టు రైల్వేశాఖ పరిధిలో పనిచేస్తూ బస్సులు నడిపించేది. బస్సుల నిర్మాణంలో ఆల్విన్ కంపెనీ పాత్ర ప్రధానమైంది. బ్రిటిషు వారి కంపెనీల పెట్టుబడులు రోడ్డు రవాణా శాఖలో ఉన్నాయి. కాగా, 1932లో ప్రధాన రోడ్డు మార్గాలను జాతీయం చేసి ప్రభుత్వమే బస్సుల్ని నడిపించడం మొదలెట్టింది. ఈ విధంగా నిజాం సంస్థానంలో బస్సుల నిర్మాణం, రవాణా వసతుల అభివృద్ధి జరిగింది.

**చక్కెర ఫ్యాక్టరీ :**

హైదరాబాద్ సంస్థానంలో చెరుకు పంటలు బాగానే పండుతుండేవి. నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో చెరుకును పండించేవారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద రైతులు విస్తారంగా చెరుకు సాగుచేసేవారు. ఈ నేపథ్యంలో 1933లో నిజాం షుగర్ ఫ్యాక్టరీ స్థాపించారు. కొందరు భూస్వాములు, పెట్టుబడిదారులు కొంత డబ్బు పెట్టగా, నిజాం ప్రభుత్వమే ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టింది. తెలంగాణలో ఉన్న పెద్ద పరిశ్రమల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు ఈ పరిశ్రమ ఆసియాలోనే అతిపెద్ద పరిశ్రమగా కూడా చెప్పవచ్చు. హైదరాబాద్ సంస్థానంలో మొట్టమొదటి పంచదార పరిశ్రమ ' నిజాం చక్కెర పరిశ్రమ. దీన్ని హైదరాబాద్ సంస్థానం చివరి నవాబైన మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1921 లో నిజామాబాద్ జిల్లాలోని బోధన్‌లో స్థాపించారు. ఇది రాష్ట్రంలోని పంచదార పరిశ్రమల్లో కెల్లా పెద్దది. ఈ కర్మాగారంలో పంచదారతో పాటు మొలాసిస్, పిప్పర్‌మెంట్లు, కార్బన్ డై ఆక్సైడ్ వాయువును కూడా తయారు చేస్తారు. ఈ పరిశ్రమకు అనుబంధంగా నాలుగు పంచదార ఫ్యాక్టరీలను నెలకొల్పారు.



1. జహీరాబాద్ (మెదక్) – 1973
2. మిర్యాలగూడ (నల్గొండ) – 1977
3. ముత్యంపేట (కరీంనగర్) – 1981
4. సారంగాపూర్ (నిజామాబాద్‌లో ఏర్పాటు చేశారు).

**సింగరేణి గనులు :**

తెలంగాణలో సింగరేణి గనులు అతిపెద్దవి. ఇక్కడ నుంచి 1889 నాటి నుంచే బొగ్గు తవ్వడం ప్రారంభించారు. కొత్తగూడెం, బెల్లంపల్లి ఏరియాల్లోని గనుల్లోంచి బొగ్గు తవ్వితీసేవారు. ఈ గనులు తొలుత బ్రిటిషు కంపెనీల యాజమాన్యంలో ఉన్నాయి. 1940 నాటికి ఈ గనుల్లో దాదాపు పన్నెండు వేలమంది పనిచేసేవారు. 1886లో హైదరాబాద్ దక్కన్ కంపెనీ పేరుతో నిర్ధారించిన బొగ్గు నిక్షేపాలను వెలికితీయడానికి సంస్థను స్థాపించారు. ఈ సంస్థ మొదటిసారిగా ఖమ్మం జిల్లా ఇల్లందు వద్ద స్టంట్ ఫిట్ బొగ్గు గనిని ఏర్పాటు చేసి ఉత్పత్తిని ప్రారంభించారు. 1920 లో ఈ సంస్థ పేరును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌గా మార్పుచేసి కంపెనీ షేర్లను ఇంగ్లాండ్‌లోని లండన్ స్టాక్ ఎక్స్ఛేంజిలో నమోదు చేసుకుంది. 1945 లో ఆనాటి నిజాం ప్రభుత్వం ఈ కంపెనీ షేర్లను కొనుగోలు చేసింది. 1949లో రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి సింగరేణి కాలరీస్ కంపెనీ వచ్చింది.


**సిర్పూరు పేపర్‌మిల్లు :**

సిర్పూరు పేపరు మిల్లు.. ఈ పేరు వినగానే ఒకప్పుడు వేలాదిమంది మంది కార్మికులతో పరిశ్రమ కళకళలాడిన దృశ్యాలు కంటిముందు కనబడతాయి. ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఉన్న సిర్పూర్ పేపర్ మిల్లు 1936 లో నిజాం నవాబు కాలంలో ఏర్పాటైంది. 1942 లో మిల్లులో పేపర్ ఉత్పత్తిని ప్రారంభించారు. అయితే దశాబ్దాలుగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ వస్తున్న ఈ పేపర్‌మిల్లు... గత పాలకుల నిర్లక్ష్యం, నిర్వాహకుల అవినీతితో ఈ పరిశ్రమ ఒక్కసారిగా కళ తప్పింది. 2010 నుంచి నష్టాల బారిన పడింది. అప్పటి నుంచి యాజమాన్యం ప్రక్షాళన మొదలుపెట్టింది. దీంతో పేపర్ ఫ్యాక్టరీనే నమ్ముకుని జీవిస్తున్న కార్మికుల బతుకులు ముక్కలయ్యాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలకు జీవనోపాధినిచ్చింది. అయితే నష్టాల పేరుతో.. ఈ మిల్లును 2014 సెప్టెంబర్ 27న ఉత్పత్తిని యాజమాన్యం నిలిపివేసింది. దీంతో ఏళ్ల నుంచి మిల్లులో పనిచేస్తున్న కార్మికుల జీవితాలు ఒక్కసారిగా రోడ్డున పడ్డాయి.

**డిబిఆర్ మిల్స్ :**

హైదరాబాద్‌లో ఏర్పడిన మిల్లుల్లో అతి పెద్దది డిబిఆర్ మిల్స్.. దివాన్ బహదూర్ రాంగోపాల్ ( డిబిఆర్ ) మిల్లులు 1922లో నెలకొల్పారు. ఇప్పుడు లోయర్ ట్యాంక్‌బండ్ సమీపాన శిథిలావస్థలో కనిపిస్తున్న ఈ మిల్లులకు ఉజ్వలమైన చరిత్ర ఉంది. జౌళిమిల్లుల్లో డిబిఆర్ మిల్స్‌కు మంచి పేరుంది. మొదట్లోనే ఈ మిల్లుల్లో 1300

మంది పనిచేసేవారు. కాగా, వరంగల్ లో 1934 లో ఆజాంజాహీ మిల్లు ఏర్పాటైంది. వరంగల్‌లో ఏర్పాటైన ఈ పరిశ్రమలో నాడు 2300 మంది పనిచేసేవారు. పత్తి పండించే రైతులకు రుణాలు అందజేసి, విత్తనాలు, ఎరువులు అందజేసి సహకరించని చరిత్ర ఈ మిల్లుకు ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటం, సరైన విధానాలు అవలంబించకపోవడం వల్ల ఈ మిల్లు కూడా మూతపడింది.



**ముఖ్యమైన వస్త్ర పరిశ్రమలు :**

- అజాంజాహీ మిల్లు – వరంగల్ (1934లో ప్రారంభించగా 1990లో మూతపడింది)
- నటరాజ్ స్పిన్నింగ్ మిల్లు – నిర్మల్
- ప్రియదర్శిని స్పిన్నింగ్ మిల్లు – సదాశివపేట (మెదక్)
- సూర్యవంశీ స్పిన్నింగ్ మిల్లు – భువనగిరి

**ఆల్విన్, ఆస్‌బెస్టాస్ కంపెనీలు :**

ఈ రెండు కంపెనీలు కూడా తెలంగాణలో ప్రముఖమైనవి. ఆల్విన్ కంపెనీ 1942లో ఏర్పడింది. హైదరాబాద్ ఆస్‌బెస్టాస్ సిమెంట్ ఉత్పత్తుల కర్మాగారాన్ని 1949లో సనత్‌నగర్‌లో స్థాపించారు. బస్సులు ఇతర ఇంజనీరింగ్ వస్తువులు తయారుచేసింది. ఆల్విన్ వాచీలు కూడా తయారయ్యేవి. ఆస్‌బెస్టాస్ కంపెనీ షాబాద్ సిమెంటుతో ఆస్‌బెస్టాస్ రేకులు తయారు చేసింది. ఇండ్ల, భవనాల నిర్మాణాలకీ ఈ రేకుల్ని ఉపయోగించేవారు. షాబాద్ సిమెంటు ఫ్యాక్టరీ నాడు గుల్బర్గా జిల్లాలో ఉండేది. కాలానుగుణంగా ఈ సంస్థలు కూడా నిర్వహణ లోపాలతో మూతపడ్డాయి.

**వజీరు సుల్తాన్ టుబాకో కంపెనీ :**

సిగరేట్ పరిశ్రమను ఎం.డి. వజీర్ 1920 లో హైదరాబాద్‌లో స్థాపించారు. స్థానిక పెట్టుబడిదారులు హైదరాబాద్‌లో ఈ పరిశ్రమను స్థాపించారు. హైదరాబాద్ సంస్థానంలోని వివిధ ప్రాంతాల్లో పండించే నాటు పొగాకును కొనుగోలు చేశారు. ఇక్కడే చార్మినార్ సిగరెట్లు తయారుచేసేవారు. 1930లో 'వజీరు సుల్తాన్ టుబాకో కంపెనీ 'ని ఓ విదేశీ కంపెనీకి అమ్మివేశారు. నాటి హైదరాబాద్ ప్రభుత్వం పెట్టుబడులు కూడా దీనిలో ఉన్నాయి. ఇది 1983లో పూర్తిగా స్వతంత్ర సంస్థగా రూపొంది వీఎస్టీ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌గా నమోదైంది.



**హైదరాబాద్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ :**

హైదరాబాద్ సంస్థానికి చివరగా పనిచేసిన మీర్ లాయక్ అలీకి చెందిన కంపెనీ ఇది. 1934లో 'హైదరాబాద్ కన్‌స్ట్రక్షన్ కంపెనీని ప్రారంభించారు. లాయక్ అలీ స్వతహాగా వాణిజ్యవేత్త. నిజాం ప్రభుత్వ భవనాల నిర్మాణంలో అధికభాగం ఈ కంపెనీ చేజిక్కించుకుంది. తర్వాత ప్రభుత్వమే ఈ కంపెనీని తన అధీనంలోకి తీసుకుంది. ఇక, నిజాం సంస్థానంలో హైదరాబాద్‌లోనూ, జిల్లాల్లోనూ అనేక బియ్యం మిల్లులు, అయిల్ మిల్లులు 1930 లోనే ఏర్పడ్డాయి. మార్కెటుకు వచ్చే వడ్లను కొని, బియ్యం పట్టించి హైదరాబాద్ నగరంలోనూ, ఇతర పట్టణాల్లోనూ అమ్ముకునేవారు. అందుకని బియ్యం, ఆయిల్ మిల్లుల వ్యాపారం జోరుగా సాగుతుండేది. వేరుశనగ, ఆముదాలు, నువ్వుల పంటలు విస్తారంగా ఉన్నందున ఈ ప్రాంతంలో ఆయిల్ మిల్లులు కూడా బాగానే నడిచాయి. 1920–30ల నాటికే ఈ మిల్లుల వ్యాపారం విస్తరించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో కూడా ఇంజనీరింగ్ పరిశ్రమలు ఏర్పడ్డాయి. వివిధరకాల పరిశ్రమలకు సంబంధించిన విడిభాగాలు, చిన్నచిన్న యంత్రాల సరఫరా, మరమ్మతులకు అనువుగా ఈ పరిశ్రమలు అభివృద్ధి చెందాయి.

**పారిశ్రామిక స్థితిగతులు :**

పారిశ్రామికీకరణను అడ్డుకునే బ్రిటీష్ పాలన హైదరాబాద్‌లో లేకపోవడంతో ఈ రాజ్యం పారిశ్రామికంగా అభివృద్ధి చెందగలిగింది. పారిశ్రామికవేత్తలకు చేయూతగా 1929 లోనే 'ఇండస్ట్రీయల్ ట్రస్ట్ ఫండ్'ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిద్వారా పెట్టుబడిని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేసింది. తద్వారా ఆజంజాహి మిల్స్, ఉస్మానియా కెమికల్స్, నిజాం షుగర్ ఫ్యాక్టరీ, ప్రాగాటూల్స్, సిర్పూర్ పేపర్ మిల్స్, సింగరేణి కాలరీస్, తాజ్‌గ్లాస్ పరిశ్రమ, హైదరాబాద్ ఆస్‌బెస్టాస్ లాంటి సంస్థలు ఏర్పడ్డాయి. నిజాం ప్రభుత్వం పారిశ్రామిక ప్రగతికి కావల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి ' సెంట్రల్ ల్యాబొరేటరీస్ ఫర్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రిసెర్చ్' అనే సంస్థ ఏర్పాటు చేసింది. ఇవేకాకుండా రెండు సబ్బు పరిశ్రమలు, 40 ముద్రణాలయాలు, 4 సిగరేట్ పరిశ్రమలు, 2 గాజుల పరిశ్రమలు, 9 మందుల సంస్థలు ఉండేవి. 1921లో 200 పరిశ్రమలుండగా, 1941 నాటికి పరిశ్రమల సంఖ్య సుమారు 500కు చేరుకుంది.

నవాబోకా జమానా – కార్ఖానోకా ఖజానా అన్నంతంగా... హైదరాబాద్ సంస్థానం అభివృద్ధి సాధించింది. అయితే.. ఆ తర్వాత వ్యవస్థాగత లోపాలు, పాలకుల నిర్లక్ష్యం కలిసి అనేక పరిశ్రమలు మూతపడటానికి కారణమయ్యాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పడి రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న తరుణంలో... మళ్లీ పరిశ్రమలకు పూర్వ వైభవం లభిస్తుందని, మూతపడ్డ పరిశ్రమల్లో కొన్నింటికైనా మళ్లీ పునరజ్జీవనం లభిస్తుందని ఆశిద్దాం.

– దక్కన్ న్యూస్

## ఘనంగా తెలంగాణ సాహితి

# భాషా సాహిత్యోత్సవాలు

'భాషా సాహిత్యం, సంస్కృతులను, మాండలిక భాషా సొగసులను, ప్రజాభాషను – దళదిశలా చాటుదాం' అనే ఆలోచనతో ఈ మూడో లిటరరీ ఫెస్ట్‌ను తెలంగాణ సాహితి ఏర్పాటు చేసింది. తెలుగు విశ్వవిద్యాలయంలో మే 10,11,12 తేదీల్లో లిటరరీ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కవులు, గాయకులు కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. మూడు రోజులూ ఒక సాహితీ సందోహం, నూతన ఉత్సాహానికి, చైతన్యానికి వేదికయిన భాషా సాహిత్యోత్సవం. భాషాభివృద్ధికి భిన్నమయిన ఆలోచనలు, అభిప్రాయాలకు వేదికై... నేడు మాతృభాష మనుగడకి వచ్చిన సవాళ్ళను ఐక్యంగా ఎలా ఎదుర్కోవాలో ఆలోచించిన వేదికగా భాషా సాహిత్యోత్సవం నిలిచింది. కవులను, రచయితలను, మేధావులను ఆలోచింపచేసింది. అమ్మ నుంచి పిల్లలు దూరమవుతున్నట్టుగానే అమ్మ భాష నుంచి నేటితరం దూరమవుతున్న తరుణంలో భాషనే చర్చనీయాంశంగా చేయడమే ఈ సాహిత్యోత్సవ విజయంగా భావించవచ్చు. సాహిత్య రంగాలలో భిన్నమైన సామాజిక దృక్పథాలు కలిగినవారు స్వేచ్ఛగా తమ ఆలోచనలు పంచుకోవటం, భాషా వికాసానికి ప్రజలను చైతన్యాన్ని ఇవ్వటం కోసం సమన్వయంతో ఎలా ఆలోచించాలో, పని చేయాలో చర్చించడం కూడా సాహిత్యోత్సవ నిర్వహణ లక్ష్యంగా నెరవేరింది.

మే 10వ తేదీన తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు నందిని సిధారెడ్డి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. తెలంగాణ సాహితి రాష్ట్ర కన్వీనర్ కె.ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ, తెలకపల్లి రవి, నలిమెల భాస్కర్, గోరటి వెంకన్న, మువ్వా శ్రీనివాసరావు, వినుతారెడ్డి, యాదగిరిరావు మొదలైన వారు పాల్గొన్నారు. ఈ ప్రారంభ సభకు తెలంగాణ సాహితి రాష్ట్ర నాయకురాలు సలీమ ఆహ్వానం పలుకగా కంచర్ల శ్రీనివాస్ వందన సమర్పణతో ప్రారంభ సభ ముగిసింది. సభ ప్రారంభంలో ఇటీవల మరణించిన సాహితీ కళాకారులు పొట్లూరి వెంకటేశ్వరరావు, బాలంత్రపు రజనీకాంతారావు, అయిల సైదాచారిలకు సంతాపాన్ని తెలుపుతూ సభ రెండు నిముషాలు మౌనం పాటించింది.

ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ... మాతృభాష ప్రజలున్నంత కాలం మరణించబోదన్నారు. తెలుగు భాషను ప్రజలు ఇంతకాలం కాపాడుకున్నారని, భవిష్యత్తులోనూ బతికించుకుంటారని చెప్పారు. భాషా సాహిత్యాలను ప్రపంచీకరణ కబళించుకుంటూ ముందుకెళ్తోందన్నారు. అంతరించిపోతున్న భాషలో తెలుగు ఉందని యునెస్కో ప్రకటించిందని గుర్తు చేశారు. ఇంగ్లీష్, ఇతర భాషలు, ప్రపంచీకరణ నుంచి వస్తున్న దాడిని ఎదుర్కోవాలన్నారు. ఇంగ్లీష్ ఎక్కువ కాదు, తెలుగు తక్కువ కాదని వివరించారు. దినపత్రికలు తెలుగు ప్రచురించాలని, టీవి చానళ్లు తెలుగును ప్రసారం చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు..

తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ... ప్రజల సమగ్ర జీవన విధానమే భాష అని అభివర్ణించారు. సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను భాష ప్రతిబింబిస్తుందని చెప్పారు. భాష, సాహిత్యం, సంస్కృతిలకు అవినాభావ సంబంధం ఉందన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రజలు మాతృభాషను బతికించుకున్నారని చెప్పారు.

గోరటి వెంకన్న మాట్లాడుతూ.. ఆధిపత్యం, మార్కెట్ శక్తులను ధిక్కరిస్తేనే భాష బతుకుందని చెప్పారు. వలస పాలకులు ముందు భాషా సాహిత్యం, సంస్కృతిని నాశనం చేస్తారన్నారు. ప్రాచీన పదాలు తెలంగాణలో ఎక్కువగా వాడుకలో ఉన్నాయని చెప్పారు. తెలుగు భాష సుసంపన్నం కావాలంటే యాసలన్నీ కలవాలని సూచించారు. మానవ శాస్త్రాలు, భాషా సాహిత్యం, సంస్కృతి, ప్రజల జీవన విధానంపై పరిశోధనలకు ఆఫ్రికా ఎంత అపురూపమో, తెలంగాణ అంతేనని తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ రచయిత తెలకపల్లి రవి మాట్లాడుతూ.. ఓ ప్రవాహంలా భాష ముందుకు సాగుతోందన్నారు. ప్రజల జీవితాలతో భాష ముడిపడి ఉందన్నారు. ఈ భాషే గొప్పది అని శాసించడం ఎవరికీ సాధ్యం కాదని తెలిపారు. ప్రజల జీవన విధానంలో భాష ఓ ఆయుధమని మార్క్స్ అన్నారని గుర్తు చేశారు. భాషా వికాసం, సాహిత్యం ప్రజల కోణంలో ఉండాలన్నారు.

తెలుగు భాషకు జరుగుతున్న అన్యాయం కారణంగా తెలంగాణలో ఉద్యమాలు ఉద్భవించాయన్నారు. భాషకు అవమానం జరిగితే సమాజ గౌరవానికి మచ్చ అని తెలిపారు. భాష పరిరక్షణ అంటే ప్రాచీనత కాపాడుకోవడం పాటు ఆధునీకరించుకోవాలని ఆయన సూచించారు.

రచయిత నలిమెల భాస్కర్ మాట్లాడుతూ.. ప్రాచీన పదాలు తెలంగాణలో ఎక్కువగా వాడుకలో ఉన్నాయన్నారు. తెలుగు భాష సుసంపన్నం కావాలంటే యాసలన్నీ కలవాలని తెలిపారు. ప్రజల జీవితాలతో భాష ముడిపడి ఉందని, ఈ భాషే గొప్పది అని శాసించడం ఎవరికీ సాధ్యం కాదని చెప్పారు. భాష నిరంతరం




రూపాంతరం చెందాల్సిన అవసరముందన్నారు.

రెండవరోజు "భాషాభివృద్ధి – జరగాల్సిన కృషి" అనే అంశంపై భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో సీనియర్ జర్నలిస్టు కె. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొనగా ప్రజలు ఆలోచించే భాషలోనే బోధన, పాలన ఉన్నప్పుడే భాషాభివృద్ధి చెందుతుందని కె.శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. వక్తలుగా రచయిత కాలువ మలయ్య, తెలంగాణ రిసోర్స్ సెంటర్ అధ్యక్షులు ఎం.వేదకుమార్ భాషాభివృద్ధికి ప్రజలేం చేయాలి అందుకు ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయో అనే విషయాలను వివరించారు. వహిద్ ఖాన్ ఆహ్వానం పలకగా, కటుకోఝ్వల రమేశ్ సమన్వయం చేయగా రాములు వందన సమర్పణ చేశారు. అనంతరం "భాషా, సాహిత్యం–మహిళలు" అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. తెలంగాణ సాహితి రాష్ట్ర నాయకురాలు వురిమళ్ల సునంద అధ్యక్షతన జరిగిన ఈ గోష్టిలో వక్తలుగా కొల్లాపురంవిమల, జూపాక సుభద్ర, కొండేపూడి నిర్మల, సమ్మెట ఉమాదేవి పాల్గొన్నారు. ఈ చర్చలో మహిళల జీవన విధానమే వారి సాహిత్యానికి మూలమని వివరించి... ఈ సభకు వి.పుష్పలత ఆహ్వానం పలకగా, సుమిత్రాదేవి వందన సమర్పణ చేశారు. అనంతరం "తెలంగాణ భాష, సాహిత్య వికాసం" అనే అంశంపై తెలంగాణ సాహితి రాష్ట్ర నాయకులు తంగిరాల చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా పిల్లలమర్రి రాములు, అతిథులుగా పింగళి చైతన్య, మామిడి లింగయ్య పాల్గొన్నారు. అనంతోజు మోహన్ కృష్ణ సమన్వయంతో 24 మంది పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు, ఆచార్యులు పత్ర సమర్పణ చేశారు. అనంతరం నవతెలంగాణ సహకారంతో తెలంగాణ సాహితి 44 మంది వ్యాసకర్తలతో ప్రచురించిన "తెలంగాణ భాష, సాహిత్య వికాసం" గ్రంథావిష్కరణ జరిగింది.

"భాషాభివృద్ధి – జరగాల్సిన కృషి" అనే అంశంపై సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. తెలుగు భాషా నిఘంటువు, పదకోశాలను రూపొందిస్తేనే భాషాభివృద్ధి సాధ్యమన్నారు. తెలుగును పరిపాలనలోనూ, బోధనలోనూ తప్పనిసరి చేయాలని, తెలంగాణ కవులు, సాహితీవేత్తల మంచి రచనలను ఆంగ్లంలోకి అనువాదం చేయడం వల్ల ప్రపంచ దేశాలకు తెలంగాణ సాహిత్యాన్ని చాటి చెప్పవచ్చన్నారు. న్యూస్ ఛానల్స్‌లో మాట్లాడే యాంకర్స్.... భాషను వక్రీకరిస్తున్నారని, భాషపై ఒక్కొక్కరికి ఒక్కో అపోహలు ఉన్నాయన్నారు. ఇంగ్లీష్ భాషలో ఎప్పటికప్పుడు కొత్త పదాలు, అర్థాలు రచిస్తున్నారని, అందుకే ఆ భాష అభివృద్ధి చెందుతున్నదన్నారు.

నవల రచయిత, కవి కాలువ మల్లయ్య మాట్లాడుతూ.. భాష అనేది జానపదం నుంచి పుట్టిందన్నారు. ప్రామాణిక, సంస్కృతం భాష నుంచి తెలుగును తీసుకుంటున్నారని, పాఠ్య పుస్తకాల్లో తెలుగు భాషను ఎక్కించడం లేదన్నారు.

"తెలంగాణ భాష – సాహిత్యవికాసం" అనే అంశంపై ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ.. భాష జాతి జనుల శ్వాస అని అన్నారు. తెలంగాణ భాష వికాసానికి వెంటనే తెలుగు నిఘంటువు తీసుకురావాలన్నారు. సామాజిక కార్యకర్త పింగళి చైతన్య మాట్లాడుతూ.. ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినా ఇక్కడి భాషలో ఎలాంటి మార్పు రాలేదని అభిప్రాయపడ్డారు. భాష పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కవి, రచయిత మామిడి లింగయ్య కోరారు.

"భాష, సాహిత్యం – మహిళలు" అనే అంశంపై జరిగిన సదస్సులో ప్రముఖ రచయిత్రి జూపాక సుభద్ర మాట్లాడుతూ.. సమాజంలో సంచార, ఉత్పత్తి కులాలనే అతిపెద్ద సాహిత్యంగా పరిగణించాలని కోరారు. తెలుగులో భాషను మాటగా పరిగణించాలని సూచించారు. భాషకు మూలం స్త్రీలేనని, ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో సైతం భాష కోసం సంచార కులాల తల్లుల దగ్గరికి వెళ్లాలని సూచించాయని గుర్తు చేశారు. సంచార, ఉత్పత్తి కులాలకు చెందిన అనేక మంది మహిళల మాట, పాట, మౌఖికంలో సాహిత్యం దాగుందన్నారు.

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి, జర్నలిస్ట్ కొండేపూడి నిర్మల మాట్లాడుతూ.. ప్రచార, ప్రసార మాధ్యమాల్లో ఉన్న భాషలో మార్పులు రావాలన్నారు. మహిళలను మరింత అణచివేతకు గురిచేసే విధంగా

పత్రికలు, టీవీల్లో భాష ఉంటోందన్నారు. మాండలికాలను బతికించుకోవాలని కథా రచయిత్రి సమ్మెట ఉమాదేవి కోరారు.

మూడోరోజు "భాష, సంస్కృతి - సామాజిక దృక్పథం" అనే అంశంపై ప్రముఖ భాషా పండితులు మోతుకూరి నరహరి అధ్యక్షతన జరిగిన చర్చాగోష్ఠిలో ముఖ్య అతిథిగా కాసుల ప్రతాపరెడ్డి, అతిథులుగా గుడిపాటి వెంకటేశ్వర్‌రావు, వల్లభాపురం జనార్దన్, శాంతారావు పాల్గొన్నారు. ఈ సభకు సతీష్ స్వాగతం పలుకగా, తెలంగాణ సాహితి హైదరాబాద్ నగర కన్వీనర్ జి.నరేష్ సమన్వయం చేశారు. అనంతరం "కవితా మహోత్సవం" తంగిరాల చక్రవర్తి, కపిల రాంకుమార్, ఖాజా మొహియుద్దీన్, గడీల సుధాకర్‌రెడ్డి, వల్లభాపురం జనార్ధన్, సలీమా అధ్యక్ష వర్గంగా వుండగా కవి యాకూబ్ ముఖ్య అతిథిగా కవితి మహోత్సవాన్ని ప్రారంభించారు. 115 మందికిపైగా కవులు, రచయితలు, భాషాభిమానులు విచ్చేశారు. తెలంగాణ సాహితి కార్యకర్తలు వినూతారెడ్డి, భూపతి వెంకటేశ్వర్లు, తంగిరాల చక్రవర్తి, నరేష్, మోహన్ కృష్ణ మొదలైన వారు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కవిత్వ చర్చాగోష్టిలో ప్రముఖ కవులు డాక్టర్ సిహెచ్. అంజనేయులు, నరేష్‌కుమార్ సూఫీ, వైద్యం భాస్కర్, వైరాగ్యం ప్రభాకర్, నిర్గుణ్ ఇబ్రహీం, శిష్టా మాధవి, పద్మకుమారి, గాయత్రిదేవి మొదలైన వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె. ఆనందాచారి రచించిన "మహోన్నతుడు మార్క్స్" అనే పుస్తకాన్ని తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎస్వీ.సత్యనారాయణ ఆవిష్కరించారు. కటుకోర్వుల రమేష్ రచించిన " అగ్నిశిఖ" నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. ఇంకా ఈ మూడు రోజులల్లో అనేక పుస్తకావిష్కరణలు జరిగాయి.

"భాష, సంస్కృతి - సామాజిక దృక్పథం" అనే అంశంపై కవి, రచయిత కాసుల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. అత్యధిక ప్రజల మనుగడకు భాష ఉపయోగపడుతుందా....? లేదా...? అనేది చర్చించాలన్నారు. నిజాం హయాంలో ఉర్దూ ప్రధాన పాలక భాషగా ఉందన్నారు. జన పదాలు - సంస్కృతి కులం బట్టి మనుగడలో ఉండాల్సిన అవసరం లేదన్నారు. అట్టడుగు వర్గాల ప్రజల సంస్కృతి, విలువలను కాపాడుకోవడంతో సామరస్య భావన కలుగుతోందన్నారు.

ప్రముఖ సాహితి విమర్శకులు గుడిపాటి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సామ్రాజ్యవాద, ఉదార వాద ఆర్థిక విధానాల కారణంగా మన తెలుగు భాషను, సంస్కృతిని మనమే నిరాకరిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం సమయంలో తెలంగాణ భాష-యాసపై అనేక రకాలుగా అభిప్రాయాలు వ్యక్తం చేసిన ఉద్యమ నేతలు.. అధికారంలోకొచ్చాకా తెలంగాణ భాషకు, పాఠశాలల్లో, పాలనలో ఎక్కడా కూడా ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. బతుకంతా తెలుగులోనే కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు.

సామాజిక కార్యకర్త శాంతారావు మాట్లాడుతూ.. తెలుగు భాషను, సంస్కృతిని మరింత పరిపుష్టం చేయాలన్నారు. సమాజహితాన్ని కోరేది సాహిత్యమే అన్నారు. భాష సంస్కృతులు ఉపరితలం అయితే, భూమి - రైతులు పునాది అన్నారు. సమాజంలో పసి పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు దుర్మార్గమన్నారు. కవి వల్లభాపురం జనార్దన్ మాట్లాడుతూ.. భాషను కొత్త పునాదులతో నిర్మించుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ భాషా పండితులు మోతుకూరి నరహరి మాట్లాడుతూ.. ఇంగ్లీషు భాషకు పరిమితి ఉందన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయలను కాపాడుకోవాలన్నారు.

"కవితా మహోత్సవం" లో కేంద్ర సాహిత్య అకాడమి జ్యూరీ సభ్యుడు, ప్రముఖ కవి యాకూబ్ మాట్లాడుతూ.. సమాజంలో కవి లేని చోటు లేదని, ప్రతి మనిషి ఒక కవేనన్నారు. కవిత్వం ఉన్న నేల జీవిస్తోందని, కవిత్వం లేని నేల మరణిస్తోందన్నారు. సాధారణ వచనానికి, కవిత్వానికి తేడా గమనించాలన్నారు. మనిషిని మానవీయంగా ఉదాత్తంగా తీర్చిదిద్దే శక్తి ఒక్క సాహిత్యానికి మాత్రమే ఉంటుందన్నారు.

- దక్కన్ న్యూస్

# అద్భుత గోళం!



రాలిన ఆకుల మీద
నడుస్తున్న కాల ముద్రలు
ముడతలు పడ్డ శరీరాలు
అనుభవాల కాంతి రేఖలు
ఉదయాస్తమయాలు లెక్కిస్తావా
ప్రాణ భయం నిన్ను వెంటాడుతది
జరామరణ రాహిత్యం ఒక్క దేవతలకే కాదు
దయామయిలకూ కవులకూ వర్తిస్తాయి
చావుని కొని తెచ్చుకునే వాడే
యుద్ధాన్ని ప్రేమిస్తాడు
సహనాన్ని ఆవాహనం చేసుకోని వాడు
లోకపుటందాలను దర్శించ లేడు
ద్వేషమెప్పటికీ సర్కారు తుమ్మే
మొలిచిందా ఆపడం తరం కాదు
కుట్రకు పర్యాయపదం కూలదోయడమే
నిలబడి నిలబెట్టడంలోనే నిర్మాణం దాగివుంది
ఎల్లకాలం ఎవరూ వేలుపట్టి నడిపించరు
లక్ష్యం ఖరారు కానిది ప్రయాణం ఆరంభం కాదు
మనిషెప్పుడు గాలి వాటం పతంగి కాదు
భూమండలాన్ని కాంతివంతం చేసే అద్భుత గోళం!

-కోట్ల వెంకటేశ్వర రెడ్డి
m : 9440233261
e : kotla9440233261@gmail.com

# బానిసలు

పాల్వంచ వెంకటేశ్వర టాకీస్ బాల్కనీ క్లాస్ సెకండ్ షో కు ఆడవాళ్ళకు టిక్కట్లు చింపిన ఆనంద షో పడిన అరగంట తరువాత మేనేజర్కి చెప్పి కరకవాగులోవున్న వాళ్ళింటికి సైకిల్ మీద బయలుదేరింది. అప్పుడు రాత్రి పదిన్నరవుతుంది.

సైకిల్ అల్లూరి సెంటర్ దాటిందో లేదో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో గాలివాన మొదలైంది. అంతలోనే కరెంట్ కూడా పోయింది. కన్ను పొడుచుకున్నా కనిపించని కటికచీకటి అలుముకుంది. చినుకులు తుపాకి గుండ్ల మాదిరిగా తాకసాగాయి.

"ఇదేం వాన? ఒక్కసారిగ కుండపోతగ అందుకుంది!" అనుకున్న ఆనంద ఆడమ్స్ ఇంజనీరింగ్ కాలేజీ రోడ్డులోవున్న ఓచింతచెట్టు కిందకి చేరి వంటిమీది బట్టలు పిండుకోసాగింది.

సరిగ్గా అదే సమయంలో పాల్వంచ నుండి కాలేజీ వైపుగా వెళుతున్న రెండు బైక్‌ల మీద వున్న నలుగురు యువకులు చెట్టుకింద వంటరిగా వున్న ఆనందను చూసి ఠక్కున ఆగిపోయి, వాళ్ళల్లో వాళ్ళు ఏదో మాట్లాడుకో సాగారు.

వాళ్ళను చూసిన ఆనంద "వాళ్ళెవరోగాని బండ్లాపి ఇటే వస్తున్నారెందుకో? తాగినట్టున్నారు. ఎటు జూసినా ఒక్కపురుగు లేరు. ఏమైతదో ఏమో" తన్లో తను అనుకుంటూ భయంతో వణికిపోసాగింది.

ఇంతలో..

ఆ నలుగురూ చెట్టుకిందికి వచ్చీరావడంతోనే గొర్రెపిల్లమీద తోడేల్లు పడ్డట్టు ఆనందను చుట్టు ముట్టారు. మూకుమ్మడిగా వాళ్ళు సాగిస్తున్న ధాష్టికానికి తట్టకోలేక ఆనంద చేస్తున్న ఆక్రందనలు ఉరుముల ధ్వనిలో కలిసిపోతుంటే వాళ్ళతో పెనుగులాడి, పెనుగులాడి ఆఖరికి స్పృహ కోల్పోయింది.

**తనదారి తను చూసుకుని వేరుకాపురం వెళ్ళిపోయిన కొడుకుకోసం ఒక ఏడుపు ఏడ్చి వూరుకున్న కనకమ్మ, కూతురును పెట్టుకొని రోజులు వెళ్ళదీస్తుండగా ఎక్కువ డబ్బులొస్తాయన్న ఆశతో కొడుకు ఆటోలో టేకుదుంగలు స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు దొరికిపొయ్యాడు.**

ఆకలి తీర్చుకున్న మృగాలు నాలుగూ బైక్ లెక్కి కాలేజీరోడ్డులో మాయమైపోయాయి.

తెల్లవారు జామున పవర్‌రౌజ్ ఫస్ట్ షిఫ్ట్ డ్యూటీలకు వెళుతున్నకార్మికులు కొందరు చింతచెట్టుకింద బురదలో దిశమొలతో శవం మాదిరిగాపడివున్న ఆనందను చూసి "అయ్యో పాపం! ఎవరో అమ్మాయి" అంటూ దగ్గరికొచ్చి చూసి ఆవిడను గుర్తుపట్టిన వెంటనే కరకవాగులో వున్న వాళ్ళ అన్న పాపారావుకి ఫోన్ చేశారు.

చాలాసేపటి తరువాత ఆటో వేసుకుని వచ్చిన పాపారావు ఆనందను అదే ఆటోమీద వేసుకుని నేరుగా గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్ళాడు.

రెండోరోజు మధ్యాహ్నానికి స్పృహలోకొచ్చిన ఆనంద గుండెలు బాదుకుంటూ "నాజీవితం నాశనమైపోయింది" అంటూ పెద్దగా ఏడ్చీ ఏడ్చీ ఆఖరికి ఫిట్సొచ్చి పడిపోయింది.

పాపారావును పిలిపించిన డాక్టర్ "చూడండీ! జరిగిన ధారుణానికి మానసికంగా దెబ్బతిన్న ఆ అమ్మాయికి పాపం! మతి భ్రమించింది. ఇక ఆవిడనిక్కడుంచుకొని మేం చెయ్యగలిగిందికూడా ఏమీలేదు. మేమిచ్చే మందులు తీసుకుపోయి వాడుతూ పసిపిల్ల మాదిరి జాగ్రత్తగా చూసుకుంటే కొంతకాలానికి తిరిగి మామూలు మనిషి కావొచ్చు" అంటూ ఎన్నో జాగ్రత్తలు చెప్పిన డాక్టర్ మందులిచ్చి పంపించాడు.

❖ ❖ ❖

సినిమాహాల్లో పనిచేసే కొమరయ్య, కనకమ్మ దంపతులకు ఒక ఆడ, ఒక మగ ఇద్దరుపిల్లలు కలిగిన తరువాత కొమరయ్య తన్తోపాటే సినిమాహాల్లో స్వీపర్‌గా పనిచేసే సరోజను తీసుకుని అజాలేకుండా ఏటో వెళ్ళిపోయాడు.

భర్త వెళ్ళిపోయినప్పటి నుండి కనకమ్మ సినిమాహాల్లో పని చేసుకుంటూ కొడుకు పాపారావును కూతురు ఆనందను పెంచి పెద్దచేసింది.

చదువబ్బని పాపారావు పెళ్ళీడు కొచ్చినా పనీపాటు లేకుండా అల్లరి చిల్లరిగా తిరుగుతూ, క్రికెట్ బెట్టింగులు కడుతూ దొరికిన కాడల్లా అప్పులు చెయ్యసాగాడు.

కొడుకు ప్రవర్తనను చూసీ, చూసీ విసుగొచ్చిన కనకమ్మ "ఇట్ల లాభంలేదు. పెండ్లి జేస్తైనన్న బాగుపడ్తడేమో?" అనుకొని తమ్ముని బిడ్డను మాట్లాడి పెండ్లి చేసింది.

పెండ్లయిన ఆరునెల్లకు అత్తగారిచ్చిన కట్నం డబ్బులతో ఆటో కొనుక్కుని తిప్పుతూ వేరుకాపురం పెట్టాడు పాపారావు.

తనదారి తను చూసుకుని వేరుకాపురం వెళ్ళిపోయిన కొడుకుకోసం ఒక ఏడుపు ఏడ్చి వూరుకున్న కనకమ్మ, కూతురును పెట్టుకొని రోజులు వెళ్ళదీస్తుండగా ఎక్కువ డబ్బులొస్తాయన్న ఆశతో కొడుకు ఆటోలో టేకుదుంగలు స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు దొరికిపొయ్యాడు. ఆ కేసు నుండి అతణ్ణి విడిపించి తీసుకొచ్చేసరికి బి.పి. పెరిగిపోయిన కనకమ్మకు పక్షవాతమొచ్చి మంచాన పడిపోయింది.

తనకారణంగా తల్లికి పక్షవాతమొచ్చి మంచానపడినా పట్టించుకోకుండా తిరగసాగాడు పాపారావు. దాంతో ఏంచేయాలో దిక్కుతోచని ఆనంద ఓరోజు సినిమాహాలు ఓనర్ వెంకటరత్నం దగ్గరికెళ్ళి "సారూ! మా అమ్మపని నాకిప్పిస్తే ఆపన్జేసుకుంటూ ఆమెను సాదుకుంటా" అంటూ బ్రతిమాలింది.

ఆనంద అభ్యర్థనను విన్న వెంకటరత్నం"అందుకే మొగపోరగాల్ల కంటే ఆడపిల్లలే నయమంటారు" అనుకుని "సరే జాగర్తగా నీపని నువ్వు చేసుకుంటూ గౌరవంగా బ్రతుకు" అంటూ ఆడవాళ్ళ పక్క టిక్కెట్లు చింపే పనిలో పెట్టుకున్నాడు.

ఆరోజు నుండి సినిమాహాల్లో పనిచేసుకుంటూ తల్లికి వైద్యం చేయించుకుంటూ రోజులు వెళ్ళదియ్యసాగింది ఆనంద.

అటువంటి ఆనంద అన్యాయంగా మృగాల్ల దాడికి గురై మతిస్థిమితం కోల్పోయి జీవచ్ఛవంలా బ్రతుకసాగింది.

మంచిగావున్నప్పుడే తల్లిని, చెల్లిని పట్టించుకోని పాపారావుకి అకస్మాత్తుగా ఒకేసారి ఆ ఇద్దరి భాధ్యత మీదపడడంతో గొంగళి పురుగులుపట్టిన మునగచెట్టును చూసినవాడిలా చీదరించుకోసాగాడు

❖ ❖ ❖

ఆనంద మృగాల్ల దాడికి బలై అప్పుడే ఆరునెల్లు గడిచి పోయాయి.

ఈ ఆరు నెలల్లోనూ ఆనంద పరిస్థితిలో ఎలాంటి మార్పూ రాలేదు. పైగా, మూలిగేనక్కమీద తాటిపండు పడ్డట్టు జరిగిన ధారుణానికి ప్రతిఫలంగా ఆవిడ గర్భవతి అన్న ఇంకో ధారుణమైన విషయం బయటపడింది.

ఆ విషయం తెలిసిన వెంటనే పాపారావు చెల్లెల్ని మళ్ళీ గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళి విషయాన్ని డాక్టర్‌కి వివరించి "ఏదో విధంగా అబార్షన్ చెయ్యండి!" అంటూ బ్రతిమాలాడు.

ఆనంద పరిస్థితిని సానుభూతితో అర్థంచేసుకున్న డాక్టర్ "చూడండీ! ఈ అమ్మాయి శారీరకంగానూ మానసికంగానూ చాలా బలహీనంగా వుంది. పైగా ఆరోనెల. ఇటువంటి స్థితిలో తనకు అబార్షన్ చేస్తే పెగ్నెన్సీ పోవడమేమోగాని ఆవిడ ప్రాణానికే ముప్పు రావచ్చు. కాబట్టి ఇంటికి తీసుకుపోయి ఇంకో మూడునెల్ల తరువాత పురుడు పోయించండి. ఆతరువాత చూసుకుందాం" అంటూ సలహా ఇచ్చాడు.

డాక్టర్ మాటలిన్న పాపారావు "అది చస్తే మట్టిజేస్తా, మొండికిబడి బతికితే ఇంత గంజిబోస్తగాని మీరైతే అబార్షన్ చెయ్యండి సార్!" అంటూ నిర్థయగా మాట్లాడాడు.

అతని మాటలిన్న డాక్టర్ "చూడండీ! మీరు చెయ్యమన్నట్టల్లా చెయ్యడానికి కాదు మేమిక్కడుంది. ఒక డాక్టరుగా పేషేంట్‌కి ఏం చెయ్యాలో నాకు తెలిసింది చెప్పాను. అంతే తప్ప నేను మాత్రం ఆ పిల్లకు అబార్షన్ చెయ్యను" అంటూ నిక్కచ్చిగా తేల్చి చెప్పాడు.

మీరు చెయ్యమన్నట్టల్లా చెయ్యడానికి కాదు మేమిక్కడుంది. ఒక డాక్టరుగా పేషేంట్‌కి ఏం చెయ్యాలో నాకు తెలిసింది చెప్పాను. అంతే తప్ప నేను మాత్రం ఆ పిల్లకు అబార్షన్ చెయ్యను" అంటూ నిక్కచ్చిగా తేల్చి చెప్పాడు.

డాక్టర్ వున్న వాస్తవాన్ని కుండబద్దలు గొట్టినట్టు చెప్పడంతో ఇంకేం చెయ్యలేని పాపారావు అనందను తీసుకుపొయ్యి వాళ్ళ గుడిశలో పడేశాడు.

మంచంలో పడివున్న కనకమ్మ, బిడ్డ పరిస్థితిని చూసి తట్టుకోలేక పేగులు కదిలిపోయేలా ఏడవసాగింది.

"నీ అవ్వకు, నీ చెల్లెకు ముప్పొద్దుల వండిపెట్టడం నావల్లగాదు. నువ్వే వండిపెట్టుకుంటవో లేకుంటే ఎక్కడన్న అడుక్కొచ్చి పెట్టుకుంటవో నీ ఇష్టం. మీరు మీరు ఏగంగలోనన్నా దూకండ్రి గాని నాజోలికి మాత్రం రాకండ్రి!" అంటు ఏమాత్రం కనికరంలేకుండా మాట్లాడింది పాపారావు భార్య సరస్వతి.

భార్యమాటలు కోపం తెప్పిస్తున్నా తమాయించుకున్న పాపారావు ఆవిడ వంక చూస్తూ "లోకం కోసమన్నా ఇంకో మూడునెల్లు ఓపిక పట్టు. ఆ పిచ్చి దాన్కి కాన్పైనంక ఏదో ఒకటి చేద్దాం గాని" తన్లో తను ఏదో ఆలోచించుకుంటూ మెల్లగా అన్నాడు.

భర్తమాటలిన్న సరస్వతి "మూడునెల్లు కాదుగదా మూడురోజులు గూడ నావల్లగాదు. మీ సావు మీరెక్కడన్నా సావండ్రి!" మంచానపడింది స్వయంగా తన మేనత్తనిగాని, దుర్మార్గుల అకృత్యానికి అన్యాయంగా బలైంది తన ఆడపడుచన్న ఇంగీతం ఇసుమంతకూడా లేకుండా దుర్మార్గంగా మాట్లాడింది.

భార్య మాటలకు బదులు పలుకలేని పాపారావు మెల్లగా బయటకు జారుకున్నాడు.

ఆ తల్లీకూతుల్ల అవస్థ చూడలేక ఇరుగు పొరుగు వాళ్ళు ఎవరో ఒకరు అప్పుడో ఇప్పుడో తమకు కలిగిందాంట్లో అంతో ఇంతో తెచ్చిపెట్టసాగారు.

❖ ❖ ❖

ఆ రోజు రాత్రి హఠాత్తుగా మబ్బులుపట్టి ఫెళ, ఫెళ మని గుండెలు జలదరించేలా ఉరుములు, తళ తళ మని కళ్ళు మూతలు పడిపోయే మెరుపులతో కుండపోత వర్షం మొదలైంది. ఆ ఉరుములు, ఆ మెరుపులు, ఆ వర్షం చూసి చలించిపోయిన ఆనందకు తన జీవితాన్ని ధారుణంగా దెబ్బదీసిన కాళరాత్రి హఠాత్తుగా గుర్తుకొచ్చి తిరిగి మామూలు మనిషయ్యింది.

మామూలు మనిషిగా మారిపోయిన ఆనంద తనను తాను ఒక్కసారి పరిశీలనగా చూసుకుంది. తాను ఏపరిస్థితిలో వున్నదో అర్థం కాగానే భయంతో వణికిపోతూ కెవ్వున కేక వేసి కుప్పకూలి పోయింది.

సరిగ్గా అప్పుడే ఆవిడకు పురిటి నొప్పులు మొదలయ్యాయి.

గంట,రెండు గంటల నరకయాతన తరువాత ఆనంద మగపిల్లవాణ్ణి ప్రసవించింది.

కొడుకును ఒక్కసారి కళ్ళనిండుగా చూసుకున్న ఆనందకు అంతలోనే నీరసంతో మళ్ళీ స్పృహ తప్పింది.

అదే సమయంలో పాపారావు ఎవరికో ఫోన్ చేశాడు.

మరో అరగంట తరువాత ఆ వర్షంలోనే ఓ కారొచ్చి పాపారావు వాళ్ళ ఇంటిముందు ఆగింది.

కారులోనుండి దిగిన జంటను చూస్తూనే "మీ అదృష్టం బాగుంది సార్! మీరు కోరుకున్నట్టు మొగపిల్లగాడే పుట్టిండు" అంటూ చెప్పుకొచ్చాడు పాపారావు.

పాపారావు మాటలు వింటూనే వచ్చినవాళ్ళ కళ్ళల్లో నవ్వుల నెలపొడుపులు పొడ్చుకొస్తుంటే "సరే, ఆఖరికి ఎంతిమ్మంటారు?" అంటూ అడిగారు.

"మొగపిల్లగాడు గదా మనమనుకున్న దెబ్బైకి ఇంకో ముప్పై కలపండి!" అన్నాడు పాపారావు.

"లేదు లేదు. మనం ముందు అనుకున్నదానికన్న ఒక్క రూపాయిగూడా ఎక్కువిచ్చేది లేదు. అట్లా మీకిష్టమైతేనే ఇవ్వండి లేదంటే మాదారిని మేం వెళ్ళిపోతాం" అంటూ వచ్చిన వాళ్ళు పక్కా వ్యాపారస్తుల్లా మాట్లాడారు.

వాళ్ళ మాటలు విన్న వెంటనే పాపారావును పక్కకు పిల్చుకుపోయిన సరస్వతి "కొండనాలిక్కి మందేస్తే వున్ననాలిక వూడిపోయిందన్నట్టు జెయ్యకు. ఆశగ్గూడ అంతుండాల, వాళ్ళసలే వద్దనిపోతే ఏంజేస్తావ్? ఇగ అప్పుడు తల్లితోపాటు పిల్లగాన్నిగూడ మనమే

సాదాల. అనుకున్నకాడికి తీస్కోని పిల్లగాన్నిచ్చెయ్'' అంటూ హెచ్చరించింది.

"సరే నీ ఇష్టం నువ్వు ఎట్లంటె అట్లనే" అంటూ భార్యమాటలకు వంతపాడాడు పాపారావు.

అంతే!

పాపారావు చేతిలో డెబ్భైవేలు పెట్టిన ఆగంతకులిద్దరూ పిల్లవాణ్ణి తీసుకుని వెళ్ళిపోయారు.

కారెళ్ళిపోయిన కొద్దిసేపటికే ఆటో వేసుకుని బజారుకెళ్ళిన పాపారావు దంపతులు ఎన్నాళ్ళనుండో వాయిదా వేసుకుంటూ వస్తున్న ఎల్సీడీ టి.వి.ని అరవై వేలరూపాయల పెట్టి కొనుక్కొచ్చి ఇంట్లో పెట్టుకున్నారు.

❖ ❖ ❖

స్పృహలోకొచ్చిన ఆనందకు పక్కమీద చూసుకుంటే పిల్లవాడు కనిపించక పోవడంతో "అమ్మా!

నా కొడుకేడే?" అంటూ ఆందోళనగా తల్లినడిగింది.

"జరిగిన సంగతి పిచ్చిదానికి చెబితే నీ కుతిక పిసికి చంపుతాం" అంటూ కొడుకు, కోడలు చేసిన హెచ్చరికతో భయపడిపోయిన కనకమ్మ మంచంలో అంతెత్తున ఎగిరెగిరిపడుతూ ఏడుస్తుంది తప్ప జరిగిందేమిటో బిడ్డకు చెప్పలేక పోయింది.

దాంతో, ఏదో జరుగరానిదే జరిగిందని అర్థం చేసుకున్న ఆనంద పెద్ద పెద్దగా కేకలు పెడుతూ గట్టిగా ఏడవసాగింది.

పాపారావు ఇంట్లో జరుగుతున్న తతంగమంతా గమనిస్తున్న ఇరుగు పొరువాళ్ళు "పాపం! పచ్చిబాలింత అంతగనం ఏడుస్తుంది. ఏడ్చీ, ఏడ్చీ ఏమైపోద్దో?" అనుకోసాగారు తప్ప పాపారావు దంపతుల నోటికి భయపడి ఎవరూ ముందుకొచ్చి "ఏంటిదంత?" అంటూ అడగలేదు.

ఆనంద రోదన అంతకంతకు ఎక్కువౌతుండడంతో దుక్కిటెద్దులా బుస కొడుతూ చెల్లెలు మంచం దగ్గరకొచ్చిన పాపారావు "ఎందుకట్లరుస్తున్నావ్?" అంటూ ఆవిడ మూతి మీద ఫట్ మని గుద్దాడు.

ఆ దెబ్బకు కళ్ళముందు చుక్కలు కన్పించి నట్టైపోయిన ఆనంద మళ్ళీ స్పృహ తప్పిపోయి మరునాడు మధ్యాహ్నందాకా అట్లాగే వుండిపోయింది.

తిరిగి స్పృహలోకిరావడమే ఆలస్యం "నాకొడుకేడి? నాకొడుకేడి?" అంటూ నీరసంగా అరవసాగింది.

తరువాతెప్పటికో ఆనంద దగ్గరకొచ్చిన పాపారావు "నువ్వు సోయి తప్పి పడిపోంగనే పిల్లగాని పానం బోయింది. నువ్వు సోయికొస్తే ఎంతేడుస్తవోనని ఎమ్మటే తీస్కపొయ్యి బొందబెట్టొచ్చినం. ఇంకేం మొత్తుకుంటావుగాని ఊకో" అంటూ తీవ్రంగా గద్దించాడు.

పాపారావు మాటలిన్న ఆనందకు కన్నకడుపు వక్కలైపోతుంటే రెండు చేతులెత్తి మొక్కుతూ "అన్నా! నువ్వు చెప్పేదంతా అబద్ధమని నాకు తెల్సు. నాకొడుకును నాకిస్తే వాణ్ణి తీస్కోని నీ కంటికి కనబడకుంట యాడికన్న దూరంగ బొయ్యి ఏదో కష్టం జేస్కుంట నాబత్కు నేను బత్కుతా" అంటూ దీనంగా బ్రతిమాల సాగింది.

బిడ్డ చావును కళ్ళారా చూసిన కనకమ్మ ఇంటికప్పు ఎగిరి పోయేలా ఏడుస్తుండ దంతో "ముసల్ది అంతగనం ఏడుస్తుం దేంటో?" అనుకుంటూ ధైర్యం చేసిన ఇరుగుపొరుగువాళ్ళు ఒక్కొక్కళ్ళే ఆనంద వాళ్ళుండే గుడిశ దగ్గరికొచ్చారు.

"మర్యాదగ చెబుతుంటే నీకర్థం గాదా? నీ కొడుకును తీస్కపొయ్యి నేనేం జేస్కుంట?" అంటూ మదమెక్కిన అడవి దున్నలా రంకెలేస్తూ ఇంట్లో నుండి బయటకు వెళ్ళిపొయ్యాడు పాపారావు.

"నా కొడుకును ఖచ్చితంగా మీరే ఏదో చేసింర్రు. మర్యాదగ నాకొడుకును నాకు తెచ్చియ్యండ్రి!" అంటూ అదేపనిగా ఏడుస్తూ వారం పది రోజులు అన్నం నీళ్ళు ఉగ్గబట్టింది ఆనంద.

అటు బిడ్డ గోసను చూడలేక ఇటు జరిగిందేమిటో ధైర్యం చేసి చెప్పలేక అవిటి తల్లి కనకమ్మ మంచం పట్టెలకు తల కొట్టుకుంటూ తనూ గోడు గోడున ఏడవసాగింది.

అంత జరుగుతున్నా పాపారావు దంపతుల నోటికి దడిసి ఇరుగు పొరుగువాళ్ళు "గాలికి బొయ్యే కంప నెత్తికెక్కొట్టుకున్నట్టు మనకెందు కొచ్చిన గోల?" అనుకుంటూ కిమ్మ నాస్తిగ వుండిపొయ్యారు.

దీపంలో నూనె అయిపోతూ వుంటే మెలమెల్లగా కొడిగట్టిపొయ్యే వత్తిలా పేగుబంధపు తల్లితనం బిడ్డ మీద మరులు రేపుతూవుంటే "కొడుకా! కొడుకా!" అంటూ కనీసం కళ్ళనిండుగానైనా చూసుకోని ఆ పసిగుడ్డును తల్చుకుంటూ రోజు రోజుకూ నీరసించిపోయిన ఆనంద ఆఖరికి ఆ పురిటి మంచంమీదనే ప్రాణాలు విడిచింది.

బిడ్డ చావును కళ్ళారా చూసిన కనకమ్మ ఇంటికప్పు ఎగిరి పోయేలా ఏడుస్తుండడంతో "ముసల్ది అంతగనం ఏడుస్తుందేంటో?" అనుకుంటూ ధైర్యం చేసిన ఇరుగుపొరుగువాళ్ళు ఒక్కొక్కళ్ళే ఆనంద వాళ్ళుండే గుడిశ దగ్గరికొచ్చారు.

వాళ్ళను చూసిన పాపారావు దంపతులు "మీరంత మా ఇంటికెందుకొచ్చింర్రు? ఏం చూద్దామనొచ్చింర్రు? మీ బాగోతాలేందో మాకు తెల్వదా? తెల్సినా మేమెప్పుడన్న మీ ఇండ్లకొచ్చి నల్లనన్నమా? తెల్లనన్నమా?" అంటూ వాళ్ళ మీదికి రేసుకుక్కల్లా ఎగబడ్డారు.

వాళ్ళ మాటలు వినడంతోనే బ్యాటరీ అయిపోయిన ఆట బొమ్మల్లా ఇరుగు పొరుగు వాళ్ళంతా ఎక్కడివాల్లక్కడే ఠక్కున ఆగిపోయి "కుక్కజోలికి పొయ్యేదెందుకు? సక్కదనం ఎంచించుకునేదెందుకు? వాళ్ళ సావు వాల్లే సస్తర్లే పొండ్రి!" అనుకుంటూ వచ్చినంత వేగంగా వెనుదిరిగి పోయారు.

ఆతరువాత ఓగంటకు పాపారావు వాళ్ళ ఇంటి ముందుకొచ్చిన ఆంబులెన్స్ ఆనంద శవాన్ని ఎక్కించుకొని వెళ్ళిపోయింది.

నాలుగు రోజుల తరువాత!

పాపారావు తన చెల్లెలి శవాన్ని లక్ష రూపాయిలకు ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీ వాళ్ళకు అమ్ముకున్నాడన్న విషయం తెలిసిన ఆ వీధిలోని జనం ఆశ్చర్యంతో కొయ్యబారి పోయారు.

"ఎవరేమనుకుంటే మనకేంలే?" అనుకున్న పాపారావు దంపతులు ఎ.సి, ఫ్రిజ్ లతోపాటు చేరో మంచి సెల్ ఫోన్ కూడా కొనుక్కున్నారు.

– శిరంశెట్టి కాంతారావు

m : 9849890322, 9492434222

e : k.r.siramsetty@gmail.com

## వనపట్ల సుబ్బయ్య

# దీర్ఘకవితలు - తెలంగాణ ఉద్యమం

(గత సంచిక తరువాయి)

వూరుకు చెరువు గుండె కాయ
చెరువుకు నీరడి గుండెకాయ
అణువణువు లోతెంతో ఎత్తెంతో తెలిసినోడు
నీటి మట్టాన్ని చూసి
ఆయకట్టెంత పారుతదో / ఎన్నెకరాలు సాగైతదో
చిటికెలో చెప్పేస్తడు / కర్ర కర్రకు నీళ్లిడిసి
కన్న బిడ్డోలె సాదె / తూనీగలా ఈగి
తూము సాపు చేస్తడు / కంటికి రెప్పలా నన్ను కాపాడేది

నా అన్న ఇంజనీరు నీరడి'ని చెరువులు నీటితో కలకలలాడితేనే ఆవరణ వ్యవస్థ అరుదైన జంతుజాలం మనుగడ కొనసాగిస్తుంది. చెరువులతోనే పల్లెలు ప్రగతి బాటవైపు నడుస్తాయి. కవులకు కథా వస్తువులవుతాయి, చెరువు ఎండి కరువొస్తే ఊహకందని ప్రకృతి విలయాలు సంభవిస్తాయి. ఊరులో చెరువు నీటితో ఎంత అందంగా వుంటుందో కవి సుబ్బయ్య చెబుతూ...

'చింతలున్న ఊరు / చింతలేని ఊరు
చెరువులున్న ఊరు / కరవులేని ఊరు
బతుకులేని ఊరు / మట్టికి మనిషికి
రైతుకు నేలకు / వూరుకు చెరువు
తరతరాల బంధం / చెరువు లేని ఊరు
అమ్మ లేని అనాథ / నీళ్లు లేని చెరువు
పాలు లేని రొమ్ము'

అంటూ చక్కని ప్రతీకలతో చెరువు గొప్పతనాన్ని మన కళ్ళ ముందు చిత్రిక పడతాడు. లాంగ్‌పోయెంలో ఎక్కడ కూడా ఎంచుకున్న ఇతివృత్తం నుంచి దారి తప్పకుండా, వర్ణనా పరిధి మించిపోకుండా సహజమైన శైలిలో కవితను ముందుకు నడిపిస్తాడు. వలస పాలకుల కుట్రలతో నీటి సంఘాలు, వాటర్‌షెడ్ల పేరుతో పదవీ రాజకీయాలు తప్ప చెరువులకు ఒరిగేదేమి లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. జన్మభూమి, జలయజ్ఞం, స్వర్ణాంధ్ర, హరితాంధ్ర నినాదాలతో తెలంగాణ చెరువులు ఎడారులుగా చేసిన కుయుక్తులను కవి తీవ్రంగా ఎండగట్టాడు. తన నిత్యజీవితంలో పరిశీలనలోకి వచ్చిన అంశాలను సులువుగా కవిత్వీకరించడంలో వనపట్ల సుబ్బయ్య చేయి తిరిగిన కవిగా ముందుకు సాగుతున్నారు.

గత సీమాంధ్ర పెట్టుబడిదారి పాలకుల చేతుల్లో కుదేలయిన చెరువులను పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది. గత బడ్జెట్ ప్రణాళికలు సర్వేలకు పరిమితం కాగా, వ్యవసాయం దండగని, టూరిజం, కంప్యూటరిజాన్ని ప్రోత్సహించి చెరువులను మాయం చేసి కరవుబారిన పడేశారు. తెలంగాణ పునర్వైభవం కోసం అందరూ నడుంబిగించాలి. గత పాలకుల విధానాలను అమలు చేయొద్దని హెచ్చరిస్తాడు కవి.

'సకల జనుల సమ్మెలా / మిలియన్ మార్చ్‌లా
పల్లెలన్ని కదలాలి / తట్టపార పట్టి ఒంట్రంత ఎత్తాలి
అడుగులో అడుగేసి / అలుగెత్తు పెంచాలి
ఆయకట్టు పెంచాలి / కురిసిన చినుకులను కురిసినట్లే దాచుదాం
చెరువుల పూడికదీసి / జల సంపదను కాపాడుదాం
తీరొక్క రుచులతో సెదపోగొట్టి / వృత్తులకు ఉపాధి పెంచుదాం
పుడమిని పసిడి సిరులు చేద్దాం!' అంటాడు.

> సుబ్బయ్య కవిత్వమంతా బాధాసారుప్యంలోంచి కణ కణమండే లావాలా ఉబికి వచ్చిందే కనుక కవిత్వం సహజ పాండిత్యం, సకల జనుల స్పృహ, సబ్బండ జాతుల సంస్కృతి, సంప్రదాయాలు అక్షరాల్లో ఇమిడి ఉంటాయి. సుబ్బయ్య అక్షరాలు ఆకాశం నుంచి రాలిపడలేదు. ప్రతీ అక్షరానికి చారిత్రక నేపథ్యం వుంటుంది.

ఊరు చెరువు పునర్నిర్మాణం కోసం గ్రామంలోని సబ్బండ జాతులు సమర శంఖమూదినట్లుగా పలుగు పారలతో సమిష్టి శ్రమతో కృషిని సాగించాలని 'మిషన్ కాకతీయ' లక్ష్యాన్ని జయప్రదం చేయాలని కవి కోటి ఆశలతో చెరువుకు కొత్త కళను ఆకాంక్షిస్తాడు. 'ఊరు చెరువు'లో ఎట్లైయితే విభిన్న జీవరాసులు సమైక్య జీవనం ఉంటుందో సుబ్బయ్య కవిత్వంలో పాలమూరు, తన బాల్యంలోని వివిధ కాలాల్లో తన జీవితంలో భాగమైన చెరువులను, కుంటలను ఆత్మీయంగా గుర్తు చేసుకుంటడు.

సుబ్బయ్య కవిత్వమంతా బాధాసారూప్యంలోంచి కణకణమండే లావాలా ఉబికి వచ్చిందే కనుక కవిత్వం సహజ పాండిత్యం, సకల జనుల స్పృహ, సబ్బండ జాతుల సంస్కృతి, సంప్రదాయాలు అక్షరాల్లో ఇమిడి ఉంటాయి. సుబ్బయ్య అక్షరాలు ఆకాశం నుంచి రాలిపడలేదు. ప్రతీ అక్షరానికి చారిత్రక నేపథ్యం వుంటుంది. 1993లో మొలక చింతలపల్లి సాగునీటి పథకం (మహాత్మగాంధీ ఎత్తిపోతల పథకం) సాధనకు జరిగిన జల సాధన సమితి ఉద్యమంలో సోమశిల నుంచి మహబూబ్‌నగర్ వరకు జరిగిన పాదయాత్రలో కవి స్వయంగా పాల్గొన్న పుట్టిన 'తడి'లోని దీర్ఘకవిత 'నదితో నా ముచ్చట' సాగించారు. కవిత ప్రారంభంలో నదితో సంభాషణ రూపంలో మొదలై కృష్ణానది, తాను పడుతున్న బాధలను మీరేమైన తీర్చదానికి ముందుకొస్తారా? అంటూ ప్రశ్నిస్తుంది. పాలమూరు జిల్లాను ఆనుకొని రెండు వందల తొంభై కిలోమీటర్లు కృష్ణమ్మ ప్రవహిస్తున్నా కానీ తన బిడ్డల దాహార్తిని తీర్చని దుంఖం. స్థానిక పాలకుల స్వార్థం, వలస పాలకుల అవినీతి, దోపిడీ విధానాలే కారణమని కృష్ణమ్మ తన స్వగతంగా గోదు వెళ్లబోసుకుంటుంది.

రెండు జీవనుదులు పారుతున్నా / జీవితాలెందుకిట్లున్నవి
నీళ్లున్నకాడ / నాగరికతెందుకు విధ్వంసమైంది

జీవనదులున్న కాడ జీవితాలెందుకు వలసలు పోయినవి అంటూ ప్రశ్నిస్తాడు. నదిపారిన నాగరికతలు అభివృద్ధి సాధించాల్సినప్పటికీ మనుషులు ఎందుకు బతుకుదెరువు కోసం వలస పోతున్నారోనని పాలమూరు గోసకు కన్నీటి పర్యంతమవుతాడు కవి. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజుల్లోనే పోతిరెడ్డిపాడు కాలువను సీమ పెట్టుబడిదారి ఆధిపత్య నాయకత్వం బలవంతంగా తరలించుకు పోయారని మండిపడుతుందా నదీమ తల్లి!

'నా పొట్టలో గడ్డపారేసి / నా రక్తాన్ని పారించుకుంటున్నరు
జబర్దస్తిగా / పోతిరెడ్డిపాడును మలుపుకుంటున్నరు
పుట్టినూరిలో / నా ఆనవాళ్లను మాయజేసే కుట్ర
ఈ కుట్రల్ని ఆపడానికి / మీరేమైనా ముందుకొస్తరా!'

అంటూ కవే పరోక్షంగా తెలంగాణ నాయకత్వాన్ని నిలదీస్తున్నాడు. నాపై దీర్ఘకవిత రాసి ఏం చేస్తావని, నదులు పారుతున్నా నేల మీద బతుకు ఎందుకు విధ్వంసమైందని కవిని నది ప్రేమతో అడుగుతోంది. ఇక్కడ కృష్ణానదీ దుఃఖం, కవి ఆవేదన ఒకే బాధాసారూప్యంలోంచి సమరూప నిర్మాణంలో ఎంచుకున్న ఎత్తుగడ పాఠకుణ్ణి ఎక్కడా కూడా పక్కదారి పట్టకుండా కవితాఝరిలోనే సాగిపోయేందుకు కవితా నిర్మాణం ఉపకరిస్తుంది. పాలమూరు బాధను వర్ణిస్తూ...

'సుట్టు ముట్టు నీళ్లు / సుట్టమొస్తే కన్నీళ్లు
బడాబాబుల చేతుల్ల / బల్బుల్లా వెలుగుతున్న
వాటర్ బాటిళ్లు / వరదొస్తే వణికిపోత
కరువొస్తే కూలిపోత / పెండ్లైనా చావైనా
పండగప్పుడే జేజబువ్వ'ంటూ వలస బతుకుల్లో గూడుకట్టుకున్న

వెతల చిత్రాలను అద్భుతంగా చిత్రీకరిస్తారు. పాలమూరు జిల్లాల్లో కరువు మేఘాలు వచ్చినా, కరెంటు కొరత వచ్చినా, వాన రాకపోయినా, గిట్టుబాటు ధర దక్కకపోయినా రైతులు ఉరితాళ్లను కౌగిలించుకోవడం నిత్యకృత్యంగా మారిందని బాధపడుతాడు.

'కరువు కసాయిలా వెంటాడినా
కవిత్వం కనకాంబరాలై పూసింది
తెలుగు సాహిత్యానికి

పాలమూరు కవులు మొగురాలు అంటూనే ప్రజల వాడుకలో లేబర్‌జిల్లా, కరువు జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లాని సర్వనామా లున్నప్పటికీ తాగునీరులో ఫ్లోరైడ్, తాగితే కిడ్నీలో రాళ్లు తాగకపోతే పొలాలు బీళ్లుగా మారుతున్నాయని, నీళ్ల కోసం ప్రశ్నించే ప్రజల తలల పాలకుల లాఠీలు, స్కాలర్‌షిప్పులు అడిగితే విద్యార్థుల వీపుల మీద నృత్యం చేస్తున్న లాఠీస్వామ్యాన్ని నిరసిస్తున్నాడు. పావురంగా సాదుకున్న గొడ్లకు మేతలేక కబేళాకు తరలుతుంటే బతకుదెరువుకు మనుషులు దేశాల బాటలు పడుతున్నారు. గింజల కోసం పక్షులు పరరాజ్యం పోతుంటే ఉద్యమించే విప్లవకారులను పాలకులు బూటకపు ఎదురుకాల్పుల్లో చంపుతున్న వేదనను సుబ్బయ్య చాలా ఆవేదనగా అక్షరీకరించారు. కరవు దృశ్యాలు ఒక్క పాలమూరు బతుకు బాధలే కాదు, సమస్త తెలంగాణ వర్తమాన చిత్రపటంగా దీర్ఘకవితలో ఆవిష్కరించారు.

'నీళ్లను చూడగానే / బతుకమ్మను చూసినంత ఆనందం
నీరు పల్లమెరుగులాగా / నీరు న్యాయమెరుగు అనేవి
సార్వత్రిక సత్యమై ఉంటే / ఎంత బావుండన్న
బాలగోపాలు మాటలు / మనకెపుడూ బోధపడలే! అంటాడు.

అవును! నాగరికతంటే నీళ్లే కదా! నీళ్లు ప్రపంచ మార్కెట్‌లో సరుకైయిన తర్వాత గొంతెండి పోతున్న మనిషి జీవితం ఎంత

# చిల్డ్రన్ రీడర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'అపూర్వ రష్యన్ జానపద కథలు' పుస్తకావిష్కరణ

మే 12న ఎన్‌బిటి సమావేశ మందిరంలో అనిల్ బత్తుల రష్యన్ కథలకు చేసిన స్వేచ్ఛానువాదం 'అపూర్వ రష్యన్ జానపద కథలు' ఆవిష్కరణ జరిగింది. చిరంజీవులు ఆద్య, చాతుర్య, పత్తిపాక అభ్యుదయ్ శంకర్‌లు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిల్లలకు వివిధ కార్యరకమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా డా॥ పత్తిపాక మోహన్, ఎం.వేదకుమార్, స్వాతి కుమారి



బండ్లమూడి, అనిల్ బత్తుల పాల్గొన్నారు. నిజాం వెంకటేశం, సివిఎస్ రాంబాబు, రమణజీవి, పికాక్ గాంధీ, సురేశ్‌కుమార్, మాయ పుస్తకం సురేశ్ నందన తదితరులు పాల్గొన్నారు.

దారుణం. ప్రకృతి వనరును పర్యావరణ దృక్పథంలో సంరక్షించుకుని భావితరాలకు వారసత్వ సంపదగా నీళ్లను అందించాల్సిన బాధ్యత మన మీదే ఉందని 'నదితో ముచ్చట'లో సుబ్బయ్యను అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణ నేల పడుతున్న బాధలకు నిబద్ధత కలిగిన ఓ బుద్ధిజీవికి కాలం జన్మనిచ్చింది. ప్రొఫెసర్ జయశంకర్ సర్, తానెత్తుకున్న తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షల జెండాను దించకుండా పల్లెపల్లెకు కాలుకు బలుపం కట్టుకి తిరిగిన తెలంగాణ జాతిపిత కొత్తపల్లి జయ శంకరుడు. జీవితాంతం ఒకే కల సాధన కోసం నిత్యం పరితపించి లక్ష్యం పట్ల నిమగ్నత, నిజాయితియే ఆయన్ను తెలంగాణకు జాతిపితను చేసింది.

> **తెలంగాణ నేల పడుతునన బాధలకు నిబద్ధత కలిగిన ఓ బుద్ధిజీవికి కాలం జన్మనిచ్చింది. ప్రొఫెసర్ జయశంకర్ సర్, తానెత్తుకున్న తెలం గాణ స్వరాష్ట్ర ఆకాంక్షల జెండాను దించకుండా పల్లెపల్లెకు కాలుకు బలుపం కట్టుకి తిరిగిన తెలంగాణ జాతిపిత కొత్తపల్లి జయ శంకరుడు.**

ఆచార్యుని ఆదర్శాన్ని కీర్తిస్తూ వనపట్ల సుబ్బయ్య రాసిన 'జనశంకరుడు' దీర్ఘకవితను మనుసును కదిలించే పదాలను భావోద్వేగాలతో అక్షరీకరించారు. తెలంగాణ ఉద్యమం తీర్చిదిద్దిన ఉద్యమ కవి వనపట్ల సుబ్బయ్య దీర్ఘకావ్యాలు రాయడంలో చేయి తిరిగిన కవిగా తెలంగాణ వచన కవితా సాహిత్యంలో తన స్థానం పదిలపరచుకున్నారు.

'పార్టీలేవైనా అతనే కరపత్రం
నాయకులెవరైనా అతనే మేనిఫెస్టో
భుజాలు కాయలైనా బతుకమ్మను దించని బుద్ధుడు
నమ్మిన తోవలో ఒంటరైనా
సర్వజనుల హితాన్ని మరువని
సమతా బోధ గురువు

జయశంకరుడు విద్యార్థిగా మర్కజీ స్కూల్ నుంచి మొదలైన జైతెలంగాణ నినాదాన్ని ప్రజల్లోకి, అటు నుంచి అసెంబ్లీ, పార్లమెంట్‌ను స్తంభింపి చేసేదాక నినాదానికి తన ఊపిరినందించిన ప్రొఫెసర్ మాట ప్రజలకు మంత్రంగా పనిచేసింది ప్రలోభాలు, పదవులు ఎవరెన్ని ఎరలేసినా లొంగని మేరునగధీరుడు.

ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీలో తెలంగాణ పదాన్ని నిషేధించిన వలస పాలకుల ఆధిపత్య రాజకీయ కోటలను తన భావజాల వ్యాప్తితో బద్దలు కొట్టిండు.

పాయలు పాయలైన కాలువల్ని / మైదానాలకు మళ్లించి
జనసంద్రం చేసిండు / శంఖులన్నేరి
స్వరాజ్య శంఖంపూరించిండు / పాతాళంలోని నినాదాన్ని
ఆశయ పతాకం చేసి

పుడమిని పూల బతుకమ్మను చేసిండు. ఉద్యమ ఆకాంక్షలను ఇంటింటికి చేరవేయడంతో జయశంకర్ గారి కృషి భావితరాల ఉద్యమాలకు ఆదర్శనీయమైన స్ఫూర్తి.

నెత్తురుమడుగైన నేలను / పిడికెడు మాటల్ని
విత్తనాలుగా చల్లితే / ఉద్యమ దివిటీలై మండినవి
నిశ్శబ్దం ఆవరించినపుడు / పిడికెడు అస్తిత్వాన్ని
సిద్ధాంతంగా బోధిస్తే / ఉద్యమ కిరణాలై వెలిగినవి...

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం కాకముందే ప్రొ. జయశంకర్ సర్ మరణం తెలంగాణ ఉద్యమకారులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఉద్యమానికి ఆయువును అందించిన విలుకాని మరణాన్ని కవి వనపట్ల తీవ్రంగా కలత చెందుతాడు.

'దుక్కుల దాహం తీరకుండానే / దూళ్ల దూపారక మునుపే
చెరువు నిండక ముందే / జీవనది ఆగిపాయె'నని కన్నీరు పెట్టుకుంటాడు.

సుబ్బయ్య కవిత్వంలో శిల్ప ప్రాధాన్యతలతోపాటు ఎన్నుకున్న వస్తువు మీద విస్తృతమైన పరిశ్రమ చేస్తూ, ఆ క్రియలోనే సంలీనమౌతూ, తనను తాను అంకితం చేసుకుంటూ వస్తాడని అవగాహన చేసుకోవచ్చును. కవిత్వంలో మనకు అలవోకగా జయశంకరుని మానవీయ వ్యక్తిత్వాన్ని 'తెలంగాణ సర్వనామం'గా చూపించడం గమనించవచ్చు. జయశంకర్ సర్ తాను పుట్టిన నేల రుణం తీర్చుకుంటే, మనందరి తరపున కూడా పాలమూరు ముద్దుబిడ్డ కవి సుబ్బయ్య జయశంకర్ గారిని సాహిత్యంలోఅక్షరీకరించి తన వంతు బాధ్యతను నెరవేర్చుకోవడానికి దీర్ఘకవితలో చేసిన ప్రయత్నంలో సఫలీకృతం చెందారు.

-కోడం కుమారస్వామి,
m : 9848362803
e : presskks@gmail.com

## పుస్తక పరిచయం

పుస్తక పరిచయం శీర్షిక ద్వారా వివిధ పుస్తకాలను పాఠకులకు పరిచయం చేసే ప్రయత్నం ఇది. ఈ వేదిక ద్వారా పాఠకులకు తమ పుస్తకాలను పరిచయం చేయాలనుకునే రచయితలు, ప్రచురణ సంస్థలు తమ పుస్తకాలు రెండు కాపీలను దిగువ చిరునామాకు పంపించవచ్చు. వీలు వెంట వాటిని ప్రచురిస్తాం. సమకాలీన సామాజిక అంశాలతో కూడిన కొత్త పుస్తకాలకు ప్రాధాన్యం.

పుస్తకాలు పంపించాల్సిన చిరునామా:


TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

## యువ జర్నలిస్టులకు మార్గదర్శి

# 'అక్షరాయుధం' పుస్తకం

**1977** లో తెలంగాణ విద్యావంతుల వేదిక, 1978లో తెలంగాణ స్టడీఫోరం, 1999లో తెలంగాణ జన సభలో కీలక పాత్ర పోషించి, 2001లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా ఆవిర్భవించిన టీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడిగా, పొలిట్ బ్యూరో సభ్యునిగా, సీనియర్ జర్నలిస్టుగా ఎన్నో రచనలతో, కవితలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు ఆర్.సత్యనారాయణ. విలువలు కలిగిన జర్నలిస్టుగా, ప్రజానాయకుడిగా, ప్రజల తరపున నిలిచే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి ఆర్.సత్యనారాయణ. తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించి, తెలంగాణ కోసం తన వంతు కృషి చేసిన వ్యక్తి ఆర్.సత్యనారాయణ. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నేత కేసీఆర్ పిలుపుమేరకు అనేక ఉద్యమాల్లో రథసారథిగా నిలిచాడు. తన సొంత అవసరాలను త్యాగం చేసి జిల్లాల్లో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేశాడు. తెలంగాణ జేఏసీలో ఆయన చేదోడు వాదోడుగా ఉండి, తెలంగాణ సాధించుకోవడంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో కీలక పాత్ర పోషించాడు. 2007 లో కరీంనగర్ జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్సీగా నిలిచి, అసెంబ్లీలో తన గళాన్ని వినిపించాడు. పార్టీ ఆదేశాల మేరకు ఆరు సంవత్సరాలు ఉన్న ఎమ్మెల్సీ పదవికి కేవలం ఆరు నెలల్లోనే రాజీనామా చేసి ప్రజల పక్షాన, నాయకుడి పక్షాన, ఉద్యమ పక్షాన నిలిచిన గొప్ప వ్యక్తి ఆర్. సత్యనారాయణ. ఓ పక్క నాయకుడిగా... మరోపక్క జర్నలిస్టుగా తనవంతు కృషి చేస్తూ.. నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకంగా నిలిచిన వ్యక్తి.



ఆర్.సత్యనారాయణ రచించిన 'అక్షరాయుధం' పుస్తకావిష్కరణ మే 1న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖమంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్ని పుస్తకాన్ని ఆవిష్కరించారు. మెతుకుసీమ సామెత సంస్థ – సంగారెడ్డి నిర్వహణలో జరిగిన పుస్కకావిష్కరణలో తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాదరావు, తెలంగాణ ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ, ఐజేయూ నాయకులు దేవులపల్లి అమర్, ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ, సీనియర్ జర్నలిస్టులు రామచంద్రమూర్తి, మల్లేపల్లి లక్ష్మయ్య, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రొళ్ల శ్రీనివాస్, టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు కారం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. సమాజం కోసం తమ వృత్తి ధర్మాన్ని నిష్పక్షపాతంగా, నిష్కర్షంగా నిర్వర్తించే జర్నలిస్టుల జీవితాలు.. ఈ తరం యువ జర్నలిస్టులకు పాఠాలు కావాలని తెలిపారు. కూలీ నుంచి ఉత్తమ జర్నలిస్టుగా ఎదిగిన సత్యనారాయణ జీవితం మార్గదర్శకం అన్నారు. సత్యనారాయణతో తనకు 18 ఏళ్ల అనుబంధం ఉందని తెలిపారు. ఉద్యమాల్లో, పోరాటాల్లో కలిసి పనిచేశామని హరీష్‌రావు గుర్తు చేశారు. ఆర్థికంగా ఎన్ని కష్టాలు ఎదురైనా అలుపెరగని అకుంఠిత దీక్షతో ముందుకు సాగారని తెలిపారు. ఏ వార్త రాసినా అందులో మానవీయకోణం ఉండేదని, గొప్ప వ్యక్తిత్వం కలిగిన మహోన్నతుడు సత్యనారాయణ అని తెలిపారు. అక్షరాయుధం పుస్తకం రేపటి తరం జర్నలిస్టులకు మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. రచనలు, కవితలు, ప్రచురణలు ముందుతరాల వారికి ఉపయోగపడేలా ఉండాలని పేర్కొన్నారు. ఏండ్ల తరబడి జర్నలిజంలో విశేష అనుభవమున్న సీనియర్ల వ్యాసాలను, వారి అనుభవాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి జర్నలిస్టు తమ వృత్తి అనుభవాలను పుస్తకరూపంలో తీసుకురావడం సమాజంలో మార్పునకు దోహదం చేస్తుందన్నారు. స్వాతంత్రోద్యమం మొదలుకుని తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన ఘనత జర్నలిస్టులకే దక్కుతుందన్నారు. మలిదశ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని, వారి పాత్ర చరిత్రలో నిలుస్తుందని కొనియాడారు. జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ... పవిత్రమైన అక్షర వృత్తినే నమ్ముకుని సామాజిక చైతన్యమే లక్ష్యంగా పనిచేస్తూ ఆర్.సత్యనారాయణ 'అక్షరాయుధం' పుస్తకం రాయడం హర్షణీయమని హరీష్‌రావు అన్నారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల అనుభవాలను రికార్డు చేయాల్సిన అవసరం ఉందనే ఆలోచనలకు సత్యనారాయణ నాంది పలికారని అన్నారు. ఈ పుస్తకంలో ఆయన వ్యక్తిత్వం కనబడుతుందని తెలిపారు. ఆయన విద్యా నాయకుడిగా మొదలై... పత్రికా విలేఖరిగా ప్రయాణం సాగించి... తిరిగి మళ్లీ రాజకీయాల్లోకి వచ్చి తెలంగాణ ఉద్యమంలో కీలకమయ్యారు. టీవీ ఛానల్ పెట్టుకొని.. అటు జర్నలిజాన్ని ఇటు



రాజకీయాన్ని సమాంతరంగా నడుపుతున్నట్టువంటి వ్యక్తి సత్యనారాయణ అని తెలిపారు. సత్యనారాయణతో తనకు 34 సంవత్సరాల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు.

తెలంగాణ ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ..ఆర్.సత్యనారాయణ చిన్నతనం నుంచే కష్టాలు పడి ఎదిగిన వ్యక్తి అని తెలిపారు. తెలంగాణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించి తన వంతు కృషి చేసి.. తన రిపోర్టులో ఎన్నో విషయాలను తెలియజేశారు. ఏది రాసినా ప్రజల పక్షాన్నే రాసేవాడని తెలిపారు. ఈ పుస్తకంలో అన్ని రిపోర్టులు రాయడం వల్ల మెదక్ జిల్లా చరిత్ర కూడా రికార్డు కావడం జరిగిందన్నారు. ఈ పుస్తకంలో ఆయన చరిత్రతో పాటు అప్పటి విషయాలను తెలియజేయడం నేటి యువ జర్నలిస్టులకు ఉపయోగకరంగా ఉందని తెలిపారు. ఇప్పటికూడా జర్నలిస్టుగా, విద్యార్థి నాయకుడిగా, తెలంగాణ ఉద్యమ నాయకుడిగా, రాజకీయ నాయకుడిగా సత్యనారాయణకు భాగస్వామ్యం కావడం జరిగిందన్నారు.

సీనియర్ జర్నలిస్టు రాంచంద్రమూర్తి మాట్లాడుతూ.. ఈ పుస్తకం పాత్రికేయులకే కాకుండా రాజకీయ వాదులకూ, సామాజిక కార్యకర్తలకూ, విశ్లేషకులకూ స్ఫూర్తినిస్తుందని తెలిపారు. వృత్తి జీవితాన్ని ఉన్నది ఉన్నట్లు రాసిన గొప్ప మానవతావాది అని అన్నారు. ఐజేయూ జాతీయ నాయకుడు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ... జర్నలిస్టుల జీవితాలు పాఠ్యపుస్తకంగా రావాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే జర్నలిస్టులకు ఈ పుస్తకం ఆకర్షిస్తుందని తెలిపారు. ఇలాంటి పుస్తకాలు తెలంగాణ జర్నలిస్టులు రాయాలని సూచించారు.

బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాదరావు మాట్లాడుతూ... సత్యనారాయణ అనుభావాలను గురించి ఈ పుస్తకంలో రాయడం జరిగిందన్నారు. అప్పట్లో సత్యనారాయణ తమతో చాలా అనుభావాలను చెప్పడం జరిగిందన్నారు. గతంలో ఆయనతో గొడవలు జరిగినప్పుడు కూడా సత్యనారాయణ అందరితో మమేకమై, ఆ తర్వాత కాలంలో ఆయనతో కలిసి స్నేహపూరకంగా పనిచేయడం జరిగిందని గుర్తు చేశారు. 80వ శతాబ్దం నుంచి 2001 వరకు తెలంగాణ ఉద్యమంలో మెదక్ జిల్లా కవులు, రచయితలు, జర్నలిస్టులు నిర్వహించిన పాత్ర చరిత్రలో మరువలేదని ఆయన గుర్తుచేశారు.

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనలో సత్యనారాయణ ఇంటి నుంచే ఎన్నో ధర్నాలు, సమ్మెలు ఆయనతో కలిసి చేయడం జరిగిందన్నారు. ఆయన కలం ద్వారా నవ సమాజానికి మరెన్నో పుస్తకాలు రాయాలని కోరారు.

జర్నలిస్టు, మాజీ ఎమ్మెల్సీ ఆర్. సత్యనారాయణ మాట్లాడుతూ.. జర్నలిస్టుగా 25 ఏళ్లపాటు క్రియాశీలకంగా పనిచేసినప్పుడు అప్పటి పరిస్థితులు, అనుభవాల రూపమే ఈ పుస్తకమని తెలిపారు. ముఖ్యంగా తన జర్నలిస్టు జీవితంలో మూడు రకాల ఉద్యమాలు రావడం జరిగిందన్నారు. నక్సలైట్ ఉద్యమం, సామాజిక ఉద్యమం, తెలంగాణ ఉద్యమాలల్లో భాగం పంచుకునే అదృష్టం ఓ జర్నలిస్టుగా తనకు దక్కిందన్నారు. తన ఎదుగుదలతోపాటు... ఈ పుస్తక రచనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు ... పుస్తకావిష్కరణ సందర్భంగా వచ్చిన పెద్దలకు సత్కారం చేశారు.

**-ఆర్. పురుషోత్తం నాయుడు**

m : 9573041226

e : janata.rpnaidu@gmail.com

DECCAN tv
Voice of Telangana
Watch On Hathway Network, Channel No.70



# బాలల సాహిత్యం - రచన - సవాళ్లు...

**భా**వి సమాజానికి విలువలతో కూడిన పౌరులను అందించాలంటే... అది బాల్యం నుంచే సాధ్యమవుతుంది. అలాంటి విలువలను బాల్యం నుంచే నేర్పడంలో బాలల సాహిత్యం ముఖ్యమైనది. ఇదే క్రమంలో... నేటితరం పిల్లలను ఆకట్టుకునేలా కొత్త ఒరవడిలో 'బాల చెలిమి పత్రిక' త్వరలో వెలువడనుంది. ఈ నేపథ్యంలో... గత నెల ఏప్రిల్ 2న అంతర్జాతీయ పిల్లల పుస్తక దినోత్సవం రోజున హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ' ఆధ్వర్యంలో 'బాల చెలిమి ముచ్చట్లు' పేరుతో తొలి చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. దానికి కొనసాగింపుగా మే 12న.. 'బాలల సాహిత్యం - రచన - సవాళ్లు' అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. బాల చెలిమి పత్రిక ప్రచురణతోపాటు... ఇలా ప్రతినెల రెండో శనివారం బాలల సాహిత్యంపై ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

'చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ' చైర్మన్ యం. వేదకుమార్ అధ్యక్షతన... మే 12న జరిగిన 'బాలల సాహిత్యం - రచన - సవాళ్లు' కార్యక్రమంలో ప్రముఖ బాల సాహితీవేత్తలు డా. వి.ఆర్.శర్మ, పైడిమర్రి రామకృష్ణ, దాసరి వెంకట రమణ, వేదాంతసూరి, డా. కందెపి రాణీ ప్రసాద్, పుట్టగంటి సురేష్, డా. పత్తిపాక మోహన్, డా. బెల్లంకొండ సంపత్, డా.రఘు, గరిపల్లి అశోక్, అనిల్ బత్తుల, చొక్కపు వెంకట రమణ, డా.సిరి, తిరునగరి శ్రీనివాస్, పెండెం జనార్దన్, రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, జుగాష్ విల్లీ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలల సాహిత్య రచనలు చేయాలంటే... అసలు ముందుగా బాల్యం గురించి లోతుగా తెలుసుకోవాలని... దీనిపై అధ్యయనం చేయాలని బాల సాహితీ రచయిత వి.ఆర్.శర్మ అన్నారు. ఆసిఫాలాంటి ఘటనలు జరిగినపుడు... బాలల రచయితపై ఎలాంటి బాధ్యతలు ఉన్నాయో ప్రశ్నించుకోవాలో అని శర్మ సూచించారు.

**వి.ఆర్.శర్మ, బాల సాహితీ రచయిత**

బాల సాహిత్యం - సవాళ్ల ప్రశ్న వేసుకున్నప్పుడు... అసలు ఈ రోజుల్లో బాల సాహిత్యం లక్ష్యం ఏమిటనే ప్రశ్న తలెత్తుతుంది. వందేళ్ల క్రితం పాశ్చాత్య రచనల ప్రభావంతో... మనదేశంలో బాల సాహిత్య రచనలు ప్రారంభించుకున్నప్పుడు ఆనాటి సమాజ అవసరాలు, పరిస్థితుల మేరకు సూత్రీకరణలతో రచనలు చేశారు. కానీ ప్రస్తుత సమాజం అలా లేదు. అప్పట్లో రచయితలు ఆర్థికంగా, సమాజంలో ఉన్నతవర్గాల వారు తాము చూసిన, అనుభవించిన బాల్యాన్ని, పాశ్చాత్య రచనల ప్రభావంతో బాల సాహిత్యాన్ని అందించారు. కానీ నేటి బాల్యం చాలా మారింది. ఇప్పటికీ అదే పాత్ర సూత్రాలతో బాల సాహిత్యాన్ని రచించడం ఎంతవరకు సమంజసమైనదనేది మొదటి ప్రశ్న. దీనిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని నా వ్యక్తిగత అభిప్రాయం.అసలు బాల్యం ఎక్కడ మొదలై ఎక్కడ అంతమవుతుందీ అనుకుంటే... పాత సూత్రీకరణలన్నీ ప్రస్తుత పరిస్థితులకు వర్తిసాయా.. అనే చర్చ జరగాలి. పెద్దలకు ఏది మంచిదో... పిల్లలకు అదే మంచిది... పిల్లలకు ఏది చెడ్డదో.. పెద్దలకు కూడా అదే చెడ్డది.. ఇలాంటి విషయాలపై విస్తృతంగా చర్చించాలి. నేటి బాల్యాలు... విద్య, తిండి, యుద్ధాలు, అత్యాచారాలు వంటివి ప్రభావితమై ఉన్నాయి. నేటి బాలలపై జరుగుతున్న అకృత్యాలపై స్పందించాల్సిన బాధ్యత రచయితలపై ఉందని భావిస్తున్నా. పిల్లలకు కేవలం నీతి కథలేకాకుండా.. ప్రస్తుత సమాజం గురించి కూడా పరిచయం చేయాల్సిన విషయంపై చర్చ జరగాలని కోరుకుంటున్నా. ఆనాటి రోజుల్లో పూర్ణమ్మ లాంటి కథలు రాసి గురజాడ ఎందరినో ఆలోచింపజేశాడు..... మరి ఈ రోజుల్లో బాల రచయితలకు ఎందుకు స్పందన ఉండటంలేదు.. నేటి బాల్యంపై ఉన్న ఒత్తిళ్లపై కూడా రచనలు జరగకపోవడం ఒక సవాలుగా పరిగణించాలి. మనదేశంలో బాలసాహిత్యం చిన్న చూపు చూడబడుతోంది... కానీ పాశ్చాత్య దేశాల్లో హ్యారీపోటర్ లాంటి కథలు ... సినిమాలుగా తెరకెక్కి అందరినీ ఆకర్షించి కోట్లు కొల్లగొడుతున్నాయి. మరి మన దగ్గర మన కథలు... పిల్లల్ని మరింతగా ఆకట్టుకునేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. రచయితలు కూడా తరుచూ సమావేశమై చర్చించడం ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవచ్చు.. పిల్లలకు బాల సాహిత్యాన్ని మరింత దగ్గర చేసేందుకు బాల చెలిమి తరపున జరిగే జిల్లా పర్యటనల్లో అందరూ తమవంతుగా తరలిరావాలి. చిత్తశుద్ధితో బాల్యాన్ని రక్షించుకునేందుకు బాల రచనలు చేద్దాం.... చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమీ ద్వారా.. బాల సాహిత్యాన్ని సంబంధించిన విజ్ఞాన్ని ప్రచురుస్తున్నామని.. బొమ్మలతో కూడిన వినోద, విజ్ఞాన పుస్తకాలను విరివిగా అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని... అలాగే దృశ్య, శ్రవణ పద్ధతిలో కూడా బాలల సాహిత్యాన్ని, రచనలను అందుబాటులోకి తెస్తున్నామని.. చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్,

బాల చెలిమి ప్రధాన సంపాదకులు యం. వేదకుమార్ అన్నారు.

**యం.వేదకుమార్, బాల చెలిమి ప్రధాన సంపాదకులు,**

ముద్రణ, దృశ్య, శ్రవణ మార్గమాల ద్వారా పిల్లలకు ఎంతమంచి సాహిత్యాన్ని అందివ్వగలమో.. అంత ప్రయత్నం చేస్తాం. ఈ మధ్యనే ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో రేడియో కార్యక్రమాలను నిర్వహించాం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా బాల సాహిత్యాన్ని పిల్లలకు మరింత దగ్గర చేయొచ్చు. ప్రస్తుత చర్చలో పాల్గొన్న అనేక మంది రచయితల సహకారంతో అకాడమీ ద్వారా బాల చెలిమి పత్రిక తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. బాల చెలిమి కేవలం ఒక పత్రికగానే మిగిలిపోకుండా... జిల్లాకు ఒక పత్రిక వచ్చి... బాల చెలిమి ఒక వేదికలా మారాలి. ముందుగా తెలుగువారికి బాల చెలిమిని అందించే ప్రయత్నం జరుగుతోంది. బాల సాహితీ రచనలు చేసి... సమాజానికి అందుబాటులోకి తేలేకపోతున్నవారికి కూడా... బాల చెలిమి వేదికగా పనిచేస్తుంది. అలాగే ప్రతినెల రెండో శనివారం సాయంత్రం... బాల సాహిత్యం గతం, వర్తమానం, భవిష్యత్తుపై చర్చలు నిర్వహిస్తాం.

అందరినీ ఒకేసారి కాకుండా... బాల సాహితీ రచనల్లో నిష్ణాతులైన వారిని ప్రతినెల చర్చకు ఆహ్వానిస్తాం. వారు చర్చల్లో పాల్గొంటారు. ప్రతి నెలలో జరగాల్సిన చర్చ అంశంపై ముందుగానే ఒక నిర్ణయానికి వస్తాం. దీంతోపాటు... రాబోయే రోజుల్లో ప్రతినెలలో ఒక రోజు బాల సాహిత్య పుస్తకాలను తీసుకొని ఒక బస్సులో జిల్లాల్లో పర్యటిస్తాం. మా వద్ద ఉన్న దృశ్య, శ్రవణ కథలను ప్రొజెక్టర్ల ద్వారా పిల్లలకు చూపిస్తాం. అక్కడి బాల సాహితీ రచయితలకు తమ ఆలోచనలు పంచుకోవడానికి ఒక వేదిక కల్పిస్తాం. వారి రచనలు ముద్రించు కోవటానికి ముద్రణా సంస్థల ద్వారా సహకారం అందిస్తాం. వీటితో పాటు... ప్రతినెలలో ఒకరోజు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి... రచయితల సహకారంతో పిల్లలకు కథలు చెప్పడం... రంగస్థలం గురించి చెప్పడం... పిల్లల సినిమాలు చూపించడం... గేయాలు పాడించడం.. వారిలో సృజనాత్మకత వెలికితీసేలా రచనలు చేయించడం వంటివి నిర్వహించబోతున్నాం... బాల చెలిమి ముచ్చట్లకు... నగరంలో జరిగే కార్యక్రమాలకు... జిల్లాల్లో పర్యటనలను ఎవరెవరు నిర్వహించాలో ఓ కమిటీ ఏర్పాటు చేసి వాటి కార్యక్రమాలు చేపడదాం... చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ, బాల చెలిమి ప్రయత్నాలతోపాటు.... అసరమైతే ప్రభుత్వానికి కూడా సూచనలు చేసి సహాయం తీసుకుంటాం...

**డా. ఎస్.రఘు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం**

బాల చెలిమి అనేది ... రేపటి తరం వారికి మానవీయ విలువలకు చెలిమిలా నిలబడాలని కోరుకుంటున్నాం. నిశ్శబ్దంగా... వేదకుమార్ గారు... బాల చెలిమి ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు. ఆ ప్రయత్నంలో మేమంతా తప్పకుండా భాగస్వామ్యులవుతున్నాం.. బాల సాహిత్య-రచనలు- సవాళ్లు అనే విషయంలో... ఇంకా అనేక పాత కథా వస్తువులనే తీసుకుంటున్నాం... అదే రాజులు, అడవి, పల్లెలు అంశాలతో పాత పద్ధతుల్లోనే కొత్త కథలు చెబుతున్నారు. అలాకాకుండా... ప్రస్తుతం పిల్లల చుట్టూ ప్రపంచం మారుతోంది. సమకాలీన అంశాలపై ... వారి చుట్టూ జరిగే అంశాలు పరిచిత పరిసరాలు వారికి పరిచయమైన వాతావరణంలోంచి కథలు వస్తే బాగుంటుంది. అప్పుడు వారు తొందరగా కథలపట్ల ఆకర్షితులయ్యే అవకాశం ఉంటుంది. పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా హాస్యాన్ని, వ్యంగాన్ని కూడా చేరిస్తే మరింత ప్రయోజనకరం. ఇలాంటి కొత్త ప్రక్రియల వల్ల పిల్లలు బాల సాహిత్యం పట్ల ఆకర్షితులవుతారు. బాల సాహిత్యం లేకుండా పెద్దల సాహిత్యమనేది ... పునాది లేకుండా ఇల్లు కట్టడం వంటిదేనని... బాల చెలిమి ముచ్చట్ల సందర్భంగా అన్నారు...

**బెల్లంకొండ సంపత్‌కుమార్, బాల సాహితీ వేత్త**

బాల సాహిత్య రచనలు చేసేటపుడు... అసలు బాలలు అంటే ఎవరూ అనేది స్పష్టత ఉండాలి. వారికి చేసే రచనలు వారిని ఏ దిశకు తీసుకెళతాయన్నది ముఖ్యం. బాల సాహిత్య రచనల్లో ఇలాంటి సవాళ్లు ప్రాథమిక స్థాయిలోనే ఉంటాయి. పిల్లల ఆలోచనలు... నర్సరీ క్లాసుల్లో ఒక మాదిరిగా.. .. 5వ తరగతి వరకు మరో రకంగా... ఆ పైన ఇంకో రకంగా ఉంటాయి. ఇక ఇంటర్ చదివే విద్యార్థులు అటు చిన్నవారు కాదూ... అటు పెద్దవారు కాదు. పదో తరగతిలోపు పిల్లలకు విలువలు నేర్పించగలిగితే ఆ తర్వాత వారి భవిష్యత్తు బాగుంటుంది. ఇంటర్మీడియెట్ చదివే వారికి కూడా బాలసాహిత్యం ద్వారా విలువల గురించి చెప్పాల్సిన అవసరం ఉంటుంది. పిల్లల స్థాయిని బట్టి బాల చెలిమి రచనలు అందిస్తే మేలు. పిల్లల వయసుకు తగ్గట్టుగా రచనలు అందించకపోగా... వారిపై అదనపు భారం మోపితే... వారి ఆలోచనా విధానం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. చిన్న పిల్లలకు రైతు పోరాటాలు - పోలీసుల యాక్షన్ గురించి చెబితే... వారి ఆలోచనలపై దుష్ప్రభావం పడే ప్రమాదం ఉంది. బాల సాహిత్యం రచన- సవాళ్లలో వీటన్నింటిని పరిగణలోకి తీసుకోవాలి. నేటి తరం పిల్లలపై సెల్‌ఫోన్‌లు, టీవీల ప్రభావం తీవ్రంగా ఉంటోంది. వాటి మోజులో పడి పిల్లలు ఎదురుతిరిగే స్వభావాన్ని అలవరచు కుంటున్నారు. వారు బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారు. పిల్లలపై తల్లిదండ్రుల అతి ప్రేమవల్లే అనేక అనర్థాలు జరుగుతున్నాయి. అతి సున్నితమైన విషయాలను పిల్లలతో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. సమాజంలో ఇలాంటివన్నీ బాల సాహిత్య రచనల్లో సవాళ్ళగానే భావించాలి. పిల్లల్లో వ్యక్తిత్వ నిర్మాణంలో కీలకమైన పరిస్థితిని కల్పించాలి. అలాంటి రచనలు చేయడం వల్ల ఓ లక్ష్యం కోసం పనిచేసిన వాళ్ళమవుతాం. అలాంటి కీలకమైన బాధ్యత బాల చెలిమి తీసుకుంటే మంచిది. ఇలాంటి గురుతరమైన బాధ్యత బాల చెలిమిపై ఉందని భావిస్తున్నా. నేటి తరం పిల్లల్లో శ్రమను గౌరవించే తత్వం పోతోంది. వారికి శ్రమ విలువ తెలియడంలేదు. బాల సాహితీ రచయితలు ఈ విషయాలు కూడా దృష్టిలో పెట్టుకోవాలి. పిల్లల పట్ల ఎలా ప్రవర్తించాలో తెలిపేందుకు... పెద్దలకు కూడా ఓ వర్క్‌షాప్ అవసరమే. అదే సమయంలో విలువలను నేర్పడంలో వారికి కూడా వర్క్‌షాప్ లాంటివి నిర్వహించాలి. పిల్లల్లో సృజనాత్మకత పెంపునకు కొన్ని పత్రికలు ప్రయత్నం ప్రారంభించి... ఓ దశ తర్వాత వదిలేశాయి... వాటిని మరింత మెరుగుపరచి వారి ఆలోచనల్ని మరింత పదును పెంచాలి. అలాంటి ప్రయత్నాలతో బాలచెలిమి మరింతగా పిల్లలను ఆకట్టుకోగలుగుతుంది. బాల సాహిత్య రచనల పట్ల అమితాసక్తి ఉన్నవారు బాలచెలిమికి పనిచేయడం సంతోషంగా ఉంది.

**రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, బాల సాహితీవేత్త, తెలుగు ఉపాధ్యాయురాలు**

32 ఏళ్లపాటు తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ... రాబోయే తరం పిల్లల్లో ఏం తక్కువుందనేది గమనిస్తూ వచ్చాను. ఆ తర్వాతే

బాల సాహిత్యం మొదలుపెట్టాను. కథలు, గేయాలు, కవితలు ఏం చదవాలన్నా ముందు భాష తెలియాలి. చిన్నపుడు మనకు ఇళ్లలో పద్యాలు, పొడుపుకథలు, సామెతలు చెప్పేవారు. అవే కథలు తరగతిగదిలో అర్థాలు తెలుసుకుని ఆనందించేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సిలబస్ పూర్తిచేయడానికి టీచర్లకు సమయం సరిపోవడంలేదు. ఈ రోజుల్లో పిల్లలకు భాష తెలియడంలేదు. అలాంటపుడు... వారు కథలు, గేయాలు ఎలా తెలుసుకోగలరు. వారికోసం రాసిన సాహిత్యాన్ని ఆనందించలేరు. తెలుగు భాష అంటే ఆసక్తి పెరగడానికి కారణం వెతకాలి. చిన్న చిన్న వాక్యాల్లో తెలుగు నేర్పించి భాషపై ఆసక్తిని పెంచాలి. అప్పుడు మాత్రమే వారు కథలు, గేయాలు చదివినా ఆనందిస్తారు. బాల సాహిత్యంలో గేయాల రూపంలో నేను రచనలు చేశాను. పాశ్చాత్య రైమ్స్ వారి దేశాల పరిస్థితులకు అనుగుణంగా రాసుకున్నవే. దురదృష్టవశాత్తూ... మన దేశ పరిస్థితులకు తగ్గ చిన్నచిన్న రైమ్స్ ఇప్పటికీ రావడంలేదు. పిల్లల స్థాయిని బట్టి రచనల్లో పదజాలం ఉండేలా రచయితలు దృష్టిలోపెట్టుకోవాలి. నేటి పత్రికల్లోనూ... బాలల కోసం మొక్కుబడిగా కథలు, గేయాలు వేస్తున్నారే తప్ప... వారి భాష పరిజ్ఞాన్ని పెంచే ప్రయత్నం కనబడటంలేదు. భాష లేనపుడు సాహిత్యమే రాదు... ఒక రచయిత అయినా...ఉపాధ్యాయుడైన వినూత్నంగా ఆలోచించి దాన్ని పిల్లల్లోకి తీసుకెళ్లగలగాలి. బాలల కోసం ఎన్ని రచనలు చేసినా... వారివద్దకు తీసుకెళ్లగలగడం చాలా కష్టమైన పని... అలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేదకుమార్ గారికి అభినందనలు. చిట్టి చిలకమ్మా... అమ్మ కొట్టిందా అని కాకుండా... నేటి పరిస్థితులకు అనుగుణంగా మార్పు రావాలి.

**పత్తిపాక మోహన్, బాలసాహితీ రచయిత**

బాల చెలిమి పుస్తకాన్ని పిల్లల మనసుకు హత్తుకునేలా... బొమ్మలు, ముద్రణ, అక్షరాల సైజు వంటి విషయాల్లోనూ వేదకుమార్ గారు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతోపాటు ప్రతి జిల్లాలోనూ ఒక బాల చెలిమి లాంటి పత్రిక రావాలని కోరుకుంటున్నాం. దేశవ్యాప్తంగా చూసుకుంటే మన తెలుగులో బాలల పత్రికలు చాలా తక్కువగా ఉన్నాయి. బాల సాహితీ రచయితలకు సమాజంలో రెండో కేటగిరి రచయితలుగా భావిస్తున్నారు. దీంతో ఎంతో ఉత్సాహం ఉన్న రచయితలు కూడా బాల సాహిత్యానికి దూరమవుతున్నారు. అయితే ప్రస్తుతం పరిస్థితుల్లో కొంత మార్పు వస్తోంది. కొన్ని పత్రికలు పిల్లల కోసం కొంత స్థలాన్ని కేటాయించడం శుభపరిణామం... మనుషులకు విలువలు నేర్పేదే బాల సాహిత్యం... అలాంటి బాల సాహిత్యాన్ని బ్రతికించుకోవాలి... అప్పుడు మాత్రమే ప్రపంచాన్ని బ్రతికించుకోవచ్చని ప్రముఖ బాల సాహితీవేత్త దాసరి వెంకట రమణ అన్నారు. బాలల ప్రపంచం మీద ప్రేమ ఉంటేనే... బాల సాహిత్యం సాధ్యమవుతుందన్నారు.

**దాసరి వెంకట రమణ, బాల సాహిత్య రచయిత**

బాల సాహిత్యాన్ని రాయడంలో... ప్రచురించడంలో... ప్రచారంలోకి తేవడంలో అనేక ఇబ్బందులుంటాయి. పిల్లల్ని తన్మయపరిచేలా... పెద్దల్ని అబ్బురపరిచేలా బాల సాహిత్య రచనలు రావాల్సిన అవసరం ఉంది. మనుషుల్ని బ్రతికించుకోవాల్సిన అవసరంఉంది. అది జరగాలంటే నేటి పిల్లలకు బాల సాహిత్యాన్ని నూరిపోయాలి. నైతిక విలువలు లేకపోవడం వల్లే పిల్లల్లో నేరప్రవృత్తి పెరుగుతోంది. సంస్కారం, విలువలు, మానవత్వం అడుగంటి పోతున్నాయి. తల్లిదండ్రి అంటే గౌరవం లేకుండా పోతోంది. దానికి కారణం మనమే. వాళ్లని కేవలం బడికి వెళ్లివచ్చే యంత్రాల్లా తయారు చేస్తున్నాం. వారికి ఎలాంటి కథలు చెప్పడంలేదు.. వారికి విలువలు, గౌరవం నేర్పడంలేదు.

తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి వాడు గిట్టనేమి
పుట్టలోని చెదలు పుట్టవా! గిట్టవా!

విశ్వదాభిరామ వినురవేమా.... ఇలాంటి పద్యంలోని జీవనసారాన్ని పిల్లలకు నేర్పిస్తే... వారికివచ్చే బుద్ధులకు సరితూగేలా... వేమన పద్యం లాంటి పద్యం ప్రపంచ సాహిత్యంలో లేదు. మన పిల్లలకు రోజుకు ఒక పద్యం నేర్పిద్దాం... ఇదే బాల సాహిత్యం యొక్క ఔన్నత్యం. కొన్ని తరాలకు సంస్కారం నేర్పిన చందమామ పత్రిక కూడా 2013లో ఆగిపోయింది. ఎందుకు ఆగిపోయిందో ఓ పెద్ద సవాల్. ఇలాంటి పరిస్థితుల్లో... బాల చెలిమి మళ్లీ వస్తోందని ... దక్కన్ ల్యాండ్ పత్రికలో చదివినపుడు... వర్ణనాతీతమైన ఆనందానికి గురయ్యాను. బాల సాహిత్యాన్ని ప్రేమించేవాడిని... ప్రచురించేవారిని... ప్రచారం చేసే వారు ఎవరున్నా శిరస్సు వంచి నమస్కరిస్తా.. ఈ విషయంలో వేదకుమార్ గారు అభినందనీయులు.. బాల చెలిమి పత్రిక మళ్లీ వస్తది... నిలదొక్కుకుంటది... మన్నుతది... మనుషులకు మానవత్వాన్ని నేర్పుతది.. ప్రపంచానికి మన సాహిత్య సౌష్టవాన్ని చాటుతది...

**గారిపల్లి అశోక్, పిల్లల రచయిత, విశ్రాంత ఉపాధ్యాయులు**

బాలల పత్రికలు ఎన్నివచ్చినా... తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో ప్రేరణ కల్పించగలగాలి. అప్పుడు ఆ పత్రికలు తప్పకుండా విజయం సాధిస్తాయి. పిల్లల్లో ముందుగా పఠనాసక్తిని పెంచాలి. అప్పుడు తప్పకుండా మార్పు వస్తుంది. ఆ సిద్ధాంతాన్ని నేను నమ్ముతున్నాను. చందమామ వంటి పత్రికలను పిల్లల కంటే పెద్దవాళ్లే ఎక్కువగా చదివారు. ఆ కథలతో ఎంతో స్ఫూర్తి పొందారు. ఏ పత్రిక వచ్చినా... పిల్లలతోపాటు ఆబాలగోపాలన్నీ అలరించే విధంగా ఉన్నపుడు... తప్పకుండా విజయం సాధిస్తుంది.

**యాదయ్య, బాల సాహితీ రచయిత**


పిల్లల్లో విలువలు ఇంటినుంచే మొదలవుతాయి. ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్య బంధాలే విలువలకు పునాది. పెద్దల సాహిత్యంకంటే.. బాల సాహిత్యం చాలా నిజాయితీగా ఉండాల్సిన అవసరం ఉంది. పిల్లల దగ్గర అనేక గొప్ప విషయాలు తెలుస్తాయి. దానికోసం వారిని పరిశీలిస్తుండాలి. వారి మాటల్లోంచే కవితలు, కథలు స్ఫురిస్తాయి. బాల సాహిత్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు బాల చెలిమి చేస్తున్న కృషిని అభినందిస్తున్నా. బాలల సాహిత్యానికి ఆదరణ పెరుగుతుండటం శుభపరిణామమని... 'బాల సాహిత్య రచన–సవాళ్లు' చర్చా కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. నేటితరం పిల్లలకోసం రచయితలను ఒకచోట చేర్చి... ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ' చేస్తున్న కృషిని రచయితలు అభినందించారు.

– తిరునగరి శ్రీనివాస్
m : 9441464764
e : thirunagarisrinivas12@gmail.com

## పాఠకుడి అభిరుచిని, విమర్శ స్థాయి పరిధిని పెంచే

# సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం

**సా**హిత్యంలో ఖాళీలను పూరించే ప్రయత్నం విస్తృతంగా, ఉధృతంగా జరుగుతున్న దశ ఇది. దీనితోపాటు విమర్శారంగంలోని ఖాళీలను పూరించే ప్రయత్నం అంత వేగంగా ఆ స్థాయిలో జరుగుతున్నట్లు కనిపించడం లేదు. సాహిత్యంలో విమర్శా ప్రక్రియ ఎంత చైతన్యంగా ఉంటే అంత ఉత్తమసాహిత్యం రావడానికి అవకాశముంటుంది. విమర్శవల్ల సాహిత్యసృజనలో వైవిధ్యం చోటుచేసుకుంటుంది. వాస్తవికత, కొత్త రచనాధోరణులతోపాటు సృజనకారుల్లో స్ఫూర్తి, బాధ్యత పెరుగుతుంది. అటువంటి స్ఫూర్తిదాయక చైతన్యాన్ని అందించే విమర్శ అమ్మంగి వేణుగోపాల్‌గారి "సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం" అనే గ్రంథంలో ఉంది. అరవై రెండు వ్యాసాలతో పేరుకు తగినట్లుగానే కవిత్వం, కథ, నవల, యాత్రాచరిత్ర, జీవితచరిత్ర, అనువాదం మొదలైన విభిన్న అంశాలపై ఆసక్తికరమైన విశేషాలతో నిండిన విమర్శ సంపుటి ఇది.




ఈ విమర్శాగ్రంథంలో మొదటి వ్యాసం డా. సి. నారాయణరెడ్డిగారి ప్రామాణిక పరిశోధనా గ్రంథం 'ఆధునికాంధ్ర కవిత్వం. సంప్రదాయము, ప్రయోగము'తో ఆరంభం కావడం ఔచిత్యవంతంగా ఉంది. సినారె సిద్ధాంత గ్రంథంలోని ముఖ్యమైన అధ్యాయంలోని విలువైన పరిశోధనాంశాలను ప్రస్తావించడం ద్వారా ఈ తరం విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయోగకరంగా మార్గదర్శకంగా ఉంటుంది. సినారె గ్రంథాన్ని అధ్యయనం చేస్తూ ఏవిధంగా కొత్త విషయాలను గుర్తిస్తూ, పరిశీలను, అవగాహనను పెంచుకోవచ్చునేది తెలుసుకోవచ్చు. అమ్మంగివారు కేవలం సినారె గ్రంథ ప్రశంసకే పరిమితంగాకుండా దానిచుట్టూ ఉన్న కొన్ని విమర్శనాత్మక అంశాలను కూడా పేర్కొన్నారు. విమర్శకునిగా తన నిష్పాక్షిక స్వభావం కూడా అర్థమవుతుంది. హైదరాబాద్ కవుల వేదిక ప్రచురించిన "ఈ నేల వెన్నెల కాయనీ' కవితాసంపుటి ముందుమాట 'కవి-కవిత్వం'లో ఆధునిక కవిత్వంపై, తెలంగాణ కవి దృక్పథంపై అర్థవంతమైన విశ్లేషణ చేశారు. ఆధునిక కవిత్వం పాఠకుడిని ఆకర్షించడంలో, సాన్నిహిత్యం పెంచుకోవడంలో ఆధునిక వ్యవహార వచన భాష ప్రభావం చాలా ఉందన్నారు. అదే విధంగా 'తెలంగాణ కవి మౌలికంగా నగరకవి కాడు. మహానాగరికతను హర్షించిన కవి కూడా కాదు' అనే ప్రతిపాదన చేస్తూనే తెలంగాణ వచన కవిత్వంలో 'జీవితమంత విశాల వైవిధ్యం ఉంది' అని నిర్ధారణ చేస్తారు.

అమ్మంగి వేణుగోపాల్‌గారు మొదటగా కవి. నిరంతర సహృదయవాది. కవితానుభూతితో మునిగిపోయిన వారి కలం ఎక్కువగా కవిత్వాంశాల మీదనే కదిలింది. ఈ వ్యాససంపుటిలో కవిత్వానికి సంబంధించిన అనేక వస్తు రూప నిర్మాణాంశాలపై లోతైన పరిశీలనలు, విస్తృతమైన విశ్లేషణలు చేశారు. 'అలిశెట్టి ప్రభాకర్ సృజనశక్తి' వ్యాసంలోని ప్రారంభ వాక్యాలు అలిశెట్టి గొప్పదనంతోపాటు అమ్మంగిగారి ఆత్మావిష్కరణ అభివ్యక్తి శక్తి కూడా మనల్ని విస్మయానికి గురిచేస్తుంది. 'కవిత్వంలో స్తబ్దతను వర్ణించడం కష్టం. అదొక అమూర్త భావనలాంటిదై సవాలు విసురుతుంది' అంటూ అలిశెట్టి ప్రభాకర్ బలమైన ఉపమానాలు, ప్రతీకల ద్వారా స్తబ్దతను ఎంత సులభంగా ఆవిష్కరించగలిగాడనే రహస్యాన్ని విప్పి చెబుతారు.

నందిని సిధారెడ్డి కవిత్వాన్ని విశ్లేషిస్తూ 'సమకాలీన కవులలో వ్యవస్థమీద విమర్శనాత్మక కవిత్వం రాసి మెప్పించిన ఒకరిద్దరిలో నందిని సిధారెడ్డి ఒకరుగా' పేర్కొంటారు. 'తెలంగాణ నుడికారాన్ని కవిత్వ భాషలోకి అనువదించడం మూలంగా సిధారెడ్డి మన భాషాస్థాయిని పెంచగలిగారు' అని చెప్పడం అమ్మంగిగారి సునిశిత పరిశీలనా దృష్టికి నిదర్శనం. కవిత్వంలో భాషకున్న ప్రాధాన్యాన్ని వివరిస్తారు. ఒక కవిలో దాగున్న అంతర్గత శక్తిని గ్రహించడమే కాదు సోదాహరణంగా ఆవిష్కరించగలగడం విమర్శకుడిగా అమ్మంగి వేణుగోపాల్ ప్రత్యేకత.

ఈ గ్రంథంలో తెలంగాణ కథలు, రచయితల మీద విలువైన వ్యాసాలున్నాయి. అమ్మంగివారు కేవలం కథా విశ్లేషణకే పరిమితం కాలేదు. ఆయా కథకుల నేపథ్యాలు, అనుభవాలు, వ్యక్తిత్వ విశ్లేషణ చేస్తూ ఒక కథ ఆవిర్భావం వెనకున్న అంతర్మథనాన్ని వెలికితీస్తారు. 'ఒక చారిత్రక డాక్యుమెంట్‌లాంటి యుగాంతం' కథలోని వాస్తవికతను, రచయిత అనుభవాన్ని వివరిస్తూ నెల్లూరి కేశవస్వామి ఇతర రచయితలకన్నా ఎందుకు భిన్నమైనవారో నిరూపించే ప్రయత్నం ఆమోదయోగ్యంగా ఉంటుంది. దేవులపల్లి కృష్ణమూర్తి 'తారుమారు' కథలను విశ్లేషిస్తూ ఉద్యమ నేపథ్యంలో తనకు తెలిసిన మనుషుల్ని పాత్రలుగా మలచి, వాళ్ళతో కలసిపోయి, ఆత్మకథాత్మకంగా కథ

నడిపించిన విధానాన్ని వివరిస్తారు. ఈ వివరణలు ఆ కథాసంపుటి చదవాలనే ఆసక్తిని పెంచుతుంది. ఈ వరసలోనే తాయమ్మ కరుణ తమ కథల్లోని సన్నివేశాల్లో సజీవత్వాన్ని చిత్రించడానికి ఆయా పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసిన తీరుని వర్ణిస్తారు. కరుణ కథల్లోని వ్యథల్లో ఉన్న యథార్థాన్ని మనముందు పరుస్తారు. తెలంగాణ సాహిత్యచరిత్రలో విస్మరించబడిన కథారచయిత సురమౌళిపై 'ఒక కథారచయిత కథ' అనే వ్యాసం ఒక కథానుభూతిని ఇస్తుంది. 'సురమౌళి కథలేవి ఆయన జీవిత కథకు సరితూగవు' అన్న తన మాటల్ని నిర్ధారించే విధంగా సురమౌళి జీవన పయనాన్ని అమ్మంగి వర్ణించారు.

జ్ఞానపీఠ సాహితీ సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'మ్రోయు తుమ్మెద' నవలపై విలువైన వ్యాసం ఈ గ్రంథం స్థాయిని మరింత పెంచుతుంది. సాహిత్య చర్చలకు ఎక్కువగా నోచుకోని, విమర్శకుల దృష్టికి బాగా దూరమైన నవల 'మ్రోయు తుమ్మెద'. తెలంగాణకు చెందిన నారాయణరావును కథానాయకునిగా చేసుకుని 1960ల నాటి తెలంగాణ సామాజిక జీవన పరిణామాలను చిత్రిస్తుంది ఈ నవల. విశ్వనాథవంటివారు రాసిన ఈ నవలా శిల్పంలోని లోపాలను కూడా నిర్మొహమాటంగా అమ్మంగి వేణుగోపాల్ వెల్లడించారు. నేటి తెలంగాణ సాంస్కృతిక పునర్నిర్మాణ దశలో ఈ వ్యాసం ద్వారా అరుదైన విశేషాలు దొరుకుతాయి. సాహిత్య గ్రంథాల విశ్లేషణ, పరిచయం, సమీక్ష చేయడంలోనే కాదు రాజకీయ, పరిపాలనా అధికారులను పరిచయం చేయడంలోనూ, వారి ఉదాత్త వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించడంలోనూ అమ్మంగివారు సిద్ధహస్తులు. వట్టికోట ఆళ్వారుస్వామి, పొట్లపల్లి రామారావు, ఆచార్య బిరుదురాజు రామరాజు, కొత్వాల్ వెంకట రామిరెడ్డి, బి.నరసింగరావు, ఆవునూరి సమ్మయ్య, కనకసుగుణ, పల్లెర్ల హనుమంతరావు మొదలైనవారి జీవితాల్లోని ఉన్నత పార్శ్వాలను చూపెట్టగలిగారు. ప్రముఖ దర్శకుడు బి. నరసింగరావు గురించి చెబుతూ "ఎమర్జెన్సీ దశలో పశ్చాత్తాపం పొంది ఉంటే తిరిగి భూస్వామ్య మూలాల్లోకి పోయివుండేవారు కాని ఈ దశా విశేషమే వారిని జనసామాన్యానికి చేరువ చేసింది" అన్న మాటలు ఆలోచనాత్మకం. ఈ వ్యాసాల్లో కేవలం సాహిత్యాభిరుచే కాదు సామాజిక ప్రయోజనం కోసం తనవంతు బాధ్యతగా నిబద్ధతతో చెప్పిన విషయాలు పఠితల్ని ఉత్తేజపరుస్తాయి.

ఈ వ్యాససంపుటిలో అనువాద గ్రంథాల మీద రెండు మంచి వ్యాసాలున్నాయి. ఒకటి డా॥ఎ.వి.ఎన్.రాజు అనువదించిన ఉర్దూశేర్ల 'ఉర్దూ సాహిత్య సౌరభం', రెండవది జయశంకర్ ప్రసాద్ హిందీలో రచించిన 'ఆంసూ' కావ్యాన్ని జలజం సత్యనారాయణ 'వేదన' పేరుతో తెలుగులో అనువదించిన గ్రంథాలకు రాసిన 'ముందు మాటలు' అవి. ఇందులో అనువాదానికి సంబంధించిన పద్ధతులతోపాటు మూల విధేయంగా సాగిన అనువాదకుల కృషిని తెలియజేస్తారు. 'కవిత్వ అనువాదం ఎప్పుడూ క్లిష్టమైన కార్యమే. సూర్యరశ్మిని వడబోసి వెన్నెల కాసినట్లుగా ఈ అనువాదం సాగిందనీ 'వేదన' అనువాద కావ్యాన్ని ప్రశంసిస్తారు.

యాత్రాచరిత్ర, సాహిత్యచరిత్ర గ్రంథ విమర్శలో కూడా అమ్మంగిగారు తనదైన శైలిలో మరింత పరిశీలనాత్మక ధోరణిలో కొత్త కోణంలోంచి వ్యాఖ్యానించారు. ప్రముఖ యాత్రా చరిత్రకారులు ఎం. ఆదినారాయణగారి 'భ్రమణ కాంక్ష'ను గురించి మాట్లాడుతూ తను గమనించిన ప్రత్యేక అంశాలను చర్చకు నోచుకునేలా ప్రస్తావించారు. ఆదినారాయణగారిలోని విస్తృత జ్ఞానం, కవి హృదయం, దృక్పథంపై స్పష్టమైన నిరూపణలను ఇచ్చారు. యాత్రా రచనకు ఉండవలసిన తాత్త్వికత అంతా 'భ్రమణకాంక్ష'లో ఉందన్నారు. ఆచార్య ఎస్వీ రామారావుగారు రచించిన 'తెలుగు సాహిత్య చరిత్ర'ను సమీక్షిస్తూ తనూ ఒక కొత్త విషయాన్ని చెప్పే ప్రయత్నం చేస్తారు. హాలుని 'గాథా సప్తశతి' గురించి మాట్లాడుతూ "రాజైన వాడు రాజ్యంలో తిరిగి కవులవద్ద కవితలను సేకరించే అవకాశం తక్కువ. కవులే నిర్ణీత సమయాలలో రాజుగారిని సందర్శించుకొని తమ గాథా ఛందస్సులోని కవితలను వినిపించి వారికి సమర్పించి ఉంటారు. అట్లా తెలుగు ప్రాంతంలో మొట్టమొదటి కవి సమ్మేళనాలు హాలుని ఆస్థానంలో జరిగి ఉంటాయన్నది నా గట్టి విశ్వాసం" అంటారు. ఇందులోని నిజానిజాల జోలికి పోకుండా వ్యాసకర్త ఊహ పరిశీలన సమంజసమనిపించేదిగా ఉంది. దీనికి కొనసాగింపుగానే 'తెలంగాణలో కవి సమ్మేళనాలు' అనే వ్యాసం వారి పరిశోధన జిజ్ఞాసకు, ప్రామాణిక సత్యాలకోసం పడే తపన, నిబద్ధత మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది.

అమ్మంగివారి వ్యాసాలు కాల్పనిక రచనలకున్న ఆకర్షణను, పఠనీయతను కలిగి ఉంటాయి. వారి వ్యాసాలు చదివితే మూలగ్రంథాన్ని చదవాలనే కోరిక బలపడుతుంది. సాధారణ పాఠకులను సైతం వేలు పట్టుకుని తీసుకెళ్ళినట్టుగా విషయాన్ని స్పష్టంగా చెపుతారు. ప్రతి వ్యాసంలోనూ ఏదో ఒక విలువైన మాట, కొత్త సమాచారం, అపురూప విశేషాలు, పరిశీలనాంశాలు, చర్చాత్మక విషయాలు ఉంటాయి. ఈ గ్రంథంలోనే అంపశయ్య నవీన్ వ్యాసాలను సమీక్షిస్తూ 'ఇవి పాఠకుడి అనుభవ పరిధిని పెంచుతాయి' అన్నారు. ఈ మాటలు అక్షర సత్యాలు. అమ్మంగి వేణుగోపాల్‌గారి వ్యాసాలకు కూడా ఇవే మాటలు వర్తిస్తాయి. సాహితీపిపాసి, నిరంతర అధ్యయనశీలి, సహృదయులు డా॥ కె.వి.రమణాచారి గార్కి ఈ గ్రంథాన్ని అంకితమివ్వడం కూడా ఔచిత్యవంతంగా ఉంది.

• • •

గ్రంథం పేరు: **'సహృదయ సాహిత్య విమర్శ-వైవిధ్యం'**

రచయిత : **డా॥ అమ్మంగి వేణుగోపాల్**

ముద్రణ: 2018, పుటలు: 359,

వెల: 300/-

ప్రతులకు: శ్రీమతి టి.విజయలక్ష్మి, ఇం.నెం: 11-9-317, లక్ష్మీనగర్, రోడ్ నెం:4, కొత్తపేట, హైదరాబాద్-500 035, తెలంగాణ రాష్ట్రం.ఫోన్ నెం: 9441054637, రాష్ట్రంలోని ప్రముఖ పుస్తక విక్రయ శాలలు.

-డా॥ ఎస్.రఘు

m : 9848208533

e : raghusr17@gmail.com

# పండుటాకు



ఎప్పుడూ తీర్పాటు లేదు
ఏ అవసరమో కుత్తిక దాకా వస్తేగాని
తలిచింది లేదు

పుట్టిపెరిగిన మట్టికి చెదలు పట్టింది

ఇయ్యాల ఇట్లా ఇక్కడికి ....

నేను
మొండిగోడలు కాపలా ఉన్న
ఆ పాత ఇంట్ల మసి పట్టిన
దూలం దిక్కు చూసిన
ఉప్పుచుక్క చటుక్కున జారింది

ఇల్లంతా
ఎక్కడికక్కడ  అమ్మనే ఉన్నట్టుంది

ఏ పని చేసినా ఎంబడెంబడి
నడిచి చంకలో వేలాడెటోన్ని

నులక మంచం పక్క మీద
కొంగు పట్టుకొని

మొగులు మీదకి  చూసుకుంటా
ఆవలించిన యాది

ఆ అరచేతి చలువ తోనే
లోకాన్ని చదివి
పట్టెడన్నం పుట్టించుకున్న

ఎప్పుడూ క్యాలెండర్ వెనుక నడిచి
నా ఇరుకు ఇంట్లో  మొస మర్లని
మూలదిక్కు
నాల్గు గోడలని తన ప్రపంచం చేసిన

నాకు తినవెట్టినంకనే
తినేది కదా...
ఎప్పుడూ తిన్నవా అని అడగకపోతిని

గడియారం గంట కొట్టినప్పుడు
మందులిచ్చిన గాని
కడుపునిండుగా మందలియ్యపోతిని

ఏమనుకుందో..
ఎన్నాండ్లు ఇట్లా అనుకున్నదో
నేను గమనించలే గాని
ఎన్నడులేంది ఆనాడు
ముడుచుకున్న కాళ్ళను
మళ్ళా చాపలే

అమ్మే కదా ఎక్కడవోతదనుకున్న
ఇయ్యాల
నా భుజం మీదనే వాలి
ఒడ్డులేని వాగు పక్కన చేరి
బూడిద కుప్పై కొట్టుకుపోయింది...

ఎవరో అంటున్నరు
ఒక్క పండుటాకు రాలితే
చెట్టేమన్నా పడిపోతదా అనీ..

అమ్మ
ఉత్త పండుటాకేనా...?!


-దేవనపల్లి వీణావాణి
m : 9951331122
e : veenavani.d@gmail.com

ద


## పత్రికలు - పరిచయం:

గమనిక: ఈ శీర్షికలను ప్రచురించేందుకు ఆయా పత్రికలు, ప్రత్యేక సంచికల వివరాలను మాకు తెలియ జేయగలరు.

వీక్షణం
సంపాదకులు:
ఎన్. వేణుగోపాల్



ఫోన్: 040-66843495

విజయ కళ
సంపాదకులు:
ఎస్.కె.మహమ్మద్ రఫీ




ఫోన్: 9848992826

వనప్రేమి
సంపాదకులు :
కామర్ మహ్మద్ ఖాన్





ఫోన్: 040-40205831


మహిళామార్గం
సంపాదకులు :
జ్యోతి



ఫోన్: 9542365700





భాగ్యరెడ్డి వర్మ రచనలు
సంపాదకులు: ఆచార్య ఇ. సుధారాణి
వెల: రూ.80
ప్రచురణ: ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్
ప్రతులకు: 4-7-522 భాగ్యరెడ్డి వర్మ రోడ్,
ఇసామియా బజార్, కోఠి, హైదరాబాద్.
ఫోన్: 040-24652646





బావుచ్చి
రచయిత: కపిలవాయి లింగమూర్తి
వెల: రూ.70
ప్రచురణ: వాణీ ప్రచురణలు
ప్రతులకు: 17-110, వాణీ సదనం, విద్యానగర్
కాలనీ, నాగర్‌కర్నూలు. ఫోన్: 9000185437.

---




మాదిరాజు రామకోటేశ్వరరావు స్వీయచరిత్ర
వెల: రూ. 200
ప్రచురణ: తెలంగాణ సాహిత్య అకాడమి
ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణము,
హైదరాబాద్-500 004





వందేళ్ల ఓయూ
రచన : డేవిడ్
వెల : రూ. 180
ప్రచురణ : తెలంగాణ ఆత్మగౌరవ వేదిక
ప్రతులకు : 2-1-1/5, నల్లకుంట,
హైదరాబాద్ -500 044, తెలంగాణ

---




చైతన్య కెరటం
రచన: చైతన్య మహిళా సంఘం
వెల: రూ.150
ప్రచురణ: మహిళామార్గం ప్రచురణలు
ప్రతులకు: 2-3-504/బి/5, ఆకాశ్‌నగర్,
అంబర్‌పేట్, హైదరాబాద్. మరియు సహచర,
నవోదయ పుస్తక కేంద్రాలలో లభించును





రాహేం
రచన : ఇక్బాల్
వెల : రూ. 80
ప్రచురణ : పాలమూరు అధ్యయన వేదిక
ప్రతులకు : ఇక్బాల్ మంజిల్, ఇ.నెం.6-29,
జి.వి.ఎన్‌క్లేవ్, కెకె గార్డెన్స్ ప్రక్కన, గద్వాల్
ఫోన్: 9440775732 , 9490909792

---




కళా తెలంగాణం
సంపాదకులు: మామిడి హరికృష్ణ
విష్ణుభట్ల ఉదయశంకర్
వెల: రూ.250
ప్రచురణ: తెలంగాణ ప్రభుత్వం-భాషా సాంస్కృతిక శాఖ
ప్రతులకు: డైరెక్టర్, భాషా సాంస్కృతిక శాఖ
కళాభారతి, రవీంద్రభారతి ప్రాంగణము,
హైదరాబాద్-500 004




అగ్నిశిఖ (కవిత్వం)
రచన: కటుకోజ్వల రమేష్
వెల: రూ.150
ప్రచురణ: తెలంగాణ సాహితి
ప్రతులకు: నవతెలంగాణ, ప్రజాశక్తి బుక్‌హౌస్,
మన తెలంగాణ, విశాలాంధ్ర బుక్ హౌస్,
ప్రముఖ పుస్తక కేంద్రాలలో

---





బాటసారి (కవిత్వం)
రచన: జయహనుమంత్ నాయక్
వెల: రూ.50
ప్రచురణ: వెన్నెల సాహిత్య అకాడమి,
నాగర్‌కర్నూలు
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలలో




జోలె విలువ
రచన : హైమావతి
వెల : రూ. 60
ప్రచురణ : విరసం ప్రచురణలు
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్ కాచిగూడ,
నవ తెలంగాణ చిక్కడపల్లి, హైదరాబాద్,
ఇతర ప్రముఖ పుస్తక షాపులు

---




కలల దారుల్లో
సంపాదకులు: డా॥ కాంచనపల్లి
వెల: రూ.60
ప్రచురణ: తెలంగాణ జాగృతి
ప్రతులకు: తెలంగాణ భవన్, రోడ్ నెం.12,
బంజారాహిల్స్, హైదరాబాద్.
ఫోన్: 9676096614.
ప్రముఖ పుస్తక కేంద్రాలలో



తెలంగాణ సినిమా బంగారు కాంతులు
రచన: ఆచార్య ఎస్వీ రామారావు
ప్రపంచ తెలుగు మహాసభలు సందర్భంగా
రచయిత ఫోన్: 98480 12053.



# తెలంగాణ

## ప్రభుత్వ పథకాలు.. దేశానికి మార్గదర్శకాలు



### పారిశ్రామిక అభివృద్ధి

- TS iPass - సింగిల్ విండో పారిశ్రామిక విధానం.. ప్రపంచంలోనే అత్యుత్తమం
- అంతర్జాతీయ పెట్టుబడులను పెద్ద యెత్తున ఆకర్షిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఆర్థిక విధానం
- రాష్ట్రంలో నాలుగు లక్షలమందికి ఉద్యోగాలు కలిపించే దిశగా రూ.1,10,154 కోట్ల పెట్టుబడులతో 6070 యూనిట్ల స్థాపన
- ఐటి ఉత్పత్తుల ఎగుమతులలో 12% వాటతో దేశంలోనే రెండో స్థానం

### రైతు సంక్షేమం

- దేశంలోనే మొదటిసారిగా వ్యవసాయానికి 24 గంటలపాటు నిరంతరాయ ఉచిత విద్యుత్ సరఫరా
- **రైతుబంధు పథకం:** రైతులందరికీ రెండు పంటకాలాలలో పెట్టుబడులకు ప్రతి ఎకరాకు రూ.8000 సహాయం
- ట్రాక్టర్ల కొనుగోలుపై 50% సబ్సిడి, పన్నుల మినహాయింపులు
- భూమి రికార్డుల సంస్కరణ, రైతులందరికి పట్టాదారు పాసు పుస్తకాలు





### రైతులకు రూ.5 లక్షల జీవిత బీమా

- రాష్ట్రంలో 18 నుంచి 60 ఏళ్ళ వయస్సులోపు ఉన్న రైతులందరికీ 5 లక్షల రూపాయల జీవిత బీమా సౌకర్యం.
- ప్రతీ రైతుకు రూ.2271 ప్రీమియం ప్రభుత్వం పక్షాన చెల్లింపు
- జూన్ 2వ తేదీ నుంచి బీమా పొందుతున్న రైతుల నుంచి నామినీల ప్రతిపాదనల స్వీకరణ.
- వచ్చే 15 ఆగస్టు నుంచి రైతులకు బాండ్ సర్టిఫికేట్‌ల జారీ.

### మిషన్ కాకతీయ

- తెలంగాణకు జీవనాడులైన 45,000 చెరువుల పునరుద్ధరణ
- **సాగునీటి ప్రాజెక్టులు వేగవంతం:** కాళేశ్వరం, పాలమూరు, సీతారామ డిండి & కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలు
- కొత్తగా సాగుబడిలోకి కోటి ఎకరాలు
- ఏటా రూ.25,000 కోట్ల బడ్జెట్ కేటాయింపులు
- అవసరమైన మేరకు ఇతర రాష్ట్రాలతో ఒప్పందాలు





### విద్యుత్ సరఫరాలో మైలురాళ్లు

- నిరంతరాయ విద్యుత్ సరఫరా నుంచి మిగులు విద్యుత్ స్థాయికి ఎదుగుదల
- రాష్ట్ర ఆవిర్భావ సమయంలో విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం 6574 మెగావాట్లు
- 3 సంవత్సరాలలో 7981 మెగావాట్ల అదనపు విద్యుత్ సాధన
- రానున్న 3 సంవత్సరాలలో 14000 మెగావాట్ల అంచనా విద్యుత్ సాధన

### డబుల్ బెడ్‌రూమ్ గృహాలు

- పేదల ఆత్మగౌరవాన్ని పరిరక్షించే దిశగా గృహాల నిర్మాణం
- ప్రభుత్వంచే పూర్తి వ్యయం భర్తీ
- జయప్రదంగా సాగుతూ పేదలందరికీ అందుబాటులో గృహాలు





### కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్

- ఆడపిల్ల వివాహ సమయంలో రూ.1,00,116 సహాయం
- ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీలకు, ఇతర వెనుకబడిన కులాల వారికి

### మిషన్ భగీరథ



- రాష్ట్రంలో ప్రతీ ఇంటికి పైపుల ద్వారా మంచి నీటి సరఫరా
- 52,18,225 గృహాలకు కనెక్షన్లు
- అంచనా వ్యయం రూ. 43,792 కోట్లు



|| కేసిఆర్ కిట్ || ఆరోగ్య లక్ష్మి || అమ్మ ఒడి || స్త్రీ నిధి || షీ టీమ్స్ ||
|| ఆసరా పెన్షన్లు || టిఎస్ ప్రైడ్ || మైనారీటి రెసిడెన్షియల్ పాఠశాలలు ||
|| టిఎస్ ప్రైమ్ || నేతన్నకు చేయూత || హరితహారం ||

జారీ చేయువారు: కమీషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

DECCAN LAND, Telugu Monthly Magazine 1st - June - 2018, ISSN 2581-3188
Postal Dates: 2nd & 3rd Every Month

RNI Regn. No. APTEL/2012/46784
Postal Permission, LII/RNP/HD/1167/2018-2020




JBR Architecture College was established by Joginpally B.R.Educational Society in the year 2012 under the patronage of Sri Late J.Bhaskar Rao garu , devoted Educationist and Philanthropist, with a view to impart quality Architectural Education with state of the art infrastructure and Creative learning environment.

JBR Architecture College is approved by the Council of Architecture , affiliated to Jawaharlal Nehru Architecture & Fine Arts University - JNA&FAU Hyderabad and is offering Five year Bachelor of Architecture Course.




The college is located in Bhaskar Nagar, Yenkapally in a sprawling 100 acre campus . The campus also houses many prestigious institutes of the Group including Medical, Engineering, Dental, Pharmacy and Law Colleges, with a combined strength of more than 10,000 students and best infrastructure and sports facilities.

JBR Architecture College Building is one of the best Architectural Campuses in the States of Andhra Pradesh & Telangana with Contemporary Architectural Design incorporating many Green Building Principles and innovative features. The institute has established State of the Art Infrastructure for Architectural Learning with Wifi Facility, Audio Visual Equipment in every class room and studio, well stocked Library, e-library, Computer Lab with advanced programs and soft wares., A spacious Auditorium, Landscaped Open Air Theater, Construction Yard etc., College Bus Facility is also available from every part of the city.

It has a team of highly qualified Faculty coming from different parts of the country graduated from various reputed national institutions and supported by highly experienced Visiting Faculty with international experience.

JBR Architecture College aims to become one of the Premier Architectural Institutes in India and plans to evolve into a School of Excellence, offering Post Graduate Courses in Architecture, Urban Planning, Landscape Architecture, Construction Management etc. A Research and Consultancy Cell is going to be set up soon in the campus to promote advanced research in the related fields and to facilitate interaction and collaboration with reputed Institutes in India and abroad.

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
Bhaskar Nagar, Moinabad Mandal, R.R. District, Hyderabad, Telangana State, India-500075.
Contact No: 08143-235240, 235241, 235242, 9703372442, 9703277053, Fax: +91 40 2330 4036
email: jbrarchitecture@gmail.com, website: http://www.jbrarchitecture.com/

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar